తెలుగు భాషా

చరిత్ర

ప్రస్తావిక ప్రకరణ

ము

విషయసూచిక

ప్రాస్తావిక ప్రకరణము	17 - 64
భాషోత్పత్తి	19
ప్రపంచ భాషలు	28
జాత్యాశ్రిత వర్గీకరణము	31
రూపాశ్రిత వర్గీకరణము	43
భౌగోళిక వర్గీకరణము	54
భారతదేశ భాషలు	55
సిద్ధాంత ప్రకరణము	65 - 138
ద్రావిడభాషా వాదము	65
ద్రావిడభాషా పరిగణనము	69
నాగరక భాషలు	87
అనాగరక భాషలు	95
ద్రావిడభాషల పరస్పరసంబంధము	107
ఆర్య ద్రావిడభాషా సంబంధము	115
సిథియను ద్రావిడభాషా సంబంధము	122
మూల ద్రావిడ భాష	130

ఉత్పత్తి ప్రకరణము 139 - 173

ఆంధ్రము 139

తెలుగు 140

తెనుగు 144

తెలుగుభాషా ప్రాచీనత 146

సంస్కృత ప్రాకృతములు - తెలుగు 152

తత్సమ తద్భవ దేశ్యములు 159

ధ్వని ప్రకరణము 174 - 240

వర్ణ సమామ్నాయము 174

ధ్వనుల వర్గీకరణము 176

ధ్వనుల వివరణ 191

ధ్వని నియమములు - అపవాదములు 198

ద్రావిడభాషలు - ధ్వని నియమములు 207

ధ్వనుల మార్పులు 216

లిపి పరిణామము 227

సంధి ప్రకరణము 241 - 264

ఉత్వ సంధి 245

ఇత్వ సంధి 250

అత్వ సంధి 256

అచ్చమేడిత సంధి 260

పదమధ్యసంధి 261

ఆగమాదేశ ప్రకరణము	265 - 290
ఆగమములు	266
ఆదేశములు	281
నామ ప్రకరణము	291 - 324
పద విభాగము	292
నామ విభక్తులు	295
లింగ విభాగము	314
వచన విభాగము	320
సర్వనామ ప్రకరణము	325 - 342
నిర్దేశాత్మకములు	326
ప్రశ్నార్థకములు	329
యుష్మదస్మదాద్యార్థకములు	338
సంబంధబోధకములు	339
అనిర్దిష్టార్థకములు	341
విశేషణ ప్రకరణము	343 - 376
సంఖ్యా వాచకములు	347
నిర్దేశాత్మక విశేషణములు	368
క్రియా విశేషణములు	371

సమాపక ప్రకరణము	377 - 386
కృత్తద్ధిత ప్రకరణము	387 - 399
కృత్ప్రత్యయము లు	388
తద్ధితములు	394
క్రియా ప్రకరణము	400 - 445
తెనుగుధాతువుల స్వరూప స్వభావములు	401
అకర్మక సకర్మక విభాగము	409
ప్రేరణార్థకములు	418
కర్మార్థకములు	418
వ్యతిరేకార్థకములు	423
ప్రార్థవాద్యర్థకములు	426
అసమాపక క్రియలు	429
సమాపక క్రియలు	437
అవ్యయ ప్రకరణము	446 453
ప్రతి పదోక్తము లు	449
లాక్షణికములు	451
వాక్య ప్రకరణము	454 - 474
వాక్య స్వరూపము	455
వాక్య భేదములు	460
తెలుగు వాక్యము తీరుతెన్నులు	466

అర్థప్రకరణము	475 -488
అర్థములలో మార్పులు	476
చారిత్రక ప్రకరణము	485 - 505
శాసన భాష	485
సాహిత్య భాష	489
మాండలిక భాషలు	494
అన్యభాషా ప్రభావములు	499
ప్రస్తుతాంశము	502
పారిభాషిక పదములు	506 - 510

తోడ్పడిన గ్రంథములు

తెలుగు

ఆంధ్ర భాషా వికాసము
ఆంధ్ర భాషా చరిత్రము
ఆంధ్ర భాషా భూషణము
ఆంధ్ర భాషానుశాసనము
ఆంధ్రుల చరిత్ర
ద్రావిడ భాషలు
పంది
అప్పకవీయము
బాల వ్యాకరణము
ప్రౌఢ వ్యాకరణము
వ్యావహారిక భాషా వ్యాకరణం
ఆంధ్రుల చరిత్ర
ఆంధ్రకౌముది
ఆర్యభాషా విభాగము
ప్రాకృత భాషోత్పత్తి
కావ్య పద్య మంజరి
దక్షిణభారత సాహిత్యములు
విజ్ఞాన సర్వస్వము
సూర్యరాయాంధ్ర విజ్ఞానము
చింతామణీ విషయ వివిధోదనము
వ్యాకరణ సంహితా సర్వస్వము
ద్రావిడ భాషా వివేచనము
ప్రౌఢన్నయ యుగము
నన్నయ భారతము
ఆంధ్ర శబ్ద తత్త్వము
అర్థానుస్వార తత్త్వము
శబ్ద లక్షణ సంగ్రహము
మన లిపి పుట్టు పూర్వోత్తరాలు

ఆంగ్లము

Comparative grammar of Dravidian Languages
Dravidian philology
Sanskrit grammar
The grammatical structure of Drav'dian Language
Languages and Literatures of Modern India
Linguistic survey of India
Our Language
The Romance of words
Language
The Miracle of Language
Primer of Philology

సంస్కృతము

ద్రవిడోపపత్తిప్రతిపాదనము
కావ్యమీమాంస
ఆంధ్ర శబ్ద చింతామణి
అథర్వణ కారికావళి
సంస్కృత మూలాంధ్ర వ్యాకరణము
సాహిత్య దర్పణము
నాట్యశాస్త్రము
భాషాశాస్త్ర ప్రవేశిని

హిందీ

భాషాలోచన్ — భాషా రహస్య
ఆర్యభాషా ఔర్ హిందీ — భాషా విజ్ఞాన్

పరమోదారులు మద్గురూత్తములు యద్భాషావయోరాశి యా
విరి గావించి యనుగ్రహించి రదియే విద్యార్థి సద్యఃపయో
ధరమై చల్లని గాలి సోకి యనుమోదస్ఫూర్తి వర్షించె సు
స్థిరమై లతణసత్ఫలోత్కరము వాసింగాంచ నాంధ్రోర్వరన్.

మొదటిముద్రణ పీఠిక

ము ం దు మా ట

ఏ జాతియైనను తన చరిత్రను తాను తెలిసికొనవలయునన్న దేశచరిత్రతో పాటు సాంఘిక చరిత్రను భాషా చరిత్రను గూడ తెలిసికొనుట యవసరము. ఈ త్రితయము వేఱత్వము నొందినగాని చరిత్ర సమగ్రత్వము నొందదు.

ఆంధ్రుల సాంఘికచరిత్రను సమ్యగ్భావనముగా రచించిన గౌరవము శ్రీ మరవరము ప్రకాశరెడ్డిగారు దక్కించుకొనిరి. భాషాచరిత్ర రచనమున నాకు గౌరవ పాత్రులు మువ్వురు – శ్రీ చిలుకూరి నారాయణరావుగారు, శ్రీ గంటి జోగిసోమ యాజిగారు, శ్రీ వజ్ఝల చినసీతారామస్వామిశాస్త్రిగారు.

శ్రీ చిలుకూరి ఆంధ్ర భాషా చరిత్రమును రచించిరి తెనుగును కూడ ఇతర ద్రావిడ భాషలతోపాటుగ ప్రాకృతజన్యముగా పరిగణించిన వీరివాదము నాకు సమ్మ తము కాదు అయినను భాషా పరిశోధనమున వీరిగ్రంథ మమూల్య విషయములను వెలువరించిన దని నా విశ్వాసము.

శ్రీ గంటి ఆంధ్ర భాషా వికాసమును రచించిరి. చాలకాలముగా అధ్యయ నాధ్యాపనములందు ప్రవర్తిల్లుచున్న యేకైక గ్రంథము ద్రావిడభాషా తులుంగ వైశిష్ట్య నిర్ణయమున నిరుపమానములై వ దీపను దక్షతను విరూపించుకొన్నది.

శ్రీ వజ్ఝల ద్రావిడ భాషా వరిశీలనము రచించిరి. కాల్డ్వెల్ గ్రంథానువాదము తో, అనుకూల ప్రతికూల వాదములతో, తమిళ కర్ణాట మలయాళ బహుశాస్త్ర ములతో మహాగహనముగా పాగినది. విశదవరిశీలన దృష్టికి, నిరుపమ పాండి త్యమునకు విధానము.

ఈ మూడు గ్రంథములును విషయమునసే కాక వరిపూర్ణమున కూడ ఘన తను పాదించుకొన్నవి. పరీక్షార్థికిగాని సామాన్య పాఠకునికిగాని అనక్తిని గరి గింపవలయునన్న వింతకన్న తక్కువ వరిమాణములో, వరళసుందరముగా వ్రాయుట యవసరము. దానికై నేనొక ప్రణాళికను సిద్ధము చేసికొని, దాని కను గుణముగా విషయమును వేఱరించుకొని, యీ గ్రంథమును వ్రాసితిని. ఇది వరి

కోధవగ్రంథ మని కాని, సర్వవిషయసమగ్ర మని కాని కించిన్మాత్రమును నాకు భ్రమ లేదు ఇందరి ప్రతి ప్రకరణమును విస్తృతి నపేక్షించును అనను, భాషా చరిత్రలోని వివిధాంశములతో పరిచయము గావించి యానక్తిని గలిగించి పెంపొందించుట ఈ గ్రంథము పర్యాప్తము కాగలదు

శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు వ్రాసిన 'సంధి', శ్రీ దివాకర్ల వేంకటావధానిగారు వ్రాసిన 'ప్రాఙ్నన్నయయుగము, 'నన్నయ భారతము' అను రెండు వ్యాసములు, శ్రీ తిరుమల రామచంద్రగారు వ్రాసిన 'మనలిని పుట్టుపూర్వోత్తరాలు' అను గ్రంథము నేకదేశముగా రచింపబడిన మహత్తర గ్రంథములు. ఇట్టిదే యింకను రావచ్చును రావలయును.

వివులీకరణమున కొకవిధమైన ప్రయోజన ముండగా సమీకరణమునకు మరొకవిధమైన ప్రయోజన ముండును ఆ ప్రయోజనమే యీ గ్రంథమునకు పరమార్థము.

గ్రంథరచన మొక యెత్తు గ్రంథప్రకటనము మరొక యెత్తు 'బుక్స్ ఆఫ్ ఇండియా' సంస్థవారు గ్రంథ ప్రకటన భారమును వహించుటయే కాక, నిరంతర ప్రోత్సాహముతో గ్రంథరచనకు కూడ కారణభూతులైరి.

నా సర్వవ్యాసంగమునకు కార్యరంగమైన ఆంధ్రక్రైస్తవ కళాశాలకు విద్యార్థిమిత్రులకు నా కృషిలో తగినంత భాగమున్న దనుట యథార్థము. నా యభిలాషకు తగినట్లుగా, అందముగా ముద్రించి యిచ్చిన గౌరవము శ్రీ లక్ష్మీ ప్రెస్ వారిది

అందరకు నా ధన్యవాదములు

★

మరొక మాట

తెలుగు భాషా చరిత్ర కిది రెండవ ముద్రణ. ఇటువంటి గ్రంథములు పునర్ముద్రణకు నోచుకొనుట వుత్కృష్ట మనియే యెంచవలయును. అందును మూడు నాలుగేండ్లలోనే అట్టి యవసరము కలుగుట మరింత విశేషము. దీనికి వెనుకనుండి చేయూత నిచ్చి అట్టి యవసరమునకు హేతువైన పెద్దల పౌమనస్యమునకు నా హార్దిక ధన్యవాదములు.

ఇది కేవలము రెండవ ముద్రణ కాదు. మొదటి ముద్రణకంటె దరిదాపు రెట్టింపు గ్రంథము పెరిగినది. మిత్రుల సూచనల ననుసరించి, విద్యార్థుల యావశ్యకములను గమనించి పెక్కు విషయములను క్రొత్తగా చేర్పుట జరిగినది. అయినను వీలయినంత సంగ్రహముగా, పఠనముగా చెప్పుటయే నా లక్ష్యము. దానిని విడనాడ లేదు. కొందరు మిత్రులు ఇందలి ప్రకరణములను పెంచి వ్రాయుమని సూచించిరి కాని, అది నా లక్ష్యమునకు అనుకూలము కాకపోవుటచేత, అట్టి విస్తరణ కార్యక్రమమునకు వీలు కలిగింపలేక పోయితిని. ఉన్నది యున్నట్లుగా విద్యార్థుల యవసరములను తీర్చగలదని, భాషాభిమానులకు సంతృప్తిని చేకూర్చ గలదని నా విశ్వాసము.

భాషాశాస్త్ర విషయమున తెలుగుదేశము కాల్యము వింకను దాటలేదు. తగినన్ని గ్రంథము లింకను వెలువడలేదు: పారిభాషిక పదప్రయోగ విషయమున ఏకాభిప్రాయసమ్మతమైన ఏకరీతి యేర్పడలేదు. కాబట్టి ప్రస్తుతగ్రంథమువందు ప్రయుక్తములయిన పారిభాషికపదములను, తుల్యములయిన ఆంగ్లపదములను అకారాది క్రమమునొక పట్టికగా వ్రాసి చేర్చితిని. వీటిఔర్థులు ఆంగ్లపదములను గూడ గుర్తించుకొనుట యవసరము.

పూర్వముద్రణగ్రంథమువలె ఇదికూడ పాఠకుల యాదరమునకు పాత్రము కాగలదని, అంతకంటె నెక్కువ ప్రయోజనవంతము కాగలదని నా యాశంస.

ప్రాస్తావిక ప్రకరణము

మానవుడు సర్వసృష్టియందు నుత్తముడు పుట్టినది మొదలు పెక్కువిధములుగా పెరుగుదలను సంపాదించుకొనును. ఇతరజీవులకు లేని ఆలోచనాశక్తి మానవునకు కలదు; అందు వలన అతడాలోచించును తన జీవితమందలి యెన్నియో ఘట్టములు, పరిసరములందలి యెన్నియో నన్నివేశములు ఆతని శాలోచనలను కలిగించును. వానిని చుట్టుప్రక్కలవారికి వ్యక్తము చేయవలయును. మానవుడు సంఘజీవి యగుటవల్ల తన భావములను ఇతరులకు తెల్పుటయు, ఇతరుల భావములను తాను తెలిసికొనుటయు తప్పవు. కావున తన భావములను వెల్లడించుటకు ప్రాక్తన మానవుడు మూడు మార్గముల ననుసరించియుండె నని భాషాశాస్త్రుల యభిప్రాయము.

మొదటిది అరచుట. ఈ విధానము భయము, శోకము మున్నగుభావములను గాని, ఆహారపదార్థము లభించు ప్రదేశము మున్నగువానిని గాని తెలియజేయుటకు సరిపోవును. ఆయా భావములనుబట్టి స్వరమునందు మార్పులు కలిగి ఆవేశము, ఉత్సాహము మున్నగువానిని నిరూపించును. ఈ పద్ధతివలన ప్రాచీనమానవుని కనీసపువ్యవహారము గడచిపోయెడిది.

రెండవది అంగికచలనము. కాళ్ళను చేతులను ఒక్కొక్కప్పుడు ఒక్కొక్కవిధముగా కదలించి ప్రాచీనమానవుడు తన భావములను వ్యక్తము చేసెడివాడు. ఇప్పుడును మూగ

వారికి తెలియజెప్పునప్పుడుగాని, చెవిటివారితో మాటాడునప్పుడుగాని కరచరణాద్యవయవములతో కొన్ని సంకేతములను గావించుట చూచుచునే యున్నాము. అన్యభాషీయులతో వ్యవహరింపవలసి వచ్చినపుడు కూడ ఇదే పద్ధతి నవలంబించుచున్నాము. ఇది యెంత ప్రాచీనభాషయైనను కానిండు బహు భాషాపండితులైనను కాల్సేతులు కదలింపకుండ మాటాడరు. కాని, యీ అంగికచలనము దూరవర్తులకు ఉపయోగపడదు.

మూడవది వాగ్వ్యవహారము. ఇదే మన భావములను, అనుభూతులను, ఆలోచనములను చుట్టుప్రక్కలవారికి అందించుటకు సమర్థమగు సాధనము. అంగికచలనమందు కరచరణాదులతో చూపిన సంకేతములే యిప్పుడు భాషారూపము నొంది యింకను స్పష్టము లగును కావున వస్తువులకు, భావములకు, అనుభూతులకు, ఆలోచనలకు సంకేతములగు మాటల సమూహమే భాష యని నిర్వచింపవచ్చును. దీనినిబట్టి భాషకు భౌతికధర్మములు, మానసికధర్మములు కూడ ఉన్న వనవచ్చును. ముఖయంత్రముకదలికవల్ల మాటలు పుట్టును; శ్రవోయంత్రము సాహాయ్యమున మాటలు వినిపించును. ఇవి యంతయు భౌతికధర్మము. మాటలు భావాదులకు సంకేతములు గదా! హృదయస్పందనములను, బుద్ధిగతాలోచనములను గూడ మాటలు వ్యక్తీకరించును. ఇదంతయు మానసికధర్మము.

ఇంతే కాక, భాష సంప్రదాయలక్షణములతోపాటు వైయక్తికవిశేషములను కూడ వ్యక్తము చేయును. సనాతనమైయుండియు, అభ్యుదయలక్షణములను ప్రదర్శించును. ఏ

యొక్కడును దీనిని మార్చుటకు గాని, మరొకదానిని దీనిలో చేర్చుటకు గాని సమర్థుడు కాజాలడు.

భాష సర్వసామాన్యము; అందరకు నర్థము కావలయును; లేనియెడల, దానిప్రయోజనమే భగ్న మగును. కావున వ్యక్తిగతము లగు అభిరుచు లెట్లున్నను భాషా విషయమున మార్పు అంగీకార్యము కాదు. పిల్లలు తల్లి దండ్రుల దగ్గర, చుట్టుప్రక్కల పెద్దల దగ్గర భాషను. సంపాదించుకొందురు. భాష తెలిసినవారు మాటలాడుచుండగా, తెలియనివారు దానిని విని ప్రయత్నపూర్వకముగా నేర్చుకొందురు. అంతేకాని, ఒకజాతియందు పుట్టినంతలో ఎవ్వరికిని భాష స్వత్వముగా సంక్రమింపదు. వైయక్తికవైలక్షణ్యములను కలియగలుపుకొని భావవ్యక్తీకరణమునకు సామాజికముగ సహకరించు సాధనము భాష.

భాషోత్పత్తి

భాష పుట్టుకనుగూర్చి అనేకవాదములు గలవు. భాష భగవద్దత్త మని కొందరి భావము. భాషను మనుష్యుడు నిర్మింపలేదనియు, భగవంతుడే కల్పించి మానవునికి ప్రసాదించెననియు వారి నిశ్చయము. ఈడెను తోటలో భగవంతుడు స్వీడిషుభాషను, ఆదము డేనిషుభాషను, పాము ఫ్రెంచిభాషను మాటలాడెనని ఒక స్వీడిషుభాషాశాస్త్రవేత్త నిర్ణయించెను. భారతీయులు సంస్కృతమును అమరభాష యని సంభావించుచున్నట్లే మహమ్మదీయులు అరబ్బీభాషను, క్రైస్తవులు హిబ్రూభాషను దేవతలభాష లని భావించి మన్నించు

చువ్వారు. దీనినిబట్టి భగవంతుడే మానవునకు భాషను ప్రసాదించె నను విశ్వాసము బలీయముగా నున్నట్లు స్పష్టము కాగలదు.

కాని, యిది తర్కసహ మగు అభిప్రాయము కాదు. మానవులకు దూరముగా, ఎక్కడనో, ఏకాంతముగా, ఒకనిని బాల్యమునవే విడిచిపెట్టితి మనుకొందము. మానవుల సంబంధము లేకుండగనే ఆహారాదికము సేర్చాటు చేయవచ్చును. అతనికి మానవులమాట నేమాత్రము వినిపింపకుండ జేసినచో, అతడు వయసున వృద్ధిపొందుచున్నను భాషను సంపాదించుకొన లేడు మూగవాడుగనే వ్యవహరించును. ఇట్టి ప్రయోగములను పెక్కింటినిబట్టి భాషను భగవంతుడే యిచ్చె నను వాదము అసాస్తము కాక తప్పదు. కాని ఒకటిమాత్రము నిజము. ఇతరజీవులకు లేని సౌకర్యము మానవునికి కలదు. మానవుని కంఠమున గల స్వరపేటిక యెట్టిశబ్దముల నైన స్పష్టముగా నిర్దిష్టముగా పలుకగలదు. ఇదియు భగవదను గ్రహమే. అట్టి స్వరపేటిక సాహాయ్యమున మానవుడు వివిధ శబ్దములను భిన్నభిన్నస్వరములలో అవస్థానుగుణముగా పలికి, భాషను కల్పించుకొనును. దానినే తరువాతివారు స్వప్రయత్నము వల్ల సముపార్జించుకొని రనుట సత్యసంగతమై కనిపించును.

సంకేతములనుండి భాషలు సముద్భవించె నని కొందరి వాదము. ప్రాచీనమానవుడు తన భావములను వెల్లడించుటకు కరచరణాద్యవయవముల నొకపద్ధతిలో కదపెడివాడు దానితో పాటుగా "ఏ, ఓ" మున్నగుధ్వనులుకూడ చేసెడివాడు.

ఆ ధ్వనులును, మూకసంకేతములును నేటిభాషకు మూల రూపము లని వారి యభిప్రాయము. ఈ వాదము "పూ పూ" (Pooh Pooh) వాద మని పేరొందినది. దీనికే "టట్-టట్" వాద మనియు మరొకపే రున్నది.

కాని, ఇది అంగీకార్యము కాదు. భాష లేనప్పుడు సంకేతముల నుపయోగించుట సహజము. ఇప్పటికిని అన్యభాషీయులకు మన భావములను వెల్లడి చేయవలసి వచ్చినపుడు సంకేతముల నాశ్రయించుట తప్పుటలేదు. కావునసే వీనిని భాషకు మూలరూపముగా భావించుట పొరపాటు ధ్వన్యాత్మకమయిన భాష కరచరణాదిసంకేతములవల్ల పర్వడెననుట యుక్తిసహము కాదు.

అనుకరణము కారణముగా భాషలు పుట్టిన వని కొందరి వాదము. మానవుడు తన చుట్టుప్రక్కలనుండి ధ్వనిచేయుచున్న పశుపక్ష్యాదులను అనుకరించెను. కాకి "కాకా" అని యనును; కావున అది "కాకము" అని యైనది. అట్లే "భే" యని యఱచుటచే కప్పకు "భేకము" అను పేరు కల్గినది. అట్లే కోకిలకూత "కూకూ" అనుటల్లుగ్గా నుండుటనుభావమున "Cuckoo" అను వ్యవహారము కలిగినది. చిన్నపిల్లల వ్యవహారమున "మేక" యనుటకు బదులుగా, అరపునుపట్టి "మే" యని వాడుట వినిపించును. అట్లే కైలుబండి యనుటకు బదులుగా కూతనుబట్టి "కూ" యని వాడుట కలదు. ప్రాకృతమానవుడు దీనివిధ మగు మనస్తత్వముతోనే అనేక శబ్దములను పాధించికొనియుండు వనుటకు సందేహము లేదు. స్వాభావికము లగు ధ్వనులన్నే కాక ధ్వన్యనుకరణశబ్దములను గూడ అను

కరించుట భాషాప్రాథమికరూపము. మానవులు చేయు ధ్వను లనుగూడ మరొకమానవుడు విని గ్రహించుటయు, దానికి బదులుగా మరొకధ్వనిని చేయుటయు స్వాభావికము. కావున ప్రకృతిలోని శబ్దన లను పశుపక్ష్యాదులు చేయు శబ్దములను అనుకరించుట యాధారముగా భాష యేర్పడుచున్న దని సిద్ధాంతము.

ఎన్నో భాషలలో ఇట్టి ధ్వన్యనుకరణాత్మకము లయిన శబ్దము లున్నమాట సత్యము. కాని చుక్కలు, సూర్యుడు, చంద్రుడు మున్నగు మౌనపదార్థము లెన్నో కలవుగదా! వీనికిని పేళ్ళు గలవు కావున ధ్వన్యనుకరణమే భాషోత్పత్తికి కారణమని చెప్పుట సర్వత్ర సమంజసము కాదు. ఈ లోప మును గమనించియే "మాక్సుముల్లరు" దీనికి "బౌవౌ" వాద మని పరిహాస పూర్వక మగుపేరిడెను.

మాక్సుముల్లరు తన పథమున కాను "డింగ్‌డాంగ్ వాదమును ప్రతిపాదించెను. ధ్వనికిని భావమునకును అనురూప మైన సంబంధ మొకటి యుండును ప్రకృతియంతయు లయాత్మక మని, ప్రతిపదార్థమును ప్రకంపనములను కలిగియుండు ననియు, ఆ ప్రకంపనములకు అనుగుణముగనే శబ్దము వక్త నోట వెలువడు ననియు ఈవాదమునందలి సారము. Whisper అని యన్నపుడు చెవిలో రహస్యముగా గుసగుసలు చెప్పు కొను నప్పటి శబ్దము వినిపించుము. తెలుగునందలి 'గుసగుస' యనునది కూడ అట్టి ధ్వన్యాత్మకతను కలిగియే యున్నది. Glow అని యన్నప్పుడు ఏదో ఒకవికాసము, ఒక దీప్తి యున్నట్లు అనిపించును Zig Zag అని యన్నపుడు 'వంకర

టింకర' యని తెలుగున అన్నట్లుగానే ఒకవక్రత భాసించును. ఇక్లే గణగణ, దబాలున చట్టున మున్నగు పదములు క్రియా సందర్భ సముద్భూతము లగు ధ్వనులను అనుకరించుచున్నట్లు అనిపించును.

కాని, ఇది శాస్త్రసిద్ధాంతముగా నిలుచునంతటి శక్తి మంతము కాదు. కవిహృదయము కలవారి కేశబ్దమైనను విశిష్టముగా కవిపింపవచ్చును. శబ్దములతో నిత్యపరిచయము సంపాదించుకొన్న పిమ్మట ఆయాశబ్దములలో ఈనాడు మనము విశిష్టధ్వనులను కనుగొనవచ్చును. అంతమాత్రమున ఇదే సత్యమనుట కవకాశము చాలదు పైగా ఇట్టిపదము లేభాష యందైనను అల్పసంఖ్యాకములై యుండును. వీనికే సర్వ ప్రాధాన్య మిచ్చుట సమంజసము కాదు.

బరువులను మోయునప్పుడు, బట్టలను ఉతుకునప్పుడు, పరుగెత్తుకొని వచ్చునప్పుడు ఈచ్ఛ్వాసనిశ్వాసములు దీర్ఘము గను బరువుగను సాగును. ఇటువంటి సమయములందు కండ రములు బిగిసి, నాదతంత్రులు ప్రకంపనమునొంది కొన్నివిధము లగు ధ్వనులను పుట్టించును. ఇంతవరకు చేయుచున్న పనివల్ల కలిగిన శ్రమ యీ విధముగా ధ్వనిపూర్వకముగా ఉచ్ఛ్వాస నిశ్వాసములను గావించుటతో కొంత ఉపశమించినట్లు కని పించును. సామూహికముగా, ఒకతెగ జనులు తమ పనిపాటు లలో ఉపయోగించుకొన్న యీధ్వనులే క్రమక్రమముగా అర్థ వంతములై భాషారూపము ధరించె నని కొందరి వాదము. దీనినే Muscular Theory అని యందురు. పడవలమ లాగు

వారు వెలువరించు "హోహిహో" అను ధ్వనినిబట్టి దీనికి "హోహిహో" వాద మనియు పేరు గలిగినది.

ఇతరవాదములందువలెనే దీనియందును లోపము గలదు. అర్థహీనము లయిన ధ్వనులే అర్థవంత మయిన భాషకు మూల మని సాపించుట పొసగదు పైగా ఇట్టి శబ్దములు ఏ భాషయందైనను అల్పసంఖ్యాకములు.

వివక్షాప్రేరణమే కారణముగా మాటలు పుట్టిన వని కొందరి వాదము విట్నీ మున్నగువారు చెప్పినట్లు "వ్యక్తీకరణాభిలాషయే భాషాభివృద్ధికి ప్రప్రథమ లక్షణము." భయము, శోకము, విసుగు, సంకోచము, సంతోషము మున్నగు భావములమ వెల్లడించవలయు ననన్న అభిలాషవల్ల మొదట మాటలు వెలువడెనని వీరు చెప్పుదురు. అరణ్యజీవితమును గడపు ఆదిమమానవుడు క్రూరమృగములవల్ల కలుగు భయముచేతనో అటునిటు నడయాడుటలో శరీరమునకు తగిలిన గాయముచేతనో గట్టిగా అరచెడివాడు. అప్పుడే చిన్న చిన్న జంతువులను భయపెట్టుటకు కేకలు పెట్టెడివాడు. ఇట్లు హృదయములోని భయాందోళనములను సంతోష సంభ్రమములను వెల్లడించుటకు వేసిన కేకలు, పెట్టిన బొబ్బలు భాషాస్వరూపసంపాదకము లవి అందురు. కాని, యేభాషలో నైన నిట్టి శబ్దములు స్వల్పముగా నుండును అట్టివెడల, ఆ శబ్దములే భాషకు రూపము దిద్దెననుట యుక్తిసంగతము కాజాలదు.

ధాతువులనుండి భాష పుట్టిన దని కొందరి నిశ్చయము. మొట్టమొదట ఎట్లో కొన్ని ధాతువులు లభించినవి; వానినుండి

అనేకము లగు శబ్దములు సిద్ధించినవి. ఆ ధాతువులే భాష లోని సర్వశబ్దములకు మూలమైనవి. ఇది అనేకులకు సమ్మత మైన వాదము కాని, దీనియందు సైతము లోపము కని పింపక పోదు. ప్రపంచమున గల కొన్ని భాషలలో ధాతువు పేరుమాత్రమునకైనను కనిపింపదు. సంస్కృతము మున్నగు భాషలందు ధాతువుయొక్కస్వరూపము స్పష్టముగా సాక్షాత్కరించు ననుమాట సత్యము.

ప్రాథమికదశయందు వాక్యములే వ్యవహృతములు కాగా, వానియందలి సాదృశ్యవైదృశ్యములను పరిశీలించి పండితులు విశ్లేషణకార్యక్రమము ననుసరించిరి. అట్లు వేరు పడినవి ధాతువులు కావున, ధాతువులను మూలముగా చేసి కొని భాషాపర్వతము నిల్చిన దనుట సత్యమును వ్యత్యస్తము గావించుటయే యగు నని కొందరి నిశ్చయము. పండితులు భాషాపర్వతమును శకలీకరించి, వేర్వేరు శిలలకు వేర్వేరు పేర్లుంచిరి. అట్టి వానిలో ధాతువులు ప్రధానములు అనం తరకాలమున ధాతువులు హేతువులుగా అనేకశబ్దము లుత్పన్న మైన వన్నను విప్రతిపత్తి లేదు.

పరస్పరవిమర్శవల్ల భాష పుట్టెనవి కొందరి వాదము. కొందరు వ్యక్తులు కూర్చుండి, కాగుగా ఆలోచనముచేసి, భాషను కల్పించి రని వీరి యభిప్రాయము కాము వాదు కొను వస్తువులకు సర్వసమ్మత మగునట్లుగా సమాలోచనము జరిపి నామకరణము గావించియుందు రవి వీరి యూహ. ఇది అభూతకల్పనము. భాషయే లేనివాడు వీరు సమాలోచనము జరుపు చెట్లు? సంభాషించు చెట్లు? అంతే కాక వలుగురును

కలిసి నిర్ణయించినంతటిలో భాష యుత్పన్న మయ్యే ననుట యుక్తిసహము కాదు అనంతరకాలమున భాషలో కొన్ని సంస్కారములు తీసికొని వచ్చుటకు ఇట్టి సమావేశములు పనికి వచ్చు నేమో కాని భాషయే లేనినాడు సమాలోచన మను మాట నేల విడిచి సాము చేయుట.

కాని, ఒకటి మాత్రము సత్యము. పైని చెప్పిన సర్వ వాదములు యథోచితముగ భాషోత్పత్తికి సహకరించును. ప్రాథమికదశలో నెట్లున్నను పరిణామదశలో పై వాదములు చాలవరకు పనిచేసియుండును "స్వీటు" మున్నగువారు సమన్వయ వాదమునే సమర్థించిరి.

పైని చెప్పిన వాదము లన్నింటినిబట్టి మానవుడు కొంత కాలముపాటు మూగవాడై యుండియుండు నని చెప్పవలసి వచ్చుచున్నది. కాని, ఇది సరియైనది కాదు ప్రారంభము నుండియు మానవుడు ధ్వనులనుపయోగించె ననియు, అట్టిశక్తి యాతనికి సహజావబోధము (Instinct)గా సంక్రమించెననియు అనుకొనదగును. కుక్కలు, పిల్లులు మొదలగునవికూడ అభిహిత ముగనే ధ్వనులను చేయుచున్నవిగదా! అట్లే ప్రాక్తనమానవుడును చేసియుండును. ఆహారసంపాదనము, దాంపత్యజీవనము, శిశుపోషణము, శత్రుసంహారము మున్నగు విషయములు సర్వజీవులకు సమానము. నోరు కేవలము ఆహారగ్రహణమునకే యేర్పడినను, మానవుడు తన స్వశక్తివలన దాని నింకను లాభదాయకముగా నుపయోగించెను. పరిసరములం దున్న పశుపక్ష్యాదుల ధ్వనుల ననుకరించెను. దీని కాతని అన్వేషణ

పరాయణత్వముకూడ తోడ్పడియుండును. సమాజ వికాసము, పరిసరములను అనుకరించుట, క్రొత్త క్రొత్త మార్పులను సాధించు ప్రయత్నము - ఇవన్నియు భాషోత్పత్తికి సహకారులే అనవలసి వచ్చును.

మానవు డెప్పుడైనను, ఒక క్రొత్తవస్తువును చూచిన యెడల ఇతరులకు చెప్పవలయు నని తహతహలాడుచుండును. వేరు తెలియనియెడల దాని గుణములను వర్ణించి, దాని స్వరూపమును వివరించి, యితరులకు తెలియజెప్పుటకు యత్నించునే కాని యూరకొనడు. ఈవిధ మగు వివక్ష మానవప్రయత్నమునకు కారణమై భాషోత్పత్తికి సహకరించి నది. ఇట్లు అనేక కారణములు సమన్వయ మొంది భాషోత్పత్తికి సహకరించియుండు నని పరిశీలన చేసినమీదట మనకు గోచరము కాగలదు. నేటి పరిస్థితులనుండి యెన్నియో సంవత్సరములక్రిందటి పరిస్థితులను సమగ్రముగా అవగాహన చేసికొన్నగాని వాస్తవమును నిశ్చయింపజాలము. భాష యందు సారస్వతమునందువలె ఆంతర మైన అర్థమునకు కాక, బాహిర మైన శబ్దమునకు ప్రాధాన్యము హెచ్చు. 'భాష' అను పదము 'భాష్' అను ధాతువువల్ల ఏర్పడినది. దీనికి "వ్యక్తమైనవాక్కు" అని యర్థము. ఇందు అర్థవంతములై అక్షరములు, పదములు, వాక్యములు నుండును. అర్థహీనములైనచో అవి భాషాశబ్దవాచ్యములు కాజాలవు. ధాతువు, ప్రకృతి, ప్రత్యయము, వాక్యము - అనునవి భాషయందలి ప్రధానాంగములు.

ప్రపంచ భాషలు

తొలుదొల్త ఒక్కటే భాష యయ్యును, క్రమముగా పెక్కుభాషలు వాడుకలోనికి వచ్చినవి. మానవజాతి పెరిగి, పెద్దదై ప్రపంచమున విస్తరించుకొన్నట్లే భాషలును విస్తరించుకొన్నవి. ఈనాడు భాషాశాస్త్రుల పరిగణమునుబట్టి ప్రపంచము మొత్తముమీద 2796 భాషలు కలవు. ఒకభాష మాటాడువారికి మరొకభాష యేమాత్రము నర్థముకానంతగా అనిపించును. భిన్నభిన్నములుగా కనిపించునట్టి యీభాషలలో కొన్నింటికి అంతరిక మైన సంబంధ మేదో యున్నట్లు పరిశీలనశేత్రములతో చూచినవారికి తప్పక గోచరించును. భాషలయొక్క రూపమునుబట్టి కాని, భాషలయొక్క పుట్టుకమబట్టి కాని వానికి పరస్పరసంబంధమును స్థాపించుటకు అవకాశము కలదు.

ఈ వర్గీకరణము రెండు రకములుగా చేయవచ్చును మొదటిది జాత్యాశ్రిత వర్గీకరణము. భిన్నభిన్న భాషలయందలి పదముల సాదృశ్యమును, ఆయాపదములకు మూల మైన ధాతువును నిర్ణయించి యేకకుటుంబతను అంగీకరింప నగును. దీనినే ఆంగ్లమున Genealogical classification అని యందురు.

కొన్ని భాషలలోని శబ్దములు, వాక్యములు అన్య భాషలలోని శబ్దములతో వాక్యములతో సంబంధమును కలిగి కనిపించుచున్నవి. కేవలము రూపమునుబట్టి కన్పించు సామ్యమే కాక అర్థసామ్యము, ధాతువిశేషము మున్నగు వానిని పరిశీలించినప్పుడు ఈభిన్నభిన్న భాషలు ఒకే ఆశ్రయమునుండి

వెలువడినట్లు ఊహింప వీలు కల్గును. మొట్టమొదటగా ఈ భాషలను పరిశీలించినవారు ఈవిధముగా తలచిరి.

'తండ్రి' అను నర్థమున సంస్కృతమునందు పితృ' అను నామమున్నది. జండు భాషయందు 'పిత' యనియు, లాటిను భాషయందు 'పేతర్' అనియు జర్మను భాషయందు 'ఫాటిర్' అనియు, పారశీకమునందు 'పిదర్' అనియు, ఆంగ్లమునందు 'ఫాదర్' అనియు రూపములు గలవు. వీని లోని సామ్యమును చూచినప్పుడు ఈభాష లన్నియు ఏదో ఒక ప్రాచీనభాషనుండి పుట్టినట్లు నిర్ధారించు అవకాశము కల్గు చున్నది. ఈవిధముగా ఏ యే భాషలలో ఏకార్థనిర్ణాయక ములై పరస్పరసన్నిహితత్వము గల పదము లున్నవో పరిశీలించి, వాని నెల్ల ఒకతల్లి బిడ్డలుగా గాని ఒకే కుటుంబమునకు చెందిన భాషలుగా గాని ఊహింపవచ్చును. సంస్కృతము, లాటిను, ఆంగ్లము మున్నగు భాషలలోని చరిత్రసాదృశ్యమును బట్టి సోదరభాష లని నిర్ణయింపవచ్చును. అట్లే ప్రాచీనమగు లాటిను భాషాకుటుంబమునకు చెందినవిగా ఫ్రెంచి స్పేనిషు, పోర్చుగీసు, రుమేనియను, ఇటాలియను మున్నగు భాషలు కనిపించును.

కాని కేవలపదపరికరమునుబట్టియే ఏకకుటుంబత్వమును నిర్ణయించుట సమంజసము కాదు. చారిత్రక రాజకీయ కారణములవల్ల గాని, వాణిజ్య వ్యాపారములవల్ల గాని, సంస్కృతి సాహిత్యముల ప్రభావమువల్ల గాని ఒక్కొక్క భాషలో అన్య భాషాపదములు విరివిగా ప్రవేశింపవచ్చును. స్థూలముగా చూచినప్పుడు వేటి పారశీకము అరబ్బీభాషతో సోదర సంబం

ధము కాని, జన్యజనక సంబధము కాని కలిగి యున్నట్లు అని పించును. రాజకీయకారణముగా అరబ్బీభాషకు పారశీకముపై అట్టి ప్రాభవము లభించినది. అందువలననే పారశీకసాహిత్య చరిత్రలో "శుద్ధపారశీకోద్యమము" వంటివి కొన్ని మనకు సాక్షాత్కరించును నిజమునకు పారశీకము "ఇండో-యూరోపి యను" కుటుంబమునకు చెందినది. అట్లే ద్రావిడ భాషా కుటుంబమునకు చెందిన తెలుగు, మలయాళములందు సంస్కృత పదములసంఖ్య యత్యధికముగా గోచరించును. పదసామగ్రిని సంపాదించుటకుగాను, సాహిత్యసౌష్ఠవమును సంపాదించు కొనుటకుగాను, పొరుగుభాషలనుండి యనేకపదములను తెచ్చుకొనవచ్చును. ఎన్నిపదములు పైనుండి వచ్చినను, వ్యాకరణ విషయమున వాక్యనిర్మాణవిషయమున ప్రతిభాష కును తన సంప్రదాయమును పాటింపవలసిన యవసర మొకటి అవశ్యముగా నున్నది కేవల పద సామ్యమునుబట్టి జన్మసామ్య మును నిర్ధారించుట సమంజసము కాదు, సంప్రదాయమును కూడ పరిగణించుట అవసరము.

కేవల సాహిత్యపదములను, ఉన్నతభావబోధకములను కాక కుటుంబనిర్ణయమందు నిత్యవ్యవహారమునందలి పదములనే యెక్కువగా స్వీకరించుట సమంజసము. ఒకటి, రెండు, మూడు మున్నగు సంఖ్యావాచకములును; వాడు, అది మున్నగు సర్వ నామములును; క్రియాపదములును, వాక్య నిర్మాణవిశేషమును ఇట్టి నిర్ణయమునకు ఉచితదోహదము కలిగించును.

ఒకే కుటుంబమునకు చెందిన భాషలలోనే ఒకే పదము చిన్న చిన్న మార్పులతో వేర్వేరు రూపములలో కన్పింప

వచ్చును. ఈ మార్పులు ధ్వనిసిద్ధాంతముల ననుసరించి, నియతములై యుండును. 'శిరస్సు' అను నర్థముగల తెలుగు శబ్దము 'తల' అరవమున 'తలై' అనియు, కన్నడమున 'తలె' అనియు కలదు. 'వెల' అనునది అరవమున 'విలై' అనియు, కన్నడమున 'బిలె' అనియు కలదు. దీనిబట్టి అరవమందలి ఐకారాంతశబ్దములు కన్నడమున ఎకారాంత ములుగాను, తెనుగున అకారాంతములుగాను ఉండు నని సాధారణముగా నిర్వచింపవచ్చును. ఇట్టి మార్పులనుగూడ ఏకకుటుంబనిర్ణయసందర్భమున గుర్తించుట అవసరము.

జాత్యాశ్రిత వర్గీకరణము

ఈవిధ మగు జాత్యాశ్రితవిభాగమునుబట్టి ప్రపంచ భాషల నన్నింటిని కొన్ని కుటుంబములలో ఇమిడింపవచ్చును. అనేకత్వమునందలి యేకత్వమును గుర్తించి, సముచితముగా సంభావించుట మానవసామాన్యధర్మము. ఆధర్మమే యిచ్చట కూడ పనిచేసినది మొత్తముమీద ప్రపంచమందలి భాష లన్నింటిని ఇరువదిరెండు భాషాకుటుంబములలో అంతర్భవింప జేసిరి. వానియందును మిక్కిలి వ్యాప్తిని పొంది, అధిక సంఖ్యాకులచేత మాటాడబడు భాషలను గలని పండ్రెండు కుటుంబములు. అని యివి 1 ఇండో యూరోపియను 2 సెమిటో-హెమిటిక్ 3. సీనో-టిబెటను 4. జపానీ-కొరియను 5 ఆఫ్రికన్ నీగ్రో 6. ద్రవిడియను 7. మలయో పోలినీషియను 8. ఓరల్-ఆల్టాయిక్ 9 అమెరికను-ఇండి యను 10. కకేసియను 11. బాస్కు 12. ఇతర భాషలు.

ఇందలి యొక్కొక్కకుటుంబముయొక్క విశేషములను సంక్షేపముగా సమీక్షించుకొందము.

1. ఇండోయూరోపియను కుటుంబము : ప్రపంచమంతటిలోను అత్యధిక సంఖ్యాకులచేత మాటాడబడు భాషలు ఈ కుటుంబమునకు చెందినవే. యూరోపు, ఈశాన్యభారతము, నైరృతాసియాల నడిమి ప్రదేశము, ఆస్ట్రేలియా, న్యూజీలాండు, టాస్మానియా, దక్షిణాఫ్రికాలయందు ఈ భాషలు కలవు. ఆంగ్లేయులు, ఫ్రెంచివారు, డచ్చివారు, పోర్చుగీసువారు తాము వ్యాపించినంతమేర ఆయా వలసరాజ్యములలో తమ భాషలను నెలకొల్పుట జరిగెను.

సాధారణముగా ఈభాషలన్నియు ప్రత్యయాత్మకములై సంశ్లిష్ట భాషావర్గమునకు చెందినవి. కాని కాలక్రమమున కొన్ని భాషలు సారళ్యము నవేక్షించి కొంతమార్పునకు లోనగుచున్నవి.

జర్మానిక్, ఇటాలిక్ (రోమాన్స్), కెల్టిక్, బాల్టో స్లావిక్, గ్రీకు, అల్బేనియను, ఆర్మీనియను, ఇరానియను, ఇండోఆర్యను - అనువేరులతో ఈకుటుంబము తొమ్మిది శాఖలై కనిపించును. ఇందు ప్రతిశాఖయందును మరల భిన్న భిన్న భాషలు గలవు.

ఈ ఇండోయూరోపియనుభాషలు ధ్వనులమట్టి రెండు వర్గములుగా విభక్తములై కనబడుచున్నవి. ఇండోఆర్యను భాషాకుటుంబమునకు మూలభాషయని తలపబడుచున్న ప్రాచీనసంస్కృతమువందలి చవర్గము గ్రీకు లాటిను మున్నగు

భాషలయందు కంఠ్యముగా మారుచుండగా సంస్కృతము ఇరానియను మున్నగు భాషలయందు ఊష్మవర్ణముగా మారుచున్నది 'వంద' యను వర్థమున 'చంతోమ్' అనునది మూల భాషాపదమని శాస్త్రకారుల కల్పనము. దీనికి లాటినుభాషయందు 'కెంటుమ్' అనియు జర్మను భాషయందు 'ఖుంద్' అనియు రూపములు గలవు. ఈ రెండుచోట్లను కంఠ్యవర్ణమే కలదు. సంస్కృతమునందు 'శతమ్' అనియు, ఇరానియనునందు 'సతమ్' అనియు రూపములు గలవు. కావున 'కెంటుమ్' మున్నగురూపములను గలిగిన భాషలను కెంటుమ్ వర్గమనియు, 'శతమ్' మున్నగురూపములను గలిగిన భాషలను శతమ్ వర్గమనియు పిలుతురు.

ఈవిభాగము ననుసరించి కెల్టిక్, జర్మను, లాటిను, గ్రీకు - మున్నగుభాషలు కెంటుమ్ వర్గమునకు చెందును; అల్బేనియను, ఆర్మీనియను, బాల్టోస్లావిక్, ఇరానియను, ఇండో ఆర్యను భాషలు శతమ్‌వర్గమునకు చెందును. మొత్తముమీద చాచాపు వందకోట్లమంది ఈకుటుంబమువకు చెందిన భాషలను మాటాడుచున్నారు.

2. సెమిటో హెమిటిక్ కుటుంబము : అరేబియా, ఇరాక్, పాలస్తీను, సిరియా, ఉత్తరాఫ్రికా, ఎతియోపియా, ఎరిట్రియా, సోమాలీలాండు, జాంజిబారు, మడగాస్కరు, మాల్తా మున్నగుచోట్ల ఈకుటుంబమునకు చెందిన భాషలు వ్యాపించియున్నవి

ఈభాషలు కూడ ప్రత్యయాత్మకములే. ఇందలిధాతువులు సాధారణముగా మూడు హల్లులను కలిగియుండును.

వీనిలో వలయునెడల అచ్చులు ప్రవేశించి, రూపము నర్థమును సమకూర్చును. 'వ్రాయు' అను నర్థమున క్ త్ బ్' అను మూడు హల్లులు కలవు, 'కతబ' అని యన్నప్పుడు 'అతడు వ్రాసెను' అని యర్థము. 'కుతిబ' అని యనగా 'అది వ్రాయబడెను' అని యర్థము. 'యక్తుబు' అని యనగా 'అతడు వ్రాయును' అని యర్థము. 'యుక్తబు' అని యనగా 'అది వ్రాయబడును' అని యర్థము 'కితాబున్' అని యనగా 'పుస్తక' మనియు 'కాతిబున్' అని యనగా 'లేఖకుడు' అనియు నర్థములు ఇట్లు స్వరములు మధ్యలో ప్రవేశించి, వేర్వేరుపదముల నేర్పాటు చేయుట యీభాషలయందు కలదు ఇవి సంశ్లిష్టభాషావర్గము నకు చెందినవి.

హిబ్రూ, అరబు, ఎథియోపియా భాషలతో సెమిటిక్ శాఖయు, లిబికోబెర్బర్, కుషిటిక్, కోప్టిక్ భాషలతోకూడి హెమిటిక్ శాఖయు ప్రధానములైయున్నవి ఆరెండు శాఖల మూలమునవే ఈభాషాకుటుంబమునకు సెమిటోహెమిటిక్ కుటుంబము అనుపేరు వచ్చెను.

ఈభాషలను మొత్తముమీద ఏడుకోట్ల యేబదిలక్షలమంది మాటాడుచున్నారు

3. సీనోటిబెటను కుటుంబము : టిబెట్టు, బర్మా, సయాము, ఇండోచైనా ఉత్తరభాగము, మంచుకూవో, సింకియాంగు మున్నగుచోటులందు మాటలాడుభాషలు సీనోటిబెటను కుటుంబమునకు చెందినవి.

ఈకుటుంబమునకు చెందినభాషలు ఏకాచ్యవిభాగము నకు చెందినవి. అనగా ప్రతిపదాత్మకవర్గములో చేరిన విశ్లిష్ట

భాషలని యర్థము ఈభాషలను చాదాపుగా పబదికోట్లమంది మాటాడుచున్నారు

ఇందు చైనావిభాగము, టిబెటన్‌బర్మా విభాగము, సయామీవిభాగము - అని మూడు ముఖ్యశాఖలు కలవు. అందు ప్రధానమై పలువదియైదుకోట్లమందిచే మాటాడబడునది చైనా విభాగము. ఇందుమాండలిక విభేదము లనేకముగా కలవు. ఒకే మాట వేర్వేరుస్థానములనుండుండి వేర్వేరు స్వరములతో ఉచ్చరింపబడి వేర్వేరర్థముల నిచ్చును. ఈభాష బొమ్మలలిపిలో వ్రాయబడును. ఇటువంటి బొమ్మలు సుమారు మూడువేలు వాడుకలో కలవు. ఒక్కొక్క బొమ్మయు ఒకధ్వనికికాక, ఒక పదమునకు గుర్తుగా వ్యవహరించును.

జనసంఖ్యనుబట్టి చూచినయెడల ఇండోయూరోపియను భాషాకుటుంబము తరువాత నిలువదగినది సీనోటిబెటను కుటుంబమే.

4. జపా కొరియను కుటుంబము : జపాను, కొరియాదేశములు ఈభాషాకుటుంబ వ్యవహారమునకు ప్రధాన రంగములు. ఫారోన్మజా, మంచుకూవో, కెరోలిన్ మార్షల్ దీవులు, చైనాలో చాలభాగము, డచ్ ఈస్టిండీసు, ఫ్రెంచి ఇండోచైనా, సయాము, మలయా, బర్మా, ఫిలిప్పీనులయందు కూడ ఈభాషలకు కొంతవ్యవహారము కలదు.

ఇవి సంయోగాత్మక భాషలు. ఈభాషలయందు లింగ భేదముకాని వచనభేదము కాని కానరాదు. ఒకే అర్థమునందు వినయగౌరవాదులను నిరూపించుటకు వేరువేరుమాటల నుప యోగించుట యీభాషలయందు కలదు.

బసామ విభాగము, కొరియను విభాగము- అని రెండు శాఖలు గలవు. మొత్తముమీద ఈకుటుంబమునకు చెందిన భాష లను పదికోట్లమంది మాటాడుచున్నారు

6. ఆఫ్రికను నీగ్రోకుటుంబము : ఈకుటుంబమునకు చెందిన భాషలు ఆఫ్రికాయందును, నవోరాకు దక్షిణభాగము నను, ఎతియోపియాకు పశ్చిమభాగమునందును వ్యవహారము నందున్నవి.

సూడానీ గినియను విభాగము, బంటూవిభాగము, హాటెన్‌టాట్ బుష్మన్‌విభాగము - అని యీ కుటుంబమును మూడు ముఖ్యశాఖలుగా విభాగింపవచ్చును.

వీనినన్నింటిని ఒకే భాషావర్గమునకు చేర్చుట కవకాశము చాలదు. పైగా ఈభాషలన్నియు ఆదిమావస్థలోనే దాదాపుగా మిగిలియున్నవి. ఇంగ్లీషు, ఫ్రెంచి పోర్చుగీసు మొదలయిన భాషలు ఆప్రాచీనభాషలను వాడుకనుండి తొలగించి వాని స్థానము నాక్రమించుటకూడ క్రమక్రమముగా జరుగుచున్నది.

సూడానీ విభాగమునందు విభక్తుల యుపయోగము దాదాపుగా లేదనియే చెప్పవచ్చును. అట్లే లింగభేదముకూడ కానరాదు. ప్రతిపదాత్మక భాషావర్గమునకు చెంది ఏకాక్ష రాతుపులను కలిగి విశ్లిష్టరూపములైనవి యీభాషలు. దక్షి ణాఫ్రికాయందు అధికభాగము నాక్రమించుకొనియున్నవి బంటూవిభాగమునకు చెందినభాషలు వీనియందును లింగభేదము కానరాదు. కాని యివి ప్రత్యయాత్మక భాషావర్గమునకు చెంది యున్నవి. ఇందు మాటలకు ముందు ప్రత్యయములు చేరి అర్థ విశేషమును కల్పించును. 'తు' అని యనగా 'మనుష్యుడు' అని

యర్థము. 'జురి' అనియనగా 'అందము' అని యర్థము. 'అంద మైన మనుష్యుడు' అని చెప్పవలసి వచ్చినప్పుడు 'మ్తు మ్జురి' అని వాడబడును. 'మ్' అను ఏకవచనప్రత్యయము విశేషణ విశేష్యములు రెండింటికిని ముందు చేరును. ఇట్లే బహువచనమున 'వతు వజురి' అని యనగా 'అందమైన మనుష్యులు' అని యర్థము ఇక్కడ 'వ' యనునది బహువచన ప్రత్యయము. ఈప్రత్యయము లను ఆయానామవాచకములనుబట్టి పెక్కువిధ ములుగా భేదించును హోచెంటాట్ బుష్మను విభాగమునకు చెందినభాషలయందు జడములు, చేతనములు - అను విభాగము కనబడును. ఇక్కడకూడ బహువచన ప్రత్యయములు పెక్కు విధములుగా కలవు.

మొత్తముమీద ఈభాషలను పదికోట్లమంది వ్యవహరించు చున్నారు.

6. ద్రావిడ కుటుంబము : ఈకుటుంబమునకు చెందిన భాషలు భారతదేశమున దక్షిణభాగమునందును, సింహళదేశ మున ఉత్తరభాగమునందును వ్యవహారమునందున్నవి.

ఇవి సంయోగాత్మక భాషావర్గమునకు చెందును. వీను లందలి వచనప్రత్యయములు, విభక్తిప్రత్యయములు చేరు చుండును. జడములు, పశుపక్ష్యాదులు, స్త్రీలు ఒకతరగతికిని పురుషులు ఒకతరగతికిని చెందినట్లు పరిగణించుట యీభాష లలో లింగవిభాగము స్థానమున కనబడు ప్రధానలక్షణము.

ఇందు తమిళము, తెలుగు కన్నడము, మలయాళము, తుళు, కొడగు - అనునవి ప్రధానభాషలు. ఇవికాక ఇంకను చెదరువాటుగా అక్కడక్కడ అల్పసంఖ్యాకులచే వ్యవహరింప

బడుచున్న భాషలు కూడ కలవు. మొత్తముమీద ఈకుటుంబము నకు చెందిన భాషలను పదికోట్లమందికిపైగా మాటాడు చున్నారు.

7. మలయో పోలినీషియను కుటుంబము : మలయా ద్వీపకల్పమునందును, జావా సుమత్రా బోర్నియో బాలీ మున్నగు దీవులయందును, ఫిలిప్పీన్సు, మడగాస్కరు, న్యూజిలాండు, సమోవా మున్నగు ప్రదేశము లందును ఈకుటుంబము వ్యవహారమునందు కలదు.

ఈకుటుంబమునకు చెందిన భాషలయందు ధాతువు ద్వ్యచ్చుమై (రెండచ్చులను గలది) యుండును. నామములకు పైని ప్రత్యయముల వంటివి చేరుట యేమియు నున్నట్లు కాన రాదు. అట్లే వచనభేదముకాని, లింగభేదముకాని ఆయా భాషలలో గమనింపబడదు.

ఈకుటుంబమునందు ఇండోనీషియను విభాగము, మేనీషి యను విభాగము, మైక్రోనీషియను విభాగము, పోలినీషియను విభాగము - అని ప్రధానములయిన శాఖలు కలవు. ఇవి మొత్తముమీద తొమ్మిదికోట్లమంది వ్యవహారమున వ్యాప్తి నొందియున్నవి.

8. ఉరల్ ఆల్టాయిక్ కుటుంబము : ఫిన్లండు, కరేలియా, ఎస్తోనియా, ఉత్తరనార్వే స్వీడను, హంగేరి, ప్రాచ్య (యూరోపియను) రష్యా, తుర్కి, సోవియట్ ఆసియా, మంగోలియా, చైనీసు తుర్కిస్తాను, మంచుకూవో - మున్నగు చోట్ల ఈకుటుంబమునకు చెందినభాషలు వ్యవహారమునందున్నవి.

ఈభాషలు సంశ్లిష్ట భాషావర్గమునకు చెందినవి. ఇండో యూరోపియను భాషలలోవలెనే ధాతువుపై పరప్రత్యయము (Suffix) ను చేర్చుటలకుట యిందును కాననగును కాని యీలక్షణ మిక్కడ మరింతవ్యాప్తిని పొందియున్నది. 'సెవ్' అనుధాతువునకు తుర్కీభాషయందు 'ప్రేమ' యని యర్థము. 'సెవ్‌మెక్' అని యనగా 'ప్రేమించుట'; 'సెవ్‌దిర్ మెక్' అని యనగా 'ప్రేమింపజేయుట'; 'సెవ్‌మెమెక్' అనియనగా 'ప్రేమింపకుండుట'; 'సెవ్ ఇల్ ఎమెమెక్' అని యనగా 'ప్రేమించబడుట కసాధ్యమగుట' అని యర్థములు ఇట్లు ప్రత్యయముపై ప్రత్యయమును చేర్చుకొనుచు పోవుటవలన వివిధార్థములను సాధింపవచ్చును. ఈకుటుంబమునందు సమస్వరత యొకటి కనిపించును. హంగేరీభాషలో 'కేజ్' అని యనగా 'చేయి' యని యర్థము 'లోపల' అనునర్థమున 'బెన్' అనునది వచ్చి 'కేజ్‌బెన్' అవియగును ఇదే ప్రత్యయము 'ఇల్లు' అనునర్థముగల 'హోజ్' శబ్దమున్ వచ్చినపుడు అవ్వయుక్తమై 'హోజ్‌బన్' అని యగును ఈ భాషలయందును లింగవిభేదము గోచరముకాదు

ఫిన్నోఉగ్రిక్ విభాగము అను నామాంతరముగల ఊరలిక్ విభాగము, ఆల్టాయిక్ విభాగము – అని రెండుశాఖలుగలవు ఊరలిక్ విభాగమునందు ఫిన్నిష్, లాప్పు, మగ్యారు (హంగేరీ) ఓస్ట్యాకు, సమోయి భాషలు కలవు. ఆల్టాయిక్ విభాగమునందు తుర్కీ, మంగోలు, తుంగుస్ భాషలు కలవు మొత్తము మీద ఈకుటుంబమునకు చెందినభాషలను ఆరుకోట్లమంది మాటాడుచున్నారు.

9. అమెరికను ఇండియను కుటుంబము : ఈ కుటుంబమునకు చెందిన భాషలు పశ్చిమార్ధగోళమునం దంతటను వ్యాపించియున్నవి.

ఈ భాషల రూపనిర్మాణవిషయము ఒకరీతిగా లేదు కాని ఎక్కువ భాషలనుబట్టి చూచినచో 'బహుసంశ్లిష్టత' కనిపించు చున్నది. గ్నగ్లాస్లిజక్స్' అను పదవాక్యమునకి 'నేనొక గ్రామముకొరకై చూచుచున్నాను' అని యర్థము. ఇచ్చట 'గ్' అనునది 'నేను' అను నర్థమును బోధించుచున్నది. 'నగ్లా' అని యనగా 'జీవించుట' యని యర్థము. తరవాత నున్న 'స్ల్' అనుదానితో కలిసి 'నగ్లాస్ల్' అనియై 'గ్రామము' అను నర్థము నిచ్చుచున్నది.'ఇ అనునది పూర్వప్రత్యయముగావ్యవహరించి, తరువాతి పదమునకు క్రియాత్వము కల్పించుచున్నది. 'జక్' అనగా 'చూచుట' యని యర్థము. చిర నున్న 'న్' వర్తమానార్థకత్వమును సూచించుచున్నది. ఇందులో ఏభాగమును విడిగా నుపయోగించుటకు వీలులేదు; వానికి వై నిచెప్పిన యర్థములు కుదురవు.

ఈకుటుంబమును శాఖలుగా విభాగించుటకూడ కష్టము. వైవిధ్యము మరింత అధికముగానుండుట లనను, ప్రస్తుతము ఇండోయూరోపియను భాషలే ఆయాశాఖలను తొలగించి వానిస్థానము వాక్రమించు కొనుచుండుటలనను విభజనము వీలుకాకుండనున్నది. మొత్తముమీద ఇభాషలను దాదాపు కోటిమంది మాటాడుచున్నారు.

10. కకేసీయను కుటుంబము : సోవియట్ యూనియను నందలి కాక్ససు ప్రాంతమునందు ఈకుటుంబమునకు చెందినభాషలు వ్యవహారమునందు కలవు.

ఈభాషలయందు పూర్వప్రత్యయములను, పరప్రత్యయములనుకూడ వాడువద్ధతి కలదు. వీనిరచన మిక్కిలి క్లిష్టముగా నుండుటచే శాస్త్రజ్ఞులు మొట్టమొదట వీనిని ప్రత్యయాత్మక భాషలుగా పరిగణించిరి. కాని, తరువాత సంయోగాత్మక భాషావర్గమునకు చెందినట్లుగా నిర్ధారించిరి. వీనియందు మూండలి కములును ఉపభాషలును పెక్కువిధములుగానుండి యివన్నియు నొకేకుటుంబమునకు చెందినవన్న విషయమునసే సందేహము కలుగజేయుచుండును కాని రష్యాభాష ఆయాభాషల స్థానము నాక్రమించుకొనుటచే వ్యవహారమున వానిప్రాధాన్యము పలుచబడి పోవుచున్నది.

కిర్కాసియను, క్రిస్టియను, లెస్గియను మున్నగుభాషలతోకూడి ఉత్తరకకేసియను విభాగము - జార్జియను సువానియను, మింగ్రేలియను మున్నగుభాషలతోకూడి దక్షిణకకేసియను విభాగము - అను రెండు ప్రధానశాఖలుగా ఈకుటుంబము నిరూపింపబడుచున్నది.

దాదాపుగా ఇరువది లక్షలమంది యీభాషలను వ్యవహరించుచున్నారు.

11. బాస్కు కుటుంబము : ఈ కుటుంబమునకు చెందిన భాషలు స్పెయినుయొక్క ఈశాన్యభాగమునందును, ఫ్రాన్సు నైరృతిభాగమునందును వాడుక యందున్నవి.

ఈ భాషలు సమ్మిశ్రణాత్మక భాషావర్గమునకు చెందినవి. ఇవి సంశ్లిష్టశాలక్షణము వీనియందు అధికముగా కలదు. నామములకు వైని విభక్తులు చేరి, సన్నిహితముగానై, ఏక పదముగా నగును. 'జల్దియ' అనగా 'గుట్టము' అని యర్థము. సంబంధార్థమున 'జల్దియరేన్' అనియై 'గుట్టముయొక్క' అమ నర్థము నిచ్చును. 'జల్దిక' అని యనగా 'గుట్టముమీద' అని యర్థము విశేషణములపై వేర్వేరు ప్రత్యయములు చేరి తర తమభావమును నిరూపించుట కూడ కలదు. 'హాన్దియ' అని యనగా 'ఘనుడు' అని యర్థము. 'ఇహాన్దియగొ బణొ' అని యన్నప్పుడు 'నీకంటె ఘనతరుడు' అని యర్థము 'హాన్దియెన' అని యనగా 'ఘనతముడు' అని యర్థము. ఈ కుటుంబమునకు చెందిన భాషలలో జ, ట్ట - అను ధ్వనులు మిక్కిలి అధికముగా వినిపించుచుండును.

స్పెయిను దేశమునకు చెందిన 'గైపుజ్కొవా' విభాగమును, ఫ్రెంచిదేశమునకు చెందిన 'లబొర్డిను' విభాగమును ఈ కుటుంబమునందు రెండు ప్రధానశాఖలై యున్నవి. మొత్తముమీద ఈ భాషలను దగ్గిరాపు పదిలక్షలమంది వ్యవహరించుచున్నారు

12. ఇతర భాషలు : వైని చెప్పుకొన్న యే కుటుంబమునందును చేరక విడివిడిగా నుండు కొన్ని భాషలు కలవు. కేవల మొక్క మనుష్యుని మాత్రమే తీసికొని ఒక్క కుటుంబమని పరిగణించుట యుచితముగా నుండదు అట్లే ఒకే భాషను చూచి దాని కొక కుటుంబమును నిర్ధారించుట సరి కాదు. అట్లు కుటుంబ నిర్ధారణమునకు వీలుకాక భిన్న భిన్న

ములుగా నున్న భాషలనే వివిధభాషలను పేరున పరిగణించుట జరుగుచున్నది.

ఇటలీయందలి అత్యంతప్రాచీనభాషయైన 'ఎట్రూస్కును' అనువది అటువంటివానిలో నొకటి అది యిప్పుడు వాడుక యందులేదు. కాని, ఆభాషలోడున్న కొన్నిశిలాశాసనములును ఒక గ్రంథము నిప్పటికిని మిగిలియున్నవి. సుమేరియనుభాష క్రీ పూ. ఏడవశతాబ్దినాటికి మృతప్రాయమైనది. అయినను విజేతలయిన అస్సీరియనులు ఆభాష నభ్యసించి, ఆభాషాగ్రంథములకు తమభాషలో టీకలు టిప్పణులు రచించి రక్షించుకొనుచు వచ్చిరి ఇప్పటికిని అస్సీరియనుల అనువాదములతో పాటు సుమేరియను భాషాగ్రంథములు సురక్షితములైయున్నవి.

ఈశాన్య సైబీరియాయందు లేనానదినుండి సఖాలిన్ వరకు వ్యవహారమునన్న సైపర్ బోరియనుభాషలు; ఉత్తర జపానునందున్న ఐనూభాష: అగ్నేయాసియాయందు వ్యవహారమునందున్న మోన్ఖ్మేర్, అన్నామీ, ముండాభాషలు; భిన్నభిన్నలక్షణములను కలిగి యేయొక్క కుటుంబమునందును పూర్తిగా ఇముడకున్నవి.

రూపాశ్రిత వర్గీకరణము

రెండవది రూపాశ్రిత వర్గీకరణము. భాషలయొక్క ఆకృతినిబట్టి, నిర్మాణమునుబట్టి యేకత్వమును నిర్ణయించి సంబంధమును సిద్ధాంతించుట యీ వర్గీకరణమందలి విషయము. ఆంగ్లమున దీనిని (Syntactical or Morphological Classification) అని యందురు. దీని ననుసరించి ప్రపంచభాష

లన్నియు 1 ప్రతిపదాత్మకభాషలు 2. సంయోగాత్మక భాషలు 3. ప్రత్యయాత్మక భాషలు 4 సమ్మిశ్రణాత్మక భాషలు - అని నాలుగు వర్గములుగా విభాగింపబడును. ఒక వర్గమువకు చెందిన భాషయందు మరొక వర్గమునకు చెందిన లక్షణములు కూడ కొంతవరకు కనిపింపవచ్చును. లక్షణ ప్రాచుర్యమును బట్టి, తదావశ్యకతను బట్టి వాని నాయావర్గములలో పరిగణించుట జరుగుచుండును. కావున, వేదో యొక్క లక్షణమును బట్టి యే భాషను కాని ఏప్రత్యేకవర్గమునందును చేర్చుట ప్రమాణ మనిపించుకొనదు. ఆవిషయమును గుర్తించుకొనుట యవసరము.

1. ప్రతిపదాత్మక భాషలు : చైనా, టిబెట్టు, బర్మా, సయామీ, మలయా మున్నగుభాషలను ఆఫ్రికాయందలి సూడానీభాషయు ప్రతిపదాత్మక భాషావర్గమునకు చెందినవి. ఈభాషలయందు ప్రతిశబ్దము నింకొకశబ్దముపై నాధారపడక స్వతంత్రముగా ప్రయుక్తమగును ఈపదములు దాదాపు నిపాతముల వంటివి. ప్రకృతియని ప్రత్యయమని విభాగించుట కవకాశము లేనివిధముగా ఇందలి పదములు చాలవరకు ఏకాచ్చకములై యుండును. అనగా ప్రతిపదమునందు హల్లులెన్నియున్నప్పటికి అచ్చుమాత్ర మొక్కటే యుండును.

ఇచ్చట విభక్తులు కాని యితరప్రత్యయములుకాని యుండకపోవుట వలన పదముల క్రమమునుబట్టియే వాక్యమున కర్థ మేర్పడుచుండును. ఒకేపదము స్థానమునుబట్టియు, స్వరమును బట్టియు, వేర్వేరర్థములను దెల్పును. చైనాభాషలో 'తో' అను ఒకేశబ్దము స్వరభేదమునుబట్టి ధ్వజము, ధాన్యము, మారము, కప్పుట, చేరుట మున్నగు భిన్నభిన్నములయిన

యర్థముల నిచ్చును. ఇట్లే 'లూ' అనుమాటకు బండి, మంచు, త్యాగము మున్నగునర్థములు కలుగును. ఇట్లే నేత్రము, ముఖ్యము, అభిప్రాయము మున్నగు భిన్నార్థములలో 'ము' అను నొకేశబ్దము స్వరభేదమునుపొంది యుపయుక్తమగును.

స్వరభేదమువలెనే స్థానభేదముకూడ చైనాభాషయందు ప్రధానముగా పరిగణింపబడును. 'కాలేన్' అని అన్నప్పుడు 'పెద్దమనుష్యుడు అనియర్థము 'మనుష్యుడుపెద్దవాడు' అను నర్థమున అవేపదములను వెనుక ముందులుచేసి 'లేన్కా' అని యందురు 'వాంగ్పా ఓమిన్' అని యనగా 'రాజు ప్రజలను రక్షించుచున్నాడు' అని యర్థము. కారకమునందు భేదము కలిగినప్పుడు చిన్నమార్పుతో 'వాంగ్పాట చీమిన్' అని యగును. దీనికి 'రాజువలన రక్షింపబడిన ప్రజలు' అనియర్థము. 'నేను నిన్ను కొట్టుచున్నాను' అను నర్థమున 'న్గోతని' అని యుండి కర్మ కర్తలు వ్యత్యస్తమై 'నీవు నన్ను కొట్టు చున్నావు' అని అర్థమైనప్పుడు 'నితన్గో' అని యగును. ఇట్లు శబ్దములు భిన్నభిన్నములుగా ప్రయుక్తములగుటచేతనే యీ భాషలకు ప్రతిపదాత్మక భాషలని పేరువచ్చెను. వీనినాంగ్లమున Isolating languages అనియందురు ఇవి ఏకాచ్చకములయిన పదములను గలిగియుండుటచేత Mono -syllab c languages అని కూడ పరిగణించుట కలదు

2. సంయోగాత్మకభాషలు : తుర్కీ, కాఫిర్, జులూ, సంతాలీ, మఫోర్ మున్నగుభాషలును, ద్రావిడభాషలును సంయోగాత్మక భాషావర్గమునకు చెందినవి. ఈ భాషలయందు ప్రకృతిప్రత్యయముల కూడికవలన పదములేర్పడును. కావుననే

వీనికి సంయోగాత్మక భాషలను పేరు వచ్చెను. పదములకే యీ లక్షణము కలదన్న సత్యమును సూచించుటకై కొందరు వీనిని సంయుక్త పదరూపభాషలనియు పిలుచుట కలదు.

సాధారణముగా పదములయందున్న భిన్నాంశములలో నొక యంశము స్థిరముగా నుండును. దీనిని ప్రకృతి యన వచ్చును. దీనికి ముందుగాని, వెనుకగాని, నడుమగాని యిత రాంశములు వచ్చి చేరును. అవి ప్రకృతియందు ఏవిధమైన మార్పును తీసికొని రాకుండ, అవసరమైనచో తామే కొలది గా మారును. కాని యీ మార్పు పదాంశములను మాటు పరుపగలిగినంతగా ఎప్పుడును జరుగదు. ఏపాటి పరిచయ మున్నను, ఆయాయంశములను స్పష్టముగా గుర్తుపట్టవచ్చును. వీని కలయికకూడ కేవలము నామమాత్రముగానే యుండును. అనగా ఒక దానిప్రక్క నొకటి చేరి అంటుకొని యుండును.

తుర్కీభాషయందు 'ఏవ్' అని యనగా 'ఇల్లు' అని యర్థము బహువచనమున దీనికి 'లేర్' అను ప్రత్యయము కలిగి 'ఏవ్‌లేర్' అని యగును దీనికి 'ఇండ్లు' అని యర్థము. దీనికి చివర 'ఇమ్' అనిచేరి 'ఏవ్‌లేరిమ్' అనియైనప్పుడు 'నాయిండ్లు' అని యర్థమగును కాఫిర్ భాషయందు 'కు' అను ఉపసర్గకు షష్ఠీప్రత్యయముగు 'కు' వర్ణముతో సమానమగు నర్థము కలదు. 'కు-తి' అని యనగా 'మాకు' అనియు, 'కు-ని' అని యనగా 'వారికి' అనియు, 'కు-జే' అని యనగా 'వానికి' అనియు నర్థమగును.

ఫిలిప్పీను దీవులయందలి 'టగలోగ్' భాషయందు 'సూలత్' అని యనగా 'లేఖ' యని యర్థము. దీనియందు

'స' అని యొకయంశము ఊలత్' అని మరొకయంశము కలవు. వీనినడుమ 'ఉమ్' అను మరొకయంశము క్రొత్తగాచేరి 'సుమూలత్' అని కాగా 'లేఖకుడు' అని యర్థమగును 'ఇన్' అను ప్రత్యయము చేరి 'సినూలత్' అని యైనయెడల 'లిఖింప బడెను' అను నర్థమేర్పడును.

న్యూగినీయందలి మఫోర్ భాషయందు 'వినుట' అను నర్థమున 'మ్నఫ్' అను పదము కలదు 'జమ్నఫ్' అని యన్నప్పుడు 'నేను వినుచున్నాను' అనియు 'జమ్నఫఉ' అని యన్నప్పుడు 'నేను నిన్ను వినుచున్నాను' అనియు నర్థములు. అనగా 'జ' యన్నది 'నేను' అను నర్థమునందు 'అఉ' అన్నది 'నిన్ను' అను నర్థమునందు ముందును వెనుకను చేరియున్నవి.

తుర్కిభాషయందు 'ఏవ్' అన్నది ప్రథమైక వచన రూపము దీనికి 'ఇల్లు' అర్థము. 'ఇండ్లు' అను నర్థమున 'ఏవ్ లేర్' అని యగును. ద్వితీయాదివిభక్తులు ఈరెండింటిమీదను సమానముగా అనుప్రయుక్తమగును.

		ప్రత్యయము	ఏ. వ.	బ. వ.
ద్వితీయ	-	ఇ	ఏవి	ఏవ్ లేరి
చతుర్థి	-	ఏ	ఏవే	ఏవ్ లేరే
పంచమి	-	దెన్	ఏవ్ దెన్	ఏవ్లెర్దెన్
షష్ఠి	-	ఇన్	ఏవిన్	ఏవ్లెరిన్
సప్తమి	-	దే	ఏవ్దే	ఏవ్లెర్దే

ఇట్లే ద్రావిడ భాష లన్నిటియందును సంయోగాత్మక స్థితి స్పష్టముగా కనుపట్టును. 'తోట' అను శబ్దము ప్రథమైక వచనరూపము. దీనిపై 'లు' వర్ణము చేరి 'తోటలు' అని

యగును. ఇది బహువచన రూపము. ఈరెండు రూపములపై ద్వితీయాది విభక్తులు చేరును. అప్పుడు ప్రకృతియందు కాని ప్రత్యయములందు కాని మార్పేమియు కలుగదు. బహుత్వ మున ఇతర విభక్తులకు ముందున్న 'లు' వర్ణము అత్వము నొంది 'ల' అని యగును.

	ప్రత్యయము	ఏ. వ.	బ. వ.
ద్వితీయ	ను	తోటను	తోటలను
తృతీయ	తో	తోటతో	తోటలతో
చతుర్థి	కొఱకు	తోటకొఱకు	తోటలకొఱకు
పంచమి	వలన	తోటవలన	తోటలవలన
షష్ఠి	కు	తోటకు	తోటలకు
సప్తమి	అందు	తోటయందు	తోటలయందు

ఇట్లే తోటదారి దిగుడుబావి, మామిడితోట, ఏరువంక, పనికతోలు దాలుపు మున్నగు సమాసములయందు భిన్నపద ములు సన్నిహితములగుటయే కలదు. ఇంతకుమించిన మార్పే మియు నిచ్చట జరుగలేదు ఇట్లే కలిమి, బలిమి, ఆక, పోక మున్నగు కృదంతరూపములును మంచితనము గడుసరితనము, పెద్దటికము, చిన్నటికము మున్నగు తద్ధితరూపములును సంయోగాత్మక స్థితినే పెల్లడించును. 'వచ్చుచున్నాడు' మున్నగు క్రియాపదములు 'వచ్చు - చు - ఉన్నాడు' అను భిన్నాంశముల కలయిక వలన నేర్పడిన సమాసరూపములే.

ఏతెంచు, వీతెంచు, చనుదెంచు, అరుదెంచు, తలపడు, విడివడు పరుగెత్తు, మొలకెత్తు ఎసలారు, పెంపారు - మున్నగు క్రియాధాతువులన్నియు సమాస రూపములే. కావునవే వీనిని

కొందరు 'సంచయాత్మక భాషలు' అనికూడ అనుట జరుగు చున్నది. ఆంగ్లమున Agglomerating Languages అని యన్నప్పు డిదే యభిప్రాయము గోచరించును. సంయోగాత్మ కత్వమును తెలుపుటకై ఆంగ్లమున Agglutinative Languages అను పేరును ప్రసిద్ధముగా వాడుచుందురు

3. ప్రత్యయాత్మక భాషలు : సంస్కృతము, పార శీకము గ్రీకు, లాటిను మున్నగు భాషలు ప్రత్యయాత్మక భాషావర్గమునకు చెందినవి. ఈభాషలయందు ప్రకృతి ప్రత్యయ ముల కలయికవల్లనే పదము లేర్పడును. అయినను ప్రకృతిని ప్రత్యయమును స్పష్టముగా నిరూపించుటకు వీలులేనంతగా ఏకీ భావము నొందుట యిందలి విశేషము ఇందలి ప్రత్యయములు రూపమునేకాక అర్థమును సైతము స్వతంత్రముగా నిల్పుకొన జాలవు. ఇచ్చటి ప్రత్యయములకు సాధారణముగా స్వతంత్ర మైన యుపయోగము, అనగా ప్రకృతిని విడిచి వ్యస్తముగా ప్రయోగించుట యన్నది యుండదు. ప్రత్యయము చేరినప్పుడు ప్రకృతియందుకూడ కొన్నిమార్పులు కలుగుట యీభాషల యందు పరిగణింపదగిన యొక ముఖ్యలక్షణము. ప్రకృతి యందును మార్పు కలిగి ప్రత్యయమునందును మార్పు కలుగుట చేత, రెండును మింత సన్నిహితములై స్థూలదృష్టికి విడ దీయుటకు వీలులేని ఏకాంగముగనే కనిపించును.

సంస్కృతమునందు 'రామ' యనునది ప్రాతిపదికము. దానిపై నితర విభక్తులు చేరినప్పుడు భిన్నరూపములు కలు గును. 'రామః' అనునది ప్రథమావిభక్తిరూపము. రామమ్, రామేణ, రామాయ, రామాత్, రామస్య, రామే - మున్నగు

విధముగా ఏకవచనరూపము లుండును. ఇట్లే క్రియలందును మార్పు కానగును. 'కరోతి' అనునది ప్రథమైకవచనరూపము. ద్వివచనమునందు 'కురుతః' అనియు, బహువచనమునందు 'కుర్వన్తి' అనియు నుండును. అనగా ప్రత్యయము తుదిని చేరుచున్నప్పుడు ప్రకృతియందును కొన్నియెడల మార్పు స్పష్టముగా కనిపించుచున్నదని యర్థము.

సంస్కృతమునందు 'సమ' అను ధాతువుపై 'త్వ' అని ప్రత్యయము కలిగి 'సమత్వ' మున్నగురూపము లేర్పడును. అట్లే 'తా' అను ప్రత్యయము కలిగి 'సమతా' అనియు నగును. ఇచ్చట ప్రకృతియందు మార్పు కలుగలేదు. కాని 'సామ్య' మున్నగుచోట్ల కొంత మార్పు కనుపట్టును. ఇట్టి మార్పులు తద్ధితప్రత్యయములు వచ్చినప్పుడును కృత్ప్రత్యయములు వచ్చినప్పుడును కూడ జరుగుచునే యుండును.

లాటిను భాషయందు గోడ యను నర్థమున 'మురుస్' అని యుండును. కర్మార్థమునందు 'మురుమ్' అనియు, సంప్రదానార్థమునందు 'మురో' అనియు, సంబంధార్థమునందు 'మురి' అనియు రూపము లుండును. క్రియాపదములయందును ప్రక్రియయిట్లే కనిపించును. 'ముగించు' అను నర్థమున 'ఫిని' యను నది మూలధాతువు. దీనిపై కాలసూచక పురుషసూచక ప్రత్యయములు చేరును.'ఫినివి' అని యనగా 'నేను ముగించితిని' అని యర్థము. దీనికి బహువచనరూపమగు 'ఫినివిమస్' అను దానికి 'మేము ముగించితిమి' అని యర్థము. ఇట్లే మధ్యమ పురుషయందు 'ఫినివిస్తి' అనియు, ప్రథమపురుషయందు 'ఫినివెరున్త్' అనియు బహువచనరూపము లుండును.

నేటి ఉత్తరహిందూస్థాన భాషలయందు ప్రత్యయములు పై భాషలలోవలె సన్నిహితములుకాక విడిగా కనిపించును. 'ఇల్లు' అనునర్థమున 'ఘర్' అనుశబ్దము హిందీయందు కలదు. 'ఘర్ మేఁ' అని యనగా 'ఇంటిలో' అని యర్థము. అట్లే 'ఇంటికి' అను నర్థమున 'ఘర్ కో' అనియు 'ఇంటినుండి' అను నర్థమున 'ఘర్ సే' అనియు 'ఇంటియొక్క' అను నర్థమున 'ఘర్ కా' అనియు నుండును. ఇచ్చట మూలశబ్దము మారుట కనిపింపదు. కాని 'మైఁ' అను అస్మదర్థకైకవచనము ఇతర విభక్తులు చేరినప్పుడు మారుట కనుపట్టును. ముఝ్ మేఁ, ముఝ్ కో. ముఝ్ సే, మేరా - మున్నగువిధముగా మార్పు చెందును. ఇట్లే తూ, వహ్ మున్నగు సర్వనామశబ్దములును మార్పుచెంది కనిపించును.

ఆంగ్లమునందు 'ఐ' అనునది ద్వితీయావిభక్తియందు 'మి' అనియు షష్ఠియందు 'మై' అనియు మారును. ఇంతేకాక టు, ఆఫ్, ఫ్రమ్, బై, ఆన్, ఇన్ మున్నగు ప్రత్యయములను పూర్వమందు చేర్చుకొనును. ఇట్లువిడిగా ప్రత్యయములు చేరుట చేతనే వీనికి 'విశ్లిష్టభాషలు'(Analytic Languages)అను పేరు కలిగెను. సంస్కృతము, గ్రీకు మున్నగుభాషలలో ప్రత్యయములు ప్రకృతితో కలిసిపోవును కావున వానిని సంశ్లిష్టభాషలు (Synthetic Languages) అని యందురు.

సంస్కృతాది భాషలలో అంతమునందును, ఆంగ్లాదిభాషలలో ఆదియందును ప్రత్యయములు చేరుచున్నట్లు చూచితిమి. ఇట్లుచేరిన సందర్భములందు ప్రకృతి మారుటయు, మారకుండుటయు కూడ కలదు. ప్రకృతిని విడిచి యీప్రత్యయములు

ప్రయోగింపబడ వన్నది కూడ స్పష్టముగనే తెలియుచున్నది. ప్రత్యయములను చేర్చుకొనుటచేతనే రూపమును, అన్వయమును పొందునట్టిపదములను గలిగియుండుటచేత, ఈభాషలకు ప్రత్యయాత్మక భాషలనుపేరు కలిగెను. వీని నాంగ్లమున 'Inflexional Languages' అని యందురు.

4. సమ్మిశ్రణాత్మక భాషలు : దక్షిణ అమెరికా యందును, గ్రీనులాండునందును గల కొన్ని భాషలును బాస్కు భాషలను సమ్మిశ్రణాత్మక భాషావర్గమునకు చెందినవి. ఇందు వేరు వేరు పదములు కొంత కొంత భాగమును విడిచిపుచ్చి వాక్యమంతయు ఒక్కటే పదముగానై ప్రయోగింపబడుచుండును.

దక్షిణ అమెరికాయందలి 'చైరీ' భాషయందు 'నాథోలినిన్' అని ఒక వాక్యము కలదు. దీనికి 'మా కొరకు నావను తెమ్ము' అని యర్థము. ఇందు కనీసము మూడుమాటలైనను లేకున్న యొడల వాక్యము కాదు. అయినను ఒకేమాట వలెనే వాక్యము కపిపించుచున్నది. 'వాతేన్' అని యనగా 'తెమ్ము' అని యర్థము. 'ఆమోఖల్' అని యనగా 'నావ' అని యర్థము 'నిన్' అని యనగా 'మేము' అని యర్థము. ఈ మూడు పదములును చేరి 'నాథోలినిన్' అని యయ్యెను.

గ్రీనులాండులోని ఎస్కిమోభాషయందు "వాడు చేపల వేటకు వెళ్ళుటకు తొందరపడుచున్నాడు" అను వర్థమున 'అఉలినరి అర్తోర్ సువర్పోర్' అని యందురు. 'అఉలిసర్' అని యనగా 'చేపలవేట' యని యర్థము. 'పే అర్తోర్' అని యనగా

'ప్రవర్తించుట' యని యర్థము 'పిన్నే మవరోక్' అని యనగా 'వాడు తొందర చేయును' అని యర్థము. ఇందు పే, పిన్నే - అనువవి పూర్తిగా లోపించిపోయినపిమ్మటనే వాక్యమేర్పడినది.

ఖాస్కు భాషయందును "నేను ఇతనిని వాని కడకు కొనిపోవుచున్నాను" అను వాక్యమున కంతటికిని బదులుగా 'దశార్కటత్' అని యందురు 'నశార్సు' అని యనగా 'నీవు నన్ను తీసికొని పోవుచున్నావు' అని యర్థము. 'అకర్రి' అని యనగా 'మోయుట' అని యర్థము. 'నేను దానిని మోయుదును' అను నర్థమున 'దకర్త్' అవియు 'నీవు దానిని మోయుదువు' అను వర్థమున 'దకర్జు' అనియు 'నేను వాటిని మోయుదుము' అను నర్థమున 'దకర్జ్కత్' అవియు 'నీవు వాటిని మోయుదువు' అను వర్థమున 'దకర్జ్కు' అనియు నుండును. ఇందు వాక్యములను పోల్చి చూడగా 'త్' అనునది ఉత్తమ పురుషను, 'జు' అన్నది మధ్యను పురుషను తెల్పుచున్నట్లు స్పష్టమగును. 'ద్' అనునది 'దాపిది' అను నర్థమును దెల్పు చుండగా 'వాటిని' అను బహుత్వమును గల్గించుటకై 'జ్క్' అనువది వాడబడినది. 'అకర్రి' అనుదానిలోవి చివరి 'రి' యను వక్షరము అన్నిరూపములందును లోపించిపోయినది.

లఔర్డిన్ భాషయందు 'నేను వారిని ఎరుగుదును' అను వర్థమున 'దకిజ్కత్' అని యందురు.

ఇట్టి లక్షణము సంస్కృతభాషయందును కొంచెముగా క్రియాపదములయందును, సమాసములయందును కనిపించు చుండును. 'వమామి' అని యనగా 'నేను వమస్కరించు చున్నాను' అని యర్థము. 'వదతి' అని యనగా 'అతడు

మాటాడుచున్నాడు'అని యర్థము. 'మకరాంకశశాంక మనోజ్ఞ మూర్తి' మున్నగు సమాసములందు 'మకరాంకునివలె శశాంకునివలె మనోజ్ఞమైన మూర్తి కలవాడు' అను నొక వాక్యమే యర్థమగును. ఇట్లు సమ్మిశ్రణము చెందు స్వభావముండుట చేతనే వీనికి సమ్మిశ్రణాత్మక భాషలను పేరు కలిగెను. వీని నాంగ్లమున Incorporating Languages అని యందురు. అనేకపదము లేకపదముగా చేరు లక్షణమునుబట్టి Polysynthetic Languages అని పిలుచుట కూడ కలదు.

భౌగోళిక వర్గీకరణము

కొందరు వ్యవహారింపబడు ప్రదేశములనుబట్టి కూడ భాషలను వర్గీకరించుట కలదు. ప్రపంచమంతయు సూలముగా పంచ ఖండాత్మకముగా పరిగణింపబడుచున్నది. ఆయాఖండముల యందు వ్యవహారింపబడు భాషలను అమెరికాఖండభాషలు, ఆఫ్రికాఖండభాషలు, యూరోపుఖండభాషలు, ఆసియాఖండ భాషలు, ఆస్ట్రేలియాఖండభాషలు – అని విభాగించుట కలదు. ఇట్టి వర్గీకరణమును 'భౌగోళిక వర్గీకరణము' అని యందురు. దీనినే ఆంగ్లమునందు Geographical Classification అని యందురు.

ఈవిధమగు వర్గీకరణము ననుసరించినచో ఆసియాఖండ భాషలలో రష్యా, మంగోలియా, మంచూరియా, చైనా, టిబెటు, ఆఫ్‌గనిస్తాను, బర్మా, సయాము – మున్నగు దేశ భాషలతోపాటు భారతదేశభాషలుకూడ చేరియుండును. ప్రస్తుతము భారతదేశభాషలను గూర్చి పరిశీలింతము.

భారతదేశ భాషలు

భాషలనుబట్టి చూచినప్పుడు భారతదేశము యూరోపియా ఖండమునందు మిక్కిలి ప్రముఖస్థానమునలంకరించును. స్థూలముగా చెప్పికొన్నప్పుడు ఉత్తరభారతమునందు ఆర్య కుటుంబమునకు చెందినభాషలును, దక్షిణాపథమునందు ద్రావిడ భాషాకుటుంబమునకు చెందినభాషలును వ్యవహృతము లగుచున్నట్లు పరిగణింపవచ్చును. భారతప్రభుత్వము పదునాలుగు భాషలను మాత్రమే ప్రాంతీయభాషలుగా గుర్తించినది. ఆ భాషలన్నియు చక్కనిసాహిత్యమును గలిగి, చరిత్రను గలిగి నిత్యమును వ్యవహృతము లగుచున్నవి. అవి భాషాతత్త్వమును బట్టి పై రెండుకుటుంబములలోనికి దాదాపుగా నిమిడిపోవును. ఇవికాక పెక్కుభాషలును, ఉపభాషలును హిమాలయముల నుండి కన్యాకుమారివరకు విస్తరించియున్నవి. అవి సంఖ్యను బట్టి మాత్రమేకాక, ఇతరదేశభాషలతోడి సామ్యసంబంధము లనుబట్టి కూడ చాలముఖ్యములై ప్రాముఖ్యము వహించు చున్నవి. ఈభాషల వైవిధ్యము భారతమును కేవల మొకదేశ ముగా కాక, ఖండముగా నిరూపించుచున్నది. చారిత్రకముగా ఈభాషలకు, ఉపభాషలకును మిక్కిలి ప్రాధాన్యము గలదు.

భారతదేశభాషల నన్నింటిని స్థూలముగా ఐదు కుటుంబములలోనికి విభజింపవచ్చును. 1. ఆర్యకుటుంబము 2. ద్రావిడ కుటుంబము 3. ఏకాక్షరకుటుంబము 4 ఆస్ట్రిక్ కుటుంబము 5. అనిశ్చిత సముదాయము.

ఇందు తొలుదొల్తదయిన ఆర్యకుటుంబము సంఖ్యాబల మునుబట్టి ప్రాధాన్యము వహించుచున్నది. దరిదాపుగా ఉత్తర భారత దేశమంతయు ఆర్యకుటుంబమువకు చెందినభాషలే నిండి యున్నవి. వీనిని మరల మూడుశాఖలుగా విభాగింపవచ్చును. మొదటిది ఇరానీశాఖ. ఈశాఖకు చెందినభాషలు బెలూచీస్తాను వందును, సరిహద్దు ప్రాంతమునందును, పంజాబు సరిహద్దుల యందును వాడుకయందున్నవి. వీనియందు మిక్కిలి ప్రాచుర్య ప్రభావములుగల భాష 'పారసి'. మహమ్మదీయ పరిపాలనా కాలములో భారతదేశమున నిది సంస్కృతముతోపాటుగా, రాజ భాషా పదవినిపొంది విరాజిల్లినది. ఈనాడు భారతదేశము నందెచ్చటను పారశీకము వాడుకయందు లేకున్నను, ఉన్నత కుటుంబములకు చెందిన మహమ్మదీయుల ఉరుదూభాషపై తద్భాషా ప్రభావ మెక్కువగా కనిపించును.

ఇందు రెండవది దరదశాఖ. పామీరునకును వాయవ్య పంజాబునకును నడుమగల ప్రదేశమును దరదస్తానని యందురు. ఆప్రదేశమును బట్టియే అచ్చటి భాషాశాఖకు దరదశాఖయను పేరు వచ్చెను. అభాషను పిశాచభాషయనియు, పైశాచి యనియు పిల్చుటకూడ కలదు గుణాఢ్యుడు బహుళ అభాష యందే తన బృహత్కథయను మహద్గ్రంథమును రచించియుండు ననియూహింపబడుచున్నది. ఈనాడు లహందా, సింధీ, పంజాబీ, కొంకణ భాషలపై గల ప్రభావమునుబట్టి పైశాచీభాష ప్రాచీన కాలమున భారతదేశమునందు బహుదూరము వ్యాపించియుండి యుండునని యనుమానించుట కవకాశము కలుగుచున్నది.

ఇంక మూడవది భారతీయశాఖ. ఈశాఖయందు మొత్తము పదునేడు భాషలను పరిగణించి డాక్టర్ గ్రియర్సన్ మూడు ఉపశాఖల లోనికిని, ఆరు వర్గములలోనికిని విభాగించెను కాని యీవిభాగమువలన తూర్పుకొననున్న భాషలను పడమటికొననున్న భాషలను కలిసి యొకచోటనే పరిగణింపవలసి వచ్చుచున్నదని తెలిపి డాక్టర్ సునీతికుమారచటర్జీ ఆర్యభారతీయభాషలను ఐదు వర్గములుగా విభాగించెను. ఇందు మొదటిదైన ఉత్తరవర్గమునందు సింధీ, లహండా, పంజాబీ అను మూడుభాషలు చేరును. రెండవదయిన పశ్చిమవర్గమునందు గుజరాతీ, రాజస్థానీభాషలు రెండును చేరును. మూడవదయిన మధ్యమవర్గమునందు పశ్చిమహిందీ యొక్కటియే యుండును. నాలుగవదయిన ప్రాచ్యవర్గమునందు ప్రాచ్యహిందీ బీహారీ, ఒరియా, బెంగాలీ, అస్సామీ అను నైదుభాషలు చేరును చివరిదైన దాక్షిణాత్యవర్గమునందు మరాఠీ యొక్కటియే చేరును. ఈపరిగణనము ప్రకారము పండ్రెండు భాషలుమాత్రమే వివిధవర్గములలోనికి వింగడింపబడివని. ఇవికాక ఇంకొకటైదు పర్వతీయభాషలు గలవు. వానినికూడ డాక్టర్ చటర్జీ రాజస్థానీ భాషాభేదములుగానే పరిగణించెను ఉత్తరమున నేపాల్ నుండి దక్షిణమున మహారాష్ట్రమువరకు. పడమట సింధునుండి తూర్పున వంగదేశమువరకు ఈభాషలు విస్తరించి వాడుకలొందుచున్నవి. వీనియన్నింటియందును మధ్యమవర్గమువకు చెందిన పశ్చిమహిందీ కేంద్రస్థానమున నున్నది. ఇది శౌరసేనీయము ప్రాకృతాపభ్రంశమునుండి వికాసమునొందినది. ఇదియే హిందీ, ఉరుదూ, హిందుస్తానీభాషలకు మూలాధారమైన ముఖ్య

రూపమై "ఖడీబోలీ" యను పేరుతో ప్రామాణిక భాషగా పరిగణింపబడుచున్నది

ఈ భారతీయ కుటుంబమునకు చెందిన భాష లన్నియు సంస్కృతమున కపభ్రంశ రూపములయిన ప్రాకృతములనుండి ప్రాదుర్భవించినవే. కావున నీయార్యకుటుంబమునకు చెందిన భాషలయందే ప్రాచీనతమ ప్రామాణిక సాహిత్యము లభించుచున్నది. పశ్చిమదేశీయుల భాషాశాస్త్రాధ్యయనము ఆర్యభారతీయ భాషలతోడి పరిచయమువలననే యారంభమయ్యె ననుట వాస్తవము.

ఆర్యకుటుంబమునకు పిమ్మట భారతదేశమున నంతటి ప్రాధాన్యమును వహించినది ద్రావిడభాషాకుటుంబము. ఇది దాదాపుగా దక్షిణాపథమంతయు నలముకొనియున్నది. ఇందు మొత్తము ఇరువదిరెండు భాషలు పరిగణింపబడినవి. అందు నాగరకభాషలుగా ఆఱుభాషలు ప్రసిద్ధికెక్కినవి. ఈ ద్రావిడభాషలన్నింటిని సౌకర్యమునకై నాలుగు వర్గములుగా విభాగింపవచ్చును. ఇందుమొదటిది దాక్షిణాత్యవర్గము. ఇందు మిక్కిలిప్రధానమును ప్రాచీనము నైనది తమిళభాష కనీసము మిప్పటికి పదునైదువందల యేండ్లక్రితమే సాహిత్యస్వరూపమును సంతరించుకొన్నది. ఈభాషయందు పరిగణింపదగినంతగా మాండలికభేదములు కనిపింపవు. ఇందు గ్రంథభాషను "శెందమిళ" మనియు, వాడుకభాషను "కొడుందమిళ" మనియు నందురు. తమిళమునకు జ్యేష్ఠపుత్రిక వంటిది మలయాళము. ఇది తొమ్మిదవ శతాబ్దమున తమిళమునుండి వేరుపడి స్వతంత్ర ప్రతిపత్తిని సంపాదించుకొన్నట్లు భాషాశాస్త్రజ్ఞుల విశ్వాసము.

ఇది కేరళ దేశమునందలి బ్రాహ్మణుల ప్రభావమువలన సంస్కృత ప్రభావమునకు చాల లొంగినది. అయినను, ఆర్యసంస్కృతికి దూరముగానున్న మోపలేలు దేశీయమైన శుద్ధ మలయాళ మును మాటలాడుదురు మైసూరురాష్ట్రమునందలిది కన్నడము. పదవశతాబ్దమునుండియు కన్నడము సాహిత్యసంవేదను గలిగియున్నది భాషారూపమునందు దీనికి తమిళముతో నెక్కుడు సంబంధమున్నను, లిపియందు తెనుగుతో నెక్కుడు సామ్యము గలదు. దీనికిని మాండలిక భేదము లంతగా కని పింపవు. కాని ప్రాచీనభాషను "పటగన్నడ" మనియు, నవీన భాషను "హొసగన్నడ" మనియు పరిగణించుట కలదు ఇది కాక 'తుళు' అను నొకభాష పరిమితప్రదేశమున వ్యవహృత మగుచున్నది. దీనియందు సాహిత్యమేమియు లేకున్నను, ద్రావిడభాషా లక్షణ పరిశీలనమున నీభాషకు మిక్కిలి ప్రాధా న్యము నిచ్చి కాల్డ్వెల్ నాగరక భాషలలో పరిగణించెను. కన్నడమునకును తుళుభాషకును నడుమ 'కొడగు' అను భాష కలదు. భౌగోళికముగనే కాక భాషాలక్షణములనుబట్టి నైతము ఇది ఆ రెండు భాషలకును మధ్యస్థమై యున్నది.

ద్రావిడకుటుంబమునందు రెండవది ఆంధ్రవర్గము. ఇందు కేవలము 'ఆంధ్రము' అను నామాంతరముగల తెలుగు భాషయే ప్రధానమైనది. అప్రధానముగా ఉపభాషలు రెక్కులు గలవు. దక్షిణదేశమునందలి తూర్పుప్రాంతమున చాలవరకు తెలుగు వినిపించును. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమేకాక మైసూరు, బొంబాయి, మధ్యప్రదేశములలోకూడ తెలుగుభాష ప్రబ లముగానే వినిపించును. ద్రావిడభాషలన్నింటిలోను ఆంధ్ర

భాషను మాటలాడువారే సంఖ్యయందెక్కువ. అట్లే సాహిత్యము నందును ఇతరద్రావిడ భాషలన్నింటికంటె తెలుగున కున్న స్థానము మిక్కిలియున్నతము. ఇందు సంస్కృతపదములు దేశీయ పదములతో సహజముగా సమన్వయమునొందును. అజంత త్వమువలన ఆంధ్రభాష శ్రవణీయమై Italian of the East అను గౌరవమునకు పాత్రమైనది.

ఇందు మూడవదై నమధ్యమవర్గమునందు మిక్కిలి ప్రసిద్ధ మైనది గోండి ఇది భౌగోళికముగా తెలుగునకు సన్నిహితమై యున్నను, భాషణికముగ ద్రావిడాత్యవర్గభాషలతోనే ఎక్కువ సామ్యమును కలిగియున్నది గోండిభాషను మాటలాడుప్రజలు ఆంధ్రదేశము, ఒరిస్సా, బీరారు, బుందేల్‌ఖండము, ఛత్తీస్‌గఢ్ మున్నగుచోట్ల చెదరుచెదరుగా కలరు. మాళవదేశపు సరిహద్దు లందుకూడ గోండిభాషీయులు కలరు. అయినను 'చేదికోసలము' లను నామాంతరములుగల బుందేలుఖండ ఛత్తీసుగడములే కేంద్రస్థానములుగా తలంపబడుచున్నవి. గోండిభాషకు పొరుగు భాషగా "కుఖ" ఒరిస్సాయందు ప్రచారములో నున్నది. దీనికి తెలుగుతో ఎక్కువసంబంధము కలదు. ఈభాషకు ఉత్తరము వైపున పొరుగుభాషగా 'కురుఖ్' వాడుకలో నున్నది. దీనికి 'ఓరావొన్' అను మరొక పేరుకూడకలదు. దీనికి ద్రావిడాత్య వర్గముతో ఎక్కువసంబంధమున్నట్లు కనిపించును. రాజమహాలు కొండలలో నివసించు 'మల్తీ' జాతిప్రజలు మాటాడు 'మల్తో' యనునది కురుఖ్ భాషకుచెందిన ఉపభాషయే పశ్చిమబీరారులో 'కోలామీ'యను భాష వాడబడుచున్నది. దీనికిని తెలుగుభాషతో మిక్కిలి సామ్యము కనిపించును.

ద్రావిడభాషలలో బహిరంగవర్గము నాలుగవదిగా పరిగణింపబడుచున్నది. ఇందు బ్రాహుయీభాష యొక్కటియే కలదు. ఇది ఉత్తరమున సింధు బెలూచీస్తానుమధ్యదేశమున వ్యాప్తిలో కలదు. ఒకప్పుడు ద్రావిడులు భారతదేశమంతయు వ్యాపించియుండి రనుటకు సాక్ష్యమిచ్చుచున్నట్లు ఈభాష ఉత్తరపు సరిహద్దులలో కొనయూపిరితో నున్నది. దీనిపై బెలూచీ, సింధీ మున్నగుభాషలు తమ ప్రభావమును విరివిగా చూపి లోగొనుచున్నవి. అయినను, ఇతరకుటుంబములకు చెందిన భాషలనడుమ ఇంతవరకు స్వీయవ్యక్తిత్వమును నిలుపుకొనుచు, నిలిచియుండుట నిజముగా ఆశ్చర్యకరమగు విషయము.

భారతదేశమునందలి భాషాకుటుంబములలో మూడవది **ఏకాక్షరకుటుంబము.** ఇందు టిబెట్టు భాషయు, చైనా భాషయూ ప్రాధాన్యము వహించుటచే దీనిని టిబెటన్ చైనా కుటుంబమనియూ పిలుచుచుందురు. ఈ కుటుంబము తిరిగి 'పయామీచైనా' యనియు 'టిబెటన్ బర్మాయనియు' రెండు విభాగములుగా విభక్తమగును. పయామీచైనా విభాగము నందు రెండంతర్భాగములు గలవు. మొదటి దానికి 'సిమిటిక్' విభాగమని పేరు. ఈ విభాగమునకు చెందిన భాషలు చైనాలో మాత్రమే వినిపించును రెండవ విభాగమునకు 'తాయి' యని పేరు. 'తాయి' యనునది పయామునందు నివసించు ప్రజల నుద్దేశించి జాతి వాచకముగా కూడ నుపయోగింపబడును. ఇండోచైనా యందు ఈజాతి జనులే అధికసంఖ్యలో మున్నారు. అస్సాము మొదలుకొని చైనాయందలి క్వాన్‌క్సీ ప్రాంతము వరకు ఈజాతి జనులు వ్యాపించియున్నారు. 'అహోం' అను

నుపభాషయు, 'భాతమీ' అను నుపభాషయు అస్సామునకు తూర్పుభాగమునను బర్మా సరిహద్దులయందు వ్యవహారమునందు గలవు.

టిబెట్టునందును బర్మాయందును గల ప్రజ లొకేవర్గము నకు చెందినవారు. అందువల్లనే మానవ శాస్త్రజ్ఞులును భాషా శాస్త్రజ్ఞులును వారిని టిబెటన్ బర్మావర్గముగా పరిగణించిరి. భాషలనుబట్టి చూచినచో టిబెటన్ బర్మావర్గము విశాలమగు టిబెటన్ చీనావర్గమునందు సరిగా సగముండును. ఈటిబెటన్ బర్మావర్గమునకే భారతదేశముతో అధికసంబంధము కలదు. దీనికి మూడుశాఖలు కలవు - 1 టిబెట్టు హిమాలయశాఖ. 2. అస్సాము త్తరశాఖ 3 అస్సాముబర్మాశాఖ.

టిబెట్టు హిమాలయశాఖలో టిబెట్టుదేశమునందలి ముఖ్యములైన భాషలు నుపభాషలును, హిమాలయముల ఉత్తరపుటంచుననున్న చిన్నచిన్నమాండలికములును పరిగ ణింపబడుచున్నవి. అస్సాము బర్మాశాఖలో బర్మాభాషయు, అస్సాము బర్మా సరిహద్దులందుగల చిన్నచిన్న మాండలిక ములును సమ్మిశ్రితములై యున్నవి. ఈ రెండుశాఖలకు నడుమ, ఉత్తరపు కొండలయందలి భాషలు వై రెండుశాఖల లక్షణము లను కలియగలుపుకొని అస్సాముత్తరశాఖ యనుపేర క్రొత్త శాఖగా నేర్పడినవి. భాగోళికముగా కూడ వాని కా ప్రత్యేకత కలదు.

ఆస్ట్రిక్ కుటుంబము భారతదేశమునందలి భాషా కుటుంబములలో నాలుగవది. ఈ ఆస్ట్రిక్ కుటుంబము మెడ గాస్కరునుండి పసిఫిక్ మహాసముద్రమునందలి ఈస్టరుద్వీపము

వరకును, పంజాబునుండి న్యూజిలాండ్ వరకును విస్తరించియున్న యనేకభాషలను కలియగలుపుకొని యున్నది.

ఆస్ట్రిక్ కుటుంబము ఇండోనేషియన్ శాఖయనియు, ఆస్ట్రో - ఏషియాటిక్ శాఖ యనియు రెండుశాఖలుగా విభాగింపబడినది. ఇందు మొదటిదయిన ఇండోనేషియన్ శాఖకే మలయాపోలినేషియన్ శాఖ యనియు నామాంతరము గలదు. ఇందు మలయాభాష బర్మాదేశపు దక్షిణపు సరిహద్దులయందును, దక్షిణమున నున్న ద్వీపసమూహమునందు సలోన్ భాషయు వ్యవహారమున నున్నవి

ఆస్ట్రో - ఏషియాటిక్ శాఖ మరల మోన్‌ఖ్మేర్ భాగము, ముండా భాగము అని రెండుగా విభజింపబడినది. మోన్‌ఖ్మేర్ భాగమునందు మోన్‌ఖ్మేర్ అనునది కాక పలౌంగ్ వా, ఖాసీ, నికోబారీ విభాగములు ఇంకొక మూడు కలవు. ఇందు మోన్‌ఖ్మేర్ విభాగము విస్తృత మైనది. ప్రస్తుత మిది బర్మా సయాము లందును, భారతదేశమునందలి కొన్నియడవు లందును వ్యవహరింపబడుచున్నది. 'మోన్' అనియు 'ఖ్మేర్' అనియు రెండు భాషలనుబట్టి యీవిభాగమునకు ఈపేరు వచ్చెను. 'పలౌంగ్' అనియు 'వా' అనియు రెండు భాషలుగల విభాగమునకు పలౌంగ్ వా' అనిపేరు. అది బర్మాయందలి ఉత్తరపుటడవులలో వ్యవహారమునన్నది, నికోబార్ దీవియందలి భాష నికోబారీ. ఇది మోన్‌భాషకును ముండాభాషలకును నడుమ కృంఖలముగా నున్నది. ఖాసీభాష అస్సాము పర్వత ప్రాంతమునందలి ఖాసీతెగకు చెందినజనుల వ్యవహారమున నున్నది. ఈఖాసీభాషను టిబెటన్ బర్మాశాఖకు చెందినభాషలు

చుట్టుముట్టియుండుటచే, ఆస్ట్రిక్ కుటుంబమునకు చెందినయితర భాషలతో దీనికి చాలకాలముగా సంబంధము తెగిపోయినది.

ముండాభాషలు భారతదేశమునందలి ఆస్ట్రిక్ కుటుంబ భాషలన్నింటిలోమ మిక్కిలిముఖ్యమైనవి. పశ్చిమబెంగాల్ నుండి వీహారువరకు, భారతదేశపు మధ్యప్రాంతమంతటను, ఒరిస్సా యందు గంజాముజిల్లావరకును ఈభాగమునకు చెందినభాషలు వ్యవహృతమగుచున్నవి. వీనివ్యవహారక్షేత్రములో అక్కడక్కడ ద్రావిడభాషలుకూడ వాడుకయందు గలవు. మధ్యప్రదేశమునకు పశ్చిమభాగమున ముండాభాషలను ద్రావిడభాషలు చుట్టుకొనియున్నవి. ముండాభాషలకు చెందిన 'కనావరి' అను మాండలికము హిమాలయములయందు సిమ్లావరకు వ్యవహారమున కలదు. ముండాభాషలకు ఆశ్రయము వింధ్యపర్వత ప్రాంతము. అక్కడ ఖేర్వారీ, సంతాలీ, ముండారీ, హో భూమిజ, కోఖా, కుర్కూ, ఖడియా, జువాంగ్, శాబర, గదబ మున్నగు వెక్కువగాండలికములు ముండాభాషావిభాగమునకు చెందినవే. ఈభాషలకు భారతీయభాషలన్నింటిపైని పర్యాప్తమైన ప్రభావము కలదని భాషాశాస్త్రజ్ఞుల నిశ్చయము

ఇంక మిగిలినభాషల నన్నింటిని అనిశ్చితభాషాకుటుంబమని ఒక వర్గముగా పరిగణింతురు. ఆ భాషల పేళ్ళును, నిశ్చితముగా వ్యవహరింపబడు స్థలములును గూడ వానిని పైని జూపిన ఏభాషాకుటుంబమునందును జేర్చుటకు వీలు గాకుండ నున్నవి. అవి చాలవరకు అడవిజాతులయందు మాటాడబడు అప్రధాన భాషలు. వానియందలి పదసామగ్రియు అధికముగా లేదు; సూక్ష్మభావములను తెల్పుటకు సమర్థమగు వాక్య విన్యాస వైఖరియు కానరాదు.

సిద్ధాంత ప్రకరణము

హిందూదేశమున నుత్తరభాగమున నున్న భాషలకు గౌడభాషలనియు, దక్షిణభాగమున నున్న భాషలకు ద్రావిడ భాషలనియు వ్యవహారము కలదు ప్రజల నుద్దేశించి పంచ గౌడు లనియు పంచద్రావిడులనియు వ్యవహరించుట ప్రాచీన కాలమునుండియు వినిపించును కాని స్థానికపండితులకు ద్రావిడభాషలు కూడ సంస్కృత జన్యములే యను నమ్మకము ఇటీవలివర కుండెడిది. నిత్యోపయోగి పదసామగ్రినిబట్టియు, సంఖ్యావాచక సర్వనామములనుబట్టియు, వ్యాకరణవిశేషము లను బట్టియు చూడగా ఉత్తర దేశభాషలకును దక్షిణ దేశ భాషలకును భేదము స్పష్టముగా కనిపించుచున్నది సామ్యమును బట్టి యేక కుటుంబత్వమును, భేదమునుబట్టి భిన్న కుటుంబత్వ మును సమర్థించుట సముచితము.

ద్రావిడ భాషా వాదము

'రాస్మస్ రాస్కు' అను నొక భాషాశాస్త్రజ్ఞుడు బహు దేశ పర్యటనము చేసి యనేక భాషలనుగురించి ప్రత్యక్షపరిచయ మును సంపాదించుకొనెను. క్రీ శ 1816 నుండి 28 వరకు సాగిన ఆయన పర్యటనమునందు స్వీడను, ఫిన్‌లాండు, రష్యా, కాకస్స్, పర్షియా, ఇండియా దేశములను దర్శించి, ఆయా భాషలను బాగుగా అధ్యయనము చేసెను. అప్పటివరకు స్థూలముగా వీర్పడియున్న యభిప్రాయమును మార్చుచు రాస్కు పండితుడే తొలదొ ల ద్రావిడభాషల యునికిని గూర్చి

ప్రస్తావించెను. ఇవి సంస్కృత భాషనుండి పుట్టినవి కావనియు దానికంటె భిన్నములనియు నీయనయే ప్రతిపాదించెను. ఈయన 'ద్రావిడభాషలు' అని యనక 'మలబారుభాషలు' అని వాడెను. ఈయనయే భాషాకుటుంబములను గూర్చి ప్రస్తావించుచు మొదటిదిగా ఇండియను కుటుంబమును దెల్పి, దక్కను విభాగము హిందూస్తాను విభాగము నని రెండుగా విభజించెను. ఇది క్రీ. శ. 1818 లో జరిగిన విషయము. కావునే భాషాచరిత్రలో ద్రావిడభాషా వాదమునకు మూలపురుషునిగా 'రాస్మస్ రాస్కు' ను గుర్తించుట జరిగెను,

కాని, నిజమున కింతకు ముందే ద్రావిడభాషల యొనికిని గుర్తించిన గౌరవము 'ఫ్రాన్సిస్ డబ్ల్యు. ఎలిస్' అను నాయనకు చెందవలసియున్నది. ఆయన ఎ. డి. కాంప్‌బెల్ వ్రాసిన తెలుగు భాషా వ్యాకరణమునకు భూమికను వ్రాయుచు, అందు 'దక్షిణదేశభాషలు' అనుపేరున ద్రావిడభాషలను గురించి వ్రాసెను. తమిళము (గ్రాంథిక వ్యావహారికములు), తెలుగు (గ్రాంథిక వ్యావహారికములు), కన్నడి (ప్రాచీన నవీనములు), మలయాళము, తుళువ, కొడుగు-అను భాషలను పేర్కొనుటయే కాక రాజమహేలు భాషకు తమిళముతోను తెలుగుతోను సామ్య మెక్కువగా నున్న సంగతినిగూడ ప్రస్తావించెను. ఇది క్రీ. శ. 1816 నాటి విషయము.

దాదాపు రెండువేల సంవత్సరములుగా నిలువ|డొక్కొనియున్న యీ దేశీయ భాషల కన్నింటికి విషమ్ కాల్డ్వెలు

సామూహికముగా 'ద్రావిడభాషలు' అని పేరు పెట్టెను. కొందరు పాశ్చాత్యరచయితలు ఈ భాషలను తములియను భాషలనియు, తములికు భాషలనియు, తల్ములికు భాషలనియు కొంతకాలము క్రిందటివరకు పిలిచిరి కొందరు మలబారు భాషలనియు, కోరమాండలు భాషలనియుకూడ పిలిచిరి. ద్రావిడ భాషలలో తమిళము మిక్కిలి ప్రాచీన కాలముననే సాహిత్య స్థితిని పొందిన దగుటవల్ల, తత్ప్రభావమునకు లొంగి యితర భాషలను తమిళ సంబంధులగు భాషలుగా పరిగణించువారు 'తములికు' మున్నగు పేర్లు పెట్టుట సంభవించెను. కాల్డ్వెలు భాషాకుటుంబమునకు ద్రావిడపదమును వాడి, భాషా పరముగా మాత్రమే తమిళ శబ్దమును వాడెను.

'మలబారు' అనునది పడమటి కనుమల ప్రాంతమునకు పోర్చుగీసువారు పెట్టిన పేరు. ఇందు పూర్వభాగమయిన 'మల' యనునది 'మలయాళము' మున్నగుచోట గల 'కొండ' యను నర్థముగల శబ్దమే. ఉత్తరభాగము సంస్కృతమున సమూహార్థమందున్న 'వార' శబ్దమని కొందర యభిప్రాయము. డాక్టరు గుండెర్టు అరబ్బీ భాషయందలి 'బార్' శబ్దమే యిది యని యభిప్రాయపడెను. కాల్డ్వెలు పారశీకమునందలి 'బార్' శబ్దమును స్వీకరించెను. దీనిని బట్టి 'కొండలు గలదేశము' అను నర్థ మేర్పడును. పాశ్చాత్యులు సముద్రప్రయాణము ముగించుకొని ముందుగా చూచునది మలబారు. కావున ఆ పేరున కాము విన్న క్రొత్తభాషల నన్నింటిని పిలుచుట తటస్థ పడి యుండును.

'కోరమాండలు' పదముకూడ విచిత్రమైనది. 'చోడులు' పాలించిన మండలము 'చోడమండలము'. డకారము రకారము కాగా 'చోరమండలము' కావచ్చును. దాక్షిణాత్యభాషలలో 'చ' 'క' లు పరస్పరము వినిమయము నొందుట కలదు. కావున 'కోరమండలము'ఏర్పడిపాశ్చాత్యోచ్చారణమున 'కోరమండల్' కావచ్చును. ఇదే యభిప్రాయమును కాల్డ్వెలు తొలుత చెప్పెను. అయినను తరువాత తనయభిప్రాయమును మార్చు కొని పులికట్టు సమీపమున గల కరుమణల్' అను గ్రామమును బట్టియే 'కోరమండల్' అను పదము వాడుక నొందె నని నిర్ణ యించుకొనెను. ఏమయినను, ఇదియు మలబారువలె ప్రథమ స్థానమునుబట్టియే యేర్పడిన సంకేతము.

మలబారు భాషలని కాని, కోరమాండలు భాషలనికాని వ్యవహరించుట యిప్పు డే మాత్రమును వినిపింపదు. ద్రావిడ పదముమాత్రమే ప్రతిష్ఠను సంపాదించుకొన్నది. సంస్కృతము నందు భాషాపరముగను, జాతిపరముగను, ద్రావిడ పదము వాడుకలో నున్నది. మనుస్మృతియందును. మహాభారత పురాణాదులందును ద్రవిడశబ్దము జాతిపరముగా వాడబడినది. 'ద్రావిడీ' అను పేరున ఒకభాష యున్నట్లు సంస్కృతవైయా కరణులు పేర్కొనిరి. కాబు రాజేంద్రమిత్రలాల్ అను పండితుడు 'ద్రావిడి' అనునది ప్రాకృతవిభేద మనియు దాని నుండి యీ నాటిభాషలు కొన్ని యుద్భవించె ననియు తెల్పెను. ఏడవశతాబ్దికి చెందిన కుమారిలభట్టు తన తంత్ర వార్తికమునందు 'ఆంధ్ర ద్రావిడ భాషాయామ్' అని వ్రాసెను.

దీనినిబట్టి కాల్డ్వెలును, గ్రియర్సనును ఆంధ్రులకు తమిళులకు ఒకేభాష యుండెనని కుమారిలభట్టు భావించినట్లు వ్రాసిరి. శ్రీగంటి జోగిసోమయాజి 'తద్యథా ద్రావిడ భాషాయామ్' అను పాఠము సరియైనదనియు, ఇచ్చట ద్రావిడశబ్దమునకు తమిళ మను అర్థమే కలదనియు నిర్ణయించిరి. దండిదశ కుమారచరిత్రయందు ద్రవిడశబ్దమును దేశపరముగా వాడెను; బాణుడు కాదంబరియందు జాతిపరముగా వాడెను. మొత్తము మీద ప్రాచీనకాలమునుండియు 'ద్రావిడ' శబ్ద మొకటి దేశ పరముగను జాతిపరముగను, భాషాపరముగను కూడ వాడు కలో నున్నట్లు స్పష్టము.

కాల్డ్వెలు భాషాభేదమునకు 'తమిళము' అనుమాటను ఉపయోగించి, భాషాకుటుంబమునకు ద్రావిడశబ్దము నుప యోగించుటవల్ల వాడుకలో ఒక స్పష్టత యేర్పడినది. కొందరు ఇప్పటికిని ద్రావిడ మనగా తమిళ మనియు, అందుండి పుట్టిన భాషలు ద్రావిడభాష లనియు తప్పుగా భావించు చున్నారు. తెలుగు, కన్నడము మున్నగు భాషలవలెనే తమి ళము కూడ ఒక సోదరభాషయే. వీని యన్నింటికిని మూల భూత మగు భాష యొకటి యుండవలయు ననియు, అది ప్రాచీనద్రావిడభాష యనియు భాషాతత్త్వవేత్తలనిశ్చయము.

ద్రావిడ భాషా పరిగణనము

కాల్డ్వెలు మొట్టమొదటగా క్రీ శ. 1856 సంవత్సర మున 'ద్రావిడభాషల తులనాత్మక వ్యాకరణము' అను

గ్రంథము నాంగ్లమున ప్రకటించెను. ఆయన చేసిన పరిగణనము ప్రకారము ద్రావిడభాషలు మొత్తము పండ్రెండు. ఉత్తర హిందూస్థానమున 'బ్రాహుయీ' యను భాష కలదు. అది కూడ ద్రావిడభాషాకుటుంబమునకు చెందినదే. కాల్డ్వెలు ఆ భాష కాకయే పండ్రెండు భాషలను పరిగణించెను. అందు ఆరు భాషలు నాగరకములు 1. తమిళము 2. మలయాళము 3. తెలుగు 4. కన్నడము 5. తుళు 6. కొడగు.

ఆరు భాషలు అనాగరకములు 1. తుద 2. కోత 3. గోండు 4. ఖొందు 5. ఒరావొను 6. రాజమహల్.

ఆధునికులు ద్రావిడభాషలు మొత్తము ఇరువదిరెండు కల వని, వానిని ప్రాదేశికముగా విభాగించుచున్నారు. వీరి విభాగము ననుసరించి ఉత్తర ద్రావిడభాషలు మూడు 1. బ్రాహుయీ 2. కురుఖ్ 3. మల్తో. మధ్య ద్రావిడభాషలు పదునొకండు 1. కుయి 2. కువి 3. కూబి 4 కోయ 5. పర్జి 6. నాయికీ 7. ఒల్లారి 8. కోలామి 9. గోండి 10. గదబ 11. తెలుగు.

దక్షిణ ద్రావిడభాషలు ఎనిమిది 1. తమిళము 2. కన్నడము. 3. మలయాళము 4. తుళు 5. కొడగు 6. బడగ 7. తుద 8. కోత.

కాల్డ్వెలు పేర్కొనిన 'తుద' యనుభాషకే 'తొద' యను పేరు కూడ కలదు. ఒరావొనుభాషయే 'కురుఖ్' అను పేరున ఉత్తర ద్రావిడభాషగా పరిగణింపబడుచున్నది. రాజ

మవాల్ భాషకే 'మల్తో' అనియు 'మాలెర్' అనియు కూడ పేర్లు గలవు. ఖొందుభాషను కూభాషయనియు కుయిభాష యనియు, కంధీభాష యనియుకూడ పిలుతురు. గోండుభాషకు గోండీభాష యని నామాంతరము కలదు.

ఇందు కాల్డ్వెలు చెప్పిన నాగరకభాషల కారింటికి సాహిత్యస్థితి కలదు. తక్కినవానికి వాగ్వ్యవహారమే కాని లేఖనవిధానము లేదు. అనను 'టటిల్' 'యూల్సు బ్లూ' మున్నగు పండితులు కుయి, గోండ్డి మున్నగు అనాగరకభాషలే ప్రాచీనద్రావిడభాషాస్థితిని స్పష్టముగా ప్రకటించు నను ఉద్దేశముతో పరిశ్రమ గావించిరి. నాగరకభాషల భాషాసంపదను గురించి కొంచెముగా పరిశీలింతము.

నాగరకభాషలు

తమిళము : ప్రాచీనద్రావిడభాషనుండి తొలుదొల్త విడివడి, సాహిత్యసౌష్ఠవమును సుస్థిరత్వమును గడించుకొన్న భాష తమిళము. కొందరు తమిళపండితులు క్రీస్తుపూర్వము కొన్ని వేల సంవత్సరములకు ముందు తమిళ మున్నట్లు నుడివిరి. శ్రీయస్ వైయాపుర పిళ్ళై మున్నగు తమిళపండితులు క్రీ పూ. మూడవశతాబ్దికి పిమ్మట తమిళము సుప్రతిష్ఠితమయ్యె నని నిశ్చయించిరి.

ద్రవిడ శబ్దమునుండి తమిళ శబ్దము వచ్చె నని బిషప్ కాల్డ్వెలు అభిప్రాయపడెను. సంస్కృతమునందు వకార మకారములు పరస్పరము మారుట కనిపించును. గుణవాన్, మతి

మాన్ మున్నగుచోట్ల మతువ్యత్యయమునం దీమార్పుగలదు. అట్లే ద్రవిడ యనునది 'ద్రమిడ' యై యుండు నని, అపిమ్మట డకారమునకు బదులుగా తమిళభాషకు సహజమయిన 'ఱ' కారము కలిగియుండు నని పర్యవసానమున తేలినది. 'తమిఱ' యనునది స్థిరపడినది. తమిళపండితులు మాత్రము తమిళము దేశ్యశబ్ది మనియే విశ్వసింతురు దేశీయములగు వ్యుత్పత్తులను గూడ దెల్పుదురు. తమిళ మనగా తీపి యనియు, కరుణ యనియు తమిళనిఘంటువులందు అర్థములు గలవు

తమిళవాఙ్మయచరిత్రమున మొదటిది సంగయుగము. సంస్కృత సంఘశబ్దమునకు 'సంగ' వికృతి యైయుండును. కవుల సమూహము అను నర్థమున 'సంగ' యనునది వాడబడెను. ఇట్టి కవిసంఘములు మూడు కలవు. 1. తలై చ్చంగమ్ 2. ఇడై చ్చంగమ్ 3. కడై చ్చంగమ్.

మొట్టమొదటి సంఘము తలై చ్చంగమ్. ఇందు శివుడు, మురుగన్, అగత్తియన్ మొదలగువారితోపాటు 549 మంది సభ్యులుగా నుండిరి. ఈకాలమున వెలసిన గ్రంథము 'పేరగత్తియమ్. దీనిని అగస్త్యుడు వ్రాసె నని చెప్పుదురు అతనిపై గౌరవముతో తమిళభాషను 'అగత్తియమ్' అని యనుటకూడ కలదు. ఈగ్రంథము తమిళమునకు మొట్టమొదటి వ్యాకరణము. కాని, ఈగ్రంథము సమగ్రముగా లభింపలేదు

రెండవ సంఘము ఇడై చ్చంగమ్. దీనియందు అగస్త్యుని శిష్యుడయిన తొల్కాప్పియనారుతోపాటు 59 మంది సభ్యులుగా నుండిరి. ఈకాలమున వెలసిన గ్రంథము తొల్కాప్పియమ్ తొల్కాప్పియనారు ఐంద్రవ్యాకరణము ననుసరించి దీనిని

రచించె నని చెప్పుదురు. తొల్కాప్పియమునందు ఎఱుత్తు (వర్ణము), శొల్ (పదము), పొరుళ్ (కావ్యవస్తువు) అని మూడు భాగములు కలవు. వ్యవహారమునందు కలిసిపోయిన అన్యభాషాశబ్దములు స్వీకార్యము లని తొల్కాప్పియనార్ నిర్దేశము. కావ్యవస్తువివరణమున తమిళుల సామాజికజీవితము చక్కగా చిత్రింపబడినది.

మూడవసంఘము కడైచ్చంగమ్. ఇందు నక్కీరుడు, తిరువళ్లువరుతోపాటు 49 మంది కవు లుండెడివారు తమిళ వేదమని పేరుపొందిన 'తిరుక్కురళ్' అను గ్రంథమును తిరువళ్ళువరు రచించెను ఇందు మానవజీవితమునకు ఆవశ్యకము లగు సర్వవిషయములును సరసముగా, సహజసుందరముగా చిత్రింపబడినవి.

తిరువళ్ళువరునకు తరువాత 'అవ్వై' యను కవయిత్రిని పేర్కొనవలయును. ఈమె యనేకగ్రంథములను రచించెను. నేటికిని తమిళుల నిత్యవ్యవహారమున అవ్వై రచించిన గ్రంథముల సూక్తులు సజీవములై యున్నవి.

తరువాత బహుకర్తృకము లయిన సంకలనగ్రంథములు వెలువడినవి. వీనియందు దేశసాహిత్యమునకు మిక్కిలి ప్రాధాన్యము కనిపించును. ప్రణయగీతికలతోపాటు వీరగీతికలను గూడ ఆలపించిరి.

మణిమేకలై, శిలప్పదిగారమ్, జీవకచింతామణి, వళయాపతి, కుండలకేశి యనునవి తమిళ పంచకావ్యములు. క్రీ.శ. 8వ శతాబ్దికి చెందిన శీత్తలై శాత్తనార్ అను వతడు 'మణి

మేకలై' అను కావ్యమును రచించెను. ఇందు ముప్పదిగాథలు కలవు. రమణీయమైనప్రకృతివర్ణనముతో, రసోచితమైన సమాస రచనముతో బౌద్ధజీవనవిధానమును కనులకు గట్టునట్లు చిత్రించుట వాత్తనార్ విశిష్టత.

శిలప్పదిగార మను కావ్యమును 'ఇళంగో' అను రాజ కవి సృష్టించెను. ఇది తొమ్మిదవ శతాబ్దినడిమిభాగమున రచింప బడె నని పరిశోధకుల విశ్వాసము. ఇది తమిళుల సామాజికజీవి తమును సర్వవిధముల ప్రతిబింబించు మణిదర్పణ మన్న అతి శయోక్తి కాదు. ఇందు జైనమతాచారము లధికముగా ప్రవే శించినవి. రచనావిధానమునుబట్టి 'నాటక కావ్యము' అను ప్రశ స్తిని సంపాదించుకొన్నది.

'తిరుత్తక్కదేవర్' అను చోళవంశీయు డైన జైన ముని శృంగారరసప్రధానముగా 'జీవకచింతామణి' అను గ్రంథ మునురచించెను. రచనాకాలము 5వ శతాబ్ది యని కొందరును, 9వ శతాబ్ది యని కొందరును తలచుచున్నారు. ఇందు చతుర్విధ పురుషార్థములును చక్కగా వర్ణింపబడుటచే 'ముడిపొరుళ్ తొడర్ నిలై డెయ్యుళ్' అను పేరు కూడ వ్యాప్తిని గడించు కొన్నది. ఇందును జైనుల తత్త్వవిషయములు ఆచార వ్యవహారములు వర్ణితము లయినవి. తరువాతి కవుల కిది మూదలగ్రంథ మైనది.

కుండలకేశి, వళయాపతి అను రెండు గ్రంథములును ఉపలభ్యములు కాలేదు. తమిళసాహిత్యచరిత్రలో నామమా త్రావశిష్టములై మిగిలిపోయినవి.

పవణంది రచించిన 'నన్నూల్' అను లక్షణ గ్రంథము మిక్కిలి ప్రశస్తికి వచ్చినది. తొల్కాప్పియము తర్వాత అంత ప్రాధాన్యమును పొందిన లక్షణగ్రంథ మిదే.

మొత్తమ్మీద మూడు సంగముల కాలము విషయమున వివిధప్రతిపాదనలు కలవు. క్రీ పూ. 1000 సంవత్సరముల మండి క్రీ. పూ. 150 సంవత్సరముల వడిమికాలమువరకు ఈనిర్ణయములు సాగినవి. ఏమైనను. ప్రాచీన తమిళమునకును నేటి తమిళమునకును చాల భేద మున్నది. సెందమిళమనియు, కొటుందమిళ మనియు రెండు భేదములు గలవు. మొదటిది ప్రాచీన తమిళము ; రెండవది క్రొత్తతమిళము. తమిళమును తెలుగువారును కన్నడులును 'అరవము' అని పిలుతురు. దీనికి వ్యుత్పత్తిని నిశ్చితముగా చెప్పలేము. తమిళమున 'అరవన్' అనగా నీతిమంతుడని యర్థము. కావున నీతిని బోధించుసాహిత్యముగల భాష యగుటచే అరవమునకు ఆ పేరు కలిగెనని డా॥ గుండెర్టు అభిప్రాయము. ఈవిషయమున మరొక వాదము కూడ కలదు. 'అరివు' అనగా జ్ఞానము. దక్షిణ దేశీయులలో తమిళులు మిక్కిలి జ్ఞానవంతులు గనుక వారిభాషకు 'అరవము' అను పేరు గలిగె నట! తమిళదేశములో 'ఆరువ' అనుపేరున ఒకజిల్లా కలదు. అది అంత ప్రసిద్ధము కాదు. అయినను దానిపేరే తమిళభాష కేర్పడెనని ఒకవాదము కలదు.

ఇంతకును 'అరవము' అను పేరు తమిళభాషలో వినిపించునది కాదు. తమిళభాషను ఇతరులాపేరున పిలుతురు. కావున అరవము అను పేరునకు తమిళభాషలో అర్థము వెదకుట నిరర్థకము. తెలుగుపండితుల యభిప్రాయములో

'అరవము' అనునది సంస్కృతపదము; ధ్వని లేని దని యర్థము. దీనియందు వర్గయుక్తాక్షరాలు లేవు గనుక ఈ అర్థమున 'అరవము' అను పదము తగియేయున్నది. అందువలన తెలుగువారు భాషను, దేశమును గూడ అరవము అనియే పిలుతురు

ఒక్కచిన్నమాట తెలుగునందలి అరవము అరవవారి అరవముతో సమాన మని భ్రమపడరాదు. తమిళులకు 'అరవము' అనగా ధ్వని యని యర్థము, కావున, తెలుగు వారు వాడెడి యర్థమునకు ఇది పూర్తిగా విరుద్ధము. తమిళ మందు పదాదియందు రకారముండదు. అందువలన ముందు 'అ' కారమును జేర్చి పల్లుదురు. రాజు అను శబ్దము 'అరసన్' అని యైనట్లే రవము అనునది 'అరవము' అని యగును.

తమిళమును రెండుకోట్ల యేబది లక్షల జనము మాతృ భాషగా మాటాడుచున్నారు దక్షిణభారతమున ఆగ్నేయ భాగమునను, సింహళమున ఉత్తరభాగమునందును తమిళము వాడుకలో నున్నది.

కొరవ (ఎరుకల), ఇరుల, కసువ, కైకాడి, బుర్గుడ్డి - అనువేర్లతో తమిళమునకు ఐదు మాండలికములు ప్రధానముగా పరిగణింపబడినవి.

మలయాళము : మలయాళప్రదేశము నేటి కేరళ దేశము, ఇందు మలబారు, కొచ్చిను తిరువాన్కూరు అను మూడు ముఖ్యభాగములు కలవు. ఇది అరేబియా సముద్రము నకును, పడమటి కనుమలకును మధ్యగా నున్నది. 'కేరము' అనగా కొబ్బరిచెట్టు కావున కొబ్బరిచెట్లు సమృద్ధిగా గల ప్రదేశ

మగుటచే దీనికి 'కేరళము' అను పేరు వచ్చియుండునని కొందరు భావించుచున్నారు.

ఈ 'కేరళము' అను పదము 'చేరళమ్' 'చేరమ్' అనురూప ములతోకూడ తమిళమలయాళాది సాహిత్యములందు కన్పడు చున్నది. కేరళదేశస్థుడు అను నర్థమున 'కేళన్' అనియు 'కేళు' అనియు వాడుచుండుట కలదు అశోకుని శాసనమునందు 'కేరళం పుత్త్ర' యని కలదు. ప్లినీ యను చరిత్రకారుడు 'కెలోబొత్రస్' అనియు 'టాలెమీ' యను చరిత్రకారుడు 'కెరొ బొత్రాస్' అనియు ప్రాసిన ప్రాతలు 'కేరళంపుత్త్ర' అను దానితో సమానములే యని, బిషప్ కాల్డ్వెల్ నిశ్చయము. కేరళ చేర శబ్దములు ప్రాచీనములును, చరిత్రప్రసిద్ధములు నమట నిర్వివాదము. మలయాళ మనుపదమునకు వ్యుత్పత్తి గమ నింతము. 'మల' అను పదమునకు 'కొండ' యని యర్థము. 'ఆళమ్' అనగా సముద్రమని యర్థము. పడమటి కనుమలకును అరేబియా సముద్రమునకును నడుమ మండుటచే దీని కీ పేరు కలిగె నని కొందరి తలంపు కొందరు 'అళం' అనగా భూమి యని యర్థమును గ్రహించి కొండభూమి యను నర్థమును చెప్పుచున్నారు. అగవమున మలై నాడు మలైమండలము అను విధముగా ప్రయోగము లుండుటచే రెండవ యర్థమే సమంజస మని తోచును.

కాల్డ్వెల్ మున్నగువారు మలయాళమును స్వతంత్ర భాషగా కాక, తమిళపుత్రికగా భావించిరి. కేరళపాణినీయ మును రచించిన రాజరాజవర్మ తమిళమునుండి మలయాళము తొమ్మిదవ శతాబ్ది ప్రాంతమున వేరై యుండు నని అభిప్రాయ

పడెను. కొందరు పండితులు మాత్రము తమిళమువలెనే మల యాళము కూడ ప్రాచీన ద్రావిడభాషనుండి యుద్భవించె నని నిశ్చయించిరి. వీరి యూహ్దేశమున మలయాళము తమిళమునకు సోదరభాషయే కాని, జన్యభాష కాదు.

ఇంతకును విడివడిన పిమ్మట కూడ మలయాళముపై తమిళభాష ప్రభావముచూపుచునే యుండెను. క్రీ.శ. 825వరకు తమిళభూపతులైన పెరుమాళ్ రాజవంశీయుల రాచరికము మలయాళదేశముపై సాగినది. రాజకీయప్రభావము తొమ్మిదవ శతాబ్దికే ముగిసిపోయినను, పదునారవ శతాబ్దివరకు భాషా ప్రభావము మలయాళముపై నుండనే యున్నది.

'చేరమన్' అను కవి రచించిన 'రామచరితము' అను గ్రంథము మలయాళ సాహిత్యమున తొలికావ్యముగా ప్రసిద్ధి నందినది. రచనాకాలము పదవశతాబ్దియని కొందరును, పండ్రెండవ శతాబ్ది యని కొందరును విశ్వసించుచున్నారు. ఇందలి భాష మిక్కిలి కఠినమును కృతకమునై కనిపించును, ఇందు తమిళభాషాప్రభావ మెంత యున్న దన్న మలయాళపదములు కూడ తమిళరూపము నొందినవి. ఇందలిభాష నాటి భాషా విశేషములను గుర్తించుటకు మిక్కిలి సహాకరించును

'కణ్ణశన్ పాటుగళ్' అనునది కావ్యసంపుటి. ఇందు 'రామ పణిక్కర్' వ్రాసిన కణ్ణశ రామాయణము పేర్కొన దగినది. 'భగవద్గీత'ను వ్రాసిన మాధవ పణిక్కర్ 'భారత మాల' యను కావ్యమును వ్రాసిన శంకర పణిక్కర్ ఒక

వంశమువారే. వీరు పదునాల్గవ శతాబ్ది యుత్తరార్ధమున నుండి యుందురు. వీరి రచనలందు తమిళమునకు ప్రాధాన్యము తగ్గినది ; సంస్కృతశబ్దములును సమాసములును స్థానము గడించుకొన్నవి. తమిళచ్ఛందము ననుసరించి యేర్పడిన 'నిరణ వృత్తము' అనునది యొకటిక్రొత్తగా తలయెత్తినది.

మలయాళముపై సంస్కృత భాషాప్రభావ మధిక ముగా పడినది. తెలుగు కన్నడములలో వేరుమాత్రమున కున్న మణిప్రవాళశైలి మలయాళమున స్థిరత్వము నొందినది. విభక్త్యంతము లయిన సంస్కృతశబ్దములతో, మలయాళ శబ్దముల నేకవాక్యమున గూర్చుట మణిప్రవాళశైలి. దీనిని గూర్చి 'లీలాతిలకము' అను లక్షణగ్రంథమున విస్తరముగా కలదు. క్రీ. శ. పొమ్మిదవ శతాబ్దికే 'తోలన్' అనుకవి హాస్య రసపోషకముగా మణిప్రవాళరచనము గావించెను.

పదునాల్గవ శతాబ్ద్యారంభమునందలి 'ఉణ్ణునీలిసందే శము' మున్నగుకావ్యములు 'మేఘసందేశము' జాడలో వెలసినవి. వీనియందును తమిళభాషాప్రభావము మిక్కుటముగా కలదు.

రామచరితమునకు పూర్వమే మలయాళమున ఎన్నో పదములును, పాటలును వ్యాప్తిలో నున్నవి. భద్రకాళిపాట్టు మున్నగునవి ప్రాచీనరచనలు. ఎళుత్తచ్ఛన్ మలయాళ వాఙ్మయోద్ధారకుడు. 'కిళిప్పాట్టు' అను రచనావిశేషమునకు సౌందర్యమును సంతరించిన ఘనత యీతనిది. భారతము, భాగవతము, అధ్యాత్మరామాయణము మున్నగునవి యీతని రచనలలో ప్రధానములు. పదునారవ శతాబ్దమున నున్నట్టు

ఉంటాయే కాని యీతని జీవితకాలమును నిరూపించు సాక్ష్యములు లేవు. పేరు కూడ నట్టిదే. 'సాహిత్యాచార్యుడు' అను నర్థము కల 'ఎళుత్తచ్ఛన్' అనునది బిరుదనామ మనిపించును గాని అసలుపేరుగా కనిపించుట లేదు.

ఈ మలయాళభాషకు సంస్కృతమున 'లీలాతిలకము' అను లక్షణగ్రంథము 15వ శతాబ్దమున రచింపబడినది ఇందు మలయాళభాషాతత్త్వము విస్పష్టముగా నిరూపింపబడినది. ఇందలి భాగములకు 'శిల్పము' లని పేరు. అట్టి శిల్పములు ఎనిమిది కలవు మొదటి మూడుశిల్పములందును మలయాళ భాషాచరిత్రయు, వ్యాకరణమును వివరింపబడినవి తరువాతి శిల్పములందు సాహిత్యవిషయములు క్రోడీకరింపబడినవి. దీనికి పిమ్మట 1868వ సంవత్సరమున డాక్టరు గుండెర్టు మలయాళభాషలో మలయాళవ్యాకరణమును రచించెను ఆ తరువాతనే రాజరాజవర్మ కేరళపాణినీయమును రచించెను. కేరళకౌముది యను గ్రంథము నవీనకాలమున వెలసినదే.

మలయాళము స్వయముగా నొకస్వరూపమును సంతరించుకొని పదముల రూపములో, పాటల రూపములో నుండగా - మొదట తమిళప్రభావమును, పిదప సంస్కృత ప్రభావమును పడినవి. ఇప్పటికిని మలయాళప్రజలకు సంస్కృత మన్న ప్రీతి హెచ్చు. ఇతరద్రావిడభాషలలోకంటె మలయాళముననే సంస్కృతపదసంపద యెక్కువగా కలదు. మలయాళమును మాతృభాషగా మాటాడువారు ఒకకోటిమంది కలరు మలయాళమునందు చెప్పుకొనదగినంత వైవిధ్యము గలిగి మాండలికము లని పరిగణింపదగిన భాషాభేదములు కనిపింపవు.

తెలుగు : ద్రావిడభాష లన్నింటిలోను సంఖ్యా బలమునందును సాహిత్యసౌందర్యములందును ఉన్నతస్థానము వాక్రమించుకొన్నది తెలుగుభాష. "ప్రాచీనసంస్కృతిచేతను, పదపరికరముచేతను తమిళమునకు తరువాతిదే యైనప్పటికిని తెలుగుభాష స్వరమాధుర్యముచేత ద్రావిడభాష లన్నింటి యందును మొదటిస్థానమును గడించుకొన్న"దని కాల్డ్వెలు యొక్క యభిప్రాయము.

తెలుగుభాషను మొదటిరోజులలో యూరోపియనులు 'జెంటూ' (gentoo) భాష యని పిలిచెడివారు. 'జెంటూ' అని 'హిందు'వన్న సామాన్యార్థములో ఉపయోగించుట జరిగినది. మహమ్మదీయులను మూరులు (Moors) అని 'మోరులు' అని పిలిచెడివారు. మహమ్మదీయుల భాషకంటె భిన్నమైన భాషయను వర్థమానమే తెలుగుభాషకు ఈపేరు కలిగెను. తరువాత తరువాత దీని వాడకము బొత్తిగా తగ్గిపోయెను.

తెలుగువారికి 'క్లింగులు' అనుపేరుకూడ సుమత్రా, జావా, మారిషస్సు, పెగు, పెనంగు, సింగపూరు మొదలయిన ప్రదేశములందు రూఢముగా కలదు. ఒకప్పుడు తెలుగువారు మిక్కిలి సాహసముతో దూరప్రాంతములకు పోయి, స్థిరనివాసముల నేర్పరుచుకొని, అధికారమును సంపాదించుకొని యుండిరి. వారిని ఆయాదేశములవారు 'కళింగులు' అను మొదటి శబ్దమున 'క్లింగులు' అని అనెడివారు. అనంతరకాలమున 'తమిళులు' ఆయాస్థానముల కేగి 'క్లింగులు గానే వ్యవహరింపబడిరి.

తెలుగువారిని ఆంధ్రులుగా ఐతరేయబ్రాహ్మణము పేర్కొన్నది. క్రీ. పూ. మూడవశతాబ్దికి చెందిన అశోకుని

శాసనములందు ఆంధ్రుల ప్రసంగము కలదు. క్రీ. శ. 77వ సంవత్సరమునాటి 'ప్లినీ' యను గ్రీకుచరిత్రకారుడు ఆంధ్ర జాతిని వర్ణించెను. ఏడవశతాబ్దికి చెందిన 'హ్యూన్‌స్వాంగ్' అను చీనాయాత్రికుడు ఆంధ్రభాషనుగూర్చి ప్రసంగించెను కావున క్రీస్తుపూర్వమునుండియు ఆంధ్రజాతి తగినస్థానమును గలిగి యున్నదనుట కెట్టి సందేహమును లేదు.

ఆంధ్రభాషకు తెలుగు, తెనుగు అనుపేళ్ళుకూడ కలవు. తెలుగు శబ్దము త్రిలింగశబ్దభవమని కొందరును, త్రికళింగ శబ్ద భవమని కొందరు ననుచున్నారు 'కొందరు స్వచ్ఛమైన' అను నర్థముగల 'తెల్' ధాతువుపై 'గు' వర్ణముచేరి 'తెల్గు' అని అయ్యెనని యిది దేశ్యమేకాని తద్భవముకాదని యను చున్నారు.ఆట్లే 'తెనుగు' అనునది 'త్రినగ' శబ్దభవమని కొంద రనుచుండగా తేనెవంటిది కావున 'తేనె + అగు' అనియై 'తెనుగు' అనురూపమునొందెనని కొందరనుచున్నారు. ఇంకను నెక్కువిధములైన వ్యుత్పత్తులు చూపబడుచున్నవి. వానిసంగతి యెట్లున్నను తెనుగు,తెలుగు, ఆంధ్రము - అనునవి యీనాడు పర్యాయవాచకములుగా మనయోగింపబడుచున్నవి.

తెనుగు భాష పదునొకండవ శతాబ్దియందు మహాభార తముతో సాహిత్యసౌష్ఠవమును సంపాదించుకొన్నది. అయి నను, అంతకుమున్నే సాహిత్యమున్నట్లు చెప్పుటకు తగిన సాక్ష్యములున్నవి. పాల్కురికి సోమనాథుడు వెన్నెలపద ములు, తుమ్మెదపదములు మొదలయిన వానినిగూర్చి తెల్పెను. అనగా ప్రజాసామాన్యముచే నాదరింపబడుచున్న సాహిత్య మొకటి ఆకాలమున నుండెనని యర్థము. ఏడవశతాబ్దినుండియు

తెనుగు భాషాశాసనములు లభించుచున్నవి. నన్నయభట్టారకునకు పూర్వమే పద్యశిల్పము కలదని చెప్పుటకు శాసనములే పరమప్రమాణములుగా నున్నవి. క్రీ. శ. ప్రారంభమునుండియు ప్రాకృతసంస్కృత శాసనములలో తెలుగు పదములు గోచరించుచునే యున్నవి. హాలుడు సంతరించిన 'గాథాసప్తశతి' యందు తెలుగు శబ్దము లనేకముగా కనిపించుచున్నవి. వీని యన్నింటినిబట్టి క్రీస్తుశక ప్రారంభమునుండియు తెలుగుభాష కలదని చెప్పుట కేమాత్రమును సందేహింపవలసిన యవసరము లేదు.

నన్నయభట్టారకుడు ఆంధ్రకవితా భగీరథుడు. తిక్కన సోమయాజి ఆంధ్రభాషకు పరిపుష్టిని గూర్చిన మహానుభావుడు. తెలుగువలుకుబడులలోని సొగసును, వాక్యవిన్యాసములోని హొయలును,పదముల మార్దవగాంభీర్యాదిగుణముల నుచక్కగా ఆవిష్కరింపగలిగెను. ఈవిధముగా సంస్కృతసావాయ్యముతో ప్రారంభమై, తెలుగుతనమును నిండించుకొని ఆంధ్రసాహిత్యము నిరంతరాయముగా వచ్చుచున్నది. ప్రారంభకాలమునసే వ్యాకరణగ్రంథములు, ఛందోలంకారాది లక్షణగ్రంథములుకూడ ఏర్పడి యుండుటచే భాషానిష్ఠవము అంతగా సడలుటకుకాని, యితరభాషలలో కలిగినంత మార్పు కలుగుటకుకాని తెలుగు నందు అవకాశము లేకపోయిన దనియే చెప్పవచ్చును.

తెలుగుభాష సంస్కృతపదసామగ్రి నధికముగా స్వాయత్తము చేసికొన్నది అందువల్లనే ద్రావిడభాషయే యైనను ఆర్యభాషా సంప్రదాయాను కూలమైన పెంపుదలను పొంది యొక సమన్వయమును సాధించుచున్నట్లు కనిపించును. నైసర్గి

కముగాకూడ తెలుగుదేశము ఉత్తర దక్షిణభాగములకు మధ్య స్థముగానుండి రెంటిని సమైక్యపరుచు నొక సాధనమై యొప్పు చున్నది.

క్రీ. శ. 1807వ సంవత్సరమున డబ్ల్యు. బ్రౌన్ అను వాయన A grammar of the Gentoo Language అను గ్రంథ మును వ్రాసెను. 1814లో కేరీ అనువాయనయు, 1816లో కేంప్‌బెల్ అను వాయనయు తెలుగుభాషకు వ్యాకరణగ్రంథ ములను వ్రాసిరి. చార్లెస్ ఫిలిప్ బ్రౌను అనువాయన తెలుగు వ్యాకరణమును, తెలుగు నిఘంటువును రచించెను ఆతరువాత కూడ నెక్కుడు పాశ్చాత్యులు తెలుగుభాషనుగూర్చి శాస్త్రీయ గ్రంథములను రచించిరి

తెలుగుదేశమునకు వెలుపల తెలుగుమాండలికములు కొన్ని వ్యవహారమునందున్నవి. కోంటావు, సాలేవారి, గోలారి అనునవి చాందాజిల్లాయందును - బేరడీ, దాసరి యనునవి బెల్గాముసందును - కామారీ, వడరీ యనునవి బొంబాయి పరి సరములందును గలవు.

మొత్తముమీద తెలుగుభాష మూడున్నరకోట్లమందికి మాతృభాషయైయున్నది.

కన్నడము : ఈభాషను కన్నడము అని కాని కర్ణా టము అని కాని యందురు. తమిళములోవలె ఈభాషలో గూడ వాళగన్నడ మని వొసగన్నడ మని రెండుభేదములు గలవు. ప్రాచీనభాషను వాళగన్నడ మని యందురు. నవీన భాషను వొసగన్నడ మని యందురు. ఈరెండింటికిని ప్రత్యయ ముల యుపయోగమునందు భేదము కలదు. 'కర్ణాట' అను

సంస్కృతపదమునుండి 'కన్నడ' అను తద్భవ మేర్పడె నని పండితుల యభిప్రాయము. గుండెర్టుతోపాటుగ కాల్డ్వెలు కన్నడమును దేశ్య మనియే నిశ్చయించెను. 'కర్' అనగా నల్ల ని యని యర్థము; 'నాడు' అనగా దేశ మని యర్థము. కావున కర్నాడు అనగా నల్లని దేశమని యర్థము. తెలుగున కూడ వేగినాడు, రేనాడు మున్నగు పదములలో 'నాడు' దేశవాచకముగా బహుళముగా ప్రయుక్తమై యున్నది. ఆరవశాబ్దియందలి వరాహమిహిరుడు కర్ణాటపద మును వాడెను. ఈ 'కర్నాట' అనునదియే కన్నడులవాడు కనుబట్టి 'కన్నడ' అనియు 'కన్నర' అనియు రూపములను పొందినది. 'కన్నర' అనునదే ఆంగ్లమున "Canarese" అను రూపమున సిద్ధినొందినది.

'కరునాడు' అనగా ఎత్తయిన ప్రదేశ మని యర్థము చెప్పి దేశ్య మనియే నిర్ణయము చేసిరి. కన్నడభాషాచరిత్రను వ్రాసిన శ్రీనరసింహాచారియరు "కన్నాడు" శబ్దమునకు "కర్ణాట" శబ్దము సంస్కృతీకరణ మని భావించిరి. రణలు సంయోగమునొంది నకారద్విత్వము కావచ్చును గాని నకారద్వితము రణలుగా వేరుపడుట భాషాశాస్త్రవిరుద్ధ మని శ్రీబోగిసోమయాజి తమ యభ్యంతరమును దెల్పిరి. 'కమ్మని వాడు' అను నర్థమున నున్న 'కన్నాడు' పదముకంటె ఈ వరలో చెప్పిన 'కరునాడు' శబ్దమే కర్ణాటశబ్దోత్పత్తికి మాతృక కాగలదు 'కరునాడు' అనునదే కర్నాడు, కన్నాడు, కన్నడ అను రూపములకు మూల మనుట భాషాశాస్త్రనిధేయమై సమంజసముగా కనిపించుచున్నది.

గ్రంథపరిచయము సంపాదించుటకు పూర్వము కన్నడ భాషలోని నాలుగు ప్రాచీనశాసనముల విషయమును గమనింతము. క్రీ శ ఐదవ శతాబ్దికి చెందిన 'హల్మిడి శాసనము' సంస్కృతశ్లోకముతో ప్రారంభమై, సంస్కృతపదబహుళ మైన కన్నడవచనములో వ్రాయబడియున్నది. ఈశాసనమునందు 'మొత్త' మిరువది కన్నడపదములు గలవు. క్రీ. శ. 700 సంవత్సరమునకు చెందిన 'బాదామీ శాసనము' సంస్కృత మయ మైన కన్నడమున త్రిపదిచ్ఛందమున వ్రాయబడి యున్నది. భాషపై సంస్కృతప్రభావ మున్నను, కేవలకర్ణాటకచ్ఛందస్సులో రచింపబడుట యిందలి విశేషము. అదే కాలమునకు చెందిన 'శ్రవణ బెళగోళశాసనము'లో కూడ సంస్కృతపదప్రాచుర్యమే యెక్కువగా కనిపించును. పదవ శతాబ్దికి చెందిన 'శ్రవణ బెళగోళశాసనము'లో 'అక్కర' యుపయోగింపబడినది. శాసనములందలి దేశ్యభాష మాళ గన్నడముకంటె తమిళభాషకే సన్నిహితముగా నున్న దని తజ్జుల యభిప్రాయము.

కన్నడవాఙ్మయమున లభించినవానిలో మొట్టమొద టిది 'కవిరాజమార్గ' అను లక్షణగ్రంథము. రచనాకాలము బాదాపు క్రీ. శ. 825. నృపతుంగు డను రాష్ట్రకూటచక్ర వర్తియే దీనిని రచించె నని కొందరును, నృపతుంగసభాసదు డైన శ్రీవిజయుడు రచించె నని కొందరును భావించుచున్నారు.

ఈగ్రంథమున మూడు ప్రకరణములు గలవు. మొదటి ప్రకరణమున దోషాదోషనిర్ణయము, రెండవ ప్రకరణమున శబ్దాలంకార నిర్ణయము, మూడవ ప్రకరణమున అర్థాలంకార

నిర్ణయము జరిగినవి. లక్ష్యములను పూర్వవర్తు లగు కవుల కావ్యములనుండియే కవిరాజమార్గక ర్త తాను గ్రహించెను. శ్రీవిజయ, కవీశ్వర, పండిత, చంద్ర, లోకపాలాది పద్యకావ్య క ర్తలను విమలోదయ, నాగార్జున, జయబంధు, దుర్వినీతాది గద్యకవులను కూడ ప్రశంసించెను. గద్యపద్యచంపూరీతులు మూడును వాడుకలో నున్నవి.

జైనమతమునకుచెందిన యనేకకథలతో పందొమ్మండు గురు జైనసన్యాసులనుగూర్చి 'వడ్డారాధన' అను గద్య గ్రంథమును శివకోట్యాచార్యుడు మనోహరముగా రచించెను. సమంతభద్రుడు, కవిపరమేష్ఠి మున్నగు ప్రసిద్ధకవులును బృహద్వ్యాఖ్యానములను రచించిన పండితులును కొంద రున్నట్లు తెలియుచున్నది. కాని వారిగ్రంథములు మృగ్యములు.

పదవ శతాబ్దమునకు చెందిన పంపడు కన్నడ సాహిత్యమున ఆదికవిస్థానము నలంకరించును. తాను వేంగి మండలమందున్న వేంగిపట్టు అను అగ్రహారమున జన్మించినట్లు తానే చెప్పికొనెను. వంశముచే వైదికుడును, ధర్మముచే జైనుడును అగుటచేత పంపకవియందు జైనవైదికధర్మ సమన్వయము కనిపించును. జైనతీర్థంకరులలో మొదటివాడైన వృషభనాథుని చరిత్రమును 'ఆది పురాణము' అనుపేరున చంపూగ్రంథముగా పదునాలుగాశ్వాసముల పరిమితితో రచించెను. పంపడు రచించిన రెండవ గ్రంథము 'విక్రమార్జున విజయము'. జైనభారతము ననుసరింపక పంపకవి వ్యాసభారతమునే యను సరించినను కొన్నిమార్పులను చేసెను. ఇందు నాయకుడు అర్జునుడు ద్రౌపది అతని ధర్మపత్ని. యుద్ధానంతరము సుభద్రా

సహితుడై అర్జునుడే పట్టాభిషిక్తు డగును. కావ్యనాయకు డైన అర్జునునకును, తన కాశ్రయదాత యైన 'అరికేసరి' నృపాలునకును అభేదాధ్యవసాయమును సాధించును. ఆనాటి చారిత్రకపరిస్థితులు ఈగ్రంథమున నిబద్ధములై యున్న వనుట నిస్సంశయము. ఈగ్రంథము 'పంప భారతము' అని వ్యవహారనామమున ప్రసిద్ధి నొందినది.

పొన్నడు 'జినాక్షరమాల' యను ఇరువదితొమ్మిది కంద పద్యములతో జినస్తుతిని రచించెను. జైనతీర్థంకరులలో పదునారవవాడైన శాంతినాథుని జీవితమును పండ్రెండు ఆశ్వాసములలో 'శాంతిపురాణము' అనుపేర చంపువుగా రచించెను. పంపని 'ఆదిపురాణము' వంటి గ్రంథమును వ్రాయవలయు ననుస్ఫూర్తి 'శాంతిపురాణ' రచనమునకు ప్రేరణము గావించియుండును. ఇతడు భువనైక రామాభ్యుదయము' అను కావ్యమును వ్రాసినట్లు తెలియుచున్నది కాని గ్రంథము లభ్యము కాలేదు. రాష్ట్రకూటచక్రవర్తియగు కృష్ణుడు పొన్న కవికి కవిచక్రవర్తిబిరుదము నిచ్చెను.

రన్నడు జైనతీర్థంకరులలో రెండవ వాడైన అజిత నాథునిజీవితమును గ్రహించి, 'అజితపురాణము'ను వ్రాసెను. చాళుక్యయువరా జగు సత్యాశ్రయునితో భీమున కభేదాధ్యవసాయము పాటించుచు 'సాహస భీమ విజయము' అను గ్రంథమును రచించెను. ఇందు నాయకుడు భీముడు. దీనికి 'గదాయుద్ధము' అను నామాంతరము కలదు. ఇతడు పరశురాము చరిత, చక్రేశ్వరచరిత అను మరిరెండు గ్రంథములను రచిం

చెను కాని అవి లభ్యము కాలేదు ఇతడు కవిచక్రవర్తిబిరు దము తోపాటు, రాజగౌరవమును పొందెను

ఇంతవరకుచూచిన పంప పొన్న రన్నలను రత్నత్రయము అనుపేర సామూహికముగా పిలుతురు.

నాగవర్మ 'ఛందోంబుధి' అను గ్రంథమున సంస్కృత ఛ్ఛందస్సులతోపాటు కర్ణాటక విషయజాతి' అను భాగమున దేశీయచ్ఛందస్సులను గూడ వివరించెను ఇదే కన్నడమున మొట్టమొదటి ఛందోగ్రంథము. ఇతడుకూడ వేంగీమండలము లోని వేంగిపట్టు అను అగ్రహారమే తన జన్మస్థానముగా వాకొ నెను ఇతనికి 'కవిరాజహంస' యని 'బుధాళివన కలహంస' యని బిరుదములు కలవు.

రెండవ నాగవర్మ 'కర్ణాట భాషాభూషణ' అను వ్యాక రణ గ్రంథమును సంస్కృత సూత్రపద్ధతిలో వ్రాసెను. 'కావ్యావలోకన' అనుపేరున కందపద్యములలో అలంకార శాస్త్రమును రచించెను 'వస్తుకోశ' అనుపేర పద్యమయ మగు నిఘంటువును గ్రథనముచేసెను అందు కన్నడ భాషావ్యవహార మున నున్న సంస్కృత పదములకు కన్నడమున నర్థము లిచ్చెను.

ప్రారంభయుగమున జైనమతముతో, తరువాతి కాల మున వీరశైవముతో, అనంతరకాలమున వైష్ణవముతో ముడిపడి, ప్రోత్సాహమును పొంది కన్నడసాహిత్యము వేర్వేరు పరిణామ ములకు లోనై, స్వతంత్ర వ్యక్తిత్వమును స్థాపించుకొన్నది.

కన్నడము స్థూలముగా బుర్తెరుల భాష, కురుంబుల భాష, కురుంవారుల భాష, గోలరుల భాష యని వాలుగు

విధములయిన మాండలిక భేదములను కలిగియున్నది. ఇంచు బుర్వెరుల భాషకు 'బడగ' యను నామాంతరము కలదు.

మొత్తముమీద కన్నడమును రెండుకోట్లమంది మాతృ భాషగా మాటాడుచున్నారు.

తుళు : దక్షిణభారతదేశమునందలి పశ్చిమతీరము నందున్న 'తుళునాడు' అంతటిలోను తుళుభాష వ్యవహారమున నున్నది. దక్షిణ కన్నడ మండల మందలి కార్కళ, మంగుళూరు, బుంట్వాలు, పుత్తూరు తాలూకాలును, ఉడిపితాలూకా యందలి చాలభాగము, సుళ్లియ తాలూకాయును కలిసి 'తుళువాడు'గా పిలువబడును. కేరళ ప్రదేశమునందు కలిసిన 'కాసరగోడు' తాలూకా యందును తుళుభాష యధికముగానే యుపయోగమునందు కలదు తుళుమండలమునకు ఉత్తరమునందును, తూర్పునందును, ఆగ్నేయమునందును కన్నడభాషతో సంబంధమున్నది. దక్షిణమునందు మలయాళభాషతో సంబంధమున్నది.

తుళుభాషాభాషులను 'తుళులు' అని కాని 'తుళువలు' అని కాని అందురు. దేశమును తుళుదేశమని తౌళవదేశ మని కూడ అనుట కలదు. శాసనములయందు కర్ణాటక, కొంకణ - మున్నగు వానితోపాటు ఇదియు స్థానమును సంపాదించు కొన్నది.

'తుళుభాష'ను మలయాళ మాండలికముగా 'ఎలిస్' అను నాయన తలచెను. తుళుజాతీయులు సంస్కృతభాషను మలయాళలిపిలో వ్రాసికొనెడివారు. అందువలన ఆయన కీ భ్రమ కలిగి యుండును. నిజమునకు తుళుభాష కన్నడమునకు

పన్ని హితముగా నున్నది. అయినను మాండలిక మని యను టకు వీలు లేనంతగా ప్రత్యేకత కలిగియున్నది.

'బ్రిగెల్' అను నాయన ఆంగ్లభాషయందు తుళుభాషా వ్యాకరణమును 1872 వ సంవత్సరమున వ్రాసి ప్రకటించెను. 'మేనర్' తుళు - ఇంగ్లీషు నిఘంటువును 1886 లో ప్రక టించెను. 1888 లో ఆయనయే ఇంగ్లీషు - తుళు నిఘంటు వును ప్రకటించెను. 1920 ప్రాంతమునందు తుళుభాషోద్ధరణ మునకు పూనుకొని చరిత్రసంబంధములును తత్సదృశములు నైన 'పాద్దన' అనియు 'సంది అనియు పేరు గల రచనలను, ప్రాచీనజానపదగేయములను కన్నడలిపిలో అచ్చువేయుట జరి గెను. అదే సమయమున దేశభక్తి ప్రచారకములయిన గేయము లును, నాటకములును కూడ ఉద్భవించెను. 'ఉడిపి' శాలూకాకు చెందిన 'పణియాది' అను నాయన 'తుళువ్యాకరణము'ను తుళు భాషలో 1932 లో ప్రకటించెను.

మొత్తము మీద సాహిత్యసంపద యున్నను, పద సమృద్ధియున్నను తుళుభాష యధికమైన ప్రతిష్ఠను సంపాదింప లేదు. రాజపోషణము లేకపోవుటయు, స్వతంత్రలిపి లేక పోవుటయు దీనికి కారణములు కావచ్చును.

అదంతములయిన సంస్కృతపదములు తుళుభాషలో 'ఒ'త్వము నొందును; పుంలింగశబ్దములు ఎత్వమునొందును. ఉ॥ ధర్మ> దర్మొ: అంశ> అంసొ; రామ> రామె. వర్గ యుక్కులు పూర్వహల్లులుగా మారిపోవును ఉ॥ ధర్మ> దర్మొ: శంఖ> సంకొ; పదాదినున్న సంస్కృత యకారము స్థానమున

'ఏ' వర్ణమును నిల్పుట కలదు. ఉ॥ యజమాన > ఎజమానే; యథాస్థితి > ఎతాస్తి.

మూర్ధన్యాక్షరములను పలుకవలసివచ్చినపుడు దంత్యములను పలుకుటయే తుళుభాషయందు సహజమై యున్నది. తమిళములో వలెనే అర్థమాత్రాకమైన ఉకారము అదనముగా కలదు. అట్లే 'ఎ' అను వర్ణమునకు 'ఏ' అను వర్ణమునకును మధ్యగా నుచ్చరింపబడు 'ఎ' వర్ణమొకటి అదనముగా తుళు భాషయందు కలదు. 'ఎ' వర్ణమునకును దీనికి నుచ్చారణమున భేదముండులే కాదు, అర్థబోధయందు కూడ భేదము కలదు. ఇది ప్రథమ పురుషైకవచన ప్రత్యయముగా కూడ ఉపయోగించును. ఉ॥ తిన్నే (వాడు తినును); తిన్దే (వాడు తినెను) విధ్యర్థమునందు మధ్యమపురుష బహువచన ప్రత్యయముగా కూడ ఈ ధ్వనికలదు. ఉ॥ పోలె (మీరు వెళ్లుడు); కోర్లె (మీరు ఇండు).

'తుళు' అని యనగా తుళుభాషయందు 'మృదువైన' అని యర్థము.

ఈ భాషలో కులములనుబట్టి చిన్నచిన్న మాండలిక భేదములు కలుగుట సంభవించెను అట్లే స్థానికములయిన ప్రభావములవల్ల కూడ ఉడిపితుళు, కార్లతుళు, పుత్తూరుతుళు మున్నగు విధమైన వైవిధ్యమును పాటించుట కనిపించును. మొత్తముమీద ఈభాషను దాదాపుగా ఎనిమిదిలక్షలమంది మాటాడుచున్నారు

కొడగు : అంగ్లమున 'కూర్గు' అని వాడబడు ప్రాంతమును దేశీయులు 'కొడగు' అని యందురు. తమిళమందున్న 'కుడక్కు' అను శబ్దమే యిట్లు పరిణతమై

యుండును. ప్రాచీన తమిళమున దీనికి 'పశ్చిమము' అని యర్థము. తమిళప్రాంతమునకు 'కొడగు' పడమటిదిశగా నుండుటచే దిక్కునుబట్టి దీని కీవ్యవహారము కలుగుటకు అవకాశము కలదు. ఆంగ్లమున డకారోచ్చారణమే రకారముగా మార్పు చెంది వినిపించుచున్న దనుట వాస్తవము. దిక్పూచకమైన యీ శబ్దము క్రమముగా దేశమునకును, భాషకును పేరయ్యెను.

ఈ భాషను ప్రత్యేకభాషగా కాక కన్నడభాష కొక అనారగక మాండలికముగా నెంచుట పరిపాటిగా నున్నది. 'డాక్టరు మూగ్లింగు' అను జర్మనుదేశీయుడు కొడగు భాష కన్నడభాషకంటె తమిళ మలయాళభాషలతో సన్నిహిత సంబంధమును గలిగి యున్నదను నభిప్రాయమును వెలువరించెను.

కూర్గు భాషయందలి క్రియారూపములను పోల్చి చూడగా, కన్నడ మలయాళాది భాషలతో ఈ భాషకు సామ్యముకంటె వైషమ్యమే యెక్కువ యని తేలుచున్నది. తక్కిన భాషలలోవలె ప్రథమ మధ్యమోత్తమ పురుషరూపములకుగాని, ఏకవచన బహువచనములకుగాని భేద మున్నట్లు కానరాదు. 'నేను చేయుదును' అను నర్థమున 'కెయువి' అని క్రియారూపము. 'నీవు చేయుదువు' అని యున్నప్పుడును 'కెయువి' అను రూపమే నిల్చును. 'అతడు చేయును' అను నర్థమున 'కెయువ' అని అదంతమై కనిపించును. 'మేము చేయుదుము' అని యన్నను 'వారు చేయుదురు' అని యన్నను గూడ 'కెయువ' అను రూపమే యుండును. భూతకాలరూపముల యందు కన్నడమున దెమ్, దయ్, దమ్, దల్ మున్నగు విధ

ముగా తుడనిచేరుప్రత్యయములందు'ద'వర్ణము వినిపించును, అట్టి యెడల కొడగుభాషయందు 'జ' వర్ణము నియతముగా వినిపించుచున్నది 'నేను చేసితిని' అను నర్థమున 'కెజ్జమ్'అనియు, 'నీవు చేసితివి' అను నర్థమున 'కెజ్జియ' అనియు, 'అతడు చేసెను' అను నర్థమున 'కెజ్జత్' అనియు రూపములు కలవు. ఇక్కడ ధాతువు 'కెయ్' అనునది. ఇది కన్నడమునందున్న 'గెయ్' ధాతువుతోడి సామ్యము స్పష్టముగా చూపుచున్నది. తమిళమున 'శ' వర్ణమును, తెలుగు మలయాళములందు 'చ' వర్ణము నుండగా కన్నడమునందును కొడగునందును కంఠ్య వర్ణముతోడి రూపములే కనిపించుచున్నవి. కన్నడమునందు 'గెయ్దెమ్' అని యుండగా కొడగునందు 'కెజ్జమ్' అను రూప మేర్పడినది అనగా 'ద' వర్ణము 'జ' వర్ణముగా మారి పూర్వ మందున్న 'య' వర్ణమును కూడ 'జ' వర్ణముగా మార్చి సమీకరణము నొందినది. మొత్తముమీద ఈ భాష మిక్కిలి ప్రాథమిక స్థితిలోనుండి యితర కుటుంబభాషల ప్రభావమునకు లోనుగాక ద్రావిడభాషా లక్షణములను నిరూపించుచున్న దనుట యొప్పుకొనదగిన యంశము.

'మేజర్ కోల్' కూర్గుభాష కొక వ్యాకరణమును రచించెను. 'రివరెండ్ బి. గ్రేబర్' సంక్షేపముగా వ్యాకరణ పరిచయము గావించుచు కొడగు భాషలోని కొన్నిపాటలను సంతరించి ప్రకటించెను. కొడగు భాషీయులు అత్యంతప్రాచీన కాలమునసే పడమటి కనుమలయందు స్థిరనివాసమేర్పరుచు కొనిరనియు, ప్రాచీనద్రావిడ సంప్రదాయములు వారిలో

నింకను మిగిలియున్నవనియు 'బర్నెలు' నిశ్చయము. ఈభావను దాదాపు నలువదివేలమంది మాటాడుచున్నారు.

అనాగరక భాషలు

ఇంతవరకు నాగరకభాషల స్వరూపసంపదను దిఙ్మాత్రముగా చూచితిమి అనాగరకభాషల స్వరూపమును భౌగోళిక స్థితిని కూడ కొంచెము స్పృశించుట యుచితముగా నుండును. దక్షిణభారతదేశమునందు ద్రావిడభాషలు దట్టముగా అలముకొని యున్నవి; సింహళదేశపుత్తర భాగమునుకూడ ఆక్రమించుకొనియున్నవి.

అనాగరక ద్రావిడభాషలు తెలూచిస్తానునందును, పడమటి కనుమలందును, బెంగాలు దేశపరిసరములందును కూడ నున్నవి. స్థూలముగా మద్రాసు, నీలగిరి, తిరువేంద్రముల నడిమిదేశము తమిళభాషాప్రాంత మని యనవచ్చును. కాని తమిళులు బర్మా, సింహళము, ఇండోచైనా, మధ్యాఫ్రికా మున్నగు ప్రాంతములకు వలసవెళ్ళి తమ మాతృభాషలోనే వ్యవహారమును సాగించుచున్నారు.

కన్నడము స్థూలముగా మైసూరు బీదరు కార్వారుల నడుమ మాతృభాషగానున్నది. దీనికి సరిహద్దులయందు ఒకవైపు ఆర్యభాష లగు మహారాష్ట్ర కొంకణభాషలును, ఒకవైపు ద్రావిడభాష లగు తెలుగు తమిళములును గలవు. తెలుగుభాషాప్రాంతమునకు సరిహద్దులయందు ఒకవైపు తమిళము, ఒకవైపు ఓడ్రము, మరొకవైపు మహారాష్ట్రమును గలవు. ఓడ్ర మహారాష్ట్రములు రెండును ఆర్యభాషాకుటుం

లమువకు చెందినవే. ఐనమ 'గోండీ' అను అనాగరక ద్రావిడ భాషయొకటి తెలుగునకు మిత్రమైయున్నది. కన్నడప్రాంతము తెలుగుదేశము నానుకొనియే యున్నది. తెలుగుప్రాంతమునకు దూరముగా నున్నను తెలుగుభాషకు మిక్కిలి సన్నిహితమైన 'కుయి' భాష మహానదీలోయలో ఐదులక్షల యెనుబది వేలమందికి మాతృభాష యైయున్నది.

ఉత్తరభారతదేశమున పర్వతప్రాంతములలో ద్రావిడ భాషలు కలవు. తూర్పుకనుమలయందు 'కుయి' యున్నట్లే ఛోటానాగపూరులో ఒరావొను భాష, బీహారు రాజమహాలు ప్రాంతములో మల్తో భాష వ్యవహారములో నున్నవి. 'ముండా' వర్గమునకు చెందిన ముండారి, ఖరియా, కేర్వా, సంతాల్ భాషలు కూడ ఆప్రాంతములందు సహజీవనము సాగించుచున్నవి బ్రాహుయీభాష తూర్పుబెలూచీస్తానమునందును, సింధుప్రాంతమువందును వాడుకలో నున్నది దీనిని ద్రావిడ భాష యని చెప్పుటకే అనుమానింపదగినంతగా ఆర్యభాషల ఇరానియనుభాషల ప్రభావము దీనిపై పడినది.

తుదభాష : నీలగిరి కొండలయందుండు 'తుద' యను తెగకు చెందిన 'తుదవరులు' మాటలాడు భాష కావున దీనికి పేరు వచ్చెను. 'కర్నల్ మార్షల్' అను వాయన 'A Phrenologist among the Todas' అను పేరున తుదవరులనుగురించి పెక్కువిశేషములను తెలియజేయుచు, ఒక గ్రంథమును వ్రాసెను. 'డాక్టరు పోపు' తుదభాషావ్యాకరణ విశేషములను తెలియజేయుచు వ్రాసిన యనుబంధము ఆగ్రంథమునకు చేర్చబడినది. 'గుంపు' అను నర్థముగల 'తొఱ' యను తమిళపదము

నుండి 'తొద' యనుపదము వచ్చియుండు నని డాక్టరు పోపు యొక్క యభిప్రాయము. కాని, కాల్డ్వెల్ దీనితో ఏకీభవించుట లేదు. తుద' యందలి 'ద' వర్ణము దంత్యము. దానికి మూర్ధన్యములయిన ట, ళ వర్ణములతో ఏమాత్రమును సంబంధము లేదని ఆయన నిశ్చయము

ఇటీవలికాలమున 'ఎమెనో' అను నాయన 'తుద' భాషను గురించి మిక్కిలి పరిశ్రమ చేసి పదపరికరమును, వ్యాకరణవిశేషములను పరిశీలించెను.

ఆదియందున్న 'అ' వర్ణము తుదభాషయందు 'ఒ' వర్ణముగా మారుచున్నది. 'అడుగు' అను నర్థమున తెలుగులో 'అజ్జ' యనియు తుళుభాషయందు 'అజె' యనియు నుండగా, తుదయందు 'ఒజ్' అని కలదు 'భయము' అను నర్థమున అరవమందు 'అళ్ళు' అనియు మలయాళమందు 'అంచుక' అనియు నుండగా తుదయందు 'ఒజ్క్' అని యున్నది. తమిళమునందలి 'పత్తు' తెలుగున 'పది' అని యుండగా తుదయందు 'పొత్' అని యున్నది. తమిళము నందున్న 'కవర్' తెలుగు మలయాళములందు 'కవ' యని, తుదభాషయందు 'కఫ్' యని యున్నది. దీనికి 'జంట'యని 'జంటగా విడిన కొమ్మ' యనియు నర్థములు. ఇచ్చట 'వ' వర్ణము ఫ' వర్ణముగా మారినది. ఇట్లే తమిళమునందలి 'కవన్' కన్నడమున 'గవన' అని తుదయందు 'కఫ్' అని యుండును. దీనికి 'బాధ్యత' యని 'ప్రేమ'యని యర్థములు. 'చేరుట' యను నర్థమున చేర్ (త) సేక్ (క) చేరు (తె) సోర్ (తుద) అను రూపములుండును. తమిళమునందు 'ఏక్' అను మాటకు 'నాగలి' యని యర్థము. ఇదే యర్థమున తెలు

గున 'ఏరు' అనియు తుదయందు 'ఎర్' అనియు రూపములు గలవు. కన్నడమునందలి 'ఏరు' శబ్దమునకు 'దుక్కి చెడ్డజత' యని యర్థము తెలుగునందలి 'చేర' తమిళమున 'చేరై' అనియు కన్నడమున 'సేరె' అనియు నుండగా తుదయందు 'చ' వర్ణము 'త' వర్ణమై 'తేట్' అని యగును. ఇట్లు తుద భాష తక్కిన ద్రావిడ భాషలతో పెక్కువిధముల సామ్యమును గలిగియున్నది. ఈ భాషను మాటలాడు జనులు వేయిమంది కంచె ఎక్కువ రేరు.

కోతభాష : ఈ భాషను మాటలాడు జనులు కూడ ప్రధానముగా నీలగిరి యందే నివసించుచున్నారు; కొలదిమంది అస్సాములోకూడ నున్నట్లు తెలియుచున్నది.

కన్నడములో వలెనే 'కోత' భాషయందు 'ప' వర్ణము 'హ' వర్ణముగా మారును 'పోవు' అను ధాతువు 'హోగు' అని యగును. 'నేను వెళ్ళుచున్నాను' అను నర్థమున 'అనె హోగవె' అనియు 'నీవు వెళ్ళుచున్నావు' అను నర్థమున 'నీ హోగవి' యనియు 'అతడు వెళ్ళుచున్నాడు' అను నర్థమున 'అవనె హోగకొ' యనియు నుండును. ఇవి చాలవరకు కన్నడరూపములను బోలియున్నవి. 'మేము వెళ్ళుచున్నాము' అను నర్థమున 'నామె హోగవేమె' యని యున్నది. ఇది తమిళరూపమునకు సన్నిహితముగా నున్నది.

'ఒకటి' అను నర్థమున కోతభాషయందు 'ఒర్' అనియే కలదు. విశేషణముగా కూడ దీనికుపయోగము కలదు. 'రెండు' అను నర్థమున 'ఎర్డ్' అను రూపముగలదు అయినను 'ఇరువది' మున్నగు నర్థమున 'ఇర్వద్' మున్నగువిధముగా నుండును.

'నాలుగు' అనునర్థమున 'వన్గ్' అనియుండి 'నలువది' యను నర్థమున 'నల్వత్' అనియు 'నఁత్' అనియు నగును, 'సిగ్గు' అనునర్థముగల 'నాన అనుతెనుగు పదమునకు సమానముగా 'నణ్డ్' అను పదము కలదు 'నీడ' యను నర్థమున తమిళమున 'నిఱల్' అనియుండగా కన్నడమున 'నెఱల్' అనియు కోత యందు 'నెర్ల్' అనియు రూపములు గలవు. 'బొఱియ' అను నర్థమున తమిళమున 'పొరై' అనియు కన్నడమున 'పొర్' అనియు 'కోత' యందు 'బోర్' అనియు రూపములు గలవు. 'నీవు' అను నర్థమున తమిళమున 'నీ' అనియు కన్నడమున 'నీమ్' అనియు నుండగా కోతయందు 'ని' అను రూపముండును 'వేడి' యను నర్థమున 'వే' యను శబ్దము కలదు. 'వెన్నిర్' అని యనగా కోతయందు 'వేడినీరు' అని యర్థము.

ఇట్లు చాలపదములు చిన్నచిన్న మార్పులను పొంది యున్నను, తక్కిన ద్రావిడ భాషలతో మిక్కిలి సామ్యమును గలిగియున్నవనుట వాస్తవము. ఈ భాష దాదాపు పదమూడు వందలమందికి వ్యవహారభాషగా నున్నది. 'ఎమెనో' అను వాయన కోతభాషావిషయమున పరిశ్రమించెను.

గోండుభాష : భారతదేశపు మధ్యభాగమున 'గోండ్వానా' అని పిలువబడు ప్రదేశమున, అడవులలోను కొండలలోను నివసించు జనులను గోండులని యందురు. వారు తమ్ము తమ భాషలో 'కోహితూరులు' అని చెప్పికొందురు. 'కోయా' అను పదమునకు బహువచనమైన 'కోయాతోర్' అనుపదమును 'కోహితూరు' అను పదమును సామ్యము గలిగియున్నవి. వీనిని గూర్చి 'కర్నల్ డాల్టన్' ప్రభృతులు కొన్నిముఖ్యవిషయము

లను సేకరించిరి. రివరెండ్ జె. జి. డ్రైబర్గు అనునాయన గోండుభాషకు వ్యాకరణమును రచించెను. రివరెండ్. జె. డాసన్ అను నాయన మత్తయి సువార్తను, మార్కు సువార్తను గోండుభాషలోనికి అనువదించెను. ఆతరువాత ఆయ వడే గోండుభాషకు పదసామగ్రితోపాటు, వ్యాకరణమును సంతరించి ప్రకటించెను.

'మూడు' అను నర్థమున తమిళమున 'మూండ్రి' అని యుండగా గోండునందు 'మూండ్రి' అని యుండును. 'ప్రాను' అను నర్థమున తమిళమున 'మరమ్' అని యుండగా గోండు నందు 'మ్రా' అని యుండును. 'వారు' అను నర్థమున తమిళ మందు 'అవర్' అని యుండగా గోండు నందు 'ఓర్' అని యుండును. 'వీరు' అను నర్థమున 'ఇవర్' అని తమిళమున నుండగా 'ఏర్' అని గోండు నందుండును. తెలుగునందలి అవి, ఇవి అనువానికి సమానముగా అవై, ఇవై అని తమిళమున నుండగా గోండునందు ఆవూ, ఈవూ అనురూపములు గలవు.

విశేషణ విశేష్య సంబంధమును సూచించునపుడు గోండు ప్రత్యేకతను ప్రదర్శించుచున్నది 'నా చేయి' యను నర్థమున తమిళమున 'ఎనదుకై' యని యుండును. గోండు నందు 'నావా కై' అని యుండును 'నా తమ్ముడు' అని అనవలసి వచ్చినపుడు అరవమున 'ఎనదు తమ్బి' అని యుండును అనగా విశేషణమునందు మార్పేమియు రాలేదు. కాని గోండునందు కూడవిశేష్యమునుబట్టి విశేషణము మారి 'నావోర్ తమ్ముర్' అని యగును. ఇక్కడ విశేషణము చివరనున్న 'ఓర్' అనునది మహాదర్థకైకవచనమును సూచించును; బహువచనమున విశే

షణ విశేష్యములు రెండింటిమీదను 'క' వర్ణముచేరి 'నావోర్క్ తమ్మోర్క్' అని యగును. అప్రాణివాచకములును స్త్రీవాచక ములును ఒకే వర్గమునకు చెంది యొకే ప్రక్రియ ననుసరించును. 'నావాకై' అని యన్నట్లుగానే 'నావా సెలార్' అని యన వచ్చును. దీనికి 'నా చెల్లెలు' అని యర్థము. 'నా చెల్లెండ్రు' అని యనవలసినప్పుడు 'నావోంగ్ సెలార్క్' అనియుండును.

తెలుగునందలి 'అది' యనునది షష్ఠీవిభక్త్యంగము 'దాని' అని యగును. అనగా తొలినున్న 'అ' వర్ణము స్థాన మును మారిన దని యర్థము తమిళమునందు ఇట్టిమార్పు లేకుండ 'అదిన్' అనియుండును. గోండునందుకూడ ఆదిమస్వర ముతో కూడియే 'అదెనా' అని యుండును తెలుగునందలి లేదు, కాదు- అనువానితో సమానముగా ఇల్లై, అల్ల - అని తమిళమందుండగా గోండునందు వావర్ణముతోకూడి హిల్లే, వాల్లే - అను రూపము లేర్పడును.

మొత్తముమీద గోండుభాష తెలుగు కన్నడ తమి ళములతో కొన్నిపోలికలను, కొన్నిభేదములను కనబరుచుచు తన ప్రత్యేకతను నిల్పుకొనుచున్నది. కొంతకుకొంత దానిపై సంతాలుభాషా ప్రభావముకూడ పనిచేయుచున్నదని చెప్ప వచ్చును ఈభాషను మొత్తముమీద [illegible] తమనిత్యవ్యవహారమున నుపయోగించుకొనుచున్నారు.

గోండుభాష : [illegible] గోండ్వానా గుహ్యుల్లలయిందును గల యాటవిక జనులు మాటాడు భాష. గోండుభాష యనిపేరు, ఈభాషను

మూటాడు జనులను 'ఖొందులు' అని యందురు. వారికి సన్ని హితులై న ఓడ్రులు 'కంధులు' అనికూడ పిలుచుట కలదు. ఆంధ్రులు వారిని 'కోడులు' అని పేర్కొనుచుందురు. తమ్ము తాము చెప్పుకొనునప్పుడు ఖొందులు తాము 'కూ' జాతికి చెందినట్లుగా చెప్పుకొందురు. అందువల్లనే వారిభాషకు కూడ 'కూ' భాష యను నామాంతరము గలదు దీనినే 'కుయి' అను పేరున వ్యవహరించుటకూడ కలదు. 'ఖొందు' అను శబ్దము వకమ తమిళమందలి 'కుర్రు' అను శబ్దమునకును సామ్యము గలదని, 'కొండజాతివారు' అను నర్థముననే 'ఖొందు' అను పేరు కలిగి యుండునని యూహించిరి. గోండును ఖొందును సాన్ని హిత్యము గలిగిన తెగలు. కొందరు రెంటినొక్క తెగ గానే భావించి, వారిభాష నొకేభాషగా భ్రమపడుటయు జరిగెను. 'లఖ్మాజీ' అను నాయన కూభాషావ్యాకరణమును రచించెను.

'నేను' అను నర్థమున తమిళమున 'నాన్' అనియు కన్నడమున 'నాను' అనియు నిప్పటిరూపములు. 'యాన్ అని 'అనె' అని ప్రాచీనరూపములు. 'కూ' భాషయందు 'ఆను' అనునది దీనికి సమానార్థకమైనరూపము. 'మేము' అను నర్థ మున 'యామ్' అని 'ఆమ్' అని తమిళకన్నడములందుండగా కూయందు 'ఆము అని కలదు. 'నీవు' అనునర్థమున 'నీ' (త) నీను (క) ఈను (కూ) అనురూపములు గలవు. 'మీరు' అను నర్థమున నీర్ (త) నీవు (క) ఈరు (కూ), 'వాడు' అను నర్థ మున అవన్ (త) అవను (క) అవాను (కూ), 'వారు' అను

నర్థమున అవర్ (త) ఆవసు (క) అవారు (కూ) అను రూప ములు కలవు.

తెలుగునందు 'డు' ప్రత్యయమువలె 'కూ' భాషయందు 'ఱు' ఉపయోగపడును. బహువచనప్రత్యయము 'గా' యనునది. లావెంఱు' అని యనగా 'యువకుడు' అని యర్థము. ఇతర విభక్తులు వచ్చినప్పుడు లావేని (యువకుని); లావేనికి (యువ కునికి) మున్నగువిధముగా 'ఱు' ప్రత్యయము లోపించును. బహువచనమునందు లావెంగా (యువకులు), లావెంగాని (యువకులను); లావెంగానికి (యువకులకు) అను విధముగా రూపములుండును.

మొత్తముమీద ఈ భాష తెలుగు కన్నడములతో ఎక్కువ సామ్యమును కలిగియున్నది. సంఖ్యావాచకముల యందు గోండు భాషతోపాటు దీనిపై సైతము ఆర్యభాషల ప్రభావము కనిపించుచున్నది. ఇది యైదులక్షల ముప్పదివేల మందికి నిత్యవ్యవహారము నందున్న భాష.

ఓరావోను భాష : వంగదేశపు పశ్చిమభాగమునందును, దానికి సన్నిహితముగానున్న మధ్యప్రదేశమునందలి కొన్ని భాగములందును ఓరావోను భాష వాడుకయందున్నది. ఛోటా నాగపూరునందును, ఇసుగు పొరుగు జిల్లాలయందును మాటాడ బడు ఈ భాషకు 'కురుఖ్' అను పేరు గలదు 'ఓరావోలు' అన బడు ఈ తెగప్రజలు కొంకణ ప్రాంతమునుండి గోణనదీ తీరము వకు వచ్చి, అక్కడ స్థిరనివాస మేర్పరుచుకొని రని కొందఱి విశ్వాసము. ఆ ప్రాంతమునం దప్పటికే 'ముండా' కుటుంబ భాషలు వ్యాపించి యున్నవి.

గ్రియర్సను కురుఖ్ అను మాటను 'గ్రద్ద' అను నర్థము గల 'కఱుగు' అను పదము తో సామ్యమును సాధించి వ్యుత్పత్తి నూహించెను. అట్లే 'ఒరావో' అనుదానికి 'వ్యయపరుడు' అను నర్థముగల 'ఉరావూ' అను వార్యభాషాపదమునకును సామ్యమును సాధించి వ్యుత్పత్తి నూహించెను.

అస్మదర్థకము ఏకవచనమున 'ఏన్' బహువచనమున 'ఏమ్' అని యుండును. ఉభయార్థకము 'నామ్' అని యుండును. యుష్మదర్థకము నీన్ (ఏ) నీమ్ (బ) అనియు, ఆత్మార్థకము తాన్ (ఏ) తామ్ (బ) అనియునుండును. విభక్తులు ఏకవచన బహువచనరూపములు రెండింటిమీదను సమానముగనే చేరును. నాయొక్క అనునర్థమున 'ఎణ్ పై' మాయొక్క యను నర్థమున 'ఎమ్ పై' అనియు నుండును. యుష్మదర్థమునందు నిణ్ పై (ఏ) నిమ్ పై (బ) ఆత్మార్థమునందు తణ్ పై (ఏ) తమ్ పై (బ) అనియు రూపము లుండును.

'ఒండ్' 'ఒంటా' అనునవి ఒకటి యనునర్థమున 'ఎణ్డ్' అనునది రెండు అను నర్థమున 'మూన్డ్' అనునది మూడు అను నర్థమున, 'నాఖ్' అని నాలుగు అనునర్థమున వాడబడును ఈ తరువాతి అంకెలు ఆర్యభాషలనుండి ప్రవేశించినవి.

స్త్రీపురుషవాచకములకు 'అర్' అనియు అమహాత్తులకు 'గురి' అనియు బహువచనప్రత్యయము కలుగును. 'ఆలన్' అని యనగా 'పురుషుడు' అనియర్థము. బహువచనమున 'ఆలర్' అని యగును. 'ముక్కా' అని యనగా 'స్త్రీ' యని యర్థము. బహువచనమున 'ముక్కర్' అని యగును 'అల్లా' యని

యనగా 'కుక్క' యని యర్థము 'అల్లాగుఱి' అని యనగా 'కుక్కలు' అని యర్థము

హోడ్గ్సన్, కర్నల్ డాల్టన్ అనువారు కురుఖ్ భాషా పదపట్టికలను సంగ్రహించిరి. రివరెండ్ యఫ్ బాస్ అను నాయన ఈభాషకు వ్యాకరణమును రచించెను. రివరెండ్ ఓ. ప్లెక్ష్ రచించిన 'ఓరావొను వ్యాకరణ పరిచయము' అను గ్రంథమును, రివరెండ్ హాహ్న్ రచించిన 'కురుఖ్ వ్యాకరణము' అను గ్రంథమును అనేక విషయసంపన్నములై ఓరావొను భాషాస్వరూపమును గ్రహించుటకు మిక్కిలి తోడ్పడుచున్నవి. మొత్తముమీద ఈభాషను ఎనిమిది లక్షలమంది వ్యవహరించుచున్నారు.

రాజమహలు భాష : బీహారునందలి రాజమహలు కొండల కొండవారి భాషకు 'రాజమహలు' అనిపేరు. ఆప్రజలను 'మాలెరులు' అని పిలుచుటచేత భాషకు 'మాలెరుభాష' యనుపేరు కూడ కలిగినది. మాలెరులు తమభాషను 'మల్తో' యనియే చెప్పుకొందురు. దీనికి 'మాలెరులభాష' యని మాత్రమే యర్థము. 'మలెర్' అని యనగా 'మానవులు' అని యర్థము. గ్రియర్సను 'మలెర్' అను మాటకు 'మల' అను మాటతో సంబంధమును సూచించి 'కొండమనుష్యులు' అను నర్థమును సాధించెను. 'మాలెరులు' తమ్ముగురించి 'సౌరియా' తెగకు చెందినట్లు చెప్పుకొనుట కూడ కలదు.

'మలె' అను నేకవచనపదమునకు పైని రవర్ణముచేరి 'మలెర్' అనియై 'మనుష్యులు' అను నర్థము నిచ్చును. స్త్రీవాచకములపైని కూడ అదేప్రత్యయము చేరును. 'మల్నిత్'

అని యనగా 'స్త్రీ' యని యర్థము. 'మల్నిర్' అనియనగా 'స్త్రీలు' అని యర్థము.

అస్మదర్థమున ఏన్ (ఏ) ఏమ్ (బ) యుష్మదర్థమున సీన్ (ఏ) నీమ్ (బ) ఆత్మార్థమున తాని (ఏ) తామి (బ) అనియు రూపములుండును. 'మనము' అను నర్థమున 'నామ్' అను రూపముకూడ కలదు. ద్వితీయాది విభక్తులు ఏకవచన బహువచనములందు సమానముగానే యుండును. అయినను విభక్తి పరమగునప్పుడు పూర్వము నకారమున్న యెడల 'ఙ' వర్ణముగా నుచ్చరింపబడును. ఎఙ్గెన్ (నన్ను) ఎమెన్ (మమ్ము); నిఙ్గెన్ (నిన్ను) నిమెన్ (మిమ్ము); తఙ్గెన్ (తన్ను) తమెన్ (తమ్ము) అనువిధముగా రూపములుండును.

అంకెలయందు ఒర్ (ఒకటి), ఇవ్ (రెండు) అనునవి తప్ప తక్కినవన్నియు తిన్, చార్ మున్నగువిధముగా ఆర్య భాషలనుండి యిందు ప్రవేశించినవి పరిసరభాషయైన సంతాలీ ప్రభావము కూడ దీనిపై నెక్కువగా కలదు. ద్రావిడభాష లలో 'కురుఖ్'తో దీనికి ఎక్కువ సామ్యము కలదు.

మల్తోభాషకు సాహిత్యమును లిపియు లేవు. నాలుగు సువార్తలును, క్రైస్తవ గీతములును (Psalms), అపొస్తలుల కార్యములును ఈభాషలోనికి అనువదింపబడినవి. రోమను లిపి యుపయోగింపబడినది. డాల్టన్, హోడ్గ్సన్, కాంప్బెల్ మున్నగు వారికృషివలన నీభాషనుగురించి కొంత తెలియ వచ్చినది. రివరెండ్ కోల్ రాజమహాలుభాషలోని పాటలను సేకరించి ప్రకటించెను. స్వింటన్ రాజమహాలు మాటలను కొన్నింటిని పరిచయ మొనరించెను. రివరెండ్ ఎర్నెస్ట్ డ్రోజీ

'మల్తో భాషా పరిచయము' అను గ్రంథమును క్రీ. శ. 1884లో ప్రకటించెను. మొత్తముమీద ఈభాషను అరువదివేల మందికి పైగా మాటాడుచున్నారు.

ద్రావిడ భాషల పరస్పర సంబంధము

ఒకేభాష కాలక్రమమున వేర్వేఱు ప్రభావములకులోనై వేర్వేరు మాండలికములుగా మారినప్పటికిని మూలభాషతోడి సామ్యమును కలిగియే యుండుననుట సత్యము. ఆ మాండలిక ములే భిన్నదేశాలలో పురోగమించినప్పుడు భిన్నభాషలుగా పరిణమించును. ఒక భాషను మాటాడువారికి రెండవభాష యర్థము కాదు. అయినప్పటికిని సూక్ష్మముగా పరిశీలించిన యెడల, కొన్ని సామాన్యలక్షణములు తప్పక గోచరించును. ఆయాలక్షణములనుబట్టియే ఏకకుటుంబత్వమును నిర్ణయించుట జరుగుచుండును. ద్రావిడభాషలలోని అట్టి యేకత్వనిరూపకము లయిన లక్షణములను గుర్తింతము.

సంస్కృతమున లేని హ్రాస్వవక్రములు ద్రావిడ భాష లన్నింటియందును గలవు సంస్కృతమునందు క్వాచిత్కముగ నున్న టవర్గము ద్రావిడభాషలయందు మిక్కిలి విస్తృతముగ వినిపించును. కొందరి యుద్దేశమున ద్రావిడభాషలనుండియే మూర్ధన్యాక్షరములు సంస్కృతమునందు ప్రవేశించెను. కాని, యిది అత్యుక్తి యనిపించును. అత్యంత ప్రాచీనసారస్వత మగు ఋగ్వేదమునందే మూర్ధన్యముల ప్రయోగము కనిపించును. సంస్కృతమునందు కంటె ద్రావిడభాషలయందు వీని వాడుక యెక్కువ యనుట సమంజసము. శకట రేఫము ద్రావిడభాష లన్నింటియందును గలదు. దీని స్వరూప మేమాత్రమున

సంస్కృతభాషకు గాని, సంస్కృతజన్యములగు భాషలకు గాని, తెలియ దని చెప్పవచ్చును. 'ఱ' అను అక్షరము ద్రావిడ భాషలందు గలదు విష్ణుకుండినేంద్రవర్మ రామతీర్థ తామ్ర శాసనమునందు 'పఱకి' అనియు, రెండవ విక్రమేంద్రవర్మ చిక్కుళ్ళశాసనమునందు 'ఱెందులూర' అనియు ఱకారము వాడబడియున్నది. కాని, కాలక్రమమున తెలుగు కన్నడము లందు ఈ ఱకారము శకటరేఫముగా గాని, రకార డకార శకారములుగా గాని పరిణతి నొంది కనిపించుచున్నది 'శాటి తోంట' 'సోఱమహారాజుల్' మున్నగు శాసన ప్రయోగ ములకు సమానరూపములుగా 'శాడితోట' 'చోళమహారాజులు' మున్నగునవి కనిపించును. తమిళమలయాళములలో ఈ నాటి కిని ఱకారము యథాపూర్వకముగా వాడుకలో నున్నది.

వర్గయుక్తులు ద్రావిడభాష లన్నింటియందును లేవు తమిళమున ఈ నాటికిని యీస్థితి యిట్లే యున్నది. తెలుగు నందును మలయాళమునందును సంస్కృతపదముల వాడుక యెక్కువ యగుటవల్ల తత్సమశబ్దములందు వై యక్షరములు ప్రవేశించినవి. భిన్నవర్ణములు సంయోగముచెందుట దరిదాపు లేనట్లే చెప్పవచ్చును. కష్టము దుఃఖము మున్నగు పదములు తత్సమములు ఒక్కొక్కప్పుడు సంస్కృతపదములు తద్భవము లుగా మారునపుడు భాషాసంప్రదాయమున బట్టి మహాప్రాణము లను గోల్పోవును. భారము - బరువు; బుషభము - ఱిడబమ్.

రకారముతో ప్రారంభము లగు సంస్కృతపదములు ద్రావిడభాషలలో ఉచ్చారణసౌకర్యముకొరకు 'అ' వర్ణమును ముందు చేర్చుకొనును రథము - అరదము; రాజు - అరసన్.

హకారాదు లగు పదములు ద్రావిడభాషలకు స్వాభావికములు కావు కావున హకారోచ్చారణమును గోలోపవును. హడపము - అడపము; హరిదళము - అరిదళము.

ద్రావిడభాషలయందు ఒకే యక్షరమును పదాది నున్నచో పరుషముగను, పదమధ్యమున నున్నచో సరళముగను పలుకుదురు. ఈలక్షణము ఇప్పటికిని తమిళభాషయం దిట్లే యున్నది. తక్కిన భాషలలో రూపాంతరమున కనిపించుచున్నది. తెలుగు కన్నడములందు పదముమీది పరుషము గసడదవలలో నొక్కటిగా మారుట కిదియే హేతువు. కొన్ని యెడల పదము మీది పరుషము ద్విత్వమును పొంది, అట్లే నిలిచిపోవును.

రేఫద్విత్వమును టకార రకారసంయోగముగా పఠించుట ద్రావిడభాషాలక్షణము. తమిళమున ఈలక్షణ మిప్పటికిని గలదు. ద్రావిడలో రకారద్విత్వమే యున్నను, ఉచ్చారణమున 'ట్ర' యనియే యుండును. ఈలక్షణము తెలుగు, కన్నడము మున్నగు భాషలందు సామాన్యవిధానమున ఇప్పటికిని గోచరించును. కుఱు+ఉసురు = కుట్టుసురు అకారద్విత్వమునకు బదులు టకారద్విత్వము వచ్చుట ప్రాచీనలక్షణము.

నకార రకారసంయోగమును 'న్డ' యని ఉచ్చరించుట ద్రావిడభాషలందు కలదు. పుత్రున్డు, వచ్చువాన్డు మున్నగు శాసనప్రయోగమునుబట్టి యిట్టిస్థితి తెలుగునందు నైతము కల దని చెప్పనగును. తరువాతికాలమున రేఫము పోగా డకారోచ్చారణమే స్థిరపడియుండును - పుత్రుఁడు.

తత్సమములును, తద్భవములును పోగా మిగిలిన దేశ్య శబ్దములు ద్రావిడభాషలయందు పరస్పరసామ్యము కలిగి యుండును. కావున వీని కన్నింటికి మూలరూప మగు భాష యొకటి యుండవలయు ననియు, అదియే ప్రాచీన ద్రావిడ భాష యనియు ఊహించుట సమంజసముగా నుండును. దీనికి సంస్కృత ప్రాకృతములతో నేమాత్రమును సంబంధములేదు.

సంస్కృతమునందలి నామవిభక్తులు కేవలము ప్రత్యయములు. ద్రావిడభాషలందలి నామవిభక్తులు పదస్వరూపముతో నుండి యుండి, ప్రత్యయస్థితికి మారుచున్నవి. సంస్కృత వ్యాకరణ సంప్రదాయము ననుసరించి, వ్యాకర్తలు ద్రావిడ భాషలలో నైతము ఏడు విభక్తులను పరిగణించుచున్నను, నిజమునకు ద్రావిడభాషలందు ఇంత విస్తృతమైన విభక్తి ప్రణాళిక కానరాదు. దేశ్యశబ్దములు ప్రత్యయాదుల యావశ్యకము లేకుండగనే ప్రథమావిభక్తి రూపమున నుండుట ద్రావిడ భాషలలో మిక్కుటముగా కనిపించును.

ద్రావిడ భాషలకు సంస్కృతప్రాకృతములకంటె భిన్నమైన క్రియారూపప్రణాళిక కలదు. సంస్కృతతిజంతరూపమే ప్రాకృతమున వికృతినొంది వినిపించును. 'ఆజ్ఞాపయతి' యనునది 'ఆణవేది' యనియు 'నివేదయిష్యామి' అనునది 'ణివేదఇస్సమ్' అనియు ప్రాకృతమున నీవిధముగా రూపాంతరము నొందును. తెలుగు మున్నగు ద్రావిడభాషలందు క్రియాపదమునందు ప్రకృతి ప్రత్యయములును, ఇతరాగమములును స్పష్టముగా గోచరించును. ఇవన్నియు స్వతంత్రమైన యొక నియమము ననుసరించి వర్తించును. పదముపై మరొక

పదము చేరినట్లే, ధాతువుపై మరొక ధాతువు చేరి విశిష్టార్థ బోధక మగుట ద్రావిడభాషలలో ఎక్కువగా కనిపించును. ఈలక్షణమే వీనిని సంయోగాత్మక భాషల (Agglutinative languages) లో చేర్చుచున్నది కొనితెచ్చు, అందిచ్చు, పరు గెత్తు మున్నగు ఎన్నియో క్రియారూపములు క్రియాధాతు వుపై క్రియాధాతువు చేరగా ఏర్పడినవే.

ద్రావిడభాషలయందలి క్రియావిభక్తులు సర్వనామ రూపములే. వాడు, వారు, నీవు, మీరు నేను, మేము - వీని యందలి యవశిష్టము లగు 'డురువ్రురునుము' అనునవియే క్రియావిభక్తులుగా తెలుగున వాడుకలో గలవు ఇతర ద్రావిడభాషలందు కూడ ఇదే లక్షణము పాటింపబడుచున్నది. సంస్కృత ప్రాకృతములందలి క్రియావిభక్తులను సర్వనామ ములే యని సందేహించుటకు కూడ వీలు లేదు. సంస్కృత మున పది విధము లగు లకారములు గలవు, ద్రావిడభాషల యందు భూతభవిష్యద్వర్తమానములతోనే మొత్తము క్రియా ప్రణాళిక సాగిపోవును. ఇందలి విధానము మిక్కిలి ప్రాథమి కము, సంకుచితము అని స్పష్టముగా కనిపించును.

ద్రావిడభాషలలో క్రియాపదమే నామముగా కూడ వ్యవహరించుట యెక్కువగా కనిపించును అదుకు, బ్రదుకు, పలుకు, దుముకు మున్నగునవి నామక్రియలకు రెండింటికిని సమానముగనే యుండును. ఇట్టిది సంస్కృత ప్రాకృతము లందు కనిపించదు

సంస్కృతమునందు స్త్రీ పున్నపుంసకలింగము లని నామములను మూడు విధములుగా విభాగింతురు. లౌకికలింగ

విభాగముకంటె పారిభాషిక లింగ విభాగమే, సంస్కృత భాష యందు అనుసరింపబడుచున్నది. కాని యీ రెండు విధములగు విభాగమును ద్రావిడభాషాకుటుంబమునకు దవ్వుగనే యున్నది. కేవలము తత్సమశబ్దములనుగూర్చి విచారించునపుడు వ్యాకరణప్రక్రియాసౌలభ్యముకొరకు స్త్రీలింగసమము లని, పుంలింగసమము లని నపుంసకలింగసమము లని వాడుట కలదు. కాని దేశీయ మగు విభాగము వేరుగా గలదు తెలుగు నందలి నామములను అర్థము ననుసరించి రెండు విధములుగా విభాగింతురు- మహత్తులు అమహత్తులు. ఆరవమునందుకూడ ఇట్లే అర్థానుసారముగా ఉయర్‌తిణై, అ:ఱిణై యని రెండు విధములుగా విభాగము చేసిరి. కన్నడమునందు 'లింగము' అను పదమునే వాడినను విభాగము మాత్రము అర్థము ననుసరించియే జరిగినది.

సంస్కృతమునందు ఏకవచనము, ద్వివచనము, బహువచనము అని మూడు విధము లగు విభాగము కలదు. ప్రాకృతమునందే ద్వివచనము అంతరించిపోయినది. ద్రావిడభాష లందు ఏనాడును మూడు వచనము లున్నట్లు కనిపింపదు. మొదటినుండియు ఏకబహువచనములు రెండు మాత్రమే ద్రావిడభాషాకుటుంబమునందు కలవు. అస్మదర్థకము ద్రావిడ భాషలందు విచిత్రముగా కనిపించును. ఇతరభాషాకుటుంబము లం దెచ్చటను లేని ఉభయార్థబోధకము ద్రావిడభాషా కుటుంబవైశిష్ట్యమును నిరూపించును. 'నేను' ఏకవచనము, 'మేము' బహువచనము, 'మనము' ఉభయార్థబోధకము. వేదమునందే 'వయం' ఉభయార్థబోధక మని, కావున సంస్కృ

తమునందు కూడ ఈలక్షణము కల దని కొందరు వాదింతురు. 'వయం' అను పదమునకు మనము, మేము అను రెండర్థములను చెప్పవచ్చును. ఆంగ్లమునందలి 'We' అను పదమునకుకూడ ఈరెండర్థములను చెప్పవచ్చును. కాని, నిర్దిష్టముగా ఉభయార్థ మును నిరూపించు శబ్దము 'ఇండోఆర్యను' కుటుంబమునందు లేదు. ద్రావిడకుటుంబమునందు నిర్దిష్టముగా కలదు. బహు వచనమునందు నామమువకు 'కళ్' అని కాని 'గళ్' అని కాని చేర్పవలయును తెలుగునందు వానికి అవశిష్టరూప మగు 'లు' చేరును. ద్వితీయాది విభక్తులు బహువచనాంతశబ్దముపై, ఏకవచనాంతములపై వచ్చినట్లే వచ్చును. సంస్కృతమునందు ఏకవచన బహువచనములందు ప్రత్యయములలోనే భేద మున్నది. ద్రావిడభాషలలో అట్టి భేదము లేదు.

సంస్కృతమునందు సంబంధబోధక సర్వనామముల యుపయోగము విరివిగా కలదు. ప్రాకృతమునందును, నేటి యుత్తరహిందూస్థాన భాషలందును గూడ కలదు ద్రావిడ భాషలలో అట్టి వాక్యనిర్మాణము కన్పింపదు. అటువంటి సందర్భములందు ద్రావిడకుటుంబమున క్రియాజన్యవిశేషణ మును వాడుదురు. 'వచ్చినవాడు ఫల్గునుడు' అనుచో 'ఎవడు వచ్చెనో వాడు' అని యర్థము ఇటీవల సంస్కృతాంగ్లహిందీ ప్రభృతిభాషల ప్రభావమువల్ల ద్రావిడకుటుంబమునం దిట్టి ప్రయోగములు ప్రవేశించుచున్నవి. కాని ఈ యత్తదర్థక బోధకసర్వనామముల యుపయోగము ద్రావిడ కుటుంబమునకు స్వాభావికము కాదు.

ద్రావిడకుటుంబమునం దొకే పదము విశేషణముగను విశేష్యముగను కూడ వాడబడును. పులుపు కాయ; కాయ పులుపు; మాట, తీపి; తీపి మాట. సంఖ్యావాచకములు విశేషణ విశేష్యరూపములు రెండింట వ్యవహృతము లగును. సంస్కృతమునందలి సంఖ్యలకును, ద్రావిడకుటుంబసంఖ్యలకును సంబంధము లేదు. వెయ్యినుండి ఆపైని గల సంఖ్యలకు దేశ్యశబ్దములు లేవు; సంస్కృతమునుండి ఎరవు తెచ్చుకొన్న శబ్దములు మాత్రమే కలవు.

సంస్కృతమునందలి కృత్తద్ధితవిధానము క్లిష్టముగను, విస్తృతముగను గలదు. తెనుగుధాతువులకు తెనుగుప్రత్యయముల చేరికచే కృదంత తద్ధితాంతరూపములు స్వతంత్రముగా పర్వడును. ద్రావిడభాష లన్నింటియందును ఈవిషయమున సామ్యము కలదు. క్వాచిత్కముగ సంస్కృతప్రత్యయముల పోలిక కన్పించినను అది యేదో ఘుణాక్షరన్యాయమే కాని, సామ్యస్థాపకము కాజాలదు.

సంధివిధానమునందు సైతము ఆర్యభాషాకుటుంబమునకును, ద్రావిడభాషాకుటుంబమునకును వైషమ్యము గలదు. ద్రావిడభాషలందు పరరూపసంధి మాత్రమే కలదు. గుణవృద్ధి సవర్ణదీర్ఘాదిసంధులకు ద్రావిడభాషలందు తావు లేదు. తత్సమముల విషయమున మాత్రము వానిని వాడుట జరుగును సంధి లేనియెడల ద్రావిడభాష లన్నింటియందును యకారవకారములును, కొన్నియెడల నకారమును వచ్చుచుండును.

సుదీర్ఘసమాసములు ద్రావిడభాషలలో లేవు. సంస్కృ తానుకరణమున కొందరు చేసినను కృత్రిమములై, మరుగున పడిపోయినవి. ఇందు మాటకుప్రక్క మాటను చేర్చుటతోడనే సమాస మగును సంస్కృతమునందువలె, సామాసికవిధు లేమియు లేవు. వాక్యములు కూడ చిన్నవిగను, సూటిగను ఉండుట ద్రావిడభాషల లక్షణము వాక్యమునందలి పదములు కర్తృ, కర్మ, క్రియల క్రమములో నుండును కర్మార్థక ప్రయోగము సంస్కృతముతో పోల్చి చూచినప్పుడు, ద్రావిడ భాషలందు లే దనియే చెప్పవచ్చును

పైని పరిశీలించినట్లు ద్రావిడభాషలు పదసామగ్రిని బట్టియు, వ్యాకరణవిధానమునుబట్టియు కూడ, తమ వైశిష్ట్య మును నిరూపించుకొని, ఏకకుటుంబత్వమును స్థాపించుకొను చున్నవి. తెలుగు, మలయాళము మున్నగుభాషలను చూచి నప్పుడు తత్సమ పదబాహుళ్యమునుబట్టి సంస్కృతజన్యత్వ మును సమ్మతింపవలయు ననిపించును గాని, అంతకంటె స్థిర మును, వైశిష్ట్యబోధకము నైన వ్యాకరణాదినియమమును చూచినప్పుడు ద్రావిడభాషలు ఏకకుటుంబజన్యము లని, సంస్కృతభాషాకుటుంబమునకు చెంద వని నిశ్చితముగా చెప్పనగును.

ఆర్య ద్రావిడ భాషా సంబంధము

ద్రావిడభాషలు ఆర్యభాషలకంటె భిన్నమూలమన్న విష యము నిశ్చయముగా తేలిపోయినది. పద పరికరము వాక్య నిర్మాణము మున్నగు వంశములను ఒట్టి తద్భేదములను గమ నించుట సులభమే. కాని, పరస్పర సాన్నిహిత్యమువలన, ఇతర

చారిత్రక హేతువులవలన ఒక కుటుంబమునకు చెందిన భాషల ప్రభావము మరొక కుటుంబమునకు చెందిన భాషలపైని పడుటయు సహజమే అయినప్పటికిని సాదృశ్యముతోపాటు, విశిష్టతను విభిన్నతను నిరూపించు నంశములను గూడ గమనింపగలిగినప్పు డేభాష యేకుటుంబమునకు చెందినదో నిర్ధారించుకొనవచ్చును. ఇంత విశాలమయిన సృష్టిలో ఒక వ్యక్తిని పోలియొకవ్యక్తి యుండవచ్చును అంతమాత్రమున నిరువురకు బంధుత్వము నంటగట్టవలసిన యవసరము లేదు. ఇతరసాక్ష్యములు కూడ సహకరించినప్పుడే అట్టి నిర్ణయము చేయ వలసి పడును భాషల విషయముకూడ అట్టిదే

ద్రావిడభాషలు ఆర్యభాషలు ప్రక్క- ప్రక్కగా నుండి యిరుగు పొరుగు భాషలై యెంతోకాలముగా జీవించుచున్నవి. అట్టి యెడల ఏమాత్రమును ఇచ్చిపుచ్చుకోనుటలు లేకుండ నుండుట సాధ్యముకాదు. తెలుగుభాషను వ్యాకర్తలు నాలుగు విధములుగా విభాగించిరి. అందు తత్సమ తద్భవములు రెండును ఆర్యభాషాసంపర్కమువలన తెలుగులో కలిగినవే. దేశ్యములు మాత్రము సహజసిద్ధములు. తెలుగు నందలి దేశ్యములతో సదృశములయిన రూపములు తమిళ మలయాళ కర్ణాటాది భాషలలో కనిపించును కావున ఇవి ద్రావిడ కుటుంబమునకు చెందిన పదము లని నిర్ణయించుట కాక్షేపము లేదు. అట్లే తత్సమములు సంస్కృత ప్రాకృతములనుండి యథాతథముగా వచ్చినవనియు, తద్భవములుమాత్రము కొన్ని మార్పులకు లోనై వచ్చినవనియు నిర్ణయించుట కాక్షేపము లేదు. ఇట్లు సంస్కృత ప్రాకృతములనుండి వచ్చిన పదసామగ్రి

తెలుగు మలయాళములలో మిక్కిలి యధికముగా కలదు. కన్నడమునందు కొంతవరకు కలదు తమిళము చాల స్వల్పముగా మాత్రమే ఆర్యభాషాపదములను గ్రహించినది. ఛందో వ్యాకరణాలంకారాది విషయములలో కూడ సంస్కృతము ద్రావిడభాషలపైని తనప్రభావమును చూపినమాట వాస్తవము.

ద్రావిడభాషలుకూడ తమ ప్రభావమును ఆర్యభాషలపైని ప్రసరింపజేసి యుండునని భావించుట సమంజసము. దీనికి నిదర్శనముగా కొన్ని లక్షణములు గోచరించుచునే యున్నవి. ఇతరములయిన ఇండోయూరోపియను భాషలలో నేమాత్రమును కనిపింపక, సంస్కృతమునందును ఉత్తరహిందూస్థాన భాషలయందు మాత్రమే కొన్ని ప్రత్యేక లక్షణములు కనిపించుచున్నయెడల, వానికి పరిసరభాషలప్రభావమే కారణమని యంగీకరింపక తప్పదు పరిసర భాషలయందు ఆయాలక్షణములు పూర్వసిద్ధములై యున్నప్పుడు ఆ సిద్ధాంతమునకు మరింత బలము చేకూరును.

సంస్కృతమునందు విభక్తి ప్రత్యయములను శబ్దములపై చేర్చి రామాయ, రామస్య మున్నగు విధముగా రూపములను గావించుట పరిపాటి. ఉత్తరహిందూస్థానభాషల యందు ప్రథమావిభక్తిరూపముపైనే యితరవిభక్తులు కాని, విభక్తితుల్యములైన శబ్దములుగాని చేరుటకనిపించును. ప్రథమావిభక్తి యందు 'రామ్' అని యున్నరూపము విభక్త్యంగమై యితర రూపములయందు రామ్-సే, రామ్-కేలియే, రామ్-కా మున్నగువిధముగా నగును ద్రావిడభాషలయందును ప్రథమైకవచనరూపమే విభక్త్యంగమై యుండుట అత్యధికముగా కని

పించు లక్షణము. తోట, తోటలో, తోటనుండి, తోటయందు-మున్నగువిధముగా మున్నరూపములనుబట్టి ప్రథమైకవచన రూపము విభక్త్యంగమై యుండుట స్పష్టము.

సంస్కృతమునందు వామవిభక్తులు వచనమునుబట్టి మారుచుండును. ఏకవచనమున 'రామస్య' అన్న షష్ఠీరూపము ద్వివచనమున 'రామయోః' అనియు, బహువచనమున 'రామాణాం' అనియునుండును. అనగా ఒకే విభక్తిని సూచింపవలసినప్పుడు సంస్కృతము ఏకవచనమున నొక ప్రత్యయము, ద్వివచనమున మరొక ప్రత్యయము, బహువచనమున నింకొక ప్రత్యయము వచ్చుట జరుగుచున్నది. ఉత్తరహిందూస్థాన భాషలు మూడునుండి వచనములను రెండింటికి తగ్గించుకొన్నవి. ఒకే ప్రత్యయమును ఏకవచనరూపములపైని, బహువచనరూపములపైని సమానముగానే చేర్చుట మొదలు పెట్టినవి. 'రామ్‌కో' అని యన్నప్పుడు 'రామ్' అను ప్రథమైక వచనముపై కో అను ప్రత్యయము చేరినది. బహుత్వమునందు అదే ప్రత్యయము 'రామోం కో' అని బహుత్వరూపముపై చేరును. తెలుగునందు 'తోటకు' అని యన్నప్పుడు ఏకవచనరూపముపై 'కు' ప్రత్యయము చేరినది. 'తోటలకు' అని యన్నప్పుడు అదే ప్రత్యయము బహువచనరూపముపై చేరినది

సంస్కృతమునందు ఉభయార్థకమైన అస్మదర్థకము ప్రత్యేకముగా లేదు. 'వయమ్' అని యన్నప్పుడు 'మేము' అని శ్రోతను విడిచిపెట్టియు 'మనము' అని శ్రోతను కలుపుకొనియు కూడ అర్థము చెప్పవచ్చును. కేవలము 'మనము' అనియే చెప్పవలయుననన్న సంస్కృతమునందు పదము కని

పింపదు. తజ్జన్యములయిన హిందీ మున్నగుభాషలయందు కూడ అట్టిది యుండుట కవకాశములేదు. కాని ద్రావిడభాషల సంప ర్కమువలన ఉత్తరాది భాషలలో కొన్నింటియందు ఈ ప్రత్యేక ప్రయోగము స్థానమును సంపాదించుకొన్నది మధ్యప్రదేశము నందు 'హమ్ గయే థే' అనియు 'అపన్ గయే థే' అనియు రెండురకముల యుపయోగము కలదు. మొదటి వాక్యమునకు 'మేము వెళ్ళితిమి' అని యర్థము, రెండవ వాక్యమునకు 'మనము వెళ్లితిమి' అని యర్థము గుజరాతీ భాషయందు 'అమే గయా వాతా' అని బహుత్వమునందు 'అపణే గయా వాతా' అని ఉభయార్థకమునందు వాడుదురు ఇట్టివాడుక ద్రావిడభాషల నుండియే ఆయాభాషలు నేర్చుకొనియుండును.

సంస్కృతమునందలి సమాపక క్రియలవలెగాక, ఉత్తర హిందూస్థానభాషలు కృదంతరూపములపై అనుబంధములను తెచ్చి సమాపక క్రియలను సాధించుట కొంచెముగా కలదు. సంస్కృతమునందు కరోతి, అకరోత్, క్రియతే మున్నగువిధ ముగా సమాపకక్రియలు గలవు. ఉత్తరాది భాషలయందు 'భూ' ధాతు నిష్పన్నమయిన 'భవతి' అనురూపమునకు పరి ణామములయిన హో, హై మున్నగురూపములను క్రియా పదములుగా వాడుట కలదు. కర్తేహో, కర్తాహై మున్నగు విధముగా రూపము లుండును వీనికిని ద్రావిడభాషా రూప ములకును సంబంధము లేదు. కర్నా హువా, కర్నా పడా, కర్నా చాహియే మున్నగు విధములయిన రూపములకును ద్రావిడభాషా రూపములకును సంబంధము గలదు. 'కర్నా' అనునది 'చేయుట' యను వర్థముననున్న భావార్థకరూపము,

ఇట్టి యీ రూపముపై వేరొక అనుబంధమును చేర్చి సమాపక క్రియలను సాధించుట యిందు జరిగెను. ద్రావిడభాషలయందు చేయుట జరిగెను, చేయుట యయ్యెను, చేయుట తప్పదు మున్నగు విధముగా ప్రయోగించుట ప్రచురముగా కలదు. ఇదే కాక 'చేయన్' మున్నగు నుజ్యంతములు కూడ భావార్థమునే తెలుపును. కావున ఉత్తరాదిభాషలయందలి యీప్రయోగము నకు ద్రావిడభాషాప్రభావమే కారణము

వాక్యప్రయోగమునందును ద్రావిడభాషాప్రభావము ఆర్యభాషలపై కనిపించును ద్రావిడభాషలయందు కర్త, కర్మ, క్రియ వరుసలో నుండును. కర్తకు సంబంధించిన విశేషణములు కర్తకు ముందును, కర్మకు సంబంధించిన విశేషణములు కర్మకు ముందును, క్రియకు సంబంధించిన విశేషణములు క్రియకు ముందును ప్రయుక్తము లగును వాక్యమునం దసమాపక క్రియ లెన్నియున్నను, అవి యన్నియు పూర్వమందే ప్రయుక్తములై, చివరకు సమాపక క్రియతో వాక్యము ముగియవలయును అనగా అనుబంధవాక్యకము(Subordinate Clause) లెన్నియున్నను, ప్రధాన వాక్యకము (Principal Clause) తుదినే రావలయు ననియర్థము. సంస్కృతమునం దిట్టి నియమము లేదు. కొందరయభిప్రాయమును బట్టిచూడగా సంస్కృతముకూడ ద్రావిడభాషాప్రభావమునకు లోనగుటచేతనే కర్త కర్మ క్రియ వరుసలో వాక్యనిర్మాణము జరుగుచున్నది. పూర్వవచన కావ్యములందు క్రియయే ముందుగా ప్రయుక్తమగుట ప్రచురముగా కనుపటును ఆంగ్లాది భాషలయందు కర్త క్రియ కర్మ వరుసలో వాక్యనిర్మాణము జరుగును. అదియే ఆర్య

భాషా పద్ధతి అయినను ద్రావిడభాషలతోడి సంపర్కమువలన సంస్కృతమునందును, ఉత్తరాది భాషలయందును వాక్యక్రమమున మార్పు కలిగెను అట్లే అనుబంధవాక్యములు ముందుగాను ప్రధానవాక్యము వెనుకగాను ప్రయుక్తమగు పరిపాటి కూడ కలిగెను

వ్యాకరణ విషయమునందు మాత్రమే కాక పదసామగ్రియందును ఆర్యభాషాకుటుంబము ద్రావిడభాషకు ఋణపడియున్నది. డా॥ కాల్డ్వెలు సంస్కృతమునందలి పెక్కువదములను చూపి ద్రావిడ భాషలనుండియే యవి సంస్కృతములో ప్రవేశించి యుండునని యభిప్రాయపడెను. అవి ఆర్యభాషా పదములే యైనచో సంస్కృతములో మాత్రమే కాక, యిత రార్యభాషలలోకూడ ఉండవలయును. పాశ్చాత్యములయిన ఆర్యభాషలయందు కనిపింపక, సంస్కృతమునందు మాత్రమే యున్న ఆపదములకు ద్రావిడభాషలే యాకరములై యుండునని యాయన భావము. అక్కా, అత్తా, అటవీ, అంబా కటుక, కలా, కుటి కూల, మీన, నీర, నానా, పట్టన - మున్నగు పెక్కు శబ్దములను ఆయన చూపెను. వీనినిగూర్చి యిదమిత్థ మని తేల్చిచెప్పుట కవకాశము చాలదు.

ఇంకొక్క విషయము డా॥ సునీతి కుమార చటర్జీ మున్నగు వారు ద్రావిడభాషల ప్రభావమువల్లనే ఆర్యభాషలయందు పెమార్పులు కలిగెనని భావించుచుండగా డా॥ కాల్డ్వెలు మరొక మార్గమును పట్టియుండెను. కేవలద్రావిడ భాషలవలన ఆర్యభాషలలో ఈమార్పులు కలుగలేదనియు, ఈరెండు కుటుంబములును విడిపోవుటకు పూర్వము సిథియను

కుటుంబమునకు చెందికాని, సిథియనుకుటుంబ ప్రభావమునకు లోంగి కాని యుండెననియు, అందువల్లనే ఆ సామ్యము కనిపించుచున్నదనియు ఆయన యభిప్రాయము

సిథియను ద్రావిడ భాషా సంబంధము

డా॥ కాల్డ్వెలు ద్రావిడభాషాకుటుంబమునకు ఆర్యభాషాకుటుంబముతో నున్న భేదములను గుర్తించినట్లే యితరభాషాకుటుంబములతో నున్న సామ్యములను సైతము గుర్తించుటకు యత్నించెను. అట్టి యత్నమునందు ద్రావిడభాషలకును సిథియను భాషలకును సంబంధము కలదని నిశ్చయించెను. ఈ సిథియనుభాషలను కార్తారు, ఫిన్నిషు అల్టాయికు, మంగోలియను, తుంగీనియను మున్నగు వేళ్ళతో పిలుచుట కూడ కలదు. ఏదో ఒక్క భాషను మాత్రమే సూచించు ఆ వేళ్ళను కాక, మొత్తము కుటుంబమున కంతటికి 'సిథియను' అని వాడుట సముచితముగా నుండునని కాల్డ్వెలు నిర్ణయము.

ఇంతకుముందే 'రాస్మస్ రాస్కు' ద్రావిడభాషలకు సిథియను భాషాసంబంధమును సూచించియుండెను. 'ప్రిచర్డు' అను నాయన ఈ సంబంధమువిషయమున ఒక నిర్ణయము చేయవలయు ననియాలించెను 'ఎడ్కిన్సు' అను నాయన 'China's Place in Philology' అను గ్రంథమునందు సిథియనుభాషల సాహిత్యమును, వానికి ద్రావిడభాషలతో గల సామ్యమును బలపరిచెను ముఖ్యముగా ద్రావిడభాషలకును సిథియనుకుటుంబమునందలి మంగోలియను భాషకును పోలికలు స్పష్టముగా కనిపించుచున్నవి. ఎడ్కిన్సు "భాషాకుటుంబములుగా వేరొకొనబడుచున్నవి ప్రాచీనభాషకు మాండలికములు మాత్రమే" అన్న

నిర్ణయమునకు వచ్చెను. డా॥ కాల్డ్వెలు మధ్యాసియా యందు ద్రావిడులును ఆర్యులును కలిసియుండి రనియు, తరువాత వారు విడిపోయి యుందురనియు, కొన్ని ద్రావిడభాషాలక్షణ ములు ఆర్యభాషలలో కనిపించుటకు ఆ ప్రాచీనసంపర్కమే కారణమనియు భావించెను. అదే సమయమున సిథియను భాషలు మధ్యాసియాయందు వ్యాప్తినొందియుండుటచే వాని లక్షణము లీభాషలకు సంక్రమించియుండునని ఆయన యభిప్రాయము. ద్రావిడ భాషలను సిథియనుభాషా జన్యములుగా కాకపోయినను సామ్యముగల భాషలుగా అంగీకరింపవలయునని ఆయన యభిలాష.

కాల్డ్వెలు తన యభిప్రాయమున కుపబలకముగా బెహిస్తను ఫలకముల విషయమును ప్రస్తావించెను పశ్చిమపు మెదియాయందలి 'బెహిస్తను' అనికాని 'బఘిస్తాను' అని కాని అనబడు ప్రదేశమునందు 'దెరయస్ హిస్తాస్పిస్' అనువాని రాజకీయజీవితమునకు సంబంధించిన కొన్ని శాసనములు లభించినవి. అవి ప్రాచీన పారశీకమునందు, బాబిలోనియను భాష యందును, సిథియను భాషయందును రచింపబడియుండెను. సిథియనుభాషాశాసనముల యనువాదములనుబట్టి కాల్డ్వెలు ద్రావిడ భాషలతో వానికున్న సామ్యముల నీక్రిందివిధముగా చూపెను.

1. ఫలకములయందు ట, డ, ణ అను మూర్ధన్యాక్షర ములు గలవు. అవి సంస్కృతములోకూడ నున్నను ద్రావిడ భాషాసంపర్కమువల్లనే కలిగినవి.

2. తమిళములో వలెనే ఫలకభాషయందును ఒకే వర్ణము పదాదినున్నప్పుడు పరుషముగను, కాని యప్పుడు సరళముగను పలుకబడును.

3 ఫలకభాషయందు సంబంధార్థమున న, నిన, ఇన్న అను ప్రత్యయములు చేరుచున్నవి. తెలుగునందు ని అనియు; గోండు, బ్రాహుయీ భాషలయందు న, అ అనియు, అరవమున ఇన్ అనియు నున్న ప్రత్యయములలో ఆ పోలికలు కనిపించును.

4. ఫలకభాషయందు చతుర్థి 'ఇక్కి' అనియు 'ఇక్క' అనియు నుండును. ద్రావిడభాషలలోని కు, కి క అనువానితో వానికి సామ్యము కలదు.

5 ఫలకభాషయందు ఉన్, ఇన్, న్ అనునవి చేరగా సర్వనామముల ద్వితీయావిభక్తిరూపము లేర్పడును. తెలుగునందలి ను, ని అనునవియు కన్నడమునందలి అమ్, అన్ను అనునవియు సామ్యమును సూచించుచున్నవి.

6. ఫలకభాషయందు ఒకటి యను నర్థమున 'కిర్' అను శబ్దమొక్కటే కలదు సంఖ్యావిశేషణముగా ర ఱ్ర అనునవి కనిపించుచున్నవి. తమిళమునందలి 'ఒర్' కూభాషయందలి 'ర' అనువానితో సామ్యముగలదు. ఫలకములయందలి సంఖ్యావాచకములు 'ఇమ్' ప్రత్యయాంతములుకాగా తమిళమునందు 'ఆమ్' ప్రత్యయాంతములై యుండును.

7. ఫలకములయందలి యుష్మదర్థక సర్వనామము 'నీ' అనునది. ద్వితీయయందును విభక్త్యంగముగను 'నిన్' అని కలదు. ద్రావిడభాషలతో పోలిక స్పష్టము

8. సంబంధార్థిక విశేషణమును, సంబంధార్థక సర్వనామమును కూడ ఫలకభాషయందు కలవు. సంబంధమును సూచించు ప్రత్యయముతో ద్రావిడభాషలకు సామ్యము లేదు కాని అట్టివిశేషణమును సాధించుటయందు సామ్యము కలదు.

9 వ్యతిరేక విధియందు, నిషేధమునందు 'ఇన్ని' అని ఫలకభాషయందు కలదు. 'మిన్ని' యని గోండుభాషలోనున్న రూపముతో దీనికి సామ్యము కలదు

కాల్డ్వెలు చూపిన యీ తొమ్మిదంశములను పరిశీలించుట యవసరము. మొదటి రెండును ఉచ్చారణ విషయమునకు సంబంధించినవి. ప్రాచీనశాసనలిపిని బట్టి ఉచ్చారణమును నిర్ణయించుటకు వీలుకాదు. లిపియందలి యొకవర్ణము ఒకచోట ఒక ధ్వనిని మరొకచోట మరొక ధ్వనిని గలిగియుండెనని యిత రాధారము లేమియు లేకుండ నిర్ణయించుట పొసగదు. మూడు నాలుగంశముల సామ్యము నంగీకరింపవచ్చును. ఐదవయంశము నందు తెలుగుతో సామ్యము నంగీకరింపవచ్చును. కన్నడము నందలి 'అమ్' ఫలకభాషతో సామ్యమును చూపుటలేదు. 'అమ్న' అనునది నవీనకర్ణాట రూపము. కావున దీనికి క్రీస్తు పూర్వపుభాషతో పోలికనూ సాధింపరాదు ఏడవయంశమున పోలిక కలదు. ఎనిమిదవయంశమునందు సంబంధార్థక విశేషణ ముండుట యొక్కటియే పోలిక. సాధించు ప్రత్యయము

ఒక్కటికాదు. కాక యిట్టిది పారశీకమునుండి ఫలకభాషలో చేరియుండునని 'నోరిస్' అను వాని యభిప్రాయము. కావున దీనిని ద్రావిడభాషాసామ్యముగా అంగీకరింపవలసిన యవసరము లేదు తొమ్మిదవ యంశమున ఒక్క గోండుభాషయందు తప్ప తమిళాదిప్రధాన ద్రావిడభాషల యందు పోలికలేదు.

ఏకకుటుంబత్వమును నిర్ణయించుటకు సంఖ్యావాచకములు ప్రధానముగా పరిగణింపదగినవి. వై వానిలో ఆరవ యంశము ఒక్క సంఖ్యావాచకమునే చూపుచున్నది. దానికి ద్రావిడకుటుంబముతో సంబంధము లేనేలేదు.

కాల్డ్వెలు వైనిచూపిన యంశములేవియు ఏకకుటుంబత్వము గాని, జన్యజనక సంబంధముగాని, గరిష్ఠసాన్నిహిత్యము గాని సాధింపదగినవి కావు వైగా కాల్డ్వెలు వై యంశములను సిథియను భాషాశాసనములను బట్టి కాక, వాని యనువాదములను బట్టి వ్రాసినట్లు తానే చెప్పుకొనెను. సిథియను భాషలకును ద్రావిడభాషలకును క్రియావిధానమునందు ఏ మాత్రమును పోలిక లేదన్న సంగతిని కూడ కాల్డ్వెలు తానే చెప్పెను. వ్యాకరణాదులయందు సిథియను భాషలకు ఆర్యభాషలతో వలెనే, ద్రావిడభాషలతోను కొన్ని పోలికలున్నట్లు చెప్పెను.

సంస్కృతభాషతోగల భిన్నత్వమును నిరూపించుటకై డా॥ కాల్డ్వెలు ద్రావిడభాషాలక్షణముల నొకచోట క్రోడీకరించి, ఆ లక్షణములు సిథియనుభాషలోనైతము కనిపించుచున్నవని వేరొక్కనెను. ఆ లక్షణములను మ్నూలముగా గమనింతము.

1. ద్రావిడభాషలయందు జడవాచకములును, తిర్యగ్వాచకములును నపుంసకలింగములుగా భావింపబడును. 2. అన్యార్థక సర్వనామమునకు మాత్రమే స్త్రీపురుష విభేదము కలదు. 3. సర్వనామప్రత్యయములను పరమందు చేర్చుటచేత ప్రాణివాచక సూచకములగు విశేషణము లేర్పడును. 4. ప్రథమ పురుషక్రియ సర్వనామావిష్టములచేరికనుబట్టి ఏకవచనమునందు మూడు విధములుగను బహువచనమునందు రెండు విధములుగా నగును. 5 కొన్ని నపుంసకార్థముగల పదములకు ముందు స్త్రీపురుష సూచకములయిన విడిశబ్దములు చేర్పబడును. అప్పుడుకూడ క్రియ నపుంసక శబ్దముతోనే అన్వయించును.

6. ద్రావిడ పదములపైని విభక్త్యర్థమును తెల్పుచు, వేర్వేరు పదములుకాని పదాంశములుకాని చేరును. సంస్కృతమునందున్నట్లు ప్రత్యయము లిక్కడ లేవు. ఏకవచనరూపములపైని చేరినట్లే, బహువచనరూపములపైనికూడ అవేపదములు చేరును.

7. సంస్కృతము పూర్వప్రత్యయములను ఉపయోగించుచోట్ల ద్రావిడభాషలు కొన్ని యనుబంధములను పరమందు చేర్చును. ఈ యనుబంధములు కూడ ప్రత్యేక భాషాభాగము పకు చెందక గుణమును గాని సంబంధమునుగాని సూచించు నామవాచకములై యుండును 8 క్రియావిశేషణములన్నియు వామవాచకములు కాని కృదంతములు కాని భావార్థకములు కాని అయియుండును. అవి క్రియలకు పూర్వమందే ప్రయుక్తములగును. 9. ద్రావిడభాషలయందలి విశేషణములకు విభక్తి

యోగావ్యుత్పత్తి లేదు. విశేష్యములకు ముందుగా వాడబడినప్పుడు ఏ విభక్తినిగాని, యితరాగమమునుగాని గ్రహింపదు. అటుపిమ్మట ప్రత్యేకముగా ప్రయోగింపబడినపుడు విభక్తులను, ఆగమాదులను గ్రహించును 10 వీలయినప్పుడెల్ల ద్రావిడ భాషలు క్రియాజన్యవిశేషణములను వాడును.

11. అస్మదర్థక సర్వనామము బహువచనమున శ్రోతను కలుపుకొని యొకటి శ్రోతను కలుపుకొనకుండ ఒకటి - రెండువిధములుగా నుండును.

12. సముచ్చయార్థకపదములకు బదులుగా ద్రావిడ భాషలు వర్ణములమూలమున సముచ్చయార్థమును సాధించును.

13 భావార్థక క్రియలు, నిషేధార్థక క్రియలు ద్రావిడ భాషలలో వేర్వేరుగా రూపొందును.

14. యత్తదర్థక సర్వనామములను కాక, క్రియాజన్య విశేషణములను వాడుట ద్రావిడ భాషలలో సంప్రదాయము. యత్తదర్థక సర్వనామములు ద్రావిడభాషలలో కనిపింపవు.

15. విశేషణము ముందుగాను విశేష్యము వెనుకగాను వాడబడుట ద్రావిడభాషలయందలి లక్షణము. అట్లే వాక్యమున కర్తముందు క్రియ చివర నుండును

పైని చూపిన లక్షణములన్నియు సిథియనుభాషలలో కలవని డాక్టర్వెలు మూకయుమ్మడిగా తెలిపెను. ఏయొక్క లక్షణమునకును లక్ష్యము చూపలేదు. కావున ఔనని కాని కాదని కాని నిర్ణయించుటకు వీలు కలుగదు.

కాల్డ్వెలు చూపిన సిథియను భాషాకుటుంబమును భాషాశాస్త్రజ్ఞు లనేకులు ఏకకుటుంబముగా నంగీకరించుట లేదు.

మొట్టమొదట భాషాశాస్త్రజ్ఞులు ఇండోయూరోపియను కుటుంబమునందును సెమిటిక్ కుటుంబమునందును చేరని భాషలన్నింటిని చేర్చి తురేనియను కుటుంబ మని పేరు పెట్టిరి. కాని క్రమక్రమముగా అందుండి పెక్కు భాషలను వేరుపరుచుట యావశ్యకమయ్యెను. అట్లాంటిక్ మహాసముద్రమునుండి ఒఖోటస్కు సముద్రము వరకును, మధ్యధరా సముద్రము వరకును వ్యాపించియున్న భాషలను ఊరల్ - ఆల్టాయిక్ కుటుంబముగా పరిగణించుచున్నారు. ఇప్పటికిని ఒక కుటుంబముగా పరిగణింప దగిన లక్షణ సామ్యము పై భాషలకు కనిపించుటలేదు పరమందు ప్రత్యయములను కలుపుకొనుట సమస్వరత యను రెండు లక్షణములు తుర్కీ మున్నగు భాషలయందు ప్రధాన లక్షణములై కనిపించును ద్రావిడ భాషలు ప్రధానముగా సంయోగాత్మక భాషలు. సిథియను కుటుంబమునకు చెందిన భాషలు వివిధ లక్షణములను సూచించునవియై యున్నవి

భాషాశాస్త్రజ్ఞులు పెక్కురు సిథియను వాదము నంగీకరింపలేదు. ఆవాదము పరాస్తమైనదని తెల్పి గ్రియర్సను తన ప్రమోదమును ప్రకటించెను. కాడ్వెలు చెప్పినట్లు ద్రావిడ భాషలకు దూరప్రాంతము లందలి యితర భాషలతోకూడ కొంత సామ్యము కనిపింప వచ్చును. దానిని కేవలము కాకతాళీయముగనే గ్రహింపవలసి యుండును. ఇతర భాషలతో ద్రావిడ భాషల సంబంధము నంగీకరింపనియట్లే సిథియను భాషలతోకూడ నంగీకరింపకుండుట శ్రేయస్సు.

మూలద్రావిడ భాష

ఈనాడు వ్యవహారమున నున్న తమిళాది భాషలను సోదరభాషలుగా ఒకే కుటుంబమునకు చెందినభాషలుగా పరిగణించుచున్నాము. ఇవి సోదరభాషలైనప్పుడు వీనికి మూలమయిన భాష యొకటి యుండవలయుననన్నది యెవరికైన స్ఫురింపవలసినదే ఆ భాషయేది? దాని స్వరూపమెట్లుండును? అను ప్రశ్నలు కూడ కలుగవలసినదే. దానిని గురించి యోచించుటకు ముందు ఒక విషయమును చూతము.

ఒక కుటుంబమునందున్న యన్నదమ్ములు తమభాగములను కాము పంచుకొని వేరుపడుట వలన వేర్వేరు కుటుంబములు వెలయును అటుకాక కుటుంబమునందలి వ్యక్తులు కారణాంతరములవల్ల వేరువేరు ప్రాంతములకు వెళ్లి స్థిరపడవలసి వచ్చును, అప్పుడును వేర్వేరు కుటుంబములు వెలయును. ఈరెండు పద్ధతులలో భాషలు మొదటి పద్ధతిని కాక, రెండవ పద్ధతినే యనుసరించుననుట వాస్తవము మొదటి పద్ధతియందు ఒకకుటుంబము విచ్ఛిత్తినొంది ఏకకాలమున వేర్వేరుకుటుంబములు తలయెత్తును. రెండవపద్ధతియందు ప్రధానకుటుంబము విచ్ఛిత్తినొందదు అది యున్నది యుండగా, అందలి వ్యక్తులు కొందరు ఒక కుటుంబము నేర్పరుచు కొందురు, కొంతకాలము పోయిన పిమ్మట మరికొందరు వ్యక్తులు వేరుపడి మరొకకుటుంబము నేర్పరుచు కొందురు. ఇట్లే ఒక భాషను మాటలాడు జనులలోనుండి కొందరు వేరుపడి దూరప్రాంతములకు పోయి, ఆహారాద్యన్వేషణ పరాయణులై అక్కడ స్థిరపడి పోవుదురు. మరికొంతకాల మగుసరికి మొదటి స్థానమునందలి కొందరు

మరల వేరువడి మరొకచోట స్థిరపడుదురు. ఇట్లు జరుగగా జరుగగా వేర్వేరు ప్రభావముల వాకిడివలన వారు మాటలాడు భాషలయందును, ఆచారవ్యవహారములందును కొన్ని మార్పులు కలుగవచ్చును. పరిశీలనముచేసి చూచినప్పుడు వారిలో నున్న సాధారణ లక్షణములు గోచరింప వచ్చును, తమిళాది భాషలు అట్టి సాధారణ లక్షణములను కలిగి ఏకకుటుంబమునకు చెందిన సోదరభాషలని యీవరకే మనము సిద్ధాంతీకరించుకొంటిమి.

ఈ సిద్ధాంతము నాధారముగా చేసికొని మూలభాష నుండి మొట్టమొదట విడివడిన భాష యేది యను విషయమును నిర్ధారింపవలయును డా॥ కాల్డ్వెలు యొక్క యభిప్రాయమును బట్టి తమిళభాషయే మూలద్రావిడభాషనుండి మునుముందుగా విడివడినభాష శ్రీ కొమర్రాజు లక్ష్మణరావు తమిళముకంటె నితరభాషలే మూలద్రావిడ భాషాలక్షణముల నెక్కువగా కనబరుచు చున్నవని యభిప్రాయపడెను. డా॥ గ్రియర్సను తమిళమే మొట్టమొదట విడివడిన ద్రావిడ భాష యని యనుటను వ్యతిరేకించెను. టటిక్, యూల్ఫ్బ్లాక్ మున్నగు పాశ్చాత్యభాషాశాస్త్రజ్ఞులు నాగరకభాషలలో కంటె, అనాగరక భాషలయిన గోండి మున్నగు వానియందే ప్రాచీనభాషా లక్షణము లెక్కువగా నుండునని నిర్ధేశించిరి. ఇట్లు భిన్నభిన్న వాదములకు లోనై మూల ద్రావిడమునుండి విడివడిన తొలుతటిభాష యేదియో నిర్ణయించుట ఒక సమస్య యయ్యెను.

ఇచ్చట రెండు విషయములను గుర్తింపవలయును. మూలద్రావిడ భాషా స్వరూపము ఇదమిత్థమని తేలవలయును.

అప్పుడుకాని దానితో సామ్యముగల రూపములను గుర్తించుట జరుగదు. గుర్తించిన పిమ్మటకూడ అది మూలద్రావిడముతో సామ్యమును గలిగియున్నదని యనుటయే యుచితమగును గాని ప్రాచీనద్రావిడమునుండి వేరుపడిన మొదటి భాషయని నిర్ణయించుట యుచితము కాదు. నిజముగా మొదటనే వేరు పడిన భాష మూలభాషకంటె భిన్నమయిన పరిణామమును పొందును. కావున మొదట వేరుపడిన భాషను గుర్తించుట యన్నది సాధ్యము కాదు. మూలద్రావిడభాషా లక్షణమును బహుభాషలలో కనిపించు సామ్యమును బట్టి నిర్ధారించుట కవ కాశము కలదు. ఇంతకు నిది యంతయు బ్రహ్మపదార్థ పరి శోధనము వంటిది. తెలిసిన వానినుండి తెలియని దాని కొరకు చేయు నన్వేషణమే యిది.

ఏభాషకైనను సర్వనామములు ముఖ్యమైనవి. కావున ముందుగా వానిని పరిశీలింతము.

తమిళమునందు 'యాన్' అనియు 'నాన్' అనియు నున్న రూపము 'తుళు' నందు 'యాను' అని యున్నది. కోత, గోండి, పర్జి, గదబ మున్నగు భాషలయందు 'ఆన్' అని అకా రాదియై యున్నది. కన్నడమునందు అకారాది రూపమైన 'ఆన్' తోపాటుగా 'నాను' అను రూపమున్నది. అట్లే కొండ దొర భాషయందు కువిభాషయందు 'నాను' అను రూపము గలదు తెలుగున 'ఏను' అను రూపముతో పాటు 'నేను' అను రూపముకూడ కలదు. తుదభాషయందు 'ఓన్' అను రూపము గలదు. మలయాళమందు 'ఞాన్' అను రూపము గలదు. వైనున్న రూపముల నన్నింటినిబట్టి చూడగా 'ఞావ్' అను

నదే ప్రాథమిక రూపము అని తోచుచున్నది. 'ఈ' వర్ణము సానునాసికమైన య వర్ణముతో సమానమైన ఉచ్చారణము కలిగియుండును. కావున అనునాసికోచ్చారణమును విడువగా 'యాన్' వంటి రూపము లేర్పడును. 'య' వర్ణము తాలవ్యము కాబట్టి కొందరు తాలవ్య స్వరమైన 'ఎ' వర్ణమును వాడుట జరిగియుండును. తెలుగుననున్న 'ఏను' అటువంటిదే ద్వితీయాది విభక్త్యంగమునందు పెక్కుభాషలలో 'య' స్థానమున 'ఎ' యుండుట యీవిషయమునే స్థిరపరుచును. 'యాన్' మున్నగురూపములలోని 'య' వర్ణమును విడిచిపుచ్చుటచేత 'ఆన్' మున్నగురూపములు కలిగియుండును. తుదభాష పదాదినున్న 'అ' వర్ణమును 'ఓ' వర్ణముగా మార్చివలుకును. కావు వనే 'ఓవ్' అను రూపము కలిగినది. 'ఈ' వర్ణమును కేవల 'న' కారముగాను, తాలవ్య స్వరముతోడి నకారముగాను పలుకుట చేత 'వాను' 'నేను' మున్నగు రూపములు కలిగినవి. కావున మలయాళమువందలి 'ఞాన్' అను రూపమే తక్కినరూపము లకు మూల మునియు, కావున అదియే మూల ద్రావిడరూపమై యుండుననియు సిద్ధాంతము. (కొందరు 'ఆన్' అను తమిళ రూపమే మూలద్రావిడస్థితిని తెలియ జేయుచున్నదని నిర్ణయించిరి.)

యుష్మదర్థకైకవచనము తమిళ, మలయాళ, కోత, తుద, కొడగు, కువి మున్నగుభాషలయందు 'నీ' యని కలదు. తుళు, పర్జి, మున్నగువానియందు 'ఈ' కారాదియై కలదు. తెలుగునందు నీవు, ఈవు అవి రెండు రూపములు గలవు. అట్లే గోండి, కుయి మున్నగు భాషలలో ఈకారాది రూపము, నకా

రము తోడి రూపము కూడ కలవు మొత్తము మీద 'నీ' యను రూపమే ప్రచురమైయుండి ద్వితీయాది విభక్త్యంగముగా 'నిన్' అను పరిణతిని చెందుచున్నది. కావున 'నీ' అనునదే మూల ద్రావిడమునందలి యుష్మదేకవచనరూపమని నిశ్చయింప నగును.

తమిళ కన్నడ మలయాళములయందు 'ఆళ్' అని యున్నరూపము తెలుగున 'ఏలు' అని యైనది. కావున 'ఆళ్' అనునదే మూలరూపము: తెలుగునందు ప్రోలు, ప్రోగు మున్నగువిధముగా సంయుక్తాక్షరముతో మొదలయిన పదములు కొన్నికలవు. ద్రావిడభాషలయందు సంయుక్తాక్షరములే చాలతక్కువ. ఆదియం దేమాత్రము నుండవు. కావున పుటల్ (త) పొటల్ (క) పొటల్ (మ) అనురూపములలో నొక్కటి మూలము కావచ్చును మలయాళ కన్నడములందలి 'పొటు' యనునవి 'ప్రో' యగుట సులభము. తమిళ మలయాళములందు 'ముటుంగు' అని యుండగా కన్నడమున 'మొటుగు' అని యున్నవి. తెలుగునందలి 'ప్రోగు' రూపమునకు కన్నడ రూపము సన్నిహితముగా మన్నది.

కన్ను, మన్ను, వెన్న - మున్నగురూపములలో తెలుగున దంత్యనకారము ద్విత్వమునొందగా తమిళ కన్నడమలయాళములందు మూర్ధన్య ణకారము ద్విత్వము నొంది కనిపించును. అదియే ప్రాథమికమైన రూపము కావచ్చును.

ఒండు, రెండు మూడు - మున్నగు తెలుగు సంఖ్యావాచకములతో ఒణ్ణు, ఇరణ్టు, మూన్ఱు మున్నగు తమిళకన్నడములకే యెక్కువ సామ్యము కనిపించును.

తెలుగునందున్న 'చేయి' యన్నది తమిళ మలయాళము లందు 'చెయ్' అను రూపముతోనున్నది. కన్నడమున 'కెయ్' యను రూపముతో కలదు దీనినిబట్టి 'చెయ్' అనునదే ప్రాచీన మేమో యనిపించును గాని అది సత్యము కాదు తెలుగున కూడ 'కై' యను రూపము కలదు 'కైసేయు' 'కైవపము' మున్నగు శబ్దవల్లవములలోని 'కై' ప్రాచీనావస్థనే తెల్పును 'చెయ్' యను రూపమున కిట్టి ప్రయోగము లేదు కావున కన్నడమునందలి 'కెయ్' యనునదే మూలరూపమనియు, తమిళమలయాళములలో క>చ మార్పు కలిగెననియు గ్రహింపవలయును. తెలుగున ఆమార్పు పాక్షికముగా నయ్యెను. తమిళమలయాళములలో 'చిలుమ్' అని యుండగా కన్నడమున 'కిలువు' అనియు తెలుగున కిలుము, చిలుము - అనియు నుండుట యీస్థితినే నిరూపించును. కావున, ఇట్టి యెడల కన్నడరూపమే ప్రాథమిక మనుట సమంజసము.

ద్రావిడ భాషలయందు బహువచన ప్రత్యయము 'కళ్' అనునది. తమిళకన్నడాది భాషలయందు 'కళ్' అనియే ప్రయోగింపబడును. కాకున్న 'గళ్' అని మారును. కాని తెలుగునందు 'లు' వర్ణము మాత్రమే బహువచనప్రత్యయముగా ఉపయోగింపబడుచున్నది. కొన్నియెడల పొల్లులకారము మాత్రమే నిల్చుచున్నది. కుయి, ద్రాహుయీ మున్నగు భాషలయందు 'క' మాత్రమే బహువచన ప్రత్యయముగా మన్నది. కావున 'కళ్' అను రూపమే ద్విధాకరింపబడి 'ళ్' వర్ణముగా కొన్నియెడల, 'క' వర్ణముగా కొన్నియెడల వాడుకనొంది యున్నదని సిద్ధాంతము. (కొందరు వేరుగా

మున్న 'క' వర్ణమును, ళ్ వర్ణమును చేరదీసి, తమిళము బహు వచనప్రత్యయముగా వాడుకొనుచున్నదని భావించిరి. అది సమర్థనీయము కాదు.)

తమిళ, మలయాళ, కన్నడములందున్న ఱకారము మూలద్రావిడ వర్ణము. తమిళమునందు దాని ప్రాచుర్యమిప్పటికిని తగ్గలేదు. ఇతరభాషలయందు నెమ్మదిగా 'ఱ' వర్ణము తొలగిపోయి డ ల ర - అను వర్ణముల కవకాశము కలిగినది. కావున ఱ వర్ణమును ప్రాచీన ద్రావిడరూపముగా భావింప వచ్చును తెలుగునందును కొన్ని శాసనములలో ఈ 'ఱ' వర్ణము కలదు. కాని దానికి సాహిత్యభాషలో స్థానము లేకపోయినది.

మొత్తముమీద మూలద్రావిడ లక్షణములు కన్నడమున, మలయాళమున, తెలుగున, ఇతర ద్రావిడభాషలందును చెదరి కనిసించుచున్నవి. అనగా, ఏ యొక్కభాషయు మూల ద్రావిడ లక్షణముల నన్నింటిని నిరూపించుచున్నదని చెప్పుటకు వీలులేదు తమిళమునందు ఎక్కువలక్షణములు కనిపించునన్న సంగతి వాస్తవము. అయినను తమిళమే మూలద్రావిడమనికాని, మూలద్రావిడమునుండి వెరువడిన మొదటి భాషయనికాని యనుటకు వీలులేదు అయినను ద్రావిడభాషలన్నింటియందును తొలుతసాహిత్యస్థితి నొందినది తమిళమే. కాబట్టి అందు ప్రాచీనలక్షణము లెక్కువగా నుండుట కవకాశము కలదు. గ్రంథస్థమైన భాష తొందరగా మార్పు నొందదు. అనాగరకభాషలే మూలద్రావిడమునుండి మొదట వేరువడి యుండునని యనుకొన్నను, వానియందు ఈమధ్య కాలమున నెక్కుమార్పులు వచ్చుట కవకాశము కలదు.

కావున వానినే మూలద్రావిడ లక్షణ నిర్ణయవిషయమున సర్వ ప్రమాణముగా భావించుట సమంజసము కాజాలదు

ఉన్నభాషలలో వెక్కువిషయములందు తమిళమే మూలద్రావిడలక్షణములను నిరూపింప సమర్థమైయున్నది. కావున దానినిబట్టి, యితర లక్షణములను జతచేసి మూల ద్రావిడ మను ఊహాకల్పిత భాషను నిర్మించుకొనవచ్చును. 'ఞాన్ వర్కు ఇన్టఅన్' అనునది ఊహాకల్పితమైన మూల ద్రావిడ వాక్యము. ఇది వ్యవహారమున మార్పునొంది అరవ కన్నడ మలయాళాంధ్రములందు వేర్వేరు రూపములను ధరిం చెను.

అరవమునందు 'ఞాన్ వర్కు ఇన్టఅన్' అనునది క్రమ ముగా నాన్ వర్కు ఇన్టఏన్ > వాన్ వరుకిన్టేన్ > నాన్ వరేన్ అని మార్పు నొందెను.

కన్నడమునందు అదేవాక్యము నాన్బరుత్తుఏన్ > నాన్ బరుత్తేన్ > నాన్బరుత్తెనె అని మార్పునొందెను.

మలయాళమునందు అదేవాక్యము ఞాన్ వరు ఇన్ట ఏన్ > ఞాన్ వరు ఉన్టు > ఞాన్ వరు ఉన్ను > ఞాన్ వరున్ను అని మార్పునొందెను.

తెలుగునందు ఆన్వర్కు ఇన్టఅన్ > ఆన్ వర్కుకు ఇన్టఅన్ > ఆన్ వర్చు ఉన్టఅను > ఏనువచ్చు చున్నాను > నేనువచ్చుచున్నాను అని మార్పునొందెను.

వైదంతయు ఊహాకల్పితమే. అయినను ఇతర సాధ్యము లనుబట్టి వేర్వేరు భాషలయందు కలుగు ధ్వనుల మార్పు లను గుర్తించి యిట్టి యూహచేయుట జరిగినది. ఈయూహను బట్టి మూలద్రావిడభాష యొకటి యుండియుండుననియు, వేర్వేరుగానుండు ఉచ్చారణలక్షణములనుబట్టి వేర్వేరు పరిణామములు కలుగగా దానినుండి తమిళ కన్నడాంధ్ర మలయాళాది సోదరభాషలు రూపొందె ననియు స్పష్టముగా నిర్ణయము చేయవచ్చును

ఉత్పత్తి ప్రకరణము

తెలుగుభాషకు ఆంధ్రము, తెనుగు, తెలుగు అను మూడు పేళ్ళను వాడుకలో నున్నవి. ఈ మూడింటిని సమాన ముగనే సమానార్థముననే వాడుచుంటిమి ఆంధ్రశబ్దచింతా మణి, ఆంధ్రనామసంగ్రహము మున్నగు వానియందలి 'ఆంధ్ర' పదము భాషనే సూచించుచున్నది తిక్కన నన్నయను గూర్చి 'ఆంధ్రకవిత్వవిశారదుండు' అని ఆంధ్రపదమును భాషా పరముగా వాడియున్నాడు. నన్నయభట్టు నారాయణభట్టును గూర్చి చెప్పుచు 'యః సంస్కృతకర్ణాటప్రాకృతపైశాచి కాంధ్రభాషాసు కవిరాజశేఖరః' అని వాడియున్నాడు ఇంత వరకును ఆంధ్రశబ్దము భాషాబోధకముగా వాడబడినట్లు స్పష్టము.

ఆంధ్రము

ఆంధ్రశబ్దము దేశమునకును జాతికిని కూడ బోధక ముగా వాడుక నొందియున్నది. బౌద్ధవాఙ్మయమునందు అంధ కులను నొక జాతిప్రజలనుగూర్చి యున్నది. తమిళులతోపాటు వీరును మ్లేచ్ఛులుగా పరిగణింపబడిరి. గోదావరీతీరమున 'అంధకరట్ఠ' యను దేశ మున్నట్లు తెలియుచున్నది. ఇది ఆంధ్రరాష్ట్రమనీయు, ఆంధ్రులును అంధకులు నొక్కరే యనియు శ్రీమల్లంపల్లి సోమశేఖరశర్మగారు రూహించిరి. పల్లవ రాజుల ప్రాకృతశాసనములలో 'అంధాపథము' అను పేరున ఆంధ్రదేశము కనిపించుచున్నది. వీనినిబట్టి అంధ, అంధక, ఆంధ్ర, ఆంధ్ర యను పదములు దేశవాచకములుగా వ్యవ హృతము లైనట్లు కనిపించును. శాసనప్రామాణ్యమునుబట్టి

'అంధ్ర' యనునదే ప్రాచీనరూప మనియు, 'ఆంధ్ర' యనునది యర్వాచీనరూప మనియు నర్థ మగుచున్నది. శ్రీనష్టుల చిన సీతారామస్వామిశాస్త్రిగారు "మనుధర్మశాస్త్రమునందును, వైతరేయబ్రాహ్మణమునందు గ్రామబహిర్వాసులుగ నిరపింపబడినవారు అంధ్రులగు నార్యులు. ద్రావిడు లన్నతో ఆంధ్రులు" అని భిన్నత్వమును ప్రతిపాదించిరి. కాని ఆర్యులగు అంధ్రులును, దక్షిణాపథమునందలి యాంధ్రులు నొక్కరే యనియు పాలకజాతిగా ఔత్తరాహులు ఈ దేశమున స్థిరపడియిచ్చటి పాలితులతో కలిసిపోయి రనియు చారిత్రకుల విశ్వాసము.

క్రీ పూ. నాలుగవశతాబ్దమునందు మగధ రాజగు చంద్రగుప్తమౌర్యుని యాస్థానమున నుండిన గ్రీకు రాయబారి యాంధ్రులమగూర్చి వేరొక్కని యుండెను. అశోకుని శాసనము లందును ఆంధ్రులను ఒకజాతిగా పరిగణించిన ప్రస్తావ మున్నది. అరవ శతాబ్దినాటికి ఆంధ్రపదము జాతిపరముగా అనేక శాసనములలో ప్రత్యక్షము కాసాగినది. కాబట్టి ఆంధ్రశబ్దము జాతివాచకముగను, పిదప దేశవాచకముగను వాడుకనొంది క్రమముగా భాషకు కూడ బోధకమైయుండును. తిక్కన 'ఆంధ్రావళి మోదముం బడయునట్లుగ' అని జాతివాచకముగా వాడియుండెను.

తెలుగు

అప్పకవి ఆంధ్రదేశమునకు త్రిలింగదేశము అనివాడి ఆ సంజ్ఞ కలుగుటకు కారణము నిక్కింది విధముగా తెలిపెను.

'శ్రీశైలధర కాళేశ
ద్రాక్షారామంబు లవఁగఁ దవరారెడు నీ
త్రిక్షేత్రంబుల లింగము
లీశ్వరఁ ద్రిలింగవంజ్ఞ వెన్నిక కెక్కున్' అని పలికి,
"తత్త్రిలింగనివాసంబు తనరు కతన
నాంధ్రదేశంబు కాఁ ద్రిలింగాఖ్యమయ్యె"అని యనెను.

ఇది దరిదాపు క్రీ.శ. 1650 వాటి విషయము. ఇంతకు పూర్వమే పదునైదవశతాబ్ది పూర్వభాగమువం దున్న విన్నకోట పెద్దన తన కావ్యాలంకారచూడామణిలో

"ధర శ్రీపర్వత కాళే
శ్వర ద్రాక్షారామసంజ్ఞ వఱలు త్రిలింగా
కర మగుట నంధ్రదేశం
బరుదారఁ ద్రిలింగదేశ మవఁ జనుఁ గృతులన్.
తత్త్రిలింగపదము తద్భవంబగుటచేఁ
దెలుఁగుదేశ మనఁగఁ దేటపడియె
నెనుకఁ దెనుఁగుదేశమును నండ్రి కొండఁరని పలికెను.

ఈ యిరువురి ప్రాతలనుబట్టి త్రిలింగము లుండుటచేత త్రిలింగదేశమను పేరు కలిగె ననియుఁ, అదియే తెలుగుదేశమై తరువాతికాలమున తెనుగుదేశమయ్యె ననియు నిర్ణయింపవఁగును. వీరికంటె పూర్వుడై, వీరి కీ యూహాబలము నందిచ్చినవాడు పదునాలుగవ శతాబ్ది పూర్వార్ధమున మన్న విద్యానాథుడు. వీరు డగు ప్రతాపరుద్రుని సంతృప్తి కొరకు తదాస్థానమున

మన్న విద్యానాథుడు నాడు వాడుకలో నుండిన 'తెలుగు' శబ్దము నిట్లు చమత్కరించి యుండినను ఉండవచ్చును, 'త్రిలింగ దేశపరమేశ్వర' అని ప్రతాపరుద్రుని సంబోధించెను. ఇంతకు పూర్వము క్రీ. శ. 1027 నాటి ఇంద్రవర్మ పుర్లీ శాసనమందు 'త్రిలింగ వాస్తవ్యాయ' అని కలదు ఇంతకంటెను బూర్వమే క్రీ. శ. 150 నాటి టాలెమీ అను చరిత్రకారునికి 'త్రిలింగ' శబ్దము సుపరిచిత మని శాతవాహనుని గ్రంథమునుబట్టి విల్సన్ కాల్డ్వెల్ నిర్ణయించెను. త్రిలింగ, త్రిలింగ, త్రిలింగ, త్రిలుంగ, తెలింగ మున్నగురూపములతో ఈ శబ్దము శాసనములందు కని పించుచున్నది కాబట్టి విద్యానాథునికి పూర్వమే త్రిలింగ శబ్దము ప్రతిష్ఠితమై యున్నదని నిర్ణయింపనగును. 'తెలుగు' అను శబ్దమే మౌలిక మనియు దానినే సంస్కృతప్రియులు 'త్రిలింగ'గా మార్చియుందు రనియు నొక వాదము బలీయ ముగా గలదు ఇట్లు తెలుగుపేళ్ళను సంస్కృతీకరించు అభ్యా సము లేకపోలేదు గాని, యిన్ని విధములుగా మన్న యే తెలుగుశబ్దమునుండి సంస్కృతశబ్దము వచ్చినదని యనగలము?

ఫ్లిసీ 'మొదొగలింగమ్' (Modogalingam) అను నొక మాట నుపయోగించెను కాంప్‌బెల్ తన తెలుగు వ్యాకరణ పీఠికయందు ఈ ప్రస్తావనమున 'మొదొగ' అను దానిని 'మూడు' అను సంఖ్యావాచకమునకు సమమైనట్లు నిర్ణయించెను. అది యట్లైనచో 'మూడు లింగము' అను పేరు కలదనియు, త్రిలింగము సమానార్థకమనియు భావించి దానికి ప్రాచీన తను నిర్ధారింప వచ్చును.

సి. పి బ్రౌను పై సంజ్ఞను 'మూడు-గళింగము' అని విభాగము చేసెను 'కళింగము' నందలి 'క' వర్ణము 'గ' వర్ణముగా మారుట కష్టాంతరము లేదు 'త్రికళింగము' అనువాడుక భారతదేశమునందు చాలకాలమునుండి కలదు. ఒక వంశపు రాజులు 'త్రికళింగ ప్రభువులు' అను బిరుదనామమును చాల్చినట్లు ఒక శాసనము కలదని జెనరల్ కనింగ్‌హాము నాసెను. వరాహమిహిరుని బృహత్సంహితము అనువాదము చేయుచు, పురాణము లందొకచోట 'త్రికళింగ' శబ్దము కని పించెనని డాఁ కెర్న్ వ్రాసెను. రాగిరేకు పైనున్న యొక శాసనమందుకూడ ఈ శబ్దము కలదు మహాభారతము కళింగు లను గూర్చి మూడుసార్లు పలికెను. ఒక్కొక్కమారు ఒక్కొక్క జాతి ప్రబలకు పొరుగున నున్నట్లు తెలిపెను. కావున ఈమూడు కళింగములచేత బోధింపబడు దేశము తెలుగుదేశమేయని నిర్ధారించు అవకాశము చాలకున్నది.

ఉత్కళింగము, మధుకళింగము, కళింగము అను మూడు కళింగములకును గలిపి త్రికళింగసంజ్ఞ గల దనియు, అదియే త్రికళింగ>తిఅలింగ>తెలింగ>తెలుంగు అని అయ్యెనని యొక వాదము కలదు కాని, త్రికళింగము చారిత్రకముగా తెలుగు దేశమగుటకు వీలులేదు. అందువల్ల శబ్దసామ్యముచే చరిత్రసాహ్యమును శాసించుట సమంజసము కాదు.

'తెఱుగన్నడము' అనునది 'తెలుగు'గా మారెనని మరొక వాదము కలదు చివర గల మూడక్షరములు లోపించుటకు భాషాశాస్త్రనియమము లొప్పుకొనవు. అంతే కాక 'తేట కన్నడము' అను నర్థముగల యీ శబ్దము కన్నడముకంటె

భిన్నమైన భాషను బోధించుచున్నదని యొప్పుకొనుట కానుతెనుగు'ను తెనుగుభాష కాక మరేదో భాష యని యనుట వంటిది. కావున ఈ వ్యుత్పత్తి సత్యము కాదు; సమంజసము కాదు.

ఇంతవరకు చూచిన వాదములను బట్టి 'త్రిలింగ' శబ్దమే ప్రాచీనమైన దని ప్రతిపాదింపవగును. శైవమతప్రాబల్యమువలన అష్టాదశాధ్యాపక్రమములో 'ఓం నమశ్శివాయ' అనునది తెలుగు దేశమున పేర్పడి మొన్న మొన్నటి వరకు ప్రచారమున మన్నది కదా? అట్లే శైవమత ప్రాబల్యము కారణముగా అంధరట్ట, అంధ్రాపథీయ, దక్షిణాపథ మొదలయిన పేళ్ళతో మన్న యీ దేశము త్రిలింగదేశమై యుండును దీనికి వికృతులు వెక్కు విధములుగా, చాల కాలముగా మన్న విషయము దీనినే బల పరుచును.

తెనుగు

తెనుఁగు అను పేరుకూడ చాల కాలముగా కలదు రాజనరేంద్రుడు తన్నడిగినట్లుగా నన్నయభట్టు 'తెనుఁగున రచియింపు మధికధీయుక్తి మెయిన్' అని వ్రాసెను. ఇచ్చట నకారము ప్రాసస్థానమం దున్నది. అట్లే తిక్కన 'తెనుఁగున వినిర్మింపఁ దివురుటర్థ్యము' అని తెనుగుశబ్దము వాడియున్నాడు. తెలుగు అను పదము నన్నయయందు గాని తిక్కనయందు గాని ప్రాసఘటితముగా కనిపింపలేదని ఆంధ్రభాషాధికాసకారులవిరి. వన్నయయందు 'తెలుగు' అను శబ్దము కనిపింపని మాట నిజము కాని తిక్కన నిర్వచనోత్తర రామాయణమందు ప్రాసస్థానమునవే 'తెలుఁగు' శబ్దమును వాడెను.

తిక్కన శిష్యు డగు కేతన కూడ ఆంధ్రభాషాభూషణము నందు ప్రాసస్థానమున తెనుగు తెలుగులను సమానముగా వాడియున్నాడు. కాబట్టి ఆంధ్రము, తెనుగు, తెలుగు అనునవి నన్నయకు పూర్వమే యెన్నడో యేర్పడియుండె ననక తప్పదు.

తెనుగుశబ్దమునకు గూడ అనేకవ్యుత్పత్తులు చూపబడి నవి. త్రినగ' శబ్దమునుండి వికృతిగా 'తెనుఁగు' ఏర్పడె ననుట యొకటి. ఇట్లు ఏర్పడుటకు భాషాశాస్త్రసిద్ధాంతము లంగీకరించును. ఆంధ్రభాషాచరిత్రకారులు మూలమున లేని యనుస్వారము తజ్జన్యమందు కలుగ దను నొక యభ్యంతరము పలికిరి. కాని ఒక భాషలో సానుస్వారము లైన శబ్దములు మరొక భాషలో నిరనుస్వారముగా నుండుట వింత కాదు. మన దేశమునకు 'త్రినగ'దేశ మను పేరున్న దా? అనువది ప్రశ్న. ఉండినను పూర్వము చెప్పికొన్న 'త్రిలింగ' శబ్దమునకు సమాకారకముగానే యుండును గాని అపకారకము కాదు. అంతే కాక, తెనుగు తెలుగు శబ్దములు పరస్పరము మారుట కవకాశము కలదు, 'నల'లు తెలుగున పరస్పరము మారు చుండును. చణక - సెనగ - సెలగ,లేత - నేత,మునుగు - ములుగు; లాఙ్గలీ - నాగలి॥ కాబట్టి తెలుగు శబ్దము తెను గయ్యె నని కాని తెనుగు శబ్దము తెలుగయ్యె నని కాని నిశ్చయించుట దోషము కాబోదు.

'తేనె + అగు' అను శబ్దముల కూడికవలన 'తెనుగు' ఏర్పడె నని కొందరి యూహ యైనట్లు గ్రియర్సను వ్రాసెను. ఇది సాహిత్యసుందరమైన వ్యుత్పత్తియే కాని సత్యము

కాజాలదు. ఇట్టి వ్యుత్పత్తి యన్ని భాషలకును చెప్పుట సంప్రదాయమే. 'తెన్' అనగా దక్షిణము కాబట్టి దక్షిణమున నుండువారికి 'తెనుగు' అను పేరు వచ్చె నని మరొక వాదము కలదు. ఇట్టి పేరు సహజముగనే యుండును కాని, తెనుగులు ఎవరికి దక్షిణముగా నుండిరో వారు కదా! ఈ మాట యనవలసినది! తెనుగుభాషలోని యీ యర్థమును తెనుగు భాషకే యన్వయించుట అంత అర్థవంతము కాదు. మనకు ఉత్తరమున నున్నవారు మనలను 'తెనుగులు' అన్నచో ఉచితము; దానిని తరువాత మనము స్వీకరించి స్వీయము చేసికొన్నను చేసికొన వచ్చును. కాని అట్లు కాలేదు. మనకు దక్షిణమున నున్న తమిళులు ఉత్తరాదివా రను నర్థమున 'వడుగర్' అని వాడిరి అట్లే ఉత్తరదేశము అను నర్థమున మన దేశమును 'వడుగవటి' యని పిల్చిరి. కాబట్టి 'తెనుగు' దిగ్వాచకముగా ప్రతిష్ఠిత మయ్యె ననుటయు భ్రమయే యనిపించును.

మొత్తముమీద ఆంధ్రము, తెనుగు, తెలుగు అను శబ్దములు మూడును ప్రాచీనకాలమునుండియు నున్న వనుట సిద్ధాంతము.

తెలుగు భాషా ప్రాచీనత

ఐతరేయబ్రాహ్మణమున ఆంధ్రజాతినిగురించి మొట్ట మొదటిసారిగా మనకు వినిపించును. రామాయణ భారత భాగవతగ్రంథములందు ఆంధ్రులనుగూర్చి ప్రసంగ ముకలదు. క్రీ. పూ మూడన శతాబ్దికి చెందిన అశోకుని శాసనములందు ఆంధ్రులు స్వతంత్రప్రతిపత్తి గలిగిన సామంతులుగా పేర్కొన

బడిరి. కళింగమునకు పడమటిదిశగా ఆంధ్రరాజ్య ముండె నని ఖారవేలుని హాతిగుంఫశాసనము వేర్కొన్నది. క్రీ శ. 77వ సంవత్సరమునాటి ప్లినీ' యను గ్రీకు చరిత్రకారుడు ఆంధ్ర జాతిని వర్ణించి, వారి గుణగణములను బలవైభవములను ప్రశంసించెను. ఈ సాక్ష్యములనుబట్టి చూచినచో క్రీస్తు పూర్వమే ఆంధ్రజాతి మహోన్నతస్థితిలో నున్న దని స్పష్టము కాగలదు. ఐనను ఆంధ్రభాష పదునొకండవ శతాబ్దికి గాని సాహిత్యస్థితిని పొందలేదు. ఇంతకాలముగా ఆంధ్రు లువ యోగించు భాష ఆంధ్రమా! కాదా! అను ప్రశ్న కూడ కలుగును.

ఆంధ్రులు ఔత్తరాహులు. వారెందువలననో ఉత్తర దేశమునుండి నిర్వాసితులై దక్షిణమునకు రాసాగిరి. అట్లు వచ్చినవారు కృష్ణాగోదావరీనదుల మధ్యప్రదేశము నాక్ర మించుకొని అచ్చటి దేశీయులతో క్రమక్రమముగా కలిసి పోయిరి. ఆంధ్రులలో చరిత్ర కందిన మొట్టమొదటి వంశము శాతవాహనులది. శాతవాహనుల రాజధానిగా ప్రతిష్ఠాన పురము ప్రసిద్ధి నొందినది. తొలుత పశ్చిమోత్తరదిశగా నుండిన శాతవాహనులు క్రమముగా తెలుగుదేశమునకు వచ్చియుందురు. ఆంధ్రుల పరిపాలనమూలముగా తెలుగు దేశము ఆంధ్రదేశ మను పేరు సంపాదించుకొని యుండును. ఆచార్య శ్రీ సోమయాజిగారు పరిగణించిన ప్రకార మాంధ్ర రాజుల శాసనముల వివరము లిట్లున్నవి. శాతవాహన రాజులు వేయించిన 24 శాసనములందును 4 మాత్రమే తెనుగుదేశమున నున్నవి. ఇవి యన్నియు ప్రాకృతశాసన

ములు, ఇక్ష్వాకులు వేయించిన శాసనములు కూడ ప్రాకృతము వంటి కలవు పల్లవులు కొన్ని శాసనములలో ప్రాకృతమును కొన్ని శాసనములలో సంస్కృతమును వాడిరి. శాలంకాయ నులు కూడ ప్రాకృతసంస్కృత శాసనములను వేయించిరి. విష్ణుకుండినులు మాత్రము సంస్కృతములోనే శాసనములను వ్రాయించిరి. ఈ వివరములనుబట్టి చూడగా ఆంధ్రరాజుల కాదరపాత్ర మైన భాష ప్రాకృత మని తేలును. క్రమక్రమ ముగా సంస్కృతమునందు కూడ గౌరవము పెరిగినది. ఇట్లు ప్రాకృతసంస్కృతములు శాసనములందు గోచరించుటచే వాని యునికినిగూర్చి ప్రశ్న యే లేదు. కాని తెలు గనునది వేరుగా నుండెనా? నిత్యవ్యవహారమున జనము మాటాడు భాష యేమి? అను ప్రశ్నలకు సమాధానము కావలయును.

భోజరాజు రచించిన సరస్వతీకంఠాభరణమునం దొక శ్లోకము గలదు. "కేఽభూవన్నాధ్యరాజస్య రాజ్యే ప్రాకృత భాషిణః, కాలే శ్రీ పాహసాంకస్య కేన సంస్కృతభాషిణః" ఈ శ్లోకమునుబట్టి ఆధ్యగా జను నామాంతరము గల శాలి వాహనుని కాలమున అందరును ప్రాకృతము మాటాడగలి గిన వారే యని తెలుపవచ్చును. నిత్యవ్యవహారమునందలి భాష ప్రాకృతమే యైనయెడల ఇట్లు చెప్పవలసిన యవసరము కలుగదు. కావున జనసామాన్యము మాటాడు భాష వేరుగా నున్న దనియు, ఐనను రాజాశ్రితమునుబట్టి ప్రాకృతమునందు కూడ అందరకు ప్రవేశము గల దనియు చెప్పుట కవి యుద్దే శ్యము కావలయును. గుణాఢ్యుని కథనుబట్టి చూచినప్పటికిని సంస్కృత ప్రాకృతములకంటె భిన్న మైన దేశభాష యొకటి

యున్నట్లు స్పష్టము కాగలదు. ప్రతిజ్ఞానుసారము గుణాఢ్యుడు సంస్కృత ప్రాకృత దేశభాషలను విడనాడి పైశాచీభాష యందు బృహత్కథ రచించెను పైశాచికము కూడ ప్రాకృత ములలో నొక భాగమే యని ప్రాకృతవ్యాకరణములు తెలుపు చున్నవి. ఇట్టి యెడల గుణాఢ్యునికి ప్రతిజ్ఞాభంగదోషము పట్టదా ? యను ప్రశ్న రావచ్చును. ప్రతిష్ఠానపరిసరములందలి ప్రాకృతమును, దేశభాషను బహిష్కరించుటయే కాని యే దేశ భాషనుగూడ వాడరాదనుట యాతని యుద్దేశ మెయుండదు. ఏ భాషను వాడకున్న ఇంక వ్యవహార మెట్లు సాగును? కాను క్రొత్తగా భాషను సృష్టించుకొనుట సాధ్య మనుకొన్నను, అది యితరుల కెట్లు అర్థమగును ? కావున గుణాఢ్యుని ప్రతిజ్ఞను కావన్మాత్రముగనే గ్రహింపవలయును. గ్రియర్సను భారత దేశమునకు నుత్తరభాగమున దరదదేశమున మాటాడు భాషలు పిశాచభాష లని పేర్కొనెను. బృహత్కథకు సంస్కృతానువాదములలో నొకటి నేషాళదేశమున, రెండు కాశ్మీరదేశమున లభించినవి. దీనినిబట్టి కూడ పిశాచభాష లని పిలువబడు భాషలను అక్కడివారు మాటలాడుచుండు రని తెలియుచున్నది. గిల్గిత్, కాశ్మీరము, కొహిస్తాను, కాఫీ రిస్తాను, చిత్రాలు అను భాగములు కలిసి దరదదేశముగా నేర్పడి, పిశాచభాషలకు స్థావర మగుచున్నవి. దీనినిబట్టి బృహత్కథకు వాడబడిన పైశాచీభాష తెనుగు కాదనియు, ప్రతిజ్ఞ ప్రకారము విడువబడిన - దేశభాషయే తెనుగు కావచ్చు ననియు నూహింప వీలగుచున్నది.

సరిగా అదే కాలమున క్రీ శ. మొదటి శతాబ్దియందు హాలమహారాజు ప్రాకృతమున 'గాథాసప్తశతి' అను గ్రంథమును సంతరించెను. ఇందలి భాష మహారాష్ట్రీప్రాకృతమనియు. అదియే ప్రాకృతములలో ప్రధానమైన దనియు పలువురు పెద్దల నిర్ణయము. ఇందు సంస్కృతమున లేని యనేకపదములు కనిపించుచున్నవి. ఇవి దేశభాషలనుండి ప్రాకృతములో ప్రవేశించి యుండును. అట్లు ప్రవేశించిన వానిలో పెక్కు తెనుగుపదములు కనిపించుచున్నవి. ఆ పదములు ఇతర ద్రావిడభాషలలో నైతము నుండవచ్చును. అనను రూపసాన్నిహిత్యమును బట్టి అట్టివి తెలుగునుండియే ప్రాకృతమున ప్రవేశించియుండు నని డాక్టరు దివాకర్ల వేంకటావధానిగారు సముచితముగా నిర్ణయించిరి అత్తా పొట్ట, కరణి, మోడి మున్నగు శబ్దములను పెక్కింటిని గాథాసప్తశతినుండి యెన్నికచేసి, తెలుగుపదములుగా సోదాహరణముగా నిరూపించిరి. ఈ పదముల ప్రయోగమునబట్టి యొక విషయము నిరూపిత మగుచున్నది. ఆయా కవులు ప్రాకృతమున రచన చేసినను, నిత్యవ్యవహారప్రభావమున దేశభాషా పదములు కూడ అందు సందుచేసికొన్నవి వానికి సంస్కృతప్రాకృతములతో ఏ మాత్రమును సంబంధము లేదు.

ప్రాకృతసంస్కృతశాసనములలో కూడ తెలుగుపదములు గ్రామముల పేళ్ళుగా, మనుష్యుల పేళ్ళుగా తొంగిచూచుచున్నవి శాతవాహనుల శాసనములందు వేపురక, హిరలూర, కుడూర మున్నగు పదములును, తరువాతి కాలమున దాలూర, చెన్దలూర, కణ్డుకూర, కరుపూర, నఞాచడు,

కడాకుదురు, వెలుకపట్టు, తాన్టికొన్న మున్నగు పదములును కనిపించుచున్నవి. ఊరు, చేడు, కుదురు, పట్టు కొండ మున్నగుపదముల నంతమఁదు గల గ్రామముల పే ళ్ళి నాడును గలవు, సంస్కృతమునం దిట్టివి యెన్నడు గాని కని పింపవు. కావున క్రీస్తుశకప్రారంభమునకే 'తెలుగుభాష' వ్యాప్తిని పొంది యున్న దని యొప్పుకొనక తప్పదు. అట్టి నాగమ్మ, వీరమ్మ మున్నగు విధ మైన వ్యక్తులపేళ్ళు కని పించుచున్నవి 'అమ్మ' యనునది 'అన్న' అనుదానికి పూర్వ రూపము కావచ్చును. అరవమునందును కన్నడమునందును మూర్ధన్యణకారమే యుండగా తెలుగున మాత్రమే 'అన్న' యని దంత్యనకార మున్నది. కావున ఈ'అమ్మ' యనునది తెనుగువదము నుచ్చరించుటలో కలిగిన మారుపాటుగా గ్రహించుట యుక్తియుక్తముగా నుండును.

తెనుగుసమాసములు సాధారణముగా రెండేసి చిన్న మాటలతో నేర్పడును. వైని జూచిన గ్రామముల, వ్యక్తుల పే ళ్ళట్లే యున్నవికదా! ఏడవ శతాబ్దినాటికి మూడేసి పద ములు కలిసి సమాసరూపము దాల్చినట్లు శాసనములనుబట్టి తెలియుచున్నది దీనినిబట్టి భాష మిక్కిలి యభివృద్ధిని పొంది యుండె నని నిర్ణయింపనగును.

క్రీ. శ ౬ వ శతాబ్దికి చెందిన ఒక శాసనమునందు 'ఏఱూర' అను పదము కలదు. 'ఆఱ్' అను పదము 'ఏలు' అని తెలుగున వివర్తన మొందినది. అప్పటికి తెలుగు స్వస్వ రూపమును స్థిరీకరించుకొనక పోయినచో 'ఆఱూర' అను నట్లుగానే రూపము ద్రావిడభాషాసామాన్యముగా మండి

యుండెడిది. -ప్రాచీనద్రావిడమునుండి తెలుగునకు వచ్చిన పిమ్మటనే 'ఏ'గా ఈ రూప మేర్పడియుండు నని సిద్ధాంతము. పై వివేచనమునుబట్టి తెలుగుభాష క్రీస్తుశకప్రారంభమునకే, శాలివాహనుల పరిపాలనకాలమునాటికే సుప్రతిష్ఠితమై యుండెనని తేలినది. ఎప్పుడు ప్రారంభ మయ్యెనో తేల్చి చెప్పుట కాధారములు చాలవు.

అయినను శాతవాహనులు మొదలైన యాంధ్ర రాజులు ప్రాకృత సంస్కృతములను వాడి, తెలుగుభాషను నిరాకరించుటకు గల కారణ మేమి? యను ప్రశ్న రావ చ్చును. ఆంధ్రరాజులు ఔత్తరాహులనియు, వారి మాతృ భాష ప్రాకృత మనియు దీనికి సమాధానము. పాలకుల భాష యందే రాజకీయ వ్యవహారము సాగుట పరిపాటి కనుక శాసన ములు ప్రాకృతభాషయందే వెలువడినవి. వాగరకులు ప్రాకృతభాషలనే ఆరాధించిరి. సామాన్యజనము తెలుగు నందే నిత్యవ్యవహారములు గావించుకొనుచుండెడిది. గ్రామ ముల పేళ్ళు, వ్యక్తుల పేళ్ళు ఈ విషయమునే నిరూపించినవి. ప్రారంభములో వేరుగా నున్నను, తరువాతి కాలమున పాలకు లగు ఆంధ్రులును, పాలితు లగు తెలుగువారును నొక్కటై అభేదమును సాధించుకొనిరి. నేడు ఆంధ్రము, తెనుగు, తెలుగు అను మూడు శబ్దములును భాషాజాతిదేశములను సమానము గనే బోధించుచున్నవి.

సంస్కృత ప్రాకృతములు – తెలుగు

'తల్లి సంస్కృతంబె యెల్ల భాషలకును' అని కేతనయు 'జనని సంస్కృతంబు సర్వభాషలకును' అని శ్రీనాథు

డును చెప్పిన మాటలయందు స్థిర మగు విశ్వాసము కలిగి సంస్కృతమునుండియే తెలుగుభాష పుట్టిన దని మనవారు నిర్ణయించుకొనిరి. ఆంధ్రశబ్ద చింతామణియందు 'ఆద్యప్రకృతిః ప్రకృతిశ్చాద్యే త్వేషా తథోర్వికృతిః॥ కేవలతయాను సర్వత్యుక్తేచ యేయం యథాతథం భాషా' అని యొక సూత్రము కలదు. దీనినిబట్టి సంస్కృతప్రాకృతములు రెండును మాతృగౌరవమును పొందుచున్నవి. కాని తెలుగుభాష సంస్కృతప్రాకృతజన్యము కాదని, భాషాశాస్త్రజ్ఞుల నిరూపణముతో ప్రతిష్ఠితమైనది.

ఆర్యులు ఉత్తరధ్రువప్రాంతములో తొలుత నివసించెడి వారనియు, క్రమముగా వారిలో కొందరు దక్షిణముగను, కొందరు పశ్చిమముగను బయలుదేరి రనియు, అటు దక్షిణ ముగా వచ్చినవారు కొంతకాలము ఆసియాఖండ మధ్యభాగ మున నుండి, తరువాత అందు కొందరు భరతఖండమునకు వచ్చి, ఉత్తరదిశనుండి క్రమముగా దేశ మంతయు క్రమ్ముకొని రనియు శ్రీ మేడేపల్లి వేంకటరమణాచార్యులుగారు నిర్ణయించుచున్నారు. పడమటివైపు సాగినవారు ఐరోపాఖండమునందు నివాస మేర్పరచుకొనిరి. మొదట వీ రందరు మాటలాడు భాష యొక్కటే యనియు, మతాచారములు నొక్కటే యనియు భాషాశాస్త్రమును, పురాణాగాథా సామ్యమును ప్రకటించుచున్నవి. ఐరోపాఖండమువైపు వెళ్ళిన వారు 'కెంతుమ్' భాషలను, రెండవశాఖవారు 'సతెమ్' భాషలను మాటాడుచున్నట్లు స్థూలవిభాగముచేయబడివది. వైపు రెండు పదములకు 'వంద' యను సంఖ్యావాచకమే

యర్థము. 'వంద' యను నర్థమున వా రుపయోగించు పద మునుబట్టి యాయా భాషల కా విభాగము జరిగినది.

అట్లు వచ్చినవారు మొదట ఉత్తరభాగము నాక్ర మించుకొని యుండిరి. ఆ పిదప మరొక గుంపు వచ్చి వారిని దక్షిణదిశకును పశ్చిమదిశకును తరిమి తాను ఉత్తరభాగము నుండి మధ్యభాగమునకు చేరికొని యుండును. ఇట్లు వేర్వేరు సమయములలో వచ్చిన ఆర్యులు మాటాడుభాషలో కూడ కొంత మార్పు కనిపించును. వేదకాలమున మాటాడెడి భాష ప్రథమప్రాకృతముగా పరిగణింపబడినది. దీనికి మూల మగు భాష యొకటి యుండెడిది. అదియే ఇండోయూరోపియను భాషల కన్నింటికి మూలమని యూహింపబడుచున్నది ప్రథమ ప్రాకృతమునే సంస్కరించి నెలకొల్పుటచేత ఆ భాష సంస్కృతమై స్థిరత్వమునొంది కావ్యరచనాదికమున కుప యుక్తమైనది. ఆ పిమ్మట వాడుకలో మరింత మార్పునొందిన ప్రాకృతములును, సంస్కృతావభ్రంశములును ద్వితీయ ప్రాకృతముగా నేర్పడినవి. క్రీ పూ 400 సంవత్సరములనుండి క్రీ శ. వెయ్యి సంవత్సరములవరకు ద్వితీయ ప్రాకృతకాలము గా నంగీకరింపబడినది. ఈ భాషలు బౌద్ధజైన గ్రంథములందు అశ్వఘోషుని రచనములందును, గాథాసప్తశతి యందును, భాసుని నాటకములందును ప్రయోగింపబడినవి. ప్రాకృతవ్యాకర్తలు ఈ భాషలకు లక్షణములను కూడ నియమించిరి. ఆ తరువాత వెలసినవానిని తృతీయప్రాకృతము లని యందురు. ఉత్తరహిందూస్థానమున నేడు వాడుకలో నుండిన

కాశ్మీరీ, పంజాబీ, గుజరాతీ, మరాఠీ, బెంగాలీ మున్నగు భాషలు తృతీయప్రాకృతములు

ఆర్యులు భారతదేశమునకు వచ్చునాటికే భారత దేశమునందు ద్రావిడులు ఉన్నత సంస్కారవంతులుగా నున్నట్లు చరిత్ర సాక్ష్య మిచ్చుచున్నది. ఈ సందర్భమున శ్రీ సునీతికుమారచటర్జీ పూటలను గుర్తించుకొనుట యవ సరము-

"It is believed that the wonderful city-civilization of Sindh and South Panjab as well as Balochistan (3250 B C - 2750 B C) was the work of Drav dian Speakers But we cannot be absolutely certain in this matter, so long as the inscribed seals from the city ruins in those areas like Harappa, Mohen-jo-Daro etc. remain undeciphered ... . The Drav dian speech in its advent in India is older than Aryan, and yet (leaving apart the problematical writings on the seals found in Sindh and South Panjab city-ruins) the specimens of connected Dravid an writing or literature that we can read and understand or over a m llennium later than the oldest Aryan Documents."

దీనినిబట్టి ఆర్యభాషలతో సంపర్కము కలుగక పూర్వమే ద్రావిడులకు తమ భాషయు, లిపియు నున్నట్లు స్పష్టముగా తేలుచున్నది. ఇట్టియెడల ద్రావిడభాషలు సంస్కృతప్రాకృతములకు జన్యభాష లని కాని, సోదరభాష లని కాని యనుట యుక్తిసంగతము కాజాలదు.

శ్రీ చిలుకూరి నారాయణరావుగారు తమ ఆంధ్ర భాషాచరిత్రమునందు ద్రావిడభాషలను కూడ ప్రాకృతముల లోనే అంతర్భవింపజేయుటకు అనేక యత్నములు చేసిరి అనేక పదములను, క్రియలను సంస్కృత ప్రాకృతములనుండి కృత్రిమముగా సాధించుటకు ప్రయత్నించిరి. క్రీ పూ. మూడవ శతాబ్దికే తెలుగుభాష స్వతంత్రముగా వాడుకలో నుండినట్లు ఈవరలో చూచితిమి. ఒకే ప్రాంతమున నున్న భాషలు ఇచ్చి పుచ్చుకొనుటలు సాగించుటలో ఆశ్చర్యము లేదు అట్లే సంస్కృతప్రాకృతములలోని యనేక పదములు తెలుగుభాషలో తత్సమతద్భవములుగా ప్రవేశించినవి. అట్లే తెలుగులోని యనేక పదములు ప్రాకృతములలో చేరినవి. ఐనను నిత్యోపయోగ్యములైన పదములు, సర్వనామములు, సంఖ్యావాచకములు మున్నగునవి తెలుగుభాషయందు సంస్కృతప్రాకృతములతో సంబంధము లేకుండ నెన్నియో కలవు. ఈ దేశ్య పదములే భాషకు ప్రాణభూతములు. శివస్కంధవర్మ వేయించిన హిరహడగళ్ళి తామ్రశాసనములోని ప్రాకృతవాక్య విన్యాసమును శ్రీగంటి జోగిసోమయాజిగారు ఈ విషయమున ఉదాహరించిరి—

"బమ్హణాణమ్ చిలెరెక కొండుక వాటకమ్ అకరయోల్లక వినేసి ఖట్టావాసమ్ అదూధదధిగవాణమ్ అరటసంవినయికమ్ ఆలోణగుళచ్ఛోభమ్ అకరవెట్టికొంజల్లమ్ అపారమ్భరబిలివద్ద గవాణమ్ అవాతితకసాకపుప్ఫగవాణమ్ ఏవమాదికేహిఅట్ఠారన జాతిపరిహారేహి" మున్నగు విధముగా శాసనము సాగినది. సంస్కృతసమాసరచనమే యథాతథముగా, కేవలవర్ణవిపరి

ణామముతో ఇందు దిగినది. అదుగ్గదధిగ్రహణము - అలవణ గుడక్షోభము - అపారంపరబలీవర్దగ్రహణము - అతృణకాష్ఠ గ్రహణము - అవారితకశాకపుష్పగ్రహణము' మున్నగు సంస్కృత సమాసములే యివి యని స్పష్టముగా తెలుపు. 'పవమాదిశై:' 'పరివారై:' మున్నగు తృతీయాంతములు రూపాంతరము నొందినను, వాని స్వరూపము కనిపించుచునే యున్నది. 'పాలు, పెరుగు, ఉప్పు, బెల్లము, గడ్డి కట్టెలు, కూరలు, పుష్పులు' మున్నగు పదములే నిత్యవ్యవహారమున నున్నవి. సంస్కృత విభక్త్యంతత్వము తెలుగున అంగీకార్యము కాదు. వాక్యనిర్మాణమునందును సంస్కృత ప్రాకృతములకును తెనుగుభాషకును భేదము కలదు. ఇతరద్రావిడభాషలతో తెనుగునకు గల సామ్యము తెనుగు ద్రావిడ కుటుంబములోని దని స్పష్టముగా నిరూపించుచున్నది. సంస్కృత ప్రాకృతముల కున్న సంబంధము తెలుగుతో సంస్కృతమునకుగాని, ప్రాకృత మునకు గాని ఏవాడును లేదు.

సంస్కృతమునందలి లింగవిభాగమునకును, ద్రావిడ భాషలయందలి లింగవిభాగమునకును ఎంతో యంతరము గలదు. సంస్కృతమునందలి క్రియావిభక్తులు ప్రత్యయములు. ప్రాకృతమున సిద్ధరూపములే వికృతినొంది వాడబడుచున్నవి॥ కరోతి>కరఇ॥ ద్రావిడభాషలయందు పురుషబోధకప్రత్యయ ములు సర్వనామావశిష్టరూపములే. సంస్కృతమున ఉపసర్గలు చేరి ధాత్వర్థము వనేకవిధములుగా మార్పుట కలదు. ప్రాకృత మున నిట్టి సిద్ధరూపముల వికృతులు గలవు. తెలుగున గాని ద్రావిడభాషలందు గాని ఉపసర్గల యుపయోగము కాన

రాదు సంస్కృతమున విశేష్య విశేషణములకు లింగవచన విభక్తులయందు ఏకరూపత నియతము. తెలుగున అట్టి నియమము లేదు. తెలుగున గల ఉభయార్థకాస్మచ్ఛబ్దము సంస్కృతప్రాకృతములం దే వాడును లేదు. సంస్కృత ప్రాకృతములందు కర్మార్థకప్రయోగము విపులముగా కలదు. అట్టి యవసర మున్నప్పుడు సైతము ద్రావిడభాషలు కర్మార్థకము నుపయోగింపవు క్వాచిత్కముగా నుపయోగించినను క్రియాధాతువుపై 'పడు' అను మరొక ధాతువు నుపయోగించును. సంస్కృతమునందువలె ద్రావిడభాషలందు కర్మార్థక ప్రత్యయము గాని ఆదివృద్ధి మున్నగు మార్పులు గాని కలుగవు వ్యతిరేకార్థమునందు సంస్కృతము 'అ' అని 'న' అని యుపయోగించి దానికి పైని క్రియారూపమును వేరుగా వాడును. అంతే కాని క్రియాపదమునందు వ్యతిరేకార్థద్యోతక మగున దేమియు నుండదు ద్రావిడభాషలలో 'అ' కారమే వ్యతిరేకశాబోధక చిహ్నము ఈపాటి సామ్యమును చూచి తెనుగుసంస్కృతము లొకే రీతి నున్న వనుకొనరాదు సంస్కృతములోవలె కాక ద్రావిడవ్యతిరేకక్రియ వేరుగా కలదు. ధాతువుపై వ్యతిరేకప్రత్యయము చేరి, ఆపైని కాలార్థకపురుషప్రత్యయములు చేరుట ద్రావిడభాషలలోని విశిష్టత

ఇట్లే సంస్కృతప్రాకృతములతోను తెలుగునకు జన్య సంబంధము గాని సోదరసంబంధముగాని లే దని నిరూపించు బలీయము లగు ఉపపత్తులు చాల గలవు. పైపెచ్చు తెలుగు

భాష ప్రాకృతభాషకు కొన్ని విషయములందు తోడ్పడినట్లు కూడ చెప్పగల యాధారము లున్నవి.

ఉద్వృత్తాచ్చుల నడుమ యకార వకారములు చొర బడుట ద్రావిడసంప్రదాయము సంస్కృతమునందు ఱట్టిది లేదు. 'నః ఆగతః' అని యున్నప్పుడు 'స ఆగతః' అనియే సంస్కృతమున నగును. ప్రాకృతమున 'అమృత' శబ్దవికృతి 'అమిఅం' అని యగును దీని ఉచ్చారణ 'అమియం' అని యుండును. నేటి ఉత్తరహిందూస్థానభాషలలో కూడ ఈ ప్రభావము కనిపించును ప్రాకృతమునందు ఋ ఌ ఐ ఔ వర్ణ ములు తొలగిపోయినవి. సంయుక్తాక్షరములు ద్విత్వాక్షర ములుగా మారినవి. కొన్ని యెడల అదనముగా నొక స్వరము వచ్చి రెండు వర్ణములను వేరు పరుచుట కూడ కనిపించును॥ రత్న > రదన; మృగ > మురగ॥ ఇట్టి మార్పులు ప్రాకృతమునకు ద్రావిడభాషాప్రభావమువలననే కలిగిన వనక తప్పదు. ఇవి ద్రావిడభాషలకు సహజసిద్ధములు; ద్రావిడభాష లన్నింటి యందును సమానలక్షణములతో కనిపించును ప్రాకృతభాష లన్నింటియందు గాని, ప్రాకృతభాషలకు తల్లియైన సంస్కృత మున గాని ఈ లక్షణములు లేకుండుట ద్రావిడభాషాప్రభావ నిరూపకము.

తత్సమ తద్భవ దేశ్యములు

వ్యాకర్తలు తెలుగు శబ్దములను తత్సమ తద్భవ దేశ్య గ్రామ్యములుగా విభాగించిరి. గ్రామ్యమనగా లక్షణ విరుద్ధమని యభిప్రాయము కాబట్టి గ్రంథరచనమునకు యోగ్యము కాదని

నిరసించిరి. గ్రామ్యమునే నేటికాలమున 'వ్యావహారికము' అను పేర వ్యవహరించుచున్నాము. ఆ విషయమై ఆ సందర్భము వచ్చినపుడు ముచ్చటించుకొందము ప్రస్తుతమునకు తత్సమ తద్భవ దేశ్యములను గూర్చి యాలోచింతము.

తత్సమము : 'సంస్కృతప్రాకృతతుల్యం బగుభాష తత్సమంబు' అని చిన్నయసూరిసూత్రము. కావున 'తత్' అను శబ్దమునకు సంస్కృతప్రాకృతము లని యర్థము. సంస్కృతమును మొదటి ప్రకృతిగాను, ప్రాకృతమును రెండవప్రకృతిగాను ప్రథమావాక్యుడే తలపోసెను. ఆరెండింటికిని వికృతియైనది 'తెలుగు' అని అయన యభిప్రాయము. కావున సంస్కృత ప్రాకృతములతో సమానములయిన శబ్దములను తత్సమములని యన వచ్చును.

కాని యిక్కడ మరొకవిషయమును గమనించుట యవసరము తత్సమ తద్భవ దేశ్యములతో కూడియున్న భాషను 'ఆంధ్రము' అనియందురు. 'ఆంధ్రభాషకు వర్ణంబు లేఁబదియైదు' అనుచోట ప్రౌఢవ్యాకరణకారుడు ఈభాషనే భావించినట్లు స్పష్టము. ఇది కాక 'అచ్చతెలుగు' అని మరొక భేదము కలదు చిన్నయసూరి "సంస్కృతసమేతరంబయిన యీభాష యచ్చ యనంబడు" అని తెల్పి అచ్చతెలుగును నిర్వచించెను. దీనినిబట్టి ప్రాకృతసమములు కూడ ఆచ్చికమునందే చేరవలయును. కొందరు దేశ్యములను మాత్రమే అచ్చతెలుగు శబ్దములుగా పరిగణించినప్పటికి అచ్చతెనుఁగు కావ్యములందు ప్రాకృతసమములును తద్భవములును పర్యాప్తప్రభావమును సంపాదించుకొన్నవి కావున సంస్కృతసమములను వేరుగా

పరిగణించి ప్రాకృతసమములను, సంస్కృతభవములను, ప్రాకృత భవములను, దేశ్యములను చేర్చి 'అచ్చతెలుగు'గా పరిగణించుట యుచితము.

తత్సమములందలి ప్రాకృతసమములు అచ్చతెలుగుతో చేరుచున్నవి. కావున వానిని ప్రస్తుతమునకు విడిచి సంస్కృత సమముల రూపనిష్పత్తిని గూర్చి యాలోచింతము.

సంస్కృతముతో సమానమయినది తత్సమము. అనగా సంస్కృత ప్రాతిపదికను గ్రహించి, అంగికమైన మార్పేమియు చేయకుండ, చివర తెలుగు ప్రత్యయములను చేర్చుకొనగా ఏర్పడిన రూపము తత్సమము అని యందురు 'అంగికమైన మార్పు' అని యనుటచేత ప్రాతిపదిక నడుమ యేవిధమయిన మార్పును జరుగరాదని యర్థము. తుదియందు ఒకటిరెండు వర్ణములు పోవుటకు, అదనముగా చేరుటకు అభ్యంతరము లేదు. 'రామ' యను ప్రాతిపదికపై డుజ్వర్ణకము చేరును, అప్పుడు వెనుకనున్న అత్వమునకు ఉత్వము కలిగి 'రాముఁడు' అను రూపమేర్పడును.

సంస్కృతము	తత్సమము
రామః	రాముఁడు
భగవత్	భగవానుఁడు, భగవంతుఁడు
స్వరాట్	స్వరాట్టు
సుత్రామన్	సుత్రాముఁడు
విశ్వకర్మన్	విశ్వకర్మ విశ్వకర్ముఁడు
వృద్ధః	వృద్ధు, వృద్ధుఁడు
వన్నయభట్టః	వన్నయభట్టు

సంస్కృతము	తత్సమము
యోధః	యోధ, యోధుఁడు
పురోధస్	పురోధ, పురోధసుఁడు
వృషా	వృషము
కలత్రమ్	కళత్రము
మిత్రమ్	మిత్రము, మిత్రుఁడు
మధు	మధువు
వధూః	వధువు
విష్ణుః	విష్ణువు విష్ణుఁడు
ఇంద్రజిత్	ఇంద్రజి, ఇంద్రజిత్తు,ఇంద్రజితుఁడు
జగత్	జగత్తు, జగము
సరస్	సరస్సు, సరసు
మనస్	మనస్సు, మనసు, మనము
నౌః	నావ
ద్యౌః	దివి
వ్యాత్	వ్యాది
కద్రూః	కద్రువ

పై రూపములనుబట్టి సంస్కృతసమముల స్వరూపమును నిర్ణయించుకొనవచ్చును. అంగికముగా నెచ్చటను ఏవిధమయిన మార్పును జరుగుట లేదు. ప్రాతిపదిక యొక్క అంతమునందున్న 'స' 'మ' మున్నగు వర్ణములకు లోపము కలుగుటకాని, అదనముగా ఉత్వద్విత్వములు కాని, అందొక్కటికాని వచ్చుట జరుగుచున్నది. ఇంకొక్క విషయము, సంస్కృతమునందలి అజంత ప్రాతిపదికలు తెలుగునందుకూడ ప్రాతిపదికలుగా

వ్యవహరించుచున్నవి. కాలంతములైనపుడు సంస్కృత ప్రాతిపదికలతో సంబంధము పెట్టుకొనక, ప్రథమైక వచనరూపమును గాని, ద్వితీయైక వచనరూపమునుగాని ప్రాతిపదికముగా గ్రహించుచున్నవి అనగా వ్యవహారమునన్న సంస్కృత శబ్దములయొక్క చివర తెనుగు ప్రత్యయములను చేర్చి తత్సమ రూపములను సాధించుకొనుట జరుగుచున్నదని యర్థము.

ప్రాకృతముల విషయముకూడ అట్లే జరుగుచున్నది. తెలుగుదేశమునందును పరిసరములందును ఉన్న ప్రాకృతమునే తెలుగువారు గ్రహించియుందురు కాని కొందరు వ్యాకర్తలు ప్రాకృతసమములను వింగడించి, కొన్నింటి నొక ప్రాకృతమునకు, కొన్నింటిని మరొక ప్రాకృతమునకు చెందినట్లు నిర్ణయించుచున్నారు. అది కృత్రిమపద్ధతి. ఏభాషకయిన మరొకభాషతో సాహచర్యము కలిగినప్పుడు మాత్రమే అందలి పదము లిందుగాని, ఇందలి పదము లందుగాని చేరుట కవకాశ ముండును. అట్లు కానియెడల పరస్పర వినిమయమునకు అవకాశము కలుగదు.

ప్రాకృతము	ప్రాకృతసమము
అగ్గీ	అగ్ని
కారో	కారము
గారవమ్	గారవము
జమో	జముఁడు
రాణీ	రాణి
సిరీ	సిరి

ఇక్కడకూడ తుదనున్న వర్ణమునకే కాని ఆంగికముగా మార్పు వచ్చుట లేదు. అనగా ప్రాకృతరూపముతో సమానముగా నున్నవనియే యర్థము. అయినను ఈ రూపములకు తోడి తత్సమములయిన సంస్కృత సమములతో సమసించు యోగము లేదు. అన్నివిధముల నివి యాచ్చికములతో సమానముగనే పరిగణింపబడును. సంస్కృతమూలముతో పోల్చి చూచినప్పుడు తెలుగురూపమున ఆంగికమైన మార్పు కనిపించును. కాపునకే ఇట్టి రూపములనుకూడ తద్భవములతో పాటుగా ఆచ్చికమనందే అంతర్భవింపజేయుట జరుగుచున్నది. అదియే యుచితము.

తద్భవములు : "సంస్కృత ప్రాకృతజన్యం బయిన భాష తద్భవంబు" అని చిన్నయసూరి నిర్వచనము. సంస్కృతమునుండి కాని ప్రాకృతమునుండి కాని పుట్టిన భాషకు తద్భవమనిపేరు. సంస్కృతమునుండి కాని, ప్రాకృతమునుండి కాని యొక పదమును తెచ్చుకొని, తెలుగు విభక్తులను చేర్చుట మాత్రమే కాక, ప్రకృతియందు కూడ మార్పును గలిగించి ప్రయోగించిన యెడల అట్టి పదమును తద్భవ మని యందురు.

ఈ మార్పును ఐదు రకములుగా శాస్త్రజ్ఞులు నియోపించిరి. వర్ణాగమము, వర్ణాదేశము, వర్ణలోపము, వర్ణవ్యత్యయము, వర్ణసమీకరణము - అనునవి ఆ ఐదు రకములు.

వర్ణాగమము అనియనగా అదనముగా వర్ణము వచ్చుట యని యర్థము.

తత్సమము	తద్భవము	ఆగమము
ద్వారము	దువారము	ఉ
చంద్రుడు	చందిరుఁడు	ఇ
రక్తము	రకతము	అ
అల్పము	అలుపము	ఉ
రాత్రి	రాతిరి	ఇ
యాత్ర	జాతర	అ

వర్ణాదేశము అని యనగా ఒక వర్ణమును తొలగించి మరొక వర్ణము వచ్చుట యని యర్థము. ఒకవర్ణమును తొల గించి పెక్కు వర్ణములు వచ్చుటయు, పెక్కు వర్ణములకు బదులు, ఒక్క వర్ణము వచ్చుటయు కూడ ఇక్కడ కనిపింప వచ్చును.

తత్సమము	తద్భవము	ఆదేశము
నీరము	నీరు	అ>ఉ
రూపము	రూపు	అ>ఉ
శీతము	సీతు	,,
యామము	జాము	,,
కాకము	కాకి	అ>ఇ
నీవారము	నివ్వరి	అ>ఇ
విజ్ఞప్తి	వినతి	జ్ఞ>న
ఆజ్ఞప్తి	ఆనతి	,,

తత్సమము	తద్భవము	ఆదేశము
ద్వయము	దోయి	ద్వ>దో;అ>ఇ
మృత్యువు	మిత్తి	మృ>మి,ఉ>ఇ
వైద్యుఁడు	వెజ్జు	ఐ>ఎ,ద్య>జ్జ
కాచము	గాజు	క>గ; చ>జ
నిత్యము	నిత్తెము	త్య>త్తె
	నిచ్చ	త్య>చ్చ
సత్యము	సత్తెము	త్య>త్తె
సంధ్య	సంజ	ధ్య>జ
	సందె	ధ్య>ద
చిహ్నము	చిన్నె	హ్న>న్న
కాష్ఠము	కట్టె	ష్ఠ>ట్ట
విద్య	విద్దె	ద్య>ద్దె
ప్రజ్ఞ	పగ్గె	జ్ఞ>గ్గె
సాఁకి	సాకిరి	ఁకి>కిరి
ఖిన్నము	బికిరము	న్న>కిర
అర్హ్యము	అగ్గువ	అ>ఉవ
సత్త్వము	సత్తువ	అ>ఉవ
యళము	అసము	య>అ,ళ>స
యువతి	ఉవిద	యు>ఉ,తి>ద
కేతకి	గేదగి	పరుషములు>సరళములు

తత్సమము	తద్భవము	ఆదేశము
ముఖము	మొకము	మ.ప్రాణము>అ.ప్రాణము
సఖి	సకి	,,
ఇచ్ఛ	ఇచ్ఛ	,,
పీఠము	పీట	,,
కథ	కత	,,
ఫలకము	పలక	,,

వర్ణలోపము అని యనగా ఉన్నవర్ణములలో ఒకటికాని అంత కెక్కువగాని వర్ణములు లోపించుట యని యర్థము.

తత్సమము	తద్భవము	లోపము
స్నిగ్ధము	నిద్దము	స
మాణిక్యము	మానికము	య
తామరసము	తామర	సము
స్వామి	సామి	వ
ప్రయాణము	పయనము	ర
ప్రవాళము	పవడము	ర

వర్ణవ్యత్యయ మని యనగా పదమునందు వేరువేరు స్థానములందున్న వర్ణములు క్రొత్తస్థానములందు నెలకొనుట. 'పారావతము' అను తత్సమమునందు ద్వితీయస్థానమున 'ర' వర్ణమును, తృతీయస్థానమున 'వ' వర్ణమును గలవు. తద్భవమైన 'పావురము' అను పదమునందు ద్వితీయస్థానమున 'వ'

వర్ణమును తృతీయమునందు'ర'వర్ణమును నిల్చినవి. అనగా'రవ' లు పరస్పరము వినిమయము నొందినవన్నమాట! ఒకే భాషలో కూడ ఇట్టి మార్పు జరుగవచ్చును. 'మరకతము' అనునది 'మర తకము' అని యగుట దీనికి నిదర్శనము. సులువు, వుసులు - మున్నగువిధముగా వ్యవహారమునందు కూడ ఇట్టి రూపములు వినిపించుచునే యుండును

వర్ణసమీకరణము అని యనగా రెండు భిన్నములయిన వర్ణములు కలిసి సంయుక్తాక్షర మైనప్పుడు అందొక వర్ణము రెండవవర్ణమును తనలో కలిపివేసికొనుట. అనగా సంయుక్తాక్షరమునకు బదులుగా తద్భవమునందు ద్విత్వాక్షరము మాత్రమే యేర్పడు నని యర్థము.

తత్సమము	తద్భవము	మార్పు
శ్రేష్ఠి	సెట్టి	ష్ఠి>ట్టి
పక్వ	పక్క	క్వ> క్క
శర్కర	చక్కెర	ర్క> క్క
అర్పణము	అప్పనము	ర్ప>ప్ప
శబ్దము	సద్దు	బ్ద>ద్దు
అన్యము	అన్నెము	న్య> న్నె

'య' వర్ణముతో కూడియున్న అన్యాదిశబ్దములు తద్భవములందు 'ఎ' వర్ణమును గలిగియుండుట గమనార్హము. 'య' వర్ణము 'జ' వర్ణముగా పరిమాణము నొందినయెడల ప్రాకృత సంపర్కముతోడనే తద్భవమేర్పడెనని నిశ్చయముగా

చెప్పవచ్చును. సంధ్య - సంజ ; శయ్య - సెజ్జ॥ ఇట్టిచోట్ల తద్భవరూపములు ప్రాకృతమువలననే యేర్పడెను. అట్లు కాని యెడల 'య'స్థానమున ఎత్వము కలుగుట ప్రయోగసిద్ధము. సంధ్య - సందె ; విద్య - విద్దె మున్నగునవి అట్టివానికి నుదాహారణములు.

'పుణ్యము' మున్నగునవి తద్భవములగునపుడు తొలి దొల్త వర్ణాగమము నొంది 'పునియము' మున్నగువిధముగా నై యుండును కాని సంయుక్తాక్షరమును పలుకునప్పుడున్న డినిక చాలకపోవుటచే ద్విత్వమునొంది 'పున్నియము' అని యైయుండును. ఇచ్చటి 'య' వర్ణము 'ఎ' వర్ణముగా మారు గుణము గల దగుటచే, అట్లు మారగా 'పున్నెము' అను రూపము కూడ నేర్పడెను. ఇట్టివే వన్నియ, వన్నె ; జన్నియ, జన్నె ; కన్నియ, కన్నె - మున్నగు విధముగా ద్వైరూప్యము నొందిన రూపములన్నియు కూడ.

ఇంతకును సంస్కృతమునుండియు ప్రాకృతములనుండియు కూడ తద్భవములు ఏర్పడుననిచెప్పికొంటిమి అది యథార్థమే. కాని ప్రాకృతమునకు కూడ మూలము సంస్కృతమే. కావున సంస్కృతమునుండి ప్రాకృతములోనికి వెళ్ళి తెలుగులోనికి వచ్చిన శబ్దమేదియో, ప్రాకృతములోనికి వెళ్ళకుండ సరాసరి తెలుగులోనికి వచ్చినశబ్దమేదియో నిర్ణయించుట కష్టము. ధ్వని పరిణామము చాలవరకు తెలుగునందును ప్రాకృతము వందును ఒకే మాదిరిగా నుండును. ఒక్క 'య'వర్ణము 'జ'వర్ణముగా మారినచోట మాత్రము ప్రాకృతసంపర్కమును పట్టియిచ్చును. తక్కినచోట్ల అట్టి యవకాశము కలుగదు. కావున

సంస్కృత భవములను,ప్రాకృత సమ, ప్రాకృతభవములను నిర్దిష్ట ముగా చెప్పుట సులభసాధ్యముకాదు. ఏమయినను, ఆమూడు రకముల శబ్దములను అచ్చతెలుగు లనియే భావింతు మన్న విషయము స్మర్తవ్యము.

దేశ్యములు: చిన్నయసూరి "త్రిలింగ దేశవ్యవహార సిద్ధంబగు భాష దేశ్యంబు" అని నిర్వచించెను. దీనినిబట్టి దేశ్య పదములు తత్సమ తద్భవములవలె సంస్కృత ప్రాకృతములతో గాని, మరేభాషలతోగాని ఏవిధమైన సంబంధమును లేకుండ తెలుగుదేశములోనే పుట్టి తెలుగుదేశములోనే వ్యవహారము నొంది రూఢములయిన పదము లని యనిపించును. దేశ్యములకు సంస్కృత ప్రాకృతములతో జన్యజనక సంబంధముకాని, సోదర సంబంధము కాని యేమాత్రమును లేదనుమాట వాస్తవము. కావుననే అవి దేశ్యములైనవి చూడగా చూడగా దేశ్య పదములతో సామ్యముగల పదములు దక్షిణాది భాషలయిన తమిళ కర్ణాట మలయాళాదిభాషలలో సుస్పష్టముగా కనిపింప పాగినవి, కావున 'దేశ్యములు' అని యన్నప్పుడు 'ఇతరభాష లతో ఏవిధమైన సంబంధమును లేనివి' అని యనుకొనుట సమం జసము కాదు. తమిళ కర్ణాట మలయాళాది భాషలలో నున్న దేశ్యములును, తెలుగునందలి దేశ్యములును ఒకేభాషా కుటుంబ మునకు చెందినవన్న విషయము దీనినిబట్టి వ్యక్తమగుచున్నది.

తెలుగు	తమిళము	కన్నడము	మలయాళము
నేను	నాన్	నాను	ఞాన్
పల్లు	పల్	హల్లు	పల్లు
తల	తలై	తలె	తల

తెలుగు	తమిళము	కన్నడము	మలయాళము
మన్ను	మణ్	మణ్ణు	మణ్ణు
కన్ను	కణ్	కణ్ణు	కణ్ణు
తెర	తిరై	తెరె	తిర
కొలను	కుళమ్	కొళను	కుళం
మొదలు	ముదల్	మొదల్	ముదలు

పై పదముల పట్టికనుబట్టి తెలుగునందలి పదములతో ఇతర పదములకు గల సామ్యమును సులభముగా గుర్తుపట్ట వచ్చును. కావున దేశ్యములు కర్ణాటాది, భాషాదేశ్యములతో సోదర సంబంధమును కలిగియున్న వన్న సంగతిని నిరాపేహ ముగా నంగీకరింపవచ్చును.

ఇప్పుడింక, ఇంకొక విభాగము కలదు. చిన్నయసూరి అన్యదేశ్యములనుగూర్చి ప్రస్తావింపలేదు అయినను పూర్వ వ్యాకర్తలును, అనంతర వ్యాకర్తలును అన్యదేశ్యములనుగూర్చి ప్రసంగించి యుండిరి. పైని చెప్పికొన్నదానినిబట్టి సంస్కృత ప్రాకృతములనుండి అనేకపదములు తెలుగులో ప్రవేశించెనని తేలినది. ఆ తమిళాది పదములతో సామ్యముగల యనేక పదములు తెలుగునందున్నవన్నియు తేలినది ఇటుకాక, ఇతర కారణముల ప్రాబల్యమువలన పారశీకము, అరబ్బీ, ఆంగ్లము, పోర్చుగీసు మున్నగు భాషాపదములు తెలుగులో ప్రవేశించుట జరిగినది. పైని చెప్పిన తత్సమ తద్భవ దేశ్యములలో ఇముడ కుండ వేరుగా వచ్చి చేరినటువంటివానిని అన్యదేశ్యము లని యందురు.

రోజు, కలము, పసందు, సుమారు, అసలు – మొదలైన మాటలు తెలుగులో విడదీయరానంతగా కలిసిపోయినవి. కాని యివియన్నియు అన్యదేశ్యములే. ఇట్లే కచ్చేరి, దస్తావేజు, దస్తూరి, అమీనా, గుమస్తా మొదలైనవి కూడ అన్యదేశ్యములే. అరబ్బీ పారశీకాది భాషలనుండి వచ్చిన వీనిని ఉరూ సంబంధి భాషలుగా పరిగణింతము.

వైవి మార్పులేకుండ వచ్చినరూపములే. అటుకాక 'తరాజు' అను రూపమునకు బదులు 'త్రాసు' అనియు 'దవాత్' అనుటకు బదులు 'దవతి' అనియు మార్పు నొందిన రూపములు కూడ కొన్నికలవు.

రోడ్డు, స్టేషను, టికెట్టు మున్నగువిధముగా మార్పు చెందకుండ వచ్చిన రూపములు గలవు. ఆంగ్లము, ఫ్రెంచి, డచ్చి మున్నగుభాషలలోనుండి వచ్చినపదములను ఆంగ్లభాషా సంబంధులుగనే పరిగణింతము.

కలకత్తేరు, పేనా, బేడా, అలమారా, బీరువా మొదలయినవి మార్పు పొందిన రూపములు.

ఇట్టి అన్యదేశ్యములనుగూడ కొందరు దేశ్యములలోనే అంతర్భవించునట్లు తలచిరి అట్లు చేసినయెడల కొన్ని చిక్కులు తటస్థించును రావు, రవర, తింగణా మొదలయినవి అన్యదేశ్యములు అచ్చతెనుగు కావ్యములలో వీనికి కావులభించినది. కాని తెనుగు నందున్న ముప్పదియారు వర్ణములయందును 'ర' వర్ణము లేదు కావున 'దేశ్యము' అని యనవలయుననన్నచో తదతిరిక్తమైన వర్ణము లేకుండ నుండవలయును. ఉన్నవర్ణ

మును మార్పుట వీలుకాదు కాబట్టి దేశ్యముతోపాటు పరిగ ణింపకుండ నుండుట యుచితము. నిషా, షాదుషా మొదలయిన పదములకడ సైతము ఇట్టి చిక్కు కలదు కావున మరొక మార్గము ననుసరింపవలయును.

అన్యదేశ్యములను కూడ తత్సమ తద్భవములుగా విభా గించుకొనుట యుచితము అటులే యిష్టము కానిచో ఉర్దూ సమము, ఉర్దూభవము; హిందీసమము, హిందీభవము, ఆంగ్లసమము, ఆంగ్లభవము - మున్నగు విధముగా వాడుకొన వచ్చును సమశబ్దములను వాడుకొనునప్పుడు అవసరమునుబట్టి మూలభాషావర్ణములను గ్రహింపక తప్పదు. భవశబ్దములను వాడునప్పుడు తెలుగునందలి వర్ణములతోనే సరిపుచ్చుకొన వచ్చును

మొత్తముమీద సంస్కృతసమముకాక, తక్కిన యన్ని శబ్దములును ఆచ్చికముగా ఉపయోగింపనర్హమైనవే. 'సాదము' మొదలయిన తమిళపదములు తరువాతి కాలమున తెలుగులో ప్రవేశించినవి. 'హొమ్మ' మొదలయినవి కన్నడమునుండి యనం తరకాలమున ప్రవేశించినవి. ఇట్లు అనంతరకాలమున చేరి, భాషలో లీనము కాక ప్రత్యేకవర్గముగా నిలుచు మాటలను ప్రతిదేయపదము (Loan words) లని యందురు.అన్యదేశ్యము లన్నియు నట్టివే.

ఈ తత్సమ తద్భవ దేశ్యములు అన్యదేశ్యములతో పాటుగా, మన చరిత్రను సంస్కృతిని ఇతరేతరసంబంధములను గూడ తెలియజేయుటకు సమర్థములై యున్నవి

ధ్వని ప్రకరణము

భాష యని యనుటతోడనే ఉచ్చారిత మనునది ప్రధానాంశమై కనుపట్టును. భాషను పలుకునప్పుడు విశ్లేషింపగా పర్వడిన అత్యంత స్వల్పభాగమునకు 'ధ్వని' యనివేరు. అనగా ఈ ధ్వనుల సమూహమునే భాషయని వేరొక్కనవచ్చును ఇట్టి ధ్వనిని వ్యాకర్తలు 'వర్ణము' అని యనిరి. వర్ణములు వేరువేరు భాషలకు వేర్వేరు విధముగా వేరువేరు సంఖ్యలో మండును.

వర్ణ సమామ్నాయము

అరవమున వర్ణము అని యసుచకు 'ఎఱుత్తు' అని యందురు 'అచ్చు' అని యనుటకు 'ఉయిర్' అని యందురు "అ ఆ ఇ ఈ ఉ ఊ ఎ ఏ ఐ ఒ ఓ ఔ" అను నీపండ్రెండు వర్ణములును అచ్చులు. ఇవి మాత్రమేకాక అరవమునందు ఆయ్దమను వర్ణమును, అర్ధమాత్రాకము లగు 'ఇ ఉ'లును కూడ కలవు.

'హల్లు' అని యనుటకు 'మెయ్' అని యందురు. "క ఙ చ ఞ ట ణ త న ప మ య ర ఱ ల ళ వ" అను నీపదు వారఱీరములు హల్లులు. ఇవియే కాక 'ఱ' యను నొక యఱీరమును, మూర్ధన్య 'న' కారమును గూడ అరవమునందు కలవు.

కన్నడమునందు పైని చెప్పిన పండ్రెండచ్చులును గలవు అరవమున లేని పూర్ణానుస్వారము కూడ ఇందు కలదు. పైహల్లులతోపాటుగా కన్నడమునందు 'గ జ డ ద బ స హ'

యనునవి కూడ కలవు. అరవమునందలి ఆయ్తము కాని, మూర్ధన్యనకారము కాని కన్నడమునందు లేవు

తుళుభాష యందు పైనిచెప్పిన పండ్రెండచ్చులతో పాటుగా అకారమునకు ఒకారమునకు మధ్యస్థమైన ఉచ్చారణ గల యొక వర్ణము, అకారమునకు ఎకారమునకు మధ్యస్థమైన ఉచ్చారణ గలమరొక వర్ణము కూడ కలవు. పూర్ణానుస్వారము కూడకలదు "కగ ఙ చ జ ఞ ట డ ణ త ద న ప బ మ య ర ల వళ ష స హ ళ" అని యిరువది నాలుగు వాల్లులు కలవు.

తెలుగుభాషయందు "అ ఆ ఇ ఈ ఉ ఊ ఎ ఏ ఐ ఒ ఓ ఔ ం" అను పదునాలుగచ్చులు గలవు. "క గ చ జ ట డ ణ త ద న ప బ మ య ర ఱ ల వ శ ష హ ళ" అని యిరువది మూడు వాల్లులు కలవు కుట్రియలిగరమ్, కుట్రియలుగరమ్- అని పిలువబడు అర్ధమాత్రాకములయిన 'ఇ ఉ'లు ఉచ్చారణమునందు వినిపించును గాని వ్యాకర్త లెవ్వరును వానిని ప్రత్యేకముగా గుర్తించి ప్రమాణీకరింపలేదు.

వ్యాకర్తలు వర్ణసమామ్నాయమందు చేర్చి పరిగణింపక పోయినను 'ఱ' కారము తెలుగున నున్నదనియే శాసనములు నిరూపించుచున్నవి. శకటరేఫమును వాగనుశాసనులు బిందు యుతమైన రవర్ణముగా పేర్కొనిరి. అలఘువులయిన 'య ర ల వ' లకు తెలుగున ప్రత్యేకమైన లిపిలేదు. కాని ఆచరణము నందు ఱ ళ అనువానిని అలఘు ర ల వర్ణములకు వాడుట అత్యంతప్రాచీన కాలమునుండియు కనిపించుచున్నది.

సంస్కృతప్రభావ మధికముగా పడిన పిమ్మట కర్ణాటాంధ్ర మళయాళములలో సంస్కృత పదము లనేకముగా చేరినవి. వానితోపాటు ఆ ధ్వనులుకూడ వచ్చి చేరినవి. అరవమునందు ఈ మార్పు చాల తక్కువగా కనిపించును. అయినను 'గ్రంథలిపి' యందు ఈ ధ్వనులకుకూడ లేఖన విధానము గలదు.

ధ్వనుల వర్గీకరణము

ఏభాషయం దైనను ధ్వనులను కొన్ని వర్గములుగా విభాగించుకొనుట యవసరము. ఆయా ధ్వనులనుగురించి ముచ్చటించుకొనవలసివచ్చినప్పుడు సామూహికముగా ఆ యా వర్గ నామములనుబట్టి వ్యవహరింపవచ్చును. ఈ వర్గీకరణము మూడు పద్ధతుల ననుసరించి మూడు విధములుగా జరుగును 1. అక్షరవిభాగము 2. శ్వాసనాదవిభాగము 3 స్వర్యాది విభాగము. ఇందు ఒక్కొక్క విభాగమునుగురించి వివరముగా తెలిసికొందము.

1. అక్షరవిభాగము: తెలుగునందలి వర్ణములను స్థూలముగా అచ్చులనియు హల్లులనియు రెండు రకములుగా విభాగింతురు. చిన్నయసూరి వర్ణసమామ్నాయమును దెల్పుచు "ఇందకారాదు లచ్చులు కకారాదులు హల్లులు అక్షరవిభాగ మీలాగుననే మీఁద నెఱుంగునది." అని వ్రాసెను "అ" నుండి విసర్గమువరకు గల వర్ణములు హల్లులు. నిజమునకు అచ్చులు, హల్లులు - అన్నవి తక్కిన సంజ్ఞలవంటివే యైనచో "అక్షరవిభాగ మీలాగుననే మీఁద నెఱుంగునది" అని పేర్కొన వలసిన యవసరము లేదు. ఇది సంస్కృతీకరణము

వలన వచ్చిన సంకేతములు. కావున అష్టాధ్యాయిలో సాంకేతికముగా పర్వడినదే కాని అర్థవంతము కాదు.

సంస్కృతమున పదునాలుగు మహేశ్వర సూత్రములు గలవు. అవి సంస్కృతవర్ణసమూహ్నాయమును నిరూపించును. అందు మొదటి నాలుగు సూత్రములకు ప్రత్యాహార ప్రక్రియ వనుసరించి యేర్పడిన సంకేతము 'అచ్' అనునది. అ ఇ ఉ ణ్-బు ఋ క్ - ఏ ఓ ఙ్ - ఐ ఔ చ్॥ ఇందు ప్రతిసూత్రమునకు చివరనున్న పొల్లక్షరములను ఇత్సంజ్ఞ లని యందురు. మొదటి యక్షరమునుండి పొల్లక్షరము వరకు గల వర్ణముల నన్నింటిని పలుకుటకు బదులుగా మొదటి వర్ణమును చివరి పొల్లును గలిపి పలికిన చాలును. మొత్తము వర్ణము లన్నియు గ్రహింపబడును. 'అణ్' అని యన్నచో మొదల 'అ ఆ ఇ ఈ ఉ ఊ' అను ఆరు వర్ణములను తెల్పినట్లే. 'ఇక్' అని యంటి మనుకొందము. అప్పుడు 'ఇ' నుండి 'క్' సంజ్ఞ యున్నంతవరకు గల వర్ణము లను గ్రహింపవలయును. అనగా "ఇ ఈ ఉ ఊ ఋ ౠ ఌ ౡ" అను ఎనిమిది వర్ణములను 'ఇక్' అను సంకేతము వలన గ్రహింపబడును. అట్లే 'అ' నుండి 'చ్' వరకు గల వర్ణములకు 'అచ్' అనునది సంకేతము. దీనివలన అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ ఌ ౡ ఎ ఏ ఐ ఒ ఓ ఔ ం ః॥ అను వర్ణము లన్నింటిని గ్రహింపవలయును. నిజమునకు పై సూత్రముల యందు హ్రస్వము లగు ఎ ఒ వర్ణములకు కావు లేదు. అట్లే చివరనున్న అర్ధానుస్వార పూర్ణానుస్వార విసర్గములకు కావు లేదు. అయినను కొంచెము సరుకుకాటుతో వానిని కూడ

స్వీకరింపవలయు నన్న యభిప్రాయముతోనే 'అచ్చు' అను సంకేతమును వాడుట జరిగెను.

మహేశ్వర సూత్రములందు ఐదవ సూత్రమున ఆద్య ఊరమైన 'హ' తో పదునాల్గవ సూత్రమునందలి చివరి పొల్లఊరమైన 'ల్' కలుపగా 'హల్' అని పర్వడినది. హయవరట్ - లణ్ - ఞ మ ఙ ణ నమ్ - ఝ భ ఘ ఢ ధ ష్ - జబగడదశ్ - ఖ ఫ ఛ ఠ థ చ ట త వ్ - కపయ్ - శషసర్ - హల్ ॥ అనునవి మిగిలిన పదిసూత్రములు ఇందు మొదటివర్ణము 'హ' చివరి పొల్లు వర్ణము 'ల్' - ఈ రెండును కలుపగా 'హ య వ ర ల' మున్నగు వర్ణము లన్నియు గ్రహింపబడును. ఇచ్చటి క్రమము భిన్నముగా నున్నది. అయినను 'క' నుండి 'శ' వరకుగల వర్ణములన్నియు 'హల్' అను సంకేతముచేత సూచింపబడుచున్నవి. క్రమము మారినప్పటికిని, చ జ లను గ్రహింపకపోయినప్పటికి 'హల్' అను సంకేతమునే గ్రహించి, సర్దుబాటు చేసికొనుట యిందు కాననగును ఈ సర్దుబాటును సూచించుటకే, ఈ పేళ్ళు సాంకేతికము లని తెలియజేయుటకే సూరి "ఈ లాగుననే మీఁద నెఱుంగునది" అను పెచ్చరికను చేయవలసి వచ్చినది. మొత్తముమీద ఈవిభాగము సాంకేతికముగా జరిగినదే కాని అర్థవంతము కాదు.

అచ్చులకు స్వరములు ప్రాణములు అని మరి రెండు పేళ్ళు గలవు. స్వరములు అని యనగా స్వయముగా ఉచ్చరింపబడునవి యని యర్థము 'అ ఆ' మున్నగువానిని ఉచ్చరింప

వలసి వచ్చినప్పుడు ఇతర వర్ణముల సాహాయ్య మేమాత్రమును గ్రహింపవలసిన యావశ్యకము లేదు. ప్రాణములు అనునది కూడ ఇట్టిదే. తమిళమందున్న 'ఉయిర్' అనునది దీనితో సమానార్థకమే.

హల్లులకు వ్యంజనములు, ప్రాణులు అని మరి రెండు పేళ్ళు గలవు. ఉచ్చారణ సమయమున ఇతర సాహాయ్యము నపేక్షించుటచేత వీనికి వ్యంజనములు అను పేరు తగియున్నది. 'క్, ఖ్' మున్నగువానిని అట్లే పలుకవలయుననిన చాల శ్రమ కలుగును కావునసే అచ్చులను చేర్చి 'క,ఖ' మున్నగు విధముగా పలుకుదుము. వర్ణసమామ్నాయమునందుకూడ కేవలము పొల్లువర్ణములనే చేర్చుకొనవలసియున్నను, ఉచ్చారణ సౌకర్యముకొరకై 'అ' వర్ణమును చేర్చి పలుకుట సంప్రదాయమైనది హల్లులు శరీరము వంటివనియూ, అచ్చులు ప్రాణము వంటివనియు, ప్రాణము చేరుటచేత శరీరము ప్రాణి యనిపించుకొనుననియు భావించి హల్లులను 'ప్రాణులు' అని పిలుచుట జరిగినది. తమిళులు హల్లులను ప్రాణులుగా కాక, కేవల శరీరములుగానే భావించిరి అందువల్లనే శరీరము అను అర్థముగల 'మెయ్' అను శబ్దమును హల్లునకు పర్యాయ వాచకముగా వాడుదురు

ఈ హల్లులలో మరల 'కచటతప గజడదబ' అనువానిని 'అల్పప్రాణము'లనియు 'ఖఛఠథఫ ఘఝఢధభ' అనువానిని 'మహాప్రాణము' లనియు పేర్కొందురు.

అచ్చులయందు 'అఆఉఊఋౠఎఒ' అనువానిని హ్రస్వము లని యందురు. 'ఆ ఈ ఊ ఋూ ౠా ఏ ఐ ఓ ఔ' అను

వానిని దీర్ఘములవి యందురు. పై వానిలో 'ఐ ఔ' అనునవి రెండును సంయుక్తాచ్చులు(diphthongs) అనబడును. 'అయిదు-ఐదు, అవుడు- ఔడు' మున్నగు రూపములనుబట్టి 'ఐ' అను దానియందు 'అ' అను వర్ణములు కలవనియు 'ఔ' అను దానియందు 'అ' అను వర్ణములు కలవనియు స్పష్టముగా తెలియుచున్నది తక్కిన అను వర్ణములన్నియు సమాచ్చులు (simple vowels) అని అనబడును.

2. శ్వాస నాద విభాగము : మనము చేతితో గడ్డము క్రిందుగా గొంతుకను మృదువుగా తడిమిచూచుకొనగా ఒక కాయవలె తగులును. దానిని ఆంగ్లమునందు సామాన్య వ్యవహారమున 'Adam's apple' అనియందురు. శాస్త్రపరిభాషలో దానివి Larynx అని యందురు. తెలుగునందు పైకి కనిపించు భాగమును 'గొంతుముడి' యని కాని 'గళగ్రంథి' యని కాని యనవచ్చును. నిజమునకు అచ్చటవే 'స్వరపేటిక' కలదు. ఆంగ్లమున దానిని Glottis అని యందురు. స్వరపేటికయందు రెండు వాదతంత్రులు (vocal chords) కలవు. శ్వాసనాళము (wind pipe) లోనుండి వాయువు వాద తంత్రుల నడుమగా వెలువడి నోటినుండి కాని ముక్కునుండి కాని బయట పడును. అప్పుడు ధ్వనులు ఉత్పన్నము లగును.

నాదతంత్రులు పరస్పరము దూరముగానుండగా, వాని నడుమనుండి యే యవరోధమును లేకుండ సులభముగా వాయువు వెలువడినప్పుడు ఉచ్చారితములగు ధ్వనులను 'శ్వాస ములు' అని కాని 'అఘోషములు' అని కాని పిలుతురు. ఆంగ్లమునందు వీనిని unvoiced sounds అని కాని surds

అని కాని పిలుతురు. వాల్లులలో క ఖ, చ ఛ, ట ఠ, త థ, ప ఫ, శ ష స – అను వర్ణములు శ్వాసములు.

నాద తంత్రులు పరస్పరము సన్నిహితముగా నుండగా వాని మధ్యలోనుండి యొరసికొనుచు వాయువు వెలువడి నపుడు ఉచ్చరితములగు ధ్వనులను 'నాదములు' అని కాని 'ఘోషములు' అని కాని పిలుతురు. ఆంగ్లమునందు వీనిని voiced sounds అని కాని sonants అని కాని యందురు. అచ్చులన్నియు నాదములే. అని కాక వాల్లులయందు గ ఘ ఙ, జ ఝ ఞ, డ ఢ ణ, ద ధ న, బ భ మ, య ర ల వ హ– అనువర్ణములు నాదములయందే చేరును.

కొందరు శ్వాసవర్ణములను కఠోర వాల్లులు (hard consonants) అనియు నాద వర్ణములను కోమల వాల్లులు (soft consonants) అనియు పిలుచుట కలదు. 'క' వర్ణము మున్నగువానిని ఉచ్చరించునపుడు నాదతంత్రులయందు అవరోధము లేకుండుటచేత శ్వాసనాళమునుండి వాయువు వేగవంతమై వెలువడును అట్టియెడల దానిని వారించుటకు నాలుక (కరణము) తో గట్టి ప్రయత్నము చేయవలయును. ఈ ప్రయత్నాపేక్షనుబట్టి కకారాది శ్వాసములకు కఠోర వాల్లులు అను నామముకూడ ఉచితముగనే యున్నది. వాగమ శాసనులు 'క చ ట త ప' లకు పరుషములని నామకరణము చేసిరి. ఆ 'క చ ట త ప' లు వాని వాని వర్గయుక్కులతో కలిసి కఠోర వాల్లులుగా పరిగణింపబడుచున్నవి. 'గ జ డ ద బ' లకు సరళము లను సంజ్ఞ వాగనుశాసను లుంచిరి అవియు,

వాని వర్గయుక్కులను, అనునాసికాక్షరములను కలియగా పర్వడునవి కోమల హల్లులు వీనిని పలుకునప్పుడు నాదతంత్రులు సన్నిహితముగా నుండి లోనుండి ప్రసరించు వాయువునకు అవరోధమును కలిగించును. కావున వాయువుయొక్క వేగము కొంత మందగించి యుండును. కాబట్టి నాలుక (కరణము) తో సులభ ప్రయత్నము చేసినంతనే గకారాది వర్ణములు ఉత్పన్నము లగును.

శ్వాసనాద భేదమును శ్రవణమాత్రముచేత గుర్తింప గలుగుటకు మంచి అభ్యాసము కావలయును. అయినను వానిని గుర్తించుటకు సాధారణముగా రెండు మార్గములు గలవు. వర్ణములను పలుకునప్పుడు గొంతుముడిపై మృదువుగా వ్రేలు నుంచి చూచి తెలిసికొనవచ్చును నాదవర్ణములను పలుకునప్పుడు స్వరపేటిక యందలి నాదతంత్రుల ప్రకంపనములను (vibrations) గుర్తింపవచ్చును. శ్వాసములను పలుకునప్పుడు ప్రకంపనములు కలుగవు కావున అట్టి యనుభూతి యుండదు ఇది యొక మార్గము. రెండవమార్గము మరొకటి. ధ్వనులను ఉచ్చరించునపుడు రెండు చెవులయందును వ్రేళ్ళను దూర్చుకొని యుండవలయును. నాదవర్ణముల నుచ్చరించునపుడు గింగురుమని ఒకరొదవలె వినిపించును. శ్వాసవర్ణములను పలుకునపు డట్టిరొద కలుగదు.

ఈ విభాగము నాదతంత్రుల యవస్థనుబట్టి కావింప బడినది.

స్పర్శాది విభాగము : నాలుక యందలి యొక భాగము నోటియందలి యొక భాగమును స్పృశించుట వలన

నుచ్చరింపబడు వర్ణములను స్పర్శములు (mutes) అని యందురు ఈవర్ణములను పలుకునప్పుడు శ్వాసనాళమునుండి వెలువడు వాయువు రుద్ధమై ఒకసారి విడువబడును ఆ లక్షణమును బట్టి స్పర్శములకు స్ఫోటములు (plosives) అను పేరు కూడ కలిగెను. కఖగఘ - టఠడఢ - తథదధ - పఫబభ అను పదునారువర్ణములను స్పర్శములనికాని స్ఫోటములని కాని యందురు. వీనిని పలుకునపుడు వాయుమార్గమును పూర్తిగా మూసివేసి తెరచుట జరుగుచున్నది. కావున వీనిని సంవృత వ్యంజనములు(shut consonants) అని stops అనికూడ పిలుతురు.

కొన్ని వర్ణములను పలుకునప్పుడు శ్వాసనాళమునుండి వెలువడు వాయువు ఏదోయొక స్థానమున మిక్కిలి యవరోధము నందును అప్పుడు వాయువు ఆ యవరోధమును దాటి వెలువడుటకు చేయుప్రయత్నమువలన పాముబుసవంటి యొక ధ్వని వినవిచ్చును. అట్టి ధ్వనితోకూడిన వర్ణము లగుట వలన శ ష స హ - అను వాలుగు వర్ణములకు ఊష్మములు (spirants) అను పేరు కలిగినది. ఈ ధ్వనులను పలుకునప్పుడు వాలుకకును (దంతమూలము గాని, తాలువుగాని, మూర్ధముగాని) స్థానమునకును నడుమ కొంచెముగా వ్యవధానముండును; అనగా పూర్తిగా మూసికొని పోదని యర్థము. వాయు వా వ్యవధానములోనుండి సంఘర్షణము నొందుచు వెలువడును. కావుననే సంఘర్షణమువలన జనించిన వర్ణములమ భావముతో వీనిని ఘర్షములు (fricatives) అని కూడ అందురు. పైని చెప్పికొనిన స్ఫోటములలోవలె ఊష్మములను ఉచ్చరించునప్పుడు వాయువు ఎచ్చటను పూర్తిగా రుద్ధమగుట

లేదు. అనగా అవ్యాహతములై వెలువడు చున్నవన్నమాట! కావునసే వీనిని అవ్యాహతములు (continuants) అని కూడ పిలుతురు వీనికి వివృతహల్లులు (open consonants) అను మరొకపేరు కూడ కలదు.

వర్ణముల నుచ్చరించు సమయమున మృదుతాలువు (కొండనాలుక) వంగి శ్వాసనాళమునుండి వెలువడు వాయువును కొంచెముగా కాని, పూర్తిగా కాని నోటిలోనికి రాకుండ నిరోధించును, అట్టియెడల ఆ వాయువు నాసికావివరము (nasal cavity) వెంబడి వెలువడును. అట్టి సమయమున ఉచ్చరింపబడు వరములైన 'ఙ ఞ ణ న మ' అనువానికి అనునాసికములు (nasals) అని పేరు

కొన్ని వర్ణముల నుచ్చరించు సమయమున నాలుక దంతమూలమును గాని మూర్ధమునుగాని స్పృశించును. అట్టియెడల మధ్యభాగము రుద్ధమై యుండుటచేత నాలుకయొక్క యిరుపార్శ్వములనుండి బయలువెడలును. ల, ళ అను రెండు వర్ణములను పలుకునప్పుడు వైని చెప్పిన రీతిగా పార్శ్వముల నుండి వాయువు వెలువడును గావున వీనికి పార్శ్వికములు (laterals) అని పేరు కలిగెను. కొందరు వీనిని స్పష్టభాషలో (side consonants) అనికూడ పిలుతురు.

తెలుగునందలి 'ర'వర్ణము లుంఠితవరము. దీనిని పలుక వలసివచ్చినప్పుడు నాలుక కొనను వైకొత్తి వెనుకభాగముతో మూర్ధమును స్పృశింపవలయును. ఇట్లు వెనుకభాగముచేత స్పృశించుటచేతనే దీని కీపేరు కలిగెను. ఆంగ్లమున దీనిని

rolled consonant అని యందురు. తెలుగునందలి కఠిన రేఫము సాధురేఫముకంటె భిన్నమైన ఉచ్చారణ కలది. కఠిన రేఫమును పలుకునప్పుడు జిహ్వాగ్రము నొక ప్రక్కగా వంచి మూర్ధమును స్పృశింపవలయును అప్పుడు ఒక్కమారు కాక అవ్యవహితముగా పెక్కుమారులు స్పృశించుట జరుగును. Calling Bell పనిచేయునట్టి విధానమును గుర్తు తెచ్చుకొనిన యెడల కఠినరేఫముయొక్క ఉచ్చారణ విధానమును గుర్తుపట్ట వచ్చును ఇట్లు పెక్కుమారులు స్పృశించుటచేత ఉత్పన్న మగుచున్నది కావున అవర్ణమును కంపితము (trill) అని యందురు.

తెలుగునందున్న యరలవ అను వర్ణములనుఅర్ధాచ్చులు (semi-vowels) అని యందురు. యవర్ణమును పలుకునప్పుడు జిహ్వాగ్రమును అంగిటికి దగ్గరగా తీసికొనివెళ్ళుట జరుగును; కాని స్పృశించుట జరుగదు. వ వర్ణమును పలుకునప్పుడు క్రింది పెదవిని పైదంతములకు క్రిందుగా తీసికొని వెళ్ళుట జరుగును; ఇచ్చటను స్పృశించుట జరుగుట లేదు. అచ్చులకు వలె వీనిని పలుకునప్పుడుకూడ కరణస్థానములకు కల యిక లేనందువల్లనే వీనిని 'అర్ధాచ్చులు' అని పరిగణించుట జరిగియుండును. వీనికి 'అంతస్థములు' అనుపేరుకూడ కలదు.

అనునాసికములను, పార్శ్వికములను. లుంఠిత కంపితములను, అర్ధాచ్చులను కలిపి సామూహికముగా ద్రవవర్ణములు (liquids) అని వ్యవహరించుట కూడ కలదు. ఊష్మములతో పాటుగా ద్రవవర్ణములను గూడ చేర్చి అవ్యాహతములు (continuants) అని యందురు.

హల్లులయందు చాచాపుగా అన్నింటిని చూచితిమి. చ చ్ఛ జ జ్ఝ అను వర్ణములు మాత్రము మిగిలియున్నవి. వీనిని ఉచ్చరించునపుడు జిహ్వాగ్రము అంగిటిని తాకును. అప్పుడు వాయువు నిరుద్ధమై, ఒక్కసారిగా బహిర్గతమగును. ఇంతవరకు స్పర్శలక్షణము కలదు. అదేసమయమున ఊష్మ ములను పలుకునప్పటివలె పాముబుసవంటి ధ్వనికూడ వినవచ్చును. కావుననే ఈ వర్ణములను ఉభయధర్మములనుబట్టి 'స్పరోష్మములు' (affricates) అని యందురు.

ఇంతవఱకు పలికెడు విధానము (manner) ను బట్టి యీ వర్గీకరణము జరిగినది. అనగా ప్రయత్నము నాధార ముగా చేసికొని హల్లులను పైవిధముగా విభాగించితిమని యర్థము.

ఒక వర్ణమును పలుకవలయుననున్న ముఖయంత్రమునందు పెక్కుమార్పులు కలుగును. నాలుక యందలి యొకభాగము నోటియందలి యొకభాగమును ఒక విధముగా స్పృశించుట వలన నొక్కొక వర్ణము పుట్టును. జిహ్వాభాగమును కరణ మనియు, నోటియందలి భాగమును స్థానమనియు, స్పృశించు విధానమును ప్రయత్నమనియు నందురు. కరణ స్థాన ప్రయత్న ముల భేదమునుబట్టియే ధ్వనులయందు భేదము కలుగుచున్నది. పైని ప్రయత్న భేదమును బట్టి ధ్వనుల నెన్నివిధములుగా విభా గింపవచ్చునో చూచితిమి. ఇప్పుడింక స్థాన కరణముల విష యము చూతము.

నోటియందు ప్రసిద్ధముగా నున్న స్థానములను గుర్తు చేసికొందము. ముందరి పండ్లయొక్క వెనుకభాగమును నాలుక కొనతాకుట వలన దంత్యములు పుట్టును. కావున 'దంతములు' ఒకస్థానము దంతలమునుకొంచెము పైగానున్న భాగమును 'అంగిలి' అని యందురు అదియే తాలువు. దానికి కొంచెము పైగా ఉన్నభాగమును, అనగా నాలుకను కప్పియున్న పైభాగము వందలి మధ్యభాగమును మూర్ధము అని యందురు, నాలుకకు ఆదియందు కంఠము కలదు. కావున దానిని కంఠస్థానముగను, జిహ్వామూలముగను గుర్తింపవచ్చును. నాలుకను గూడ కంఠ దేశమునందలి భాగమును జిహ్వామూలము, మూర్ధమునకు దిగువ భాగమును జిహ్వామధ్యము ముందిపండ్లకు సన్నిహిత భాగ మును జిహ్వాగ్రము అని మూడు విభాగములు చేయవచ్చును.

కంఠ్యములు : కంఠమునుండి యుత్పన్న మగునవి యని యర్థము. నాలుక వంతటిని వెనుకకులాగి ముద్దగాచేసి (భయపడినపిల్లి శరీరమునంతను వెనుకకు కుంచించినట్లు) కంఠ బిలమును మూసి విడువవలయును. అప్పుడు కంఠ్యములు ఉద్భ వించును. నిజమునకు కంఠబిలమును మూయుట యనగా, నాలుకయొక్క దొొత్తిడివలన మృదుతాలువును కంఠమునకు అడ్డుగా నిలుపుట జరుగుచున్నది మృదుతాలువును ఆంగ్లమున soft palate అనియు velum అనియు నందురు కావున కంఠ్యములను gutterals అనుటతోపాటు soft palatals అనియు velars అనియు కూడ పిలుతురు.

అ ఆ ఎ ఏ ఐ ఒ ఓ ఔ క ఖ గ ఘ ఙ హ - అను వర్ణములను కఖలకు ముందు పలుకబడు విసర్గమును కంఠ్య ములుగా పరిగణింతురు.

తాలవ్యములు : నాలుక కొన అంగిటిని తాకుటవలన కలుగు వర్ణములను తాలవ్యములని యందురు. అచ్చులను పలుకునప్పుడు కరణస్థానముల సాన్నిహిత్యమే కాని స్పర్శ యుండదు ఇ ఈ ఎ ఏ ఐ చ ఛ జ ఝ ఞ య శ - అను వర్ణ ములను తాలవ్యములు (palatals) అని యందురు.

మూర్ధన్యములు : జిహ్వాగ్రమును కొంచెము పైకెత్తి వెనుకకు మడచి మూర్ధమును స్పృశించుటవల్ల మూర్ధన్య వర్ణము లుత్పన్నము లగును. ఋ ౠ ట ఠ డ ఢ ణ ర ఱ ష - అనునవి మూర్ధన్యములు. వీనిని ఆంగ్లమున cerebrals అనియు retroflexs అనియు పిలుతురు.

దంత్యములు : జిహ్వాగ్రము ముందరి పండ్లయొక్క వెనుకభాగమును స్పృశించుటవల్ల దంత్యములు ఉద్భవించును. ఌ ౡ చ జ త థ ద ధ న ల స - అనునవి దంత్యములు. ఆంగ్లమున dentals అని యందురు.

ఓష్ఠ్యములు : పెదవుల సాహాయ్యమువలన పలుక బడువానిని ఓష్ఠ్యములు అని యందురు. ఉ ఊ ఒ ఓ ఔ వ ఫ బ భ మ - అను వర్ణములును, వ ఫ ల కు పూర్వమందు పలుక బడు విసర్గమును ఓష్ఠ్యములుగా పరిగణింతురు ఆంగ్లమున వీనిని labials అని యందురు.

కఖలకు ముందు పలుకబడు విసర్గమును జిహ్వామూలీయ మనియు, పఫలకు ముందు పలుకబడు విసర్గమును ఉపధ్మానీయ మనియు వందురు

'వ' వర్ణమును దంతోష్ఠ్యమని యందురు. పై పండ్ల క్రిందిభాగమున క్రిందిపెదవినుంచి, ఆ వ్యవధానము వెంబడిని వాయువును విడుచుట వలన 'వ' ధ్వని పుట్టును. కావున దంతములయొక్కయు, ఓష్ఠముల యొక్కయు సాహాయ్యము వలన నుద్భవించునదగుటచే దీనికి దంతోష్ఠ్యము అను పేరు తగియున్నది.ఆంగ్లమున దీనిని denti - labial అని యందురు.

ఉచ్చారణ స్థానమునుబట్టియు, పెదవుల స్థానమును బట్టియు అచ్చులను మరల వింగడించుట జరుగును. స్వరవర్ణము లను పలుకునపుడు జిహ్వాభాగము పైకి లేచును; కొన్నియెడల నిమ్నముగా మండిపోవును; కొన్నియెడల కొంతవరకు మాత్రమే లేచును.

i అ ఆ అను వర్ణములను పలుకునపుడు నాలుక బల్లపరుపుగా మండిపోవును కావున ఆ వర్ణములను నిమ్న స్వర ములు, (low vowels) అని యందురు. ఇ ఈ అను వర్ణ ములను పలుకునపుడు నాలుక ముందరిభాగము పైకి లేచును అట్లే ఎ ఏ అను వర్ణములను పలుకునప్పుడును జిహ్వాగ్రము పైకి లేచును. కావున వీనిని ఉన్నత స్వరములు (high vowels) అని యందురు. ఉ ఊ ఒ ఓ లను

పలుకునప్పుడు జిహ్వామూలము పైకి లేచును. కావున ఇవియు ఉన్నత స్వరములే.

ii ఉచ్చారణ స్థానమునుబట్టి స్వరములను మూడువిధములుగా అగ్రిమస్వరములు, మధ్యమ స్వరములు, పశ్చిమ స్వరములు అని విభాగింపనగును. ఇ ఈ ఎ ఏ - అను వర్ణములు అంగిటికి సమీపముగా, అనగా నోటియందు ముందరిభాగమున జన్మించును. కావున వీనిని అగ్రిమస్వరములు (bront vowels) అని పిలుతురు 'అ' వర్ణము నోటికి మధ్యభాగమున నుద్భవించును. కావున దీనిని మధ్యమ స్వరము (central vowel) అని పిలుతురు. ఉ ఊ ఒ ఓ అను వర్ణములు జిహ్వామూలమునకు సమీపముగా నుద్భవించును అనగా నోటియందు వెనుక భాగమున జనించుటచే వీనిని పశ్చిమ స్వరములు (back vowels) అని పిలుతురు

iii ఉచ్చరించునపుడు పెదవులనుంచిన యాకారమును బట్టి వర్తులములు (rounded) అవర్తులములు (unrounded) అని అచ్చులు రెండు విధములుగా విభాగింపబడును. ఉ ఊ ఒ ఓ అను వర్ణముల నుచ్చరించునపుడు క్రిందిపెదవియు, పై పెదవియు వంగి ఒక వృత్తము నేర్పరచును. కావున పై యచ్చులను 'వర్తులములు' అని పిలుతురు. మిగిలిన యచ్చులన్నియు 'అవర్తులములు' అని యనిపించుకొనును.

iv నోరు తెరచుకొని యున్నరీతినిబట్టి నాలుగు విధములుగా అచ్చులను విభాగింతురు. అ ఆ అను వర్ణములను పలుకునప్పుడు నోరు పూర్తిగా తెరవ వలయును. కావున వానిని వివృతములు (open vowels) అని యందురు. ఇ ఈ

ఉ ఊ అనువానిని సంవృతములు (close vowels) అని యందురు. ఎ, ఒ అనువానిని ఈషత్సంవృతములనియు, ఏ ఓ అను వానిని ఈషద్వివృతములనియు నందురు.

ఇట్లు వాల్లులను, అచ్చులను ప్రయత్న భేదములను బట్టి స్థాన కరణ భేదములనుబట్టి భాషాశాస్త్రజ్ఞులు అనేక విధములుగా విభాగించిరి. ఈ విధమగు విభాగము వలన ఉచ్చారణదశిత చక్కగా ఏర్పడుటకు అవకాశము కలదు. భాషాశాస్త్రమునందు ఉచ్చారణమునకు ఉన్నతస్థానముండుటచేత, ఆవిషయమున శ్రద్ధ వహించి భాషాశాస్త్రజ్ఞులు పెక్కువిధములుగా ధ్వనుల స్వరూపమును నిరూపించుటకు ప్రయత్నము చేసిరి.

ధ్వనుల వివరణ

తెలుగునందును, పరిసర ద్రావిడభాషలందును గల ధ్వనుల వన్నింటి వొకచోట చేర్చి వాని స్వరూపమును విశదముగా గమనించుట యవసరము.

అ వివృత నిమ్న మధ్యమ స్వరము, (open low central vowel); అవర్తులము (unrounded); కంఠ్యము; హ్రస్వము.

ఆ వివృత నిమ్న పశ్చిమ స్వరము. (open low back vowel); అవర్తులము; కంఠ్యము; దీర్ఘము.

ఆ అర్ధవివృతము; ఉన్నతము; అగ్రిమము. (half-open high front vowel); అవర్తులము; తాలవ్యము, దీర్ఘము. తెలుగు వాడుకలో 'తాటాకు' మున్నగుచోట్ల నున్నది.

ఇ సంవృతము; ఉన్నతము, అగ్రిమము. (close high front vowel); అవర్తులము; తాలవ్యము; హ్రస్వము. (unrounded short palatal)

ఈ సంవృతము, ఉన్నతము; అగ్రిమము. (close high front vowel); అవర్తులము; తాలవ్యము; దీర్ఘము. (unrounded long palatal).

ఉ సంవృతము, ఉన్నతము; పశ్చిమము. (close high back vowel); వర్తులము; ఓష్ఠ్యము, హ్రస్వము, (rounded short labial)

ఊ సంవృతము, ఉన్నతము; పశ్చిమము (close high back vowel); వర్తులము; ఓష్ఠ్యము, దీర్ఘము; (rounded long lalbal).

ఋ సంవృతము, ఉన్నతము; అగ్రిమము (close high front vowel); అవర్తులము; మూర్ధన్యము; హ్రస్వము (unrounded short retroflex).

ౠ సంవృతము; ఉన్నతము; అగ్రిమము (close high front vowel); అవర్తులము; మూర్ధన్యము; దీర్ఘము (unrounded long retroflex).

ఌ ౡ సంవృతము; ఉన్నతము; అగ్రిమము (close high front vowels); అవర్తులము; దంత్యము (unrounded dentals).

ఎ ఈషత్ సంవృతము, మిశ్రము; అగ్రిమము. (half close mid front vowel); అవర్తులము; తాలవ్యము; హ్రస్వము (unrounded short palatal)

ఎ, తుళుభాషలో ఈవర్ణము కలదు ఇది 'ఎ' వర్ణమునకు 'ఏ' వర్ణమునకు నడుమగా పలుకబడును.

ఏ ఈషద్ వివృతము; మిశ్రము; అగ్రిమము. (half-close mid front vowel); అవర్తులము, తాలవ్యము; దీర్ఘము, (unrounded long palatal)

ఏ, తెలుగు వాడుకయందు 'అ' కారమునకు 'ఏ' కార మునకు మధ్యగా 'వచ్చాడు, పోయాడు' మున్నగుచోట్ల ఈ ఉచ్చారణ వినిపించును.

ఐ సంయుక్తాక్షరము (dipthong). అ ఇ - అను వర్ణ ముల కలయికచే నేర్పడినది.

ఒ ఈషత్ సంవృతము; ఉన్నతము, పశ్చిమము. (half-close high back vowel); వర్తులము, ఓష్ఠ్యము; హ్రస్వము (rounded short labial)

ఒ, తుళుభాషలో ఈవర్ణము కలదు. 'అ' వర్ణమునకును 'ఒ' వర్ణమునకును నడుమగా దీనిని పలుకుదురు.

ఓ ఈషద్వివృతము; ఉన్నతము; పశ్చిమము. (half-open high back vowel); వర్తులము; ఓష్ఠ్యము; దీర్ఘము (rounded long labial)

ఔ సంయుక్తాక్షరము (diphthong); అ ఉ అను వర్ణముల కలయికచే నేర్పడినది.

క శ్వాసము; వానుమూలీయము (కంఠ్యము), అల్పప్రాణము; స్పర్శము. (unvoiced unaspirated velar plosive)

ఖ శ్వాసము, వానుమూలీయము (కంఠ్యము); మహాప్రాణము; స్పర్శము. (unvoiced aspirated velar plosive).

గ నాదము, వానుమూలీయము, అల్పప్రాణము, స్పర్శము. (voiced unaspirated velar plosive)

ఘ నాదము, వానుమూలీయము; మహాప్రాణము; స్పర్శము. (voiced aspirated velar plosive).

ఙ నాదము; వానుమూలీయము; అల్పప్రాణము; అనునాసికము; ద్రవవర్ణము; అవ్యాహతము. (voiced unaspirated velar nasal liquid continuant).

చ శ్వాసము, తాలవ్యము; అల్పప్రాణము; స్పర్శోష్మము. (unvoiced unaspirated palatal affricate).

చ శ్వాసము; దంత్యము; అల్పప్రాణము; స్పర్శోష్మము. (unvoiced unaspirated dental affricate).

ఛ శ్వాసము, తాలవ్యము, మహాప్రాణము; స్పర్శోష్మము. (unvoiced aspirated palatal affricate).

జ నాదము, తాలవ్యము; అల్పప్రాణము; స్పర్శోష్మము. (voiced unaspirated palatal affricate).

జ నాదము; దంత్యము; అల్పప్రాణము; స్పర్శోష్మము. (voiced unaspirated dental affricate),

ఝ నాదము, తాలవ్యము, మహాప్రాణము; స్పర్శోష్మము. (voiced aspirated palatal affricate).

ఞ నాదము; తాలవ్యము, అల్పప్రాణము, అనునాసికము; ద్రవము; అవ్యావాతము. (voiced unaspirated palatal nasal liquid continuant)

ట శ్వాసము; మూర్ధన్యము, అల్పప్రాణము; స్పర్శము. (unvoiced unaspirated retroflex plosive).

ఠ శ్వాసము; మూర్ధన్యము; మహాప్రాణము; స్పర్శము. (unvoiced aspirated retroflex plosive).

డ నాదము, మూర్ధన్యము; అల్పప్రాణము; స్పర్శము. (voiced unaspirated retroflex plosive).

ఢ నాదము; మూర్ధన్యము, మహాప్రాణము, స్పర్శము. (voiced aspirated retroflex plosive).

ణ నాదము, మూర్ధన్యము, అల్పప్రాణము; అనునాసికము; ద్రవము; అవ్యావాతము. (voiced unaspirated retroflex nasal liquid continuant).

త శ్వాసము; దంత్యము; అల్పప్రాణము; స్పర్శము. (unvoiced unaspirated dental plosive).

థ శ్వాసము; దంత్యము; మహాప్రాణము; స్పర్శము. (unvoiced aspirated dental plosive).

ద నాదము; దంత్యము; అల్పప్రాణము; స్పర్శము. (voiced unaspirated dental plosive).

ధ నాదము; దంత్యము; మహాప్రాణము, స్పర్శము. (voiced aspirated dental plosive).

న నాదము, దంతమూలీయము, అల్పప్రాణము; అనునాసికము; ద్రవము; అవ్యాహతము (voiced unaspirated alveolar nasal liquid continuant).

ఱ నాదము: మూర్ధన్యము; అల్పప్రాణము; అనునాసికము; ద్రవము; అవ్యాహతము. (voiced unaspirated retroflex nasal liquid continuant) తమిళమున మాత్రమే కలదు.

ప శ్వాసము; ఓష్ఠ్యము; అల్పప్రాణము; స్పర్శము. (unvoiced unaspirated labial plosive).

ఫ శ్వాసము; ఓష్ఠ్యము; మహాప్రాణము; స్పర్శము. (unvoiced aspirated labial plosive).

బ నాదము; ఓష్ఠ్యము, అల్పప్రాణము; స్పర్శము. (voiced unaspirated labial plosive).

భ నాదము; ఓష్ఠ్యము; మహాప్రాణము; స్పర్శము. (voiced aspirated labial plosive).

మ నాదము; ఓష్ఠ్యము, అల్పప్రాణము; స్పర్శము; ద్రవము; అవ్యాహతము. (voiced unaspirated labial nasal liquid continuant).

య నాదము; తాలవ్యము, అంతస్థము (అర్ధాచ్చు), ద్రవము; అవ్యాహతము. (voiced palatal liquid continuant semi-vowel).

ర నాదము, మూర్ధన్యము; లుంఠితము; ద్రవము; అవ్యాహతము (voiced retroflex rolled liquid continuant).

ఱ నాదము; దంతమూలీయము; కంపితము; ద్రవము; అవ్యాహతము (voiced alveolar trill liquid continuant).

ఱ నాదము; మూర్ధన్యము; ఊష్మము; ద్రవము; అవ్యాహతము. (voiced retroflex spirant liquid continuant).

ల నాదము; దంతమూలీయము, పార్శ్వికము; ద్రవము; అవ్యాహతము. (voiced alveolar lateral liquid continuant).

వ నాదము; దంతోష్ఠ్యము; అంతస్థము; ద్రవము; అవ్యాహతము. (voiced denti-labial semi-vowel liquid continuant).

శ శ్వాసము; తాలవ్యము, మహాప్రాణము; ఊష్మము; అవ్యావహితము. (unvoiced aspirated palatal spirant continuant)

ష శ్వాసము, మూర్ధన్యము; మహాప్రాణము; ఊష్మము, అవ్యావహితము. (unvoiced aspirated retroflex spirant continuant).

స శ్వాసము, దంత్యము; మహాప్రాణము; ఊష్మము; అవ్యావహితము. (unvoiced aspirated dental spirant continuant).

హ నాదము, కంఠ్యము, మహాప్రాణము, ఊష్మము, అవ్యావహితము. (voiced aspirated gutteral spirant continuant).

ళ నాదము,మూర్ధన్యము; పార్శ్వికము, ద్రవము, అవ్యావహితము. (voiced retroflex lateral liquid continuant).

ధ్వని నియమములు - అపవాదములు

ఒక భాషలోని వర్ణములు భిన్నకాలములలో మార్పు నొందుట కాని, ఒకే కుటుంబమునకు చెందిన భిన్నభాషలలోని వర్ణములు సమకాలమున మార్పు నొందుట కాని జరుగుచుండును. ఆవిషయమును ఇంతకు ముందే కొంతకు కొంత చూచితిమి. ఇట్టి మార్పు యథేచ్ఛముగా జరుగుచుండునా?

ఏదేని నియమము ననుసరించి జరుగుచుండునా? ఒక నియమము ననుసరించియే జరుగుచుండు నని సమాధానము.

గణితమునందు, రసాయనాది శాస్త్రములందు నున్న నియమము వంటి నియమము ధ్వనిపరిణామము విషయమున వీలగునా? యనునది మరొక ప్రశ్న. గణితమునందు ఎప్పుడైనను మూడు మూళ్ళు తొమ్మిదియే యగును. మరొకటి యగుటకు వీలులేదు. ఉదజని రెండుపాళ్ళు ఆమ్లజని యొక పాలు కలియగా రాసాయనికపరిణామమువల్ల సీ కేర్పడును. దీనివిషయమున మార్పున కవకాశము లేదు ధ్వని నియమములు (Phonet e Laws) కూడ నిట్లు నిశ్చితములై యుండు నసియే కొందరి తలంపు. ధ్వని నియమములకు కూడ అపవాదములు (exceptions) కలవనియు, ప్రకృతి నియమములవలె నిశ్చితములు కావనియు కొందరి యభిప్రాయము. ధ్వని నియమముల విషయమున మూడంశములను గుర్తుంచుకొనుట యవసరము.

1. ధ్వని నియమములు ఏదోయొక కాలమునకు, ఏదో యొక భాషాకుటుంబమునకు మాత్రమే సంబంధించి యుండును. 2. ఒకజాతికాని, వర్గముకాని ఒకప్రత్యేకపరిస్థితిలో ఒకప్రత్యేక నియమము ననుసరించి ధ్వనిపరిణామమునకు కారణమగును. కావున ఆ నియమము ఆ ప్రత్యేకపరిస్థితికి ప్రవృత్తి యున్నంత కాలము నిశ్చితమై యుండును. 3. పూర్వమున్న భాష యనంతర కాలమునందు పొందిన మార్పును సూచించుటయే ధ్వని నియమముల ప్రయోజనము. అంతే కాని భవిష్యత్కాలమున

ఎట్టి పరిణామము రాగలదో ధ్వని నియమములనుబట్టి యూహిం చుట కవకాశము లేదు

టి. జి. టకర్ అను నాయన "A phonetic law of a language is a statement of the regular practice of that language at a particular time in regard to the treatment of a particular sound or group of sounds in a particular setting" అని వ్రాసెను. కావున ఒక భాషను వేర్వేరు కాలములలో పరిశీలించి, ఒక కాలములోని వేర్వేరు భాషలను పరిశీలించి, అక్కడ గోచరించు మార్పులను గుర్తించి క్రోడీకరించుటయే ధ్వని నియమ మని నిర్ధారణ చేయ వచ్చును.

జర్మనీ దేశస్థుడైన జేకబ్ గ్రిమ్ (Jacob Grimm) అను నాయన సంస్కృతము, లాటిను, గ్రీకు, ఇంగ్లీషు, జర్మను మున్నగు భాషలలోని రూపములను తులనాత్మక పరిశీలనము చేసి ధ్వని నియమములను క్రోడీకరించెను. ఆ నియమములకు గ్రిమ్ నియమము (Grimm's law) అని పేరు. ఇట్టి ప్రయత్న మింతకు పూర్వము డెన్మార్కు దేశస్థుడైన రాస్మస్ రాస్కు (Rasmus Rask) చేసియుండెను. అయినను గ్రిమ్ నియమము శాస్త్రీయమై, సమంజసమై ప్రతిష్ఠను పొందినది.

గ్రిమ్ నియమమును జర్మనుభాషా ధ్వని నియమమని యనవచ్చును. జర్మను భాషయందు ధ్వని పరిణామము రెండు మారులు కలిగెను. మొదటి పరిణామము క్రీస్తుపూర్వమే ఎన్నో శతాబ్దుల క్రితము కలిగెను. రెండవ పరిణామము క్రీ శ.

పడవళ శాఖీయందు, అనగా జర్మనులు ఆంగ్లో సాక్సన్లనుండి వేరుపడిన పిమ్మట కలిగెను.

మొదటి ధ్వని పరిణామము : ఇండో యూరోపియను మూలభాషయందలి స్పర్శములు జర్మనుభాషయందు ఈ దిగువరీతిగా మార్పు నొందెను.

	ఇం యూ. భాష	జర్మానిక్ భాష
1.	క - త - ప	ఖ (హ) - థ - ఫ
2.	గ - ద - బ	క - త - ప
3.	(హ) ఘ - ధ - భ	గ - (డ)ద - బ

పై నియమములకు వరుసగా లక్ష్యములను చూతము.

	వంస్కృతము/గ్రీకు	జర్మానిక్ భాష	ధ్వని
1.	కః	హూ	క>హ
	తను	థిన్	త>థ
	పితా	ఫాదర్	ప>ఫ
2.	గో	కా	గ>క
	దశన్	జెన్	ద>ట
	లేబియమ్	లిప్	బ>ప
3.	హోస్టిస్	గెస్ట్	హ>గ
	విధవా	విడో	ధ>డ
	భర్	బేర్	భ>బ

రెండవ ధ్వని పరిణామము : మొదటి పరిణామము వలన ఇండోయూరోపియను మూలభాషనుండి జర్మానిక్ భాష వేరుపడి భిన్నప్రవృత్తిని సూచించినది. రెండవ పరిణామము నందు జర్మను భాషయే 'నిమ్న జర్మను' అనియు 'ఉచ్చ జర్మను' అనియు రెండురూపములను చాల్చినది. అందలి ధ్వని పరిణామ నియమము క్రింది విధముగా నుండును.

	నిమ్న జర్మను (ఆంగ్లము)	ఉచ్చజర్మను
1.	ఖ (వా) - థ - ఫ	గ - ద (డ) - బ
2.	గ - ద (డ) - బ	క - త - ప
3.	క - త - ప	ఖ(వా)-థ(జ)- ఫ

పై నియమములకు వరుసగా లక్ష్యములను చూతము.

	ఆంగ్లము	జర్మను	ధ్వని
1.	బ్రదర్ (Brother)	బ్రుడర్ (Bruder)	థ>డ
	థీఫ్ (Thief)	డీబ్ (Dieb)	ఫ>బ
2	గార్డన్ (Garden)	కార్టో (Karto)	గ>క
	డాటర్ (Daughter)	టాక్టర్ (Tochter)	డ>ట
	బోల్డ్ (Bold)	పాల్డ్	బ>ప
3.	యోక్ (Yoke)	యాఖ్ (Joch)	క>ఖ
	టు (Two)	జ్వి (Zwie)	ట>జ
	డీప్ (Deep)	టైఫ్ (Tief)	ప>ఫ

పైని చూపిన రెండు ధ్వని పరిణామములను బట్టి ఈ క్రింది విధముగా ఒక పట్టికను నిర్మింపవచ్చును. అది మూల భాషకును, జెర్మానికు భాషకును, జర్మనుభాషకును గల ధ్వని భేదములను నిరూపింపగలదు

	ఇం. యూ	ఆంగ్లము	జర్మను
1.	క - త - ప	ఖ(హ)- థ - ఫ	గ - ద - బ
2.	గ - ద - బ	క - త - ప	ఖ - థ - ఫ
3.	ఘ - ధ - భ	గ - ద - బ	క - త - ప

గ్రిమ్ నియమమునందు మూడు విధములయిన దోషములు ప్రవేశించినవి 1. భిన్న భిన్నకాలములకు చెందిన ధ్వని పరిణామముల నొక్క మాదిరిగనే పరిగణించుట జరిగెను. 2 ఈ ధ్వని పరిణామము కేవలము జర్మను భాషకు మాత్రమే నియతమై యున్నది కాని యితరములైన ఇండోయూరోపియను భాషలను స్పృశించుటలేదు. 3. రెండవ ధ్వని పరిణామమునొందిన ఉచ్చజర్మను భాషనైనను ఈధ్వని నియమము పూర్తిగా కలియగలుపుకొనుటలేదు.

పై దోషములనుబట్టి గ్రిమ్‌నియమమును మొదటి ధ్వని పరిణామమువరకు పాక్షికముగా మాత్రమే అంగీకరించుట జరుగుచున్నది. గ్రిమ్ నియమమునకు కొన్ని అపవాదములు కూడ సూచింపబడుచున్నవి. మొదటి అపవాదము ఇండోయూరోపియను మూలభాషయందు స్క, స్త, స్ప అని యున్నప్పుడు క త ప లకు జర్మానికు భాషలలో ఏమార్పును వచ్చుట లేదు. గ్రిమ్ నియమము ప్రకారము ఖ (హ) - థ -

ఫ అని మారుట యవసరము. సం. అస్తి. లా. ఎస్ట్ జర్మానిక్ ఇస్ట్ అని యుండి జర్మనుభాషలో ఇస్ట్' అనియే స్థిరపడెను. రెండవ అపవాదము' ఇండో యూరోపియను మూలభాష యందలి క్త, ప్త అనువానియందలి 'త' వర్ణము మార్పు నొందుట లేదు సం. అష్టన్ లా. అక్టోన్ జర్మానిక్. అక్తన్ అనియుండి జర్మను భాషయందు అఖ్ట్ అని స్థిరపడెను. గ్రిమ్ నియమము ప్రకారము త>ధ పరిణామము కలుగవలయును. ఇక్కడ కలుగలేదు మరొక అపవాదము: ఇండో యూరోపి యను మూలభాషలోని ద బ వర్ణములు గ్రిమ్ నియమము ననుసరించి త ప వర్ణములుగా మారవలయును. సంస్కృతము నందలి 'దుహితృ' శబ్దము ఆంగ్లమునందు డాటర్ (daughter) అని యగుచున్నది. సంస్కృత 'బోధ్' ధాతువు జెర్మానికు భాషలో బిన్ద (binda) అనియే యగుచున్నది. వీని నన్నింటి నపవాదములనియే నిర్ణయింపవలయు నని యనిపించును.

కాని హెర్మన్ గ్రాస్మన్ అను భాషాశాస్త్రవేత్త యిక్కడి రహస్యమును బయలుపరిచి, చిక్కు విడదీసెను. సంస్కృతమునందును, తత్సంబంధమైన గ్రీకు మున్నగు భాష లందును మహాప్రాణములు రెండు వ్యవధానములేకుండ ఒక దాని వెంబడి నొకటి వచ్చినపుడు మొదటిది అల్పప్రాణముగా మారును. 'ధా' ధాతువు పునరుక్తి నొందినపుడు 'ధధామి' అని యగును. ప్రస్తుతనియమమునుబట్టి ప్రథమ ధ్వని అల్ప ప్రాణము కాగా 'దధామి' అని యగును. ఇట్లే 'భాష్' ధాతువునుండి 'బభాష' అని యగును. ఇట్లే 'దుహితృ' శబ్ద మునందు పూర్వభాగము 'ధుహ్' అని యుండవలయును.

'కామధుక్' అని యన్నప్పుడు మహాప్రాణమే యున్నది. అదేమరల 'దుగ్ధ' అని యన్నప్పుడు అల్పప్రాణముగా మారి పోవుచున్నది. అట్లే 'ధుహితృ' అని పూర్వరూపమై యుండి రెండవరూపముకూడ మహాప్రాణ మగుటవల్ల మొదటిది అల్ప ప్రాణముగా 'దు' అని మార్పునొందినది. సంస్కృతమునందలి 'ధ' జెర్మానిక్ భాషయందు 'ద' గా కాని 'డ'గా కాని మారుట గ్రిమ్ నియమమునకు అనుకూలమే. అట్లే 'బోధ్' అని సంస్కృతములోనున్న ధాతువు ఇండోయూరోపియను మూలభాషయందు 'భేద్ధ్' అని యుండును. అనగా 'భ' వర్ణము నకు 'బ' వర్ణము వచ్చుచున్నదని యర్థము. కాబట్టి యీ మార్పు కూడ నియమము ననుసరించియే జరిగె నని చెప్ప వలయును.

గ్రాస్మన్ వై విధముగా ఒక విరోధమును పరిహరించి, తాను మరొక సూత్రమును చేసెను. గ్రీకు క త ప ల స్థాన ములో జర్మనుభాషలో గ ద బలు వచ్చినయెడల పూర్వధ్వనులు మహాప్రాణముల స్థానములయందు ఆదేశములై యుండునని యాయన సూత్రము. కాని యువకః (సం) యంగ్ (ఆం); శతమ్ (సం) హన్డ్ (గోథిక్); లిమ్నామి (సం) బై లైకా (గోథిక్) మున్నగు ప్రయోగములను ఒట్టి అల్పప్రాణములే యైనప్పటికిని మూలభాషయందలి శ్వాసములు జెర్మానిక్ భాషలలో నాదములుగా మారుట కననగును ఇది గ్రాస్మన్ నియమమునకు అపవాదము

కార్ల్ వెర్నర్ అను భాషాశాస్త్రవేత్త యిక్కడి విరోధ మును పరిహరించి, నియమమును నిలబెట్టెను. ఇండో యూరో

పియను మూలభాషయందలి 'క త వ' ధ్వనులు జెర్మానిక్ భాషలందు 'వా థ ప' అని మారుట గ్రిమ్‌నియమము ననుస రించి జరుగును. ఇక్కడ మరొక చిన్న విషయము కలదు. పై 'క త వ' లకు పూర్వమందు ఉదాత్త స్వర మున్నప్పుడు మాత్రమే అట్లు జరుగును. అట్లు కానియెడల 'గ ద (డ) బ' లుగా మారును. పైని అపవాదములుగా ఇచ్చిన యుదా హరణములందు 'క త ప' లకు పూర్వమందు ఉదాత్త స్వర ములు లేకపోవుట వలననే 'వా థ ఫ' ధ్వనులు వచ్చుట కవ కాశము లేక పోయినది. 'భ్రాతృ' అను శబ్దమునందు 'త' ధ్వనికి పూర్వము ఉదాత్త స్వరము కలదు. కావున నిచ్చట 'త' యను నది థ (th) గా మారి brother అని యగును. ఇట్లే 'మాతృ' అన్నప్పుడు mother అని యగును, 'పితృ' అని యన్నప్పుడు father అని యగును. ఇచ్చట 'త' వర్ణము నకు ముందు ఉదాత్తధ్వని లేకపోయినప్పటికిని 'd' వర్ణముగా మారక 'th' వర్ణముగా మారుట అపవాదమే ఈ అపవాద మునకు కారణము సామ్యము (analogy). Brother, Mother మున్నగు శబ్దముల సామ్యమువలననే Father అను రూపమున కూడ 'th' అనుధ్వనియే నిల్చుట జరిగెను.

మొత్తముమీద ధ్వని నియమములు నియమబద్ధముగానే ప్రవర్తించునని యంగీకరింప వలయును. ఎచ్చటనైనను అప వాదము ఉన్నట్లు తోచుటకు కారణము సూత్రకర్తయొక్క అనవధానతయే యనిపించును. గ్రిమ్ సూత్రమును గ్రాస్మన్ సవరించుటకు, గ్రాస్మన్ సూత్రమును వెర్నర్ సవరించుటకును కారణము నియమకర్తలలోపమే కాని నియమలోపము కాదు.

అచ్లే నియమములను భాషలకు అన్వయించునపుడు, ఆ నియమము ఏకాలమునకు ఏభాషకు ఉద్దేశింపబడినదో కూడ అర్థము చేసికొని అన్వయింపవలయును. ఒక్కొక్కప్పుడు 'సామ్యము' మున్నగు బాహిరకారణముల వలన నియమమునకు అపవాదమున్నట్లు గోచరింప వచ్చును అచ్లే ప్రతిదేయ పదముల (loan words) ను పరిణతరూపములతో సమానముగా చూచినప్పుడును నియమమునకు అపవాదమున్నట్లు అనిపించును.

గ్రిమ్ 'క త ప' మున్నగు వర్ణములను గూర్చి చెప్పినపుడు సంయుక్తవర్ణముల నాతడుద్దేశించి యుండలేదు. అట్టి యెడల అతడు చెప్పని వర్ణముల నాతడు చెప్పినట్లూహించుకొని 'స్క స్త స్ప' మున్నగుచోట్ల గ్రిమ్ నియమము తప్పుచున్న దనుకొనుట మన అనవధానతకు లక్ష్యము కాగలదు. కావున ధ్వనినియమములు దేశకాలబద్ధములై పరిమిత పరిస్థితులలో నిశ్చితముగా ప్రవర్తించునని నిర్ణయింపవచ్చును. అట్టి ప్రవృత్తికి భిన్నమైన ప్రవృత్తి కనిపించినయెడల అచ్చట సామ్యము పనిచేసి యుండవలయును, అట్లు కానియెడల అది యితర భాషనుండి అనంతరకాలమున ప్రతిదేయ పదము (loan word) గా వచ్చి చేరినదయిన కావలయును. ప్రతిదేయములపట్ల ఈ నియమములు వ్యవహరింపకపోవచ్చును. అదిసమంజసమే.

ద్రావిడభాషలు - ధ్వని నియమములు

ద్రావిడభాషాకుటుంబమునకు చెందిన తెలుగు, తమిళము, మలయాళము, కన్నడము, తుళు మున్నగు భాషలలో

ఒకేధ్వని పొందు వేర్వేరు వర్ణాత్మములను గుర్తించుట యవసరము. వానినిబట్టి ద్రావిడ భాషాధ్వని నియమములను క్రోడీకరింపవచ్చును. అంతేకాక మూలరూపమును గుర్తించి, వేర్వేరు భాషలలో అదనముగా చేరు ప్రత్యయాదులను పోల్చుకొనుటకు కూడ అవకాశము కలుగును. స్థూలముగా చూచునప్పుడు భిన్నరూపములవలె గోచరించువానిలో ధ్వని నియమముల సాహాయ్యమున ఏకత్వమును గుర్తింప వీలగును.

1. తమిళమందు ఐదంతమై యున్న పదము తెలుగునందు మలయాళము నందు అదంతము, కన్నడమున ఎదంతమునై యుండును.

అ ర (తె)	అ ర (మ)	అ రై (త)	అ రె (క)
ఎ డ	ఇ డ	ఇ డై	ఎ డె

2. తమిళ మలయాళములందు పదాది నున్న 'ఇ, ఒ' వర్ణములు తెలుగు కన్నడములందు 'ఎ,ఒ' లుగా మారును.

తెర (తె)	తిర (మ)	తిరై (త)	తెరె (క)
మొదలు	ముదలు	ముదల్	మొదల్

3. తమిళమునందలి క (గ) వర్ణము తెలుగున పాఱిక ముగా వ వర్ణముగా మారును

పగల్ (త)	పగలు/పవలు (తె)

4. మూలభాషయందలి తాలవ్యస్వరముతోడి క వర్ణము తెలుగున చ వర్ణము కాగా తమిళము నందు 'శ' వర్ణమగును.

చిన్న (తె)	శిన్న (త)	కిన్న (క)
చెవి	శెవి	కివి
చేయ్	శెయ్	గెయ్

5. పదమధ్య 'స' వర్ణము తమిళమునందు కొన్ని యెడల 'య' వర్ణముగా మారును.

పేరు (తె)	హెసర్ (క)	పెయర్/పేర్ (త)
పయిరు/పసరు	హాసరు	పయిమి (త)

6. మూలద్రావిడ 'ణ' వర్ణము తెలుగునందు 'న' వర్ణముగా పరిణతి నొందును.

కణ్ (త)	కన్ను (తె)
విణ్	విన్ను
మణ్	మన్ను

7. సంస్కృత సమములందలి 'త,ద' లు మలయాళము నందు 'ల' వర్ణముగా వినిపించును.

పద్మమ్ (సం)	పల్మమ్ (మ)
తాత్పర్యమ్ (సం)	తాల్పర్యమ్ (మ)

8. తాలవ్యాచ్చులమీది ద్విత్వ త వర్ణము మలయాళము నందును, పాఠీకముగా తమిళము నందును ద్విత్వ చవర్ణముగా మారును.

శిక్ష (త) చిరిచ్చ (మ)
ఉణ్ర్తి/ఉణర్చి (త)

9. పదాది మూలద్రావిడ 'చ' వర్ణము కన్నడమునందు 'హ' వర్ణముగా మారును.

పది (తె)	హత్తు (క)	పత్తు (త)
పల్లు	హల్లు	పల్
పెంటి	హెండ్డు	పెణ్

10. తమిళమునందలి 'మ' వర్ణము కొడగు భాష యందు 'వ' వర్ణముగా మారును; ప్రాచీన కన్నడము నందలి పదాంత 'మ' వర్ణము వ్యావహారికమునందు 'వ' వర్ణముగా వినిపించును.

మామన్ (త)	మావు (కొ)
మామి	మావి
నామ్ (ప్రా. క)	నావు (వ్యా. క)
నీమ్	నీవు

11. సంస్కృత 'యు' వర్ణము తమిళమున 'న' వర్ణముగా మారును.

యుగ (సం)	నుగమ్ (త)
యమ (సం)	యమన్/నమన్ (త)

12. మూలద్రావిడము నందలి అ వర్ణము తెలుగున డ ల ర వర్ణములుగా పరిణతి నొందును. కొన్నియెడల ర వర్ణము ల వర్ణముగా మారును.

నీడ (తె)	నెఱలు (క)	నిఱుల్ (త)
కూళ	కూట్	కూటై
మూర	మొఱ	మొఱమ్
తెలియు		తెరి

13 మూలద్రావిడ 'ల' వర్ణము కుయి భాషయందు 'డ' వర్ణముగా మారును.

పాలు (తె)	పాల్ (త)	పాడు (కు)
ఇల్లు (తె)	ఇల్ (త)	ఇడ్డు (కు)

14 మూలద్రావిడ 'వ' వర్ణము కన్నడమునందు 'ఱ' వర్ణముగా మారును.

వేసఁగి (తె)	బేసిగి (క)
వెలుఁగు	బెళంగు
వచ్చు	ఱరు

15. సంస్కృత ళ ష స లు తమిళమునందు డ వర్ణము గా కాని దవర్ణముగా కాని మారును.

శీ	(సం)	తిరు	(త)
ముషళ	(సం)	ఇడబమ్	(త)
మనస్		మనదు	
మాసమ్		మాదమ్	

పై విధములుగా ద్రావిడ ధ్వని సూత్రములను నిరూపించుకొనవచ్చును.

కాని, పైని చెప్పిన సూత్రములకు అపవాదములుగా కొన్ని రూపములు కనిపించుచున్నవి. వానికి కారణములను పరిశీలింతము. కాలవ్యాచ్ఛుతోడి కకారము తమిళమున 'శ' కారము కావలసియుండగా కిళి, కెడు, కీఴవన్ మున్నగుచోట్ల శవర్ణముగా మార్పు నొందలేదు. ఇది అపవాదమనియే యనిపించును కాని యిక్కడ నింకొక నియమ మున్నదన్న సంగతిని గుర్తించినయెడల ఆ భ్రాంతి తొలగి పోవును. ఇచ్చట 'శ' వర్ణమునకు పిమ్మట వచ్చినవి మూర్ధన్య ధ్వనులు. అందువలన మూర్ధన్య ధ్వనులు పరమగునపుడు 'క' తమిళమునందు శ వరముగా మారదన్న యంశమును చేర్చు కొనవలయును.

చిలుక (తె)	కిళి (త)	గిళి (క)
చెడు	కెడు	కెడు
కెడవు	కీఴవన్	కెఴవన్

తెలుగున పైని చూపిన 'కెడవు' అను రూపమును, కెడయు, కినియు, కిలుము మున్నగు రూపములును అనంతర కాలమునందు కన్నడమునుండి ప్రతిదేయ పదములుగా తెలుగులో ప్రవేశించి యుండును. కావుననే కాలవ్యీకరణము (క>చ) కనిపించుట లేదు అరవమునందు 'చెట్టు' అను నర్థమున 'కెడి'యను రూపము గలదు. కన్నడమున 'గిడ' యని కలదు. పై నియమము నుల్లంఘించి మూర్ధన్యము పరమై నపుడు కూడ తమిళమునందు 'క'వర్ణము 'శ' వర్ణ మయ్యెను. కాని యిది తెలుగు నుండి తమిళమునందు చేరిన ప్రతిదేయ పదము. పూర్వకావ్యములందు దీనికి ప్రయోగము లేదు.

తెలుగునందును కొన్ని యపవాదము లున్నట్లు గోచరించును. క్రిందు, క్రేవ, క్రేపు- మున్నగుచోట్ల కాలవ్యీకరణము జరుగలేదు దీనినిబట్టి పై నియమము సంయుక్త వర్ణములకు వర్తింపదని నిర్ధారింపవచ్చును కావున, ఇదియు అపవాదము కాదు.

మూలద్రావిడమునందలి పవర్ణము కన్నడమునందు 'హ' వర్ణముగా మారునన్నది నియమము.

కాని అట్లు మారని రూపములుకూడ కలవు.

పీనుఁగు (తె)	పిణమ్ (త)	పెణం (క)
పొగడు	పుగళ్	పొగళ్
పొదరు	పుదర్	పొదళ్
పొగ	పుగై	పొగె

పై రూపములవంటివి పెక్కులు కలవు. ఇవన్నియు అపవాదములు కావా? కావనియే సమాధానము కన్నడమువందు 'ప' వర్ణము 'హ' వర్ణముగా మారుట తొలుతనుండియు నున్న నియమము కాదు. 'హ' వర్ణము ద్రావిడ మూలభాషయం దున్నదని యనుటకు తగిన యాధారములు లేవు. కావున కన్నడము నడిమికాలమున ఈ లక్షణము నవలంబించినది. కావున ప్రాచీన కాలమునందు స్థిరపడిన రూపములందు 'ప' వర్ణము నిల్చియే యున్నది. తరువాతి కాలమున ఏర్పడిన రూపములందు ప వర్ణము హ వరముగా పరిణతి నొందినది.

ఈ నియమము కన్నడమునకు మాత్రమే పరిమితమై యుండవలసియుండగా, తెనుగునందుకూడ ఇట్టి రూపములు కొలదిగా కనిపించుచున్నవి. పోన్ను, పోయలు మున్నగు నామములు పెచ్చు వత్తు మున్నగు క్రియాధాతువులు కన్నడమునుండి యనంతరకాలమున తెలుగులోనికి ఎరువు మాటలు (Loan words) గా వచ్చియుండును 'పొన్ను' అని 'పెచ్చు' అని పకారాదిగా నున్న రూపములు ప్రాచీనములై యుండును. ఇంతకు హకారాదులయిన పదములు తెలుగునకు స్వాభావికములుకావు. అందువలననే ఎచ్చు, అడపము మున్నగు విధముగా హకార విరహిత రూపములు మరల ఏర్పడవలసి వచ్చినది.

ఇంకొక్క విషయము. ద్రావిడభాషలయందు పదాది సంయుక్తవర్ణము లుండవు కాని తెలుగునందు క్రొత్త, ప్రాత, ప్రోలు, ప్రేలు, మ్రోయు, వ్రాయు- మున్నగు రూపములు గలవు. వీనియందు మొదటి యక్షరము సంయుక్తము. కాని యిది తొలుతటినుండియు నున్న లక్షణమని చెప్పుటకు వీలులేదు. కాని సాహిత్య ప్రారంభము నుండియు నున్నదని చెప్పవచ్చును.

కొఱుం, పఱం మున్నగు రూపములపై 'త' వర్ణము చేరి కొత్తు, పాత్తు మున్నగు విధముగా నేర్పడి యుండును. ఆ పిమ్మట అ వర్ణను రవర్ణముగా మారి పూర్వధ్వనితో సంయోగముచెందగా 'క్రొత్త' అనియు 'ప్రాత' అనియు రూపము లేర్పడియుండును ఇట్లే తమిళ కన్నడములందు 'పొటిల్' అనురూపముతో అభ్విపర్యయము కలిగి ప్+అ+ట్+ఇ ల్ = ప్రోలు'

అని యయ్యెను తమిళమున 'వేచు' అనియు కన్నడమున వేట్ అనియు నున్న రూపము తెలుగున 'వేట్లు' అనియై 'వ్రేలు' అని మారెను వీని నన్నింటిని బట్టి చూడగా మొదటి యక్షరములోని స్వరము తరువాతి అ కారము మీదికి మార్పు నొందగా తొలుత రవర్ణ సంయుక్తములైన వర్ణము లేర్పడె నని తెలుచున్నది

కాని యిట్లు సంయుక్త ధ్వనిని పలుకుట తెలుగునకు సహజము కాదు. కావుననే పాత, కొత్త మొదలయిన రూప ములు ఏర్పడుచున్నవి. వ్రబ్బు, వ్రుగ్గు, వ్రప్పు మున్నగు శబ్దములలో మొదటి వర్ణముపై రేఫ మున్నదన్న సంగతిని గుర్తించుటకు కూడ వీలులేనంతగా సురిగిపోయినది. ఇట్లు అన్ని రూపములయందును క్రా వడి యే లోపించుచుండగా వ్రాయు, వ్రాత మున్నగుచోట్ల 'వ' వర్ణము లోపించుచున్నది. 'వ'కారము దుర్బల వ్యంజనము (weak consonant) అగు టయే దీనికి కారణము. అయినను వ్రేలు, వ్రీలు, వ్రేలాడు- మున్నగుచోట్ల ఊనిక యుండుట వలన 'వ' కారమునకు లోపము కలుగక రేఫమునకే లోపము కలుగుచున్నదనుట గమనార్హము.

మొత్తముమీద ధ్వని నియమములు ద్రావిడభాషల యందుగూడ నియతములై యున్నవనియు ఏమేనియు అప వాదములవంటివి కనిపించినచో, వానికి వేరుకారణములు తప్పక యుండితీరుననియు సిద్ధాంతము.

ధ్వనుల మార్పులు

మాటలను ఉచ్చరించునపుడు కొన్నింటిని తేల్చి పలుకుటయు, కొన్నింటి నొత్తి పలుకుటయు, కొన్నింటిని మధ్యస్థముగా పలుకుటయు అనుభవసిద్ధ మగు విషయమే. ఈ విధముగా ఆరోహణావరోహణాది క్రమములో పలుకుటను 'స్వరము' అని యందురు. ఉచ్చారణసమయమున కంఠము నందలి నాదతంత్రులు ప్రకంపించునట్టి వేగమునుబట్టి యీ స్వరము కలుగును. దీనినే ఆంగ్లమున 'Pitch accent' అని యందురు ఉచ్చారణసమయమున నాదతంత్రులు సాగిన దూరమునుబట్టి 'ఊనిక' కలుగును. ఏదేని మాటను ఒత్తి చెప్పవలసి వచ్చినపుడు, గట్టిగా బలముగా చెప్పుట స్వాభావికము. ఈ ఊనికనే ఆంగ్లమున 'Stress accent' అని యందురు. ఊనిక స్వరము అను నీరెండును కారణముగా ఉచ్చారణమున వెక్కు మార్పులు కలుగవచ్చును అవి క్రమముగా భాషలో స్థిరపడవచ్చును. భాషాస్వభావమునుబట్టియు కొన్ని కొన్ని యక్షరములు సంయోగము చెందుటయు, విడివడుటయు, తొలగుటయు, అదనముగా కలుగుటయు జరుగవచ్చును. ఒక భాషలోని ఒక యక్షరము మరొక భాషలో మరొక యక్షరముగా మారుట కూడ కనిపించును. ఇట్టి పరస్పరము వినిమయము నొందుట ఏకకుటుంబజనితములైన భాషలలో స్పష్టముగా గోచరించును.

ధ్వనివ్యత్యయము : సాధారణముగా ద్రావిడభాషల యందు మాట మొదటి యక్షరమునైనే యూనిక యుండును. అట్టియెడల ఆ మాటయందు మార్పు కలుగదు. వేర్వేరు

కారణములచేత ఱొనిక తరువాతి యక్షరములమీదికి మారి నపుడు మొదటి యక్షరము జారిపోవును. అరవమున 'అవర్' అనియు కన్నడమున 'అవరు' అనియు నున్న శబ్దము తెనుగున 'వారు' అనియైనది. 'అ' కారముమీది ఱొనిక వకారము మీదికి మారగా, మొదటి యచ్చు లోపించుటకు మారుగా తరువాతి వాల్లుపై చేరినది ఇట్లే 'ఉగుర్' అనునది 'గోరు' అని యగును 'అకాదు' అను వ్యతిరేకార్థకము 'కాదు' అని యగును. ఇది ఒక భాషలోనుండి సమీపభాషలోనికి మారు నపుడు మాత్రమే కాక ఒకే భాషలోకూడ జరుగవచ్చును.

వర్ణవ్యత్యయము : ఒక పదమునందలి యక్షరములు ఒక క్రమములో నుండియుండును వక్తయొక్క ఉచ్చారణ త్వరవలన గాని, అశ్రద్ధవలన గాని, అజ్ఞానమువలన గాని ఆ క్రమము మారుచుండును. రెండు రూపములును మొదట వ్యవహారములో వ్యాప్తిని పొందినయెడల అవి భాషలో స్థిరత్వమును సంపాదించుకొనును. 'నవ్వులాట' అను పదము 'నవ్వుటాల' అనియైనది. 'తడువుకొను' అనునది 'తవుడుకొను' అనియు 'సరుదుకొను' అనునది 'సదురుకొను' అనియు మారినవి. వీని యన్నింటియందును ఒక స్థానమున నుండవలసిన యక్షరము మరొక స్థానమునకు చేరి, అచటి యక్షరమును తన స్థానమునకు నెట్టుట కనిపించును. ఉచ్చారణసౌలభ్య కాంక్షతో అచ్చులు కూడ కొంచెముగా మారును. దీనిని metathesis అని యందురు.

అనుచితవిభాగము : ఒక వాక్యములోని మాటలను వ్యాకర్తలు తమ సాధనములతో విశ్లేషించునపుడు కొన్ని

మొదల ఈ పొరపాటు జరుగవచ్చును. అట్లే వక్త అస్పష్ట ప్రయత్నమువలన కూడ ఈ పొరపాటు జరుగుచుండును. ఈ పొరపాటయినను, పరిపాటి అయిపోవుటచేత భాషయందు ప్రతిష్ఠను పంపాదించుకొన్నది ప్రాచీన ద్రావిడమున 'ఎలిక' మున్నగురూపములలో చివరి కారమును మాత్రమే బహు వచనప్రత్యయముగా స్వీకరించి, తప్పుగా విభాగముచేయుట (Wrong splitting) వలన 'ఎలి(లు)క' మున్నగువిధముగా ఏకవచనరూపము లేర్పడినవి. ఇట్టి రూపములు పెక్కులు గలవు తెలుగున ఇప్పటికిని నకారముతోడి రూపమును స్వరాదిరూప మును నొకేయర్థమున కనిపించునవి గలవు. నీలుగు-ఈలుగు; నెగయు - ఎగయు; నేని-ఏని మున్నగుపదములలో ఈ యను చిత విభాగము పనిచేసిన దనుట సత్యము. ఇట్లే పొందు, పూను, పొలయు మున్నగుపదములు కూడ వ్యంజనమును గోల్పోయి ఒందు, ఊను, ఒలయు మున్నగువిధముగా నుండుట కలదు, ఇం దేది ప్రాచీనమో, ఏది నవీనమో గుర్తించుటకు మరింత పరిశోధన మవసరము. వెనుక పదములోని తుదివర్ణ ముతో పాటుగా తరువాతి పదమును వేరుపరుచుట గాని, తరు వాతి పదములోని మొదటి వాల్లును వెనుకటి మాటకు విడిచి పెట్టుటగాని, రెంటిలో ఏదేని జరుగుట కవకాశము గలదు

స్వరాకర్షణము: ముందర గాని వెనుక గాని యున్న యచ్చుల యాకర్షణవలన ఒక యచ్చు మార్పు చెందవచ్చును 'లతకు, రామునకు' మున్నగు పదములం దున్న 'కు' వర్ణకము ఇకారాంత పదములపై 'కి' వర్ణముగా మారుట స్వరాకర్షణము (vowel attraction) వలననే. చేతికి,

రామునికి మున్నగు వానియందు ఈ మార్పు గోచరము కాగలదు. ఇట్లే 'ను'వర్ణకము 'ని'వర్ణముగా మారును. యుష్మదస్మద్విశేషణములకు పర మైన 'వును'లను ఇట్టి మార్పునకు లోనగును. క్రియావిభక్తులు కూడ ఈ మార్పును పొందును. క్త్వార్థక ప్రత్యయ మగు ఇవర్ణము గాని, ఎదాదులు గాని ఇంచుగాగమము గాని పరమందున్నప్పుడు ధాతుగతమైన ఉకారమునకు ఇకారము కలుగుచున్నది. కలిగి, కలిగెడున్, కలిగెను - కలుగుచున్నది ఇది పరమందున్న స్వరము యొక్క ఆకర్షణవలన జరుగుచున్నది. ఇట్లే ఇదంతములకు బహువచన మందు ఉత్వము కలుగుచున్నది. విద్యార్థి - విద్యార్థులు॥ ఈ ప్రభావము ఉపోత్తమమువరకు వ్యాపించి, అచటి ఇత్వమున కును సాధారణముగా ఉత్వము కలుగుచున్నది॥ ములికి - ములుకులు॥

గుణవిధి: సంస్కృతమునందు 'ఏ, ఓ, ఆర్' అను వానిని 'గుణము' లని యందురు. అకారమునకు 'ఇ ఉ ఋ' వర్ణములు పరమం దున్నపుడు ఏకాదేశముగా గుణములు వచ్చును. తెలుగునందు ఇ, ఉ వర్ణములు తమంత కామే ఎ, ఒ వర్ణములుగా మారుట కొన్నియెడల చూపట్టును. దీనికి సంస్కృత ప్రభావ మేమాత్రమును కారణము కాదు. ఇ ఈ ఎ ఏలు కాలవ్యములు. కావున ఉచ్చారణమున నొక సామ్యము కలదు. అట్లే ఉఊ ఒ ఓ లు ఓష్ఠ్యములు. వీనికి గల భేదము చాల యల్పము. ఆ భేదమును గమనింపక అశ్రద్ధగా మన యోగించినప్పు డీ తడబాటు కలుగును. అయినను ఇది కొంత వరకు వ్యాకర్తల ఒడబాటును సంపాదించుకొన గలిగినది.॥

ముఖము-మొగము, మృగము-మెకము; పుగై-పొగ; నిలమ్-నేల॥ ఇవియే కాక మల్లి-మల్లె, చెల్లి-చెల్లె మున్నగు రెండేసి రూపములు కనిపించును.

సంప్రసారణ విధి సంస్కృతమునందు ఇ ఉ ఋ ఌ వర్ణములకు బదులుగా వచ్చిన 'య వ ర ల' వర్ణములను యణ్ణులని యందురు. యణాదేశకార్య మిది. దీనికి విలోమ మగునది సంప్రసారణము. య వ ర ల వర్ణములకు బదులుగా ఇ ఉ ఋ ఌ వచ్చుట యిచ్చటి కార్యము. శ్రీ సోమయాజి గారు దీనిని ప్రత్యేకముగా పరిగణించిరి. కాని తెలుగున ఇట్టి మార్పు లేదనుకొనుట ప్రశేయము. ఉన్న దని యనిపించు పట్టులందు సంప్రసారణవిధి కాక, వేరొక కారణమును స్పష్ట ముగా నిరూపించుటకు వీలున్నది. 'ఒ' యను వర్ణమును 'వ' ధను వర్ణమును పరస్పరము మారుట కొలదిగా కలదు. 'ఒద్ద' యను సమీపార్థక పదమును 'వద్ద' యని వాడుటయు కలదు, 'ఒదరు' అను నిందార్థకము 'వదరు' అను రూపమునను గలదు. వాడుకయందు ఒగరు-వగరు; ఒనరు-వనరు; ఒయ్యారము-వయ్యారము; ఒరవడి-వరవడి మున్నగు పదములు ద్వైరూప్యమును గలిగి యున్నవి. అనను 'వ'కార యుతమైనదే పూర్వరూపమనియు, స్వరాదిపదము అనంతర కాలిక మనియు నిర్ణయించినపుడుకాని సంప్రసారణ మను పేరు సమంజస మనిపించుకొనదు. "ఒ,వ"లు రెండును ఓష్ఠ్యములు. వకారోచ్చారణమున దంతముల సహకారము కూడ కలదు ఏకస్థానజనితము లగు ఈ వర్ణములు పరస్పరము మారుటకు చాల యవకాశములు గలవు. ఈ మార్పును గమ

వించియే చిన్నయసూరి వు వూ వొ వో లు తెలుగు మాట లకు మొదట లే వని పలుకవలసి వచ్చినది.

సమీకరణము: భిన్నములయిన రెండు వర్ణములు గాని, ఏకస్థానజనితము లయిన రెండు వర్ణములుగాని సంయో గము చెంది ద్విత్వముగా మారుచుండును సంస్కృతమునందు భిన్నవర్ణ సంయోగము మిక్కిలి ప్రచురముగా గలదు. కాని, తెలుగు మున్నగు భాషలయందు ద్విత్వాక్షరములే కాని, భిన్నవర్ణ సంయుక్తాక్షరములు ఎక్కువగా లేవు. శ్రేష్ఠి - సెట్టి, శక్తి - పత్తి, అర్పణము - అప్పనము. కొన్నియెడల 'స్వర లోపము' (syncope) కలిగిన రూపములు కనిపించును॥ కొలది - కొల్ది; చలిది - చల్ది; కఱదు - కల్దు॥ ఇట్టిచోట్ల మున్న భిన్నాక్షరసంయోగమును పరిహరించి తెలుగు మనస్సు ద్విత్వమునే స్వీకరించుచున్నది॥ కొద్ది; చద్ది; కద్దు॥ సంస్కృ తమునందు ఏకస్థానజనితములే ఈ మార్పును పొందుచుండగా తెలుగున అట్టి నియమము ఏమాత్రమును లేకుండ ఈ మార్పు కలుగుచున్నది. సమీకరణమును ఆంగ్లమున (assimilation) అని యందురు.

పృథక్కరణము: ఒకేవర్ణము వెంట వెంట నుచ్చ రింపబడిన యెడల ఒక తడబాటు కలుగుట సహజము. కావున, ఆ తడబాటును తొలగించుకొనుటకు గాను అందొక వర్ణమును సాజాత్యముగల మరొక వర్ణముగా మార్చి పల్కు దురు. 'బాలుడు'అను శబ్దము బహువచనమున 'బాలులు' అని కావలసియుండగా బహువచన లకారమునకు రేఫమును విధించుట దీనినే బలపరచుచున్నది. ఇట్లే వకారాంతము

లయిన ధాతువులపై ఇంచుగాగమము కలిగినపుడు 'చ' కార మునకు 'ప' కారము కల్గుటయు ఈ విధానమునుబట్టియే. ఇపిలుచు - ఇంచు > పిలిపించు; తెచ్చు - ఇంచు> తెప్పించు। ఇంచులోని చకారముతో తడబాటు కలుగకుండుటకై ధాతు గతచకారము ఈ మార్పు పొందుచున్నది. ఈ మార్పును ఆంగ్లమున dissimilation అని యందురు.

స్వరవిశ్లేషము : భిన్నవర్ణములు సంయోగమునొంది నపుడు తెలుగుభాష ద్విత్వమును గ్రహించు నని 'సమీకరణము' అను విషయమున గుర్తించితిమి. అట్లు వీలుకాని యెడల, ఒక యచ్చు ఆగమముగా వచ్చి సంయుక్తాక్షరమును విశ్లేషించును. 'చంద్ర' శబ్దమున దకార రకార సంయోగమును వేరుచేయుచు 'ఇ'వర్ణము వచ్చి 'చందిరుడు' అను రూపమును కల్పించును. ఇట్లే అలుపము, దువారము, తండిరి, సందరము మున్నగు పదములలో ఒక యచ్చు క్రొత్తగా చేరి సంయోగాక్షరమును వేరుపరిచినట్లు గుర్తింపగలము. ఈ మార్పును ఆంగ్లమున anaptyxis అని యందురు

స్వరాగమము : ద్రావిడభాషలలో సంయుక్తాక్షరములతో ప్రారంభము లగు పదములు లేవు. ఇతరభాషలలో నుండి యవి వచ్చినపుడు వానికి ముందు ఒక అచ్చును చేర్చి పలుకుదురు. ముఖ్యముగా సకారసంయుక్తములైన వర్ణములు కలిగినప్పుడు ఇట్టి యాగమము కలుగుచున్నది ఆంగ్లవిద్యావంతులు ఆంగ్లములో వలె పలికినను, దేశీయులు మాత్రము ఇస్కూలు, ఇస్కొటు మున్నగునిధముగా పలుకుట కలదు. ఉత్తరహిందూస్థానమున ఆంగ్లవిద్యావంతులు సైతము దేశ

భాషాప్రభావమున ఇట్టిచోట్ల ఇకారమును జేర్చియే పలుకుదురు. 'రథము' అను శబ్దము తద్భవముగా 'అరదము' అని యైనది. అరవమున రకారాదిపదములకు ముందు అకారము చేరును॥ అరసు॥ దీనిని ఆంగ్లమున prothesis అని యందురు.

వర్ణాగమము : కొన్ని మాటలకు నడుమ, కొన్ని యక్షరములు అదనముగా చేరుచుండును. కొన్నియెడల వాని కర్థ ముండును వెక్కుచోట్ల వానికి ప్రత్యేకప్రయోజన మేమియు నుండదు॥ చిచ్చుకన్ను - చిచ్చులకన్ను, చింపిజుట్టు-చింపిరిజుట్టు; దొంగాటము - దొంగాటకము॥ ఇట్లే అనేకములగు ధ్వనులు మాటలకు నడుమ చేరుట తెలుగుభాషలో కనిపించును. సమత నపేక్షించియో, సామ్యము ప్రభావము వలననో యిట్టి ప్రయోగములను చేయుట పరిపాటి యైనది. వ్యాకర్తలు కూడ వీనికి సమ్మతి చూపుట కనిపించుచున్నది.

వర్ణచ్యుతి : సంయుక్తాక్షరములలో ఒక యక్షరము మాత్రము నిలిచి రెండవది జారిపోవుటయు తటస్థించును. ఊని కయే దీనికి కారణము. క్రొత్త, ప్రాత యను శబ్దములలోని క్రకారడులు నెమ్మదిగా కాలిపోవుచున్నవి. 'ఱొమ్ము' మున్నగు వానికి తద్భవముగా 'కారము' మున్నగురూపము లేర్పడినవి. స్థానము ఠానముగను, అనంటి అంటిగను మారినవి. ఇట్లే తద్భవములం దనేక వర్ణములు జారిపోయిన సంగతిని గమనింతుము.

హల్లోపము : ఒక మాటలోని చివరి యక్షరము రెండవ మాట మొదట అదే యక్షర మున్నయెడల లోపించుచున్నట్లు కనిపించును. 'పెద్దతనము' అను మాటలో దకార

ద్విత్వముపొంట తకారము వచ్చినది. పూర్వ మున్న 'ద' లోపింపగా తత్థానమున తకారము వచ్చి 'పెత్తనము' అని యగును. వంకాయ రేంకాయ మున్నగుచోట్ల గకారము ఈ నియమము ననుసరించియే లోపించినది. ప్రాదుట్లు మున్నగు చోట్ల తకార మిట్లే లోపము నొందినది ఈమార్పును ఆంగ్లము నందు haplology అని యందురు.

లోపదీర్ఘత : కొన్ని మాటలలో ఊనిక తక్కువ యగు నచ్చరములు కొన్ని యెడల లోపించిపోవు నని యెరుగుదుము. అట్లు వర్ణలోపమువలన ఉచ్చారణకాలమున ఏర్పడిన నష్టమును పూరించుటకుగాను దానికి పూర్వమున నున్న యచ్చు దీర్ఘత్వము నొందును॥ సగము - సాము; మొగము - మోము; దుముకు - దూకు, సొలయు - సోలు; వరలు - వ్రాలు, ఉరలు - రోలు॥ ఇట్టిపదములు పెక్కులు ద్రావిడ భాషలయందు లోపదీర్ఘత నొంది కనిపించును. దీనిని ఆంగ్లమున compensatory lengthening అని యందురు.

ద్విరుక్తి : ఇది యిప్పుడు మాచిన లోపదీర్ఘతకు పూర్తిగా విలోమమైనది దీర్ఘమును హ్రస్వీకరించునపుడు పైనున్న యచ్చరము ద్విత్వమై ఉచ్చారణకాలమును సరిపెట్టును. 'ఆచోటు' మున్నగుశబ్దములు 'అచ్చోటు' మున్నగు విధముగా మారును. 'మూడు' శబ్దముతోడి సమాసములందు కూడ ఇట్టి మార్పు కలుగును॥ ముల్లోకములు ॥ఈ మార్పును ఆంగ్లమున doubling అని యందురు.

నాదత : శ్వాసములు నాదములుగా మారుట యను విషయము ద్రుతకార్యమునందును, గనడదవాదేశమునందును గనిపించును. తెలుగున నిర్నిమిత్తముగా కూడ ఈ మార్పు కనిపించును. ఉచ్చారణసౌకర్యమే యన్ని కారణములను మించిన కారణమై యిట్టియెడల ప్రవర్తించును 'బ్రతుకు, మెతుకు' అనునవి 'బ్రదుకు, మెదుకు' అని నాదాక్షరమధ్యముగా గలవు 'కడచు' అనునది 'గడచు' అని వాడుక కెక్కినది 'గడప' అను నాదముతోడి రూపము 'కడప' ము ప్రొక్కివేసినది. మృగము తెలుగులో మెకము మెగము అని రెండు రూపములు చాల్చినది, అట్లే ముఖము మొకము తో పాటు మొగము కూడ నైనది. ఇట్లు శ్వాసాక్షరములకు బదులు నాదాక్షరములను వాడుట వాడుకలో బాగుగా గలదు॥ ప్రోవ - దోవ, తూరు - దూరు, తిద్దు - దిద్దు

అనునాసికీకరణము : ఒక భాషలో అనుస్వార ముండి మరొక భాషలో ననుస్వారము లేకుండ మున్న పదము లవేకముగా కలవు. వర్గములోని వాలుగక్షరములును, తత్పూర్వము బిందు వున్నయెడల ననునాసికాక్షరములతో సమాన మగు నుచ్చారణను కలిగియుండును ప్రథమా విభక్తి ప్రత్యయము లగు "బువు" వర్ణములు 'ము' వర్ణముగా పరిణతములయ్యే నని యీవరలో చూచితిమి. అడగు, వడకు, ముడుగు మున్నగు శబ్దములలో 'డ' వర్ణమునకు ణత్వము కలిగి అణగు, వణకు, ముణుగు మున్నగురూపము లేర్పడుచున్నవి. తోడుఁబాలు, నానుఁబారువియ్యము, తిరుగఁబోఁత, పొగరుఁబోతు మున్నగు పదములు వ్యవహారములో తోడుమాలు

వానుమారుఁయ్యము, తిరుగుమోత, పొగరుమోతు మున్నగు విధముగా అనునాసికాక్షరములను పొంది వినిపించుచున్నవి. ఈ మార్పును ఆంగ్లమునందు nasalisation అని యందురు.

తాలవ్యీకరణము : కంఠ్యములు తాలవ్యములుగా మారుట పెక్కు భాషలలో కలదు. ద్రావిడభాషలలో పెక్కు ధాతువులు ఒక భాషనుండి మరొక భాషలోనికి మారునప్పుడు ఈ మార్పునకు లోనై కనిపించును. ప్రాచీనద్రావిడ భాషయందలి కకారము తెలుగుభాషలో పెక్కుచోట్ల చకార మగును॥ కిళి -చిలుక॥ కీడ - చెడు॥ ఇట్టి మార్పును ఆంగ్లమునందు palatalisation అని యందురు.

సామ్యము : భాష చాలవరకు అనుకరణమువలన ప్రచారము నొందును పెద్దలు మాటాడుచుండగా పిన్నలు అన్యభాషీయులు నేర్చుకొనుచుందురు. ఇట్లు నేర్చుకొనుటలో పోలికనుబట్టి క్రొత్తవానిని సృష్టించుటయు జరుగుచుండును. తెనుగులో 'పండ్లు' అను పదము కలదు 'దంతములు' అను నర్థము గల యీ పదమునుబట్టి 'నేత్రములు' అమ నర్థము గల 'కండ్లు' అను శబ్దము సృష్టింపబడినది. కల్లు' అను శబ్దము బహువచనమున 'కండ్లు' అని యగును. దానికి 'ఱాలు' అని యర్థము. 'నేత్రము' అను నర్థముగల ఏకవచనము 'కన్ను' దీని సామ్యమున 'పండ్లు' శబ్దమునకు 'పన్ను' ఏకవచనముగా సాధింపబడినది. కాని యిది 'పల్లు' అని యుండవలయును. ఇట్లు సామ్యము (analogy) వలన అనేకరూపములు భాషలో ప్రవేశించు చున్నవి. కొన్నింటికి స్థిరత్వము నైతము చేకూరు చున్నది.

ఈ విధముగా పెక్కు మార్పులు ధ్వనుల యుచ్చారణలో కలుగుచున్నవి. పెక్కుచోట్ల అశ్రద్ధయు, అశక్తతయు కారణములు కావచ్చును. కొన్నిచోటులం దైనను భాషా స్వభావమునుబట్టి యీ మార్పులు జరుగుచున్న వని యొప్పు కొనక తప్పదు అట్టివి చిరంజీవములై ప్రామాణికభాషా గ్రంథములందు నైతము ప్రతిష్ఠను గడించుకొనుచున్నవి.

లిపి పరిణామము

వాగ్వ్యవహారమునకు భాష యని పేరు. ఈ వ్యవహారము సమకాలికులకు సన్నిహితులకు సరిపడును కాని దూరస్థులకు మన భావములను తెలియజేయ వలయునన్న వాగ్వ్యవహారము సమర్థము కాదు. అందువల్లనే ప్రాచీనమానవుడు తన పరిశోధనాశక్తి కనుగుణముగా కొన్ని మార్గములను కనిపెట్టెను. తొలుదొల్త తనభావ మే వస్తువునుగూర్చి ప్రసంచినదో ఆ వస్తువునే సంకేతముగా వాడుకొనెను. కాని యిది కష్టసాధ్య మగు వ్యవహారము; కొన్ని యెడల అసాధ్యముకూడ. అందువలన ఆవస్తువుల బొమ్మలను రాతిమీదనో, కొయ్య మీదనో చెక్కి పంపెడివాడు. ఈ విధమగు బొమ్మలే శిల్పుల నైపుణ్యముచే, పరిణామముగా లిపిరూపమును ధరించినవి. ఇట్టి లిపులను ఐదు విధములుగా లిపి విశేషజ్ఞులు విభాగించి యున్నారు.

(1) హైరోగ్లిఫిక్ లిపి: ఈజిప్టునందు వాడుక నొంది యుండుటచేత దీనికి 'ఈజిప్షియను లిపి' యను పేరుకూడ

కలదు. బొమ్మల రూపములో నున్న యీ లిపి వయస్సు ఐదు వేల సంవత్సరములకు మించి యుండును.

(2) క్యూనిఫారం లిపి: బాణములు మొనతేలి నట్లుండు గుర్తులతో వ్రాయబడుటచేతదీనికి 'బాణలిపి' యను నర్థముగల యీ పేరు వచ్చినది ఈగుర్తులనే అరబ్బులు మేకు లని యను కొనుటచేత 'కీలలిపి' యను నర్థమున 'మిస్మారి' అను పేరు పెట్టిరి. ఈ లిపి పారశీకమునందు ప్రసిద్ధిని పొందినది. వీరికి పూర్వము బాబిలోనియనులు సుమేరియనుల నుండి యీ లిపిని గ్రహించిరి.

(3) క్రీటులిపి: ఇది యిప్పటికి నాలుగు వేల సంవత్సర ముల పూర్వమునాటిదని యూహింపబడినది. క్రీటు ద్వీపము నందు వాడుకలోందియుండుటవలన దీని కీపేరు కల్గియున్నది.

(4) సెమిటిక్ లిపి ఈజిప్షియన్ లిపిలోని బొమ్మలరీతినే గ్రహించి, వారికి శత్రువులైన 'సెమ్' జాతీయులు ఈ లిపిని కనిపెట్టిరి. వీరు ప్రాచీన చిత్రలిపినుండి యిరువది సంజ్ఞలను తీసికొని, వ్రాతకు సులభముగా నుండునట్లు అక్షరలిపిగా మార్చుకొనిరి. ఇది యిప్పటికి మూడు వేల సంవత్సరముల వయస్సు గలిగియున్న దని అభిజ్ఞుల నిర్ణయము.

(5) ఫోసీషియను లిపి: సిరియాదేశపు సముద్రతీర భాగమే ఫోసీషియా. ఇచ్చటి ప్రజలు సముద్రములపై నిత్యము

ప్రయాణము చేయుచు వర్తకవ్యాపారములతో జీవించెడివారు. వీరి వాగరకజీవితసంరంభములో బొమ్మలు చెక్కుకొనుచు కూర్చుండుట కవకాశము చాలదు. అందువలన సెమిటిక్ లిపి మరింత సౌలభ్యము నార్జించుకొని రేఖామాత్రముగా రూపు దాల్చినది. ఫోనీషియానుండి గ్రీకు, రోము మున్నగు దేశములలో వ్యాపించి ప్రాచీన నవీన గ్రీకులిపులకును, నేటి యాంగ్ల లిపికిని మాతృక యైనది. ఇంతవరకు కుడినుండి యెడమకే వ్రాత సాగినను, ఈ తరువాత ఎడమనుండి కుడికి వ్రాయు అలవాటేర్పడినది. ఇవన్నియు లేఖనమహాయాత్రలో సౌలభ్యము నపేక్షించి వేసికొన్న స్థావరములు.

ఇంతవరకు పాశ్చాత్యులదృష్టితో లిపివిభాగమును సమీక్షించుట జరిగినది. వారి దృష్టిలో భారతదేశపులిపులు కూడ పాశ్చాత్యదేశములోనే పుట్టినవి. 'లిపి' యను మాటకూడ పాశ్చాత్యులదే. 'అక్షర' మను మాట కూడ పాశ్చాత్యులదే.

సెమిటిక్ జాతీయులలో 'అక్కాడియనులు' అను ఒక తెగవారు కలరు వారివలననే అక్షరలేఖనము వ్యాప్తిపొందిన దనియు, 'అక్కడ్' అను పదమునకు సంస్కృతీకరణమే అక్షర మనియు వాదించువారు గలరు. మనవారి దృష్టిలో 'అక్షరము' అనగా నాశనము లేవి దని యర్థము. వేదమునందు కూడ మన్న 'అక్షర'పదమును, తరువాత నెన్నటికో కమలు తెరచిన వారినుండి గ్రహించి రనుట హాస్యాస్పదము. కేవలయాదృచ్ఛిక సామ్యమును ఇంతగా పాగదీయుట యుచితము కాదు.

పాశ్చాత్యుల మతం 'డిపి' నుండి 'లిపి' యుద్భవించిన దని కొందరి వాదము. కాని పాణిని అష్టాధ్యాయిలో లిపి, లిఖి, లేపము, లేపనము లింపనము మున్నగురూపము లుండుటవలన పై వాదము వ్యర్థ మనక తప్పదు. 'లింపతి' అనగా 'పూయుచున్నది' అన్నది యర్థము. వర్ణములను పూతపూయుట యాధారముగా చేసికొని 'లిపి' యను పదము స్వతంత్రముగనే యేర్పడినది. అట్లే క్రీటుద్వీపవాసుల లేఖనసాధన మైన 'అలెఫ్' నుండి 'లిపి' యేర్పడెనువాదము కూడ కలదు క్రీస్తుపూర్వమే ఐదువేల సంవత్సరములనాటి వేదములనుబట్టి భారతీయులకు 'లిపి' యున్న దని స్పష్టముగా చెప్పుటకు సాక్ష్యములు గలవు. కావున ఆ లిపికి రెండుమూడు వేలయేండ్లు మాత్రమే వయస్సు గల సెమిటిక్ లిపిని గాని, ఫోనీషియాలిపిని గాని మాతృకగా భావించుట యుక్తి యుక్తము కాదు

"Th s Brahmi alphabet was believed to have been created out of the Semitic (Phoenician) system of writing by Indian merchants, several hundred years before Christ. One recent view, however, is that it was derived, probably in the 10th century B. C., from the pre-Aryan script as used at Mohen-jo-Daro and Harappa and other ancient pre-Aryan cities in Panjab, Sindh and other areas and was adapted for the needs of the Aryan Language (Vedic Sanskrit)."

—సునీతికుమార చటర్జీ.

దీనినిబట్టి ఆర్యులకు పూర్వమే భారతదేశమున లిపి యున్నదనియు, అది వేదములకంటె ప్రాచీనతరమనియు విశ్వసింపవలసి వచ్చుచున్నది ఆ లిపియే బ్రాహ్మీలిపిగా పరిణమించి, భారతీయభాషల కన్నింటికి లిపులను సమకూర్చి పెట్టినది తెలుగులిపి కూడ బ్రాహ్మీలిపినుండియే యుద్భవించిన దని వేరుగా చెప్పికొనవలసిన యవసరము లేదు

తెలుగుదేశమును అనేకవంశముల రాజులు పరిపాలించిరి. వారు వేయించిన శాసనములు ప్రాకృతసంస్కృతాంధ్రములలో నున్నవి. వాని కన్నింటికి నుపయోగించినది బ్రాహ్మీలిపియే. అయినను, పెక్కు మార్పులతో ఆ లిపి కనిపించుచుండుటవలన లిపి పరిణులు సృష్టతకొరకై, రాజవంశముల వేళ్ళనుబట్టి శాతవాహనలిపి ఇక్ష్వాకులిపి పల్లవలిపి, వేంగీలిపి, చాళుక్యలిపి, కాకతీయలిపి మున్నగువిధముగా నామకరణము గావించిరి.

ఉత్తరాది దైన మౌర్యలిపికిని, దక్షిణమునందలి శాతవాహనలిపికిని భేద మంతగా లేదు ఇక్ష్వాకులకాలములోనికి వచ్చుసరికి అక్షరములు అందమైన సముపార్జించుకొనసాగినవి. తరువాత పల్లవుల పరిపాలనము కొంతకాలము సాగినది. ఆ తరువాత వచ్చిన బృహత్పలాయనుల కాలములో శిలాశాసనములు తగ్గుముఖము పట్టి తామ్రశాసనములు వాడుకలోనికి రాసాగినవి. శాలంకాయనవంశీయుల పరిపాలన లిపి పరిణామములో విశిష్టతను సాధించుకొన్నది. ఇక్ష్వాకుల కాల

మున అక్షరముల క్రిందిభాగము పెద్దదై, యెడమవైపు మరలు చుండుట మొదలుపెట్టగా, శాలంకాయనులకాలములో అక్షరముల తలలపై అడ్డగీతలు ఏర్పడసాగినవి. అవియే తెలుగు నందలి తలకట్లకు మూలరూపములు. విష్ణుకుండినుల కాలమున అక్షరముల తలలపై గీతలు పార్శ్వికములైనవి. 'ఐ'అను నక్షరమునకు లిపి యీ కాలములో గలదు. విష్ణుకుండినులకు ఉత్తరమునవున్న వాకాటరాజుల శాసనములందు అక్షరముల తలపై గీతలు పలకలు తేరి యేర్పడసాగినవి. అవియే దేవనాగరి యందలి అడ్డగీతకు మూలరూపములు.

ఆ తరువాత చాళుక్యులకాలములో తెలుగుభాష నలు మిగాలుగా వికసించినది. తెలుగు శాసనభాష యైనది. వేంగీచాళుక్యులు తెలుగుదేశపాలకులుగా నున్న కాలమునసే పశ్చిమచాళుక్యులు కళింగదేశపాలకులుగా నుండిరి. ఇంతవరకు ఒకే విధముగా నున్న లిపి బాదామిచాళుక్యుల పాలనలో కొంచెము కుడివైపు త్రిమ్మిగ్గి కన్నడలిపికి మూలమైనది. వేంగీ చాళుక్యలిపి నిలువుగా నిలిచి, చదరముగా నుండి తెలుగులిపిగా రూపు దిద్దుకొనసాగినది నన్నయభట్టారకుడు భారతమును వేంగీచాళుక్యలిపిలోనే వ్రాసెను. కాని నన్నయనాటికే యా లిపి రూపాంతరము ధరించినది తలకట్లు దిద్దినట్లుగా ఏర్పడి కుదురుకొన్నవి; అడ్డగీతలుగా ఉండెడిని రెండు రేకులై అందము లొల్కబోయ సాగినవి. నన్నపార్యునినుండి ప్రారంభమైన మార్పులు దాదాపు రెండు వందల యేండ్లపాటు సాగి తెలుగును, కన్నడమును భిన్నలిపులుగా ప్రతిష్ఠించినవి. తెలు

గున అఱరములు గుండ్రము లగుచుండగా, కన్నడమున అఱ రములు కోణము లొందసాగినవి.

పదమూడవశతాబ్ది ముగియుసరికి తెనుగులిపి స్పష్ట రూపమును సంతరించుకొన్నది. కావునసే లిపిపరిణామవిషయ మున నింతవరకు సంధికాలముగా పరిగణింపబడినది. శ్రీనాథుని కాలమునకు దరిచాపుగా ఈనాటి అక్షరవైఖరి తెలుగులో ఏర్పడిన దనవచ్చును విజయనగరరాజులు సంస్కృత కన్నడ తమిళ భాషాశాసనములకు సైతము తెలుగులిపిసే వాడుక చేసిరి.

తెలుగునందు 'చ ఁ జ' యను రెండు దంత్యములును, 'ఱ ళ' అను అలఘువులును, అర్ధానుస్వారమును అద్భుత మైన చరిత్ర కలిగి యున్నవి.

ఆంధ్రశబ్దచింతామణియందు 'చజయుగ' అని 'చజ'లను రెండు విధములుగా తెలిపెను. చిన్నయసూరి తెలుగున గల దంత్య తాలవ్య చజలను స్పష్టముగా తెలిపెను. వర్ణసమా మ్నాయములో కూడ చెప్పుటవలన లేఖనవిధానమును వేరుగ చెప్పవలసిన యవసరము లేకపోయినది. అప్పకవి "దంత్యచజ గురు రలలకుఁ దనరు బొట్లు" అని లేఖన విధానమును వివ రించెను. అప్పకవి యుద్దేశమున దంత్య చజలను 'చ ఁ జ' అనునట్లుగా కాని 'చ ఙ' అనునట్లుగా కాని వ్రాయవల యును. కాని, యిట్టివ్రాత శాసనములం దెచ్చటను లేదు

అట్టి యావశ్యకము కలుగలే దేమో! చిన్నయసూరి 'చ జ'లను నెత్తిపై తెలుగురెండంకె వేసి చూపెను. ఇట్లు వ్రాయవలయు నని యీవరకు చెప్పినవారు గాని, శాసనములందు వ్రాసినవారు కాని లేరు. హిందీభాషయందు క,గ,జ మున్నగు నక్షరములను కొంచెము తేల్చి పలుకునపుడు వానిక్రింద చుక్క యిడు పద్ధతి గలదు. అటువంటిది అప్పకవి కేమైన స్ఫురించెనేమో! రావిపాటి గురుమూర్తి శాస్త్రిగారు తమ వ్యాకరణ గ్రంథము నందు చ, జ లను తాలవ్యములుగా చూపిరి. నెత్తిపై నున్నది తెలుగు ఒకటి. మొట్టమొదటివి తాలవ్యము లని, రెండవవి దంత్యము లని గుర్తు పెట్టుకొనుటకు చేసిన పని యిది. బ్రౌనుదొరగారు తెలుగుగ్రంథముల నచ్చువేయించు సమయమున ఉచ్చారణస్పష్టత నుద్దేశించి చేసిన సంస్కరణ మిది. వారిదగ్గర పండితులుగా వ్యవహరించిన గురుమూర్తి శాస్త్రిగారు కూడ ఆ మార్గమునే అనుసరించిరి. చిన్నయసూరి తాలవ్యముపై ఒకటి గుర్తును వేయుట మానివేసి, దంత్యముపై రెండు గుర్తును మాత్రము వేసెను. అదియే ముద్రణ విధానమున అనుసరింపబడినది. ఇతర ద్రావిడ భాషలయందు దంత్యచజలు లేవు.

అప్పకవి 'రల'లకు కూడ బిందువును విధించెను. ఇదియు కృత్రిమవిధానమే. అప్పకవీయమునందే ఆ లేఖన విధానము లేదు. ఇంతే కాక 'యరలవ'లు నాలుగును ఈ ద్వైవిధ్యమును

పొందును. ఈవిషయమును ఆంధ్రశబ్దచింతామణియే "లఘువో2 లఘవశ్చేతి ద్వేధాన్తస్థాన్వదన్తి శాస్త్రారః అన్యేఽన్యవ్యాకరణ స్పష్టా ర న్త్రవ్రగృహ్యాతే ద్వివిధః" అని రచించెను కాని 'యవ'లకు లఘ్వులఘుభేదముచే లిపిలో భిన్నత్వము లేదు. 'రల'లకు అప్పకవి చెప్పెను. కాని వానిని వేరు వర్ణములుగా పరిగణించుట జరుగలేదు. చిన్నయసూరియు ద్వైవిధ్యమును చెప్పెను లఘ్వ్యములందు ళకటరేఫమును చూపెను కాని వర్ణసమామ్నాయమందు చేర్చ లేదు. అట్లే బహువచనమున 'రలడల' కాదేశముగా వచ్చిన ళకారమునే అలఘులకారముగా నిర్వచించి, కేవల ళకారము వర్ణాంతర మని నిర్ధారించెను అప్పకవి 'ళ'కారమును గూడ అలఘులకార మనియే వాడెను ఇంతకును 'అ, ళ' అను వానికి భిన్నలిపి అతిప్రాచీనశాసన ములనుండియు కనిపించుచున్నది. ఒక్కొకప్పుడు 'ర అ' లు పరస్పరము వినిమయమునొందుట కనిపించినను, ఉచ్చారణలో ఆ వాటికి స్పష్ట మగు భేదముండియే తీరును. కావుననే ఆ భేదమును గావాడుకొన వలయు నను ప్రయత్నము వ్యాకర ణములయందు మిక్కిలి కనిపించును. 'ల ళ'ల విషయము కూడ అట్టిదే.

అర్ధానుస్వారవిషయము చూతము. "సిద్ధస్సాధ్యశ్చాను స్వారః పూర్ణార్ధభేదతో ద్వివిధః" అని ఆంధ్రశబ్దచింతామణి తెల్పినది. ఈవాడు ముద్రితగ్రంథములందు పూర్ణార్ధానుస్వార ములు రెండును స్పష్టరూపముతో గోచరించును. కాని మూడు

వందల యేండ్లకు పూర్వము దీనికి రూపములే దన్న సత్యము విన్నచో ఆశ్చర్యము కలుగక మానదు శాసన భాషలో బిందువునకు తరువాతి యక్షరములు ద్విరుక్తములగుట కను గొందుము॥ పంద్దివ్రగహి; పోయంగ్గలవాండు; పూంటకు; తోంట్ట కూంతు సరియ పోల్పం గాంత లెందు॥ మున్నగునుదా హరణములను గమనింపగా మనకు కొన్ని విషయములు తేలును. బిందువుస్థానమున పూర్ణబిందువును గావి, వర్గపంచ మాక్షరమును గాని వాడుట కలదు. ఉచ్చారణమున కూడ పూర్ణానుస్వారమే వలయుచో, తరువాతి వర్ణమును ద్విరుక్తము గావింపవలయును. అట్లు ఒత్తి పలుకుటవలన ముందరిబిందువు ఉచ్చారణగౌరవమును పొందును . ఉచ్చారణమున శ్లథమైన యనుస్వారమునకు పిమ్మటి వర్ణము ద్విరుక్తము కాదు. "కూంతు" అనునప్పుడు ఇచ్చటి పూర్ణబిందువు అర్ధానుస్వారసదృశమే. దీనికి ఉచ్చారణము లేదు. బహుశ: ఆ మీదివర్ణమును అనునాసికోచ్చారణముతో పలికెడివారేమో! ఒత్తి పలికినప్పుడు పూర్ణబిందువును తేల్చి పల్కవపు డర్ధబిందువును నిల్పుట తరువాతికాలమున సంప్రదాయ మైనది. ఉత్తరాదివారి సాహిత్యముతో పరిచయము కలిగిన పిమ్మటనే యీ అర్ధానుస్వార మేర్పడి యుండెనేమో! హిందీయందు "మైహూఁ" మున్నగుచోట్ల అర్ధచంద్రాకారపు బిందువును వాడుట కలదు. ఉచ్చారణలోని అనునాసిక్యమును బట్టి తెలుగునకు ఆ అర్ధచంద్రాకారమే అరసున్నగా రూపొంది యుండును. ఉచ్చారణమున తేల్చి పలుకుట ప్రాచీనకాలము

నుండి యున్నను. లిపిమాత్ర మిటీవలనే యేర్పడిన దనక తప్పదు. ఇతర ద్రావిడభాషలయందు అర్ధానుస్వారము లేదు.

ధ్వనికిని లిపికిని గల సంబంధమును గూడ కొంచెముగా చూతము. భారతీయభాష లన్నింటియందును లిపి ధ్వన్యను సారియై యున్నది. తెలుగున కూడ నట్లే. ఉన్న లిపిని ఉచ్చరింపకుండుట, లేని లిపిని ఉచ్చరించుట, ఒకే లిపిని భిన్నధ్వనులుగా ఉచ్చరించుట, భిన్నలిపులను ఒకే ధ్వనిగా ఉచ్చరించుట యనునవి లిపిగతలోపములుగానే పరిగణింపబడును. ఉదాహరణకు ఆంగ్లమును దీసికొందము. Doubt అనునప్పుడు 'b' ఉచ్చారణము లోపించినది. Knife అనునప్పుడు 'k' ఉచ్చారణము లేదు. Enough అనునప్పుడు 'gh' అను రెండు వర్ణములకు 'f' ఉచ్చారణము కలదు Ghost అనునప్పుడు మరల ఉచ్చారణము మారినది. 'e,i' మున్నగునవి వేర్వేరుచోట్ల ఒకే ధ్వనిని కలిగియుండును. అట్లే 'a, w, o' మున్నగునవి సమానధ్వనికి సైతము గుర్తులగును. But అనునపుడు 'అ'కారోచ్చారణము గల 'u' వర్ణము Put అనునప్పుడు 'ఉ'కారోచ్చారణము నొందును Pleasure లోని చివరి నాలుగక్షరములను ఒక మాటగ పలికిన sure అని భిన్నమైన యుచ్చారణము నొందును. ఉచ్చారణదృష్టిలో చూచినపుడిది యంతయు లిపిగత మైన యసమర్థతగనే లెక్కింపదగును ఇట్టి యసమర్థత తెలుగుభాష కేమాత్రమును లేదు. అయినను

కొన్ని వ్యత్యస్తములు మాత్రము కనిపించుచున్నవి. వానిని గమనింతము.

నేటి వాడుకయందు మాటచివరి ఉత్వమును తేల్చి పల్కుట వినిపించును 'వెళ్ళేను' మున్నగుచోట్ల నిట్టిది కలదు. అట్లే భగవంతుడు. వృత్తము మున్నగువాని ప్రత్యయముల స్థానములో కూడ తేల్చి పలుకుట కలదు. ముకారాంత ములు 'వృత్తం' మున్నగువిధముగా పూర్ణబిందువులతో వినిపించుట యీ విషయమునే సమర్థించును. దీనిని వక్తయొక్క అసావధానతగానే పరిగణించుట యుచితము. అరవమున ఇట్టిచోట్ల 'కుట్రియలుగరమ్' 'కుట్రియల్ మగరమ్' అను నర్ధమాత్రాక పాదమాత్రాకము లయిన ధ్వనులను గుర్తించిరి.

అట్లేవాడుకలో యకార వకారములు స్వరాదిపదములకు ముందు చేరి వినిపించుచున్నవి. ఇ ఈ ఎ ఏ లకు ముందు యకారము ఉ ఊ ఒ ఓ లకు ముందు వకారము వినిపించుమాట నిజమే. దీనికి కారణము అని ఏకస్థానజనితము లగుటయే కావున అసావధానముగా పలికినప్పుడు జన్మబలము వలన ఆ పొరపాటు కలుగును ఇది వక్తయొక్క అసమర్థతను సూచించునే కాని లిపియందు దోషమును స్థాపింపలేదు. అట్లే ఋ ఌ వర్ణములు 'రు ర' 'లు ల' మున్నగువిధముగా వినిపించుచున్నవి. దీనిని లిపిగతదోషముగా పరిగణించుటకు పూర్వ మీ వర్ణములు తెలుగునకు విజాతీయము లని గుర్తించుట యవసరము. సంస్కృతభవ మైన ప్రాకృతమునందే యిట్టి మార్పు

కలుగగా తెలుగున నిట్లు కలుగుటలో ఆశ్చర్యము లేదు. ఱు ఌ వర్ణముల పరిణామమునే యిది సూచించును. నన్నయ కాలమునుండియు ఉచ్చారణసామ్యమును స్థాపించు నుదాహరణములు చెక్కులుగలవు ఇట్లే 'ప్రజ్ఞ' మున్నగు పదము లందలి 'జ్ఞ' యను ధ్వనిని 'గ్న' యని పలుకువారు గలరు. కాని యిది సరియగు నుచ్చారణముకాదు. అయినను అశ్రద్ధయు అసమర్థతయు కారణముగా నిట్టి యుచ్చారణము బలిసినది. 'పగ్గె' మున్నగు తద్భవము లేర్పడినవి. కాని దీనికి సరియగు నుచ్చారణము లేకపోలేదు. కావున నిదియు లిపియందు దోషమును జూపజాలదు.

ఇంక శకటరేఫము, అర్ధానుస్వారము లిపియం దున్నవి కాని ఉచ్చారణమున నించుమించుగా నశించిపోయినవి.

విష్ణువు, కృష్ణుడు మున్నగుచోట్ల షకార ణకారముల నడుమ టకారోచ్చారణము కూడ కలదు దానికి లిపిచిహ్నము లేదు అట్లే 'వఱుము' మున్నగుచోట్ల నున్న 'ఱ' కారము కకార షకారసంయోగముకంటె భిన్న మగు . నుచ్చారణ గలది చిహ్నము, 'బ్రహ్మము-మున్నగు పదములందు 'హ'కార ములు ముందు శ్వాసినను ఉచ్చారణమున 'చిహ్నము, బ్రహ్మము' మున్నగువిధముగా వెనుకయే పలుకుదురు ఇట్లు పలుకుటకు అనుకూలముగా సంస్కృతవ్యాకర్తల శాసనము కూడలదు.

ఇక ఆంగ్లాదిభాషలనుండి వచ్చిన 'కాఫీ' మున్నగు వానికి సరియగు లిపిచిహ్నము తెలుగున లేదు. Boy అను పదమును తెలుగక్షరములలో వ్రాయజాలము. అట్లే Pleasure

అను పదము నుచ్చరించుచున్నను వ్రాయుటకు తెలుగు లిపి చాలదు. అన్యభాషాపదములను వ్రాయుటకు తెలుగులిపి చాలక పోవచ్చును. అది లోపము కాజాలదు వాడుకలో ఈనాడు 'వచ్చాడు పోయాడు' మున్నగువిధముగా నున్న ఉచ్చారణమునకు తగిన లిపిచిహ్నము లేదు వచ్చి + ఆకు మున్నగుచోట్ల సంధి కలుగగా పూర్వ కాలవ్యోచ్చారణము నిలిచియే యుండు నని చిన్నయసూరి సూత్రాంధ్రవ్యాకరణ మున 'కంచంత—కాచాకు-పచ్చాక్వికాద్యీనా మక్కజాదికా కాధుత్వ మవగంతవ్యమ్'' అని యనెను ఇదే భావమును ''పదాదిస్వరయోగంబునందొంటియ ట్లుండె నగు'' నని శబ్ద లక్షణసంగ్రహమునందు తెలిపెను. కావున కాలవ్యోచ్చా రణమే యుండ నగు నన్నమాట! అట్లే 'వచ్చాడు' మున్నగు చోట్ల కాలవ్యోచ్చారణమే యుండిన వాడుకకు సన్నిహితముగా నుండును ఇంతవరకు చేసిన వివేచనమునుబట్టి తెలుగులిపి దోషరహితమును ధ్వన్యనుసారియు నని నిర్ణయించుటకు ఎట్టి యభ్యంతరమును కలుగ దని స్పష్టము.

సంధి ప్రకరణము

సంధి యనగా కూడిక యని యర్థము. ఒక పదమునకు మరొక పదమును సన్నిహితముగా చేర్చి పలుకునపుడు భాషా సంప్రదాయమునుబట్టి కొన్ని మార్పులు జరుగును. ఒక యక్షరమును పలుకునప్పుడు ముఖయంత్రము ఒక విధమగుప్రయత్నమును గావించును; మరొక యక్షరమును పలుకుటకు ముఖయంత్రము తద్భిన్న మగు ప్రయత్నమును గావింపవలసి వచ్చును. ఉచ్చారణత్వర యొక్కటి యీప్రయత్నమునకు సహకరించును కావున 'కూడిక' యనునది యవశ్యలక్షణము. కాని, యిది అన్నిభాషలందు నొకేవిధముగా నుండదు. సౌలభ్యా పేక్ష యనునది సర్వమానవసహజ మైనను సంప్రదాయము సజాతీయభాషలయందు మాత్రము సామ్యమును సాధించి పెట్టును.

సంస్కృతమున మండు సంధివిధానము వేరు. అందలి గుణ వృద్ధి యణాదేశ సవర్ణదీర్ఘ సంధులు తెలుగు భాషా సంప్రదాయమునకు భిన్నములు. పూర్వపదమందలి తుదివర్ణ మును, పరపదమందలి తొలివర్ణమును సన్నికర్ష పొందినప్పుడు రెండింటికి బదులుగా పరపదాదివర్ణము నిలుచుట సంధి. దీనినే పరరూపసంధి యని యందురు ఆంధ్రభాషాభూషణకర్త యగు కేతన—

"మొదలిపదము తుదివర్ణము
వదలక పైపదము మొదలివర్ణ ముతోడం

గదియఁగ సంధులునాఁ దగు
విదితపుఁ దత్సంధు లెల్ల వివరింతుఁ దగన్''

అని సంధిలక్షణమును దెల్పెను కదియుట అనగా సన్నికర్ష పొందుట యని మాత్రమే యర్థము. అప్పకవి సంధిలక్షణము నింతకంటె విశదముగా తెలిపెను.—

'' ఎచట సంధి గలుగు నచటఁ బూర్వపదాంత
వ్యాల్లుతోడఁ గూడినట్టి స్వరము
లోపముగ నొనర్చి యా పొల్లుతో మీఁది
యక్షరంబు గూర్చ నయ్యె సంధి.''

పూర్వపదముచివర వ్యాల్లుతో కూడియున్నస్వరమును లోపింప జేసి, మిగిలినపొల్లువ్యాల్లుతో తరువాతి పదములోని మొదటి యక్షరమును గూర్చవలయును. తెలుగుభాషయందు పదాంత మున స్వరములే సాధారణముగా నుండును. బహువచనమున 'లు,రు' లకు నవశిష్టము లగు 'ల్,ర్' వర్ణములును, ద్రుతమును దక్కపొల్లులు తెలుగుశబ్దములకు చివర నిలువవు అందువలననే 'స్వరము' అని అప్పకవి స్పష్టముగా చెప్పెను కాని 'మీఁది యక్షరము' వా ల్లనికాని అ చ్చనికాని స్పష్టము చేయలేదు. చిన్నయసూరి బాలవ్యాకరణమున – 'పూర్వపరస్వరంబులకుఁ బరస్వరం బేకాదేశం బగుట సంధినాఁబడునని' నిర్వచించెను. పూర్వపూర్వులకంటె సూరి సంధిని సంకుచింపజేసినమాట సత్యము. అందువలననే అతడు భాషాసంప్రదాయమునకు మిరింత సన్నిహితుడై వాడు. చారిత్రకముగ సమీక్షించునపుడు కూడ పరరూపసంధి యొక్కటియే యీ భాషాసంప్రదాయ

మునకు సరిపడు సంధి యని తెలియగలదు. అందువలననే ఆతడు రుగాగమము, టుగాగమము మున్నగువానిని సంధికార్యము లుగా పరిగణింపలేదు. కాని, వానియందును సంహిత లేక పోలేదు. అందువలన వానికి సంధిపరిచ్ఛేదమునందే కావు కల్పించెను.

తమిళమున పూర్వపదాంత్యాక్షరమునకును పరపదాద్యక్షరమునకును సంధి యగును. ఇచ్చట పూర్వపదముచివర అచ్చుకాని హల్లుకాని యుండవచ్చును. అట్లే పరపదము మొదట అచ్చుల్లులలో నేదేని యుండవచ్చును తమిళమున హలంతత్వము ఒహుళముగా నుండుట దీనికి హేతువు కావచ్చును.

కన్నడమున కూడ ఇంచుమించుగా నిదియే లక్షణము. రెండుగాని అంతకంటె నెక్కువగాని వర్ణములు కూడినచో సంధి యనిపించుకొనును. ముందరిపదములోని చివరియచ్చు లోపింపగా మిగిలినహల్లు తరువాతిపదములోని మొదటిస్వర ముతో కూడుకొనును ఇది అజంతభాష కాకపోయినను, పదాంతమునందు క్రమముగా హల్లులసంఖ్య తగ్గుచున్నది.

తెలుగునందు పదములు సాధారణముగా ఉదంతములు, ఇదంతములు, అదంతములు _ అని మూడు విధములుగా నుండును. ఏకారాంతములును, ఓకారాంతములును అళ్ళర్యా ద్యర్థములందు గలవు గాని సంఖ్యలో చాలతక్కువ.

'దశరథ _ అపత్యము అనియన్నప్పుడు పూర్వపరము లందు అకార మున్నది. కావున రెండుచోట్ల మన్న అకారము నకు బదులుగా ఆకారదీర్ఘ మేకాదేశ మగును. ఇది సవర్ణదీర్ఘ

మను సంస్కృతసంధి. 'దళరభావత్య' మను రూపము సిద్ధించును. తెనుగున నైనచో 'అమ్మ - ఆదరము' అనునెడల 'అమ్మ యాదరము' అని యగును. అంతేకాని సంస్కృతము నందు వలె సవర్ణ దీర్ఘము కాదు.

ముని - ఇంద్రుడు > మునీంద్రుఁడు [సంస్కృతసంధి]
చేసి - ఇచ్చెను > చేసి యిచ్చెను [తెలుగుసంధి]
గురు - ఉపదేశము > గురూపదేశము [సంస్కృతసంధి]
వారు - ఉండిరి > వారుండిరి [తెలుగుసంధి]
నమో- అస్తు > నమోఽస్తు [సంస్కృతసంధి]
ఏమో- అనెను > ఏమోయనెను [తెలుగుసంధి]
ముని - ఆశ్రమము > మున్యాశ్రమము [సంస్కృతసంధి]
ముని - అనుమతి > ముని యనుమతి [తెలుగుసంధి]
గురు - ఆజ్ఞ > గుర్వాజ్ఞ [సంస్కృతసంధి]
గురు - ఆనతి > గురునానతి [తెలుగుసంధి]

ఇట్లే పూర్వపరస్థానములందలి వర్ణములందు సామ్యమున్నప్పుడు కూడ సంస్కృతసంధివిధాన మొకవిధముగను, తెనుఁగు సంధివిధానము మరొకవిధముగను సాగినవి దీనినిబట్టి సంధి నియమముల విషయమున ద్రావిడభాషలకును, సంస్కృత భాషకును ఏమాత్రమును సంబంధములే దని స్పష్టమైనది. నిజమునకు, వైయుదావారణములలో 'వారుండిరి' అనునది. మాత్రమే సంధియైన తావు. దానినే 'పరరూపసంధి' యని యందురు. ఇది తెనుగున నిత్యసంధి తెలుగుసంధు లనిగుర్తిం

చిన వన్నియు సంధిదానిరూపములే. ప్రకృతిభావమును తొల గించుటకుగాను రెండచ్చులనడుమ యకారముగాని, ప్రథమా జనాపేక్షతో నకారముగాని వచ్చి చేరుటవలన మిగిలిన పై రూపము లేర్పడినవి, వానిని నింకను స్పష్టముగా పక్రమముగా నిట్లు పరిశీలింతము

ఉత్వసంధి

తెలుగునందు ఉత్వమున కగు సంధి యొక్కటియే నిత్య మయినను దానికిని గొంత పడలింపులేక పోలేదు ప్రాచీనము లగు ద్రావిడశబ్దములు చాలవరకు హలంతములు. ఇప్పటికిని హలంతశబ్దము లధికముగా కలవు. మలయాళ కన్నడములం దును హలంతములు కలవు. తెలుగుమాత్రము అజంతభాషగా పరిణామము నొందినది; అనగా మూలశబ్దముల చివరి హల్లు లపై అచ్చులు చేరిన వన్నమాట' తెలుగున 'ఉ'కార మెక్కువ పదములపై చేరినది ఇది కేవల ముచ్చారణసౌకర్యముకొరకు చేరిన దగుటవలన పై పదముతో సన్నికర్ష పొందినపుడు జారి పోయినను శబ్దస్వరూపము నష్టముకాదు; అర్థగ్రహణమును క్లిష్టము కాదు. అందువలవనే సాధారణముగా ద్రావిడభాష లన్నింటియందును ఉత్వమునకు సంధి నిత్యముగా నగును. అర వమున 'కుట్రియలుగర' మనియు, 'ముట్రియలుగర' మనియు ఈ ఉత్వము రెండువిధములు. తెనుగున పదాంతమున నుండు ఉత్వము అర్ధమాత్రాకమగు ఉచ్చారణ గలది.

రాముఁడు - అతఁడు > రాముఁడతడు

వృక్షము - ఇదిగో > వృక్షమిదిగో

విష్ణువు - ఉండెను > విష్ణు వుండెను
అలరులు - అలరెను > అలరు లలరెను

ప్రథమావిభక్తిప్రత్యయము లగు డు ము వు లు ఉదంతములు. వీనిచరిత్రమును పరిశీలించినపుడు వీని చివరి ఉత్వము సహజము కాదనియు, సౌకర్యమునిమిత్తము వచ్చిన దనియూ స్పష్టము కాగలదు. కావునసే ఉత్వమునకు లోపము కలిగి పరాచ్చు నిలుచుట జరిగినది.

తమిళమున గూడ నిట్టియెడల సంధి నిత్యము
నాడు - అదు > నాడదు
మూన్ను - ఎఱుత్తు > మూన్ఱెఱుత్తు
మలయాళమున గూడ నిట్టియెడల సంధి నిత్యము
అదు - ఇల్ల > అదిల్ల
వరిగు - ఇల్ల > వరిగిల్ల
అట్లే కన్నడమునందును సంధి యగును
లేసు - ఎల్లం > లేసెల్లం

తెలుగునందు ప్రథమేతరవిభక్తి శత్రర్థచువర్ణంబులం దున్న ఉకారంబునకు సంధి వైకల్పిక మని చిన్నయసూరి సూత్రిం చెను.

ఉకారాంతము లయిన ప్రథమేతరవిభక్తి ప్రత్యయములు నాలుగు. అవి 'ను, కొఱకు, కు, అందు' అనునవి. శత్రర్థకము 'చు'. ఈ అయిదింటికి మాత్రము సంధి వైకల్పికము; అనగా, వీని కడపట నున్న ఉకారము వైకల్పికముగా లోపించు నని

యర్థము. ఇవన్నియు ద్రుతప్రకృతికములే. 'ను' అనునది ఉత్వ విశిష్టముగా నున్నను దీని ప్రాచీనరూపము పొల్లునకారము మాత్రమే అయియుండును ఇకారముమీద ఈ 'ను' సమ స్వరత (vowel harmony)ను పాటించి 'ని'గా మారుచున్నది. హలవసానములు పరము లగునప్పుడు పొల్లు నకారమాత్రము కూడ అగుచున్నది. గోవును; రామునిని; దీనిన్ _ అనునవి యుదాహరణములు.

కన్నడమున 'దీనిని' అను నర్థమున 'ఇదమ్' అని ప్రాచీన రూప ముండగా 'ఇదన్ను' అను నవినరూప మేర్పడినది. ప్రాచీన భాషయంగు హలంతరూపమే యుండి హొసగన్నడమున అజం తముగా పరిణతినొందినది. దీనినిబట్టి నకారము ప్రధానాంశ మనియు స్వరము దాని ననుసరించి వచ్చిన దవియు ననిపిం చును. అందువలననే స్వరము ఆంగిక మను నభిప్రాయముగల కొందరు సంధి చేయక కాపాడిరి. కొందరు ఆగమముగా తలచి సంధిచేసిరి. కావునసే 'నన్నతఁడు; నన్ను నతఁడు' అను విధ ముగా రెండేసిరూపము లేర్పడుట తటస్థించినది.

షష్ఠీప్రత్యయ మగు 'కు' సైత మిట్టిదే. ఇది న్యాయ్య ముగా సంప్రదానార్థమున వచ్చు చతుర్థీ విభక్తి ప్రత్యయము. దీనిని శ్రీకోరాడ రామకృష్ణయ్య 'అగు' అను క్రియాధాతు వున కవిశిష్టరూపముగా తలచుచున్నారు ఇది కూడ ఇకారము మీద 'కి' గా మారును. తమిళమున ఎనక్కు; నినక్కు మున్నగు విధముగా అకారపూర్వకముగా నుండును. కన్నడమున కూడ ఎనగె; నినగె మున్నగువిధముగా నట్లే యున్నది. తెలుగున 'కు' వర్ణకము వచ్చునపుడు ఉకారబుకారములకు నగాగమము

విధింపబడినది ఈ చివరిఉత్వమును ప్రాస్వోకారముగా భావించుటచేతనే దీనికి వైకల్పికముగా నై నను సంధిగావించుట సంభవించి యుండును.

'కొఱకు' అనునది ప్రత్యయ మనిపించుకొనుచున్నను పదస్థితిని పూర్తిగా చాటినది కాదు పని యను నర్థముగల 'కొఱ' యను శబ్దము 'కు' అను ప్రత్యయము చెనసి 'కొఱకు' అని యైనది. ఇప్పటికిని 'కొఱమట్టు' పని యన్నప్పుడు 'కొఱ మూలినవాడు' అని యన్నప్పుడు ఈ 'కొఱ'యే కొరవ లేకుండ పని యను నర్థమున సాహిత్యకరించును. కావున 'కొఱకు' అనుదాని యందున్న 'కు' ప్రత్యయము షష్ఠీవిభక్తి ప్రత్యయముతో ధర్మసామ్యము కల్గియే యుండును.

'అందు' అనునది సప్తమీవిభక్తి ప్రత్యయము. ఇదియు పూర్తిగా పదస్థితిని చాటలేదు. 'అందు అని మాత్రమే కాక 'ఇందు ఎందు' అని యింకొక రెండు శబ్దములు కూడ కలపు వ్యాకర్తలు వీనిని ప్రత్యయ ప్రతిరూపము లని పిలుతురు. అల్, ఇల్, ఉల్ అను శబ్దములు సప్తమ్యర్థమయిన గలవు. కన్న డమునను, తమిళమునను చిన్న మార్పులతో పదాంతమున చేరి సప్తమీప్రత్యయములుగా వ్యవహరించుచున్నవి. తెలుగున లకారము నకారముగా మారి అన్, ఇన్, ఉన్ అనియైనది. ఈ 'అన్' అనునదే ద్వితీయవిభక్తికరూపముల తృతీయాసప్తములందు గోరిన్, ఊరన్, చేతన్, గోతన్ - అను రూపముల నేర్పరుచుచున్నవి. వైని అమవాదర్థకమం దగు 'అదు' శబ్దములోని అవిశిష్ట మగు 'దు' చేరుటవలన 'అన్దు' 'ఇన్దు' మున్నగు విధముగా రూపము లేర్పడి సప్తమ్యర్థమున శబ్దాంతమున చేరుచున్నవి.

ఇవియే 'అల్ - అ' మున్నగువిధముగా చివర అత్వమును పొంది, నిర్దేశకము లగుచున్నవి, ఇచ్చట లకారము ద్విత్వమును పొందుచున్నది 'అల్ల' దూర దేశమును 'ఇల్ల' సామీప్యమును 'ఉల్ల' దూరమును దగ్గరను గాని ప్రదేశమును సూచించును. 'ఉల్' అనునది వర్ణవ్యత్యయమును పొంది 'లో' అని యై తెలుగున ప్రత్యయత్వమును సాధించుకొన్నది.

దీనినిబట్టి ఇక్కడి ఉత్వము లేకున్నను నష్టములేదు. కావున 'అందుండెను' మున్నగు విధముగా సంధియగును. కాని 'అన్' అన్నది ద్రుతాంతము కావున 'అందు' కూడ ద్రుతాంత మని కొందరు సంధి మానియుందురు. కావుననే రెండు విధము లగు రూపములను వ్యాకర్తలు అంగీకరించిరి.

'చున్' అనునది శత్రర్థకము. తమిళకన్నడములందు ఈ అర్థమును బోధించుచు 'తుమ్' అని నిల్చును. 'గెయితు' అనుదాని కంతమందు 'ఉమ్' అను సముచ్చయార్థకము చేరగా 'గెయితుమ్' అనున దేర్పడినది. దీనికి 'చేయుచు' అని తెలుగున సమాంతరరూపము 'చేయుదును' మున్నగు తద్ధర్మార్థకములలోని దకారము పూర్వతకారమునకు పరిణామరూపమే కావచ్చును. వ్యావహారికమున 'చేస్తూ' అని తకారయుక్తముగానే తెలుగున ప్రయోగములు గలవు. గ్రాంథికమున మాత్రము తత్స్థానమున చకారము నిల్చినది. డా॥ కాల్డ్వెల్ చెప్పినట్లు చకారముమీది ద్రుతము సముచ్చయార్థక మగు 'ఉన్' శబ్దమే కావచ్చును. అందువలననే లోప మొందియు, లోప మొంద కయు రెండు రూపము లేర్పడుచున్నవి.

ఇట్లే తమిళమున మఱు - ఉణ్ణు > మఱుపుణ్ణు అనియు, కన్నడమున పటు - ఈతం > పటువీతం మున్నగువిధముగను సంధి లేని రూపములు గలవు నామాంశమునకు నష్టము గలుగు నప్పుడు సంధి కలుగదనియు, లేనియెడల సంధి కావచ్చు ననియు ఈ భాషలనుబట్టి గ్రహింపనగును

ఇత్వ సంధి

తెలుగునందలి యిత్వమును రెండు విధములుగా విభాగింపవచ్చును. ఒకటి క్రియావదాంతము నందలిది; రెండు క్రియేతరవదాంతమునందలిది

ఏమి, మఱి, ఓ, అది, అవి, ఇది, ఇవి, ఏది, ఏవి - అను అనునవి యేమ్యాదులు. వీని యిత్వమునకు సంధి వైకల్పికము.

ఏమి ప్రశ్నార్థకము తమిళ మలయాళములందు 'ఏన్' అని నకారాంతముగా నున్నది. అమహాదర్థకప్రశ్నవాచకమై నపుడు - 'ఱదు' అను సర్వనామమును పొంది "ఎన్నదు" అని యైనది. 'ఏన్' అన్నది తెలుగున మకారాంతత్వము నొంది, ఉచ్చారణసౌలభ్యమునొరకు ఇత్వమును పొంది 'ఏమి' యైనది. చివరియిత్వము కూడ అవయవికమే యను భ్రమవలన, సంధి చేసినచో నామాంశము నష్ట మగు నను భయమువలన నొందరు సంధి చేయకుండిరి. కేవలము రెండక్షరముల శబ్ద మగుటవలన ఇట్టి జాగరూకత యెంతయో అవసరము, కాని 'ఏ - అది' అనునది తెలుగున అమహాదర్థకప్రశ్నవాచకము. ఇందు 'మి' యను నక్షరము లోపించుటయే కాక 'అది'

యొక్క అవశిష్టరూప మగు 'ది' మాత్రమే అంతమున చేరు చున్నది. వాలవసానంబులు పర మైనపుడు కూడ 'ఏ' యని మాత్రమే భాషలో నచ్చటచ్చట కన్పించుచున్నది వీని నన్నింటినిబట్టి 'ఏ' యనునది ప్రధానాంశ మనియు, ప్రాచీన నకారపరిణామరూపమే మకార మనియు, ఇత్వము ఉచ్చారణ సౌకర్యముకొరకు చేరిన దనియు నిర్దిష్టముగా చెప్పనగును.

'మఱి' యనునది 'మఱు' యొక్క మారురూపము. ఇతర భాషలలో నిప్పటి కీక్లేయున్నది తెలుగున కూడ 'మఱుమాట' మున్నగు విధముగా వాడబడుచున్నది. 'మాఱు' అనునది సమాన విధులచే 'మఱు' అని మారునని వ్యాకర్తల నిశ్చయము. అదియే తెలుగునం దింకను మారి 'మఱి' యను రూపము చాల్చెను. కావునసే యిందలి యిత్వము నిత్యము కాక, ఒకప్పు డుత్వమువలె సంధి నంగీకరించును; ఒకప్పుడు ప్రకృతి భావము నొంది సంధి నాపు వర్ణములను పొందును.

ఇట్లే 'అది, అవి' మున్నగున వన్నియు ప్రాచీన భాషలో ఉకారాంతము లై యుండును; లేదా వాలంతము లై యుండి, తమిళమున ఉదంతత్వము నెనసియుండును కావునసే యిచటి యిత్వము కూడ ఉత్వము వలెనే లోపించి మీది వర్ణమును పొందుచున్నది. తెలుగున రెండచ్చురముల పదమే యగుటవలన, తరువాతికాలమున వామాంశము నష్టము కాకుండుటకుగాను సంధిచేయుట మాని యుందురు.

'కు' అను షష్ఠీవిభక్తిప్రత్యయమే ఇకారము మీదవచ్చిన యెడల 'కి' గా మారును. ఇది ద్రుతప్రకృతికము. కావున

చివరి ద్రుతము తరువాతి పదమునందలి తొలియచ్చు నెనసిన సంధికాని పూప మేర్పడును. అట్లుకాక ఇందలి యిత్వము తరువాతి అచ్చుతో కలిసిన సంధి యగును.

ఏమ్యాదు లన్నింటి యందును శ్రుతికి ప్రాధాన్యము వచ్చు చెవికి బాగుగా వినిపించునెడల, అర్థావబోధమున క్లేశము లేకున్నయెడల వీనికి సంధి చేయవచ్చును. ఇట్టివి కాక మిగిలిన యికారాంతములకు సంధి రాదు

క్రియాపదముల చివరియిత్వమును గమనింతము. నేను, మేము, నీవు, మీరు, వాడు వారు - అను సర్వనామముల కడపటి యక్షరములే క్రియాపదములకు చివర చేరు పురుష ప్రత్యయము లగుచున్నవి. వచ్చుచున్నాను -ము,-వు -డు -రు-రు అని యీ విధముగాఅగును. ఇవే ప్రత్యయములు ఇకారము మీద వచ్చినయెడల ఇత్వము నొందును. వచ్చితిని,-మి,-వి,-రి - అనువిధముగా రూపము లేర్పడును. తమిళ కన్నడములందు కూడ శెయ్‌దేన్, గెయ్‌దెమ్ అనునట్లుగా యాన్, ఆమ్ మున్నగు సర్వనామముల అవశిష్ట రూపములే క్రియాపదముల కడపట కనిపించుచున్నవి.

మధ్యమపురుషయందు ఇకారాంతములు 'వచ్చితివి వచ్చితిరి' అనునవి. వీనికి సంధి నిత్యము 'వచ్చితి విప్పుడు, వచ్చితి రిప్పుడు' అని యుండవలయును. ఇందు తివర్ణము పురుషను, ఇత్వము భూతకాలమును సూచించును. ఈరెండింటికిని నష్టము లేకుండ సంధి గావచ్చును. కనుక మధ్యమపురుష క్రియలకు సంధి నిత్యము. 'వచ్చితివి' అను దానిలో చివరి

వకారమునకు లోపము గూడ కావచ్చును. ఇట్టియెడల 'వచ్చి తనియె' అనునట్లు రూపము లేర్పడును. ఇచ్చట తివర్ణము లోని ఇత్వమునకు నష్టము కలిగినమాట నిజమేకాని మఱొక రూపముతో పొరపడు వవకాశము లేదు కావున ఇట్టి రూపము లకును కావులభించినది. యుష్మదర్థమున తెలుగున మాత్రమే 'ఈవు, నీవు' అనుచోట 'వు' కలదు. తమిళాదులందు 'ఈ నీ' యనియే కాని 'వు' కన్పింపదు అందువలననే తెలుగునను 'వ' కారమునకు లోపము వైకల్పికముగా విధింపబడి యుండును.

'వచ్చితిని వచ్చితిమి' అను నుత్తమపురుషరూపములు కూడ నిట్టివే. వ్యాకర్తలు ద్రుతప్రకృతికములకు (ఇఁకాదు లకుఁ దక్కఁ) సంధిలేదని నిషేధించిరి. కావున వచ్చితిని - అనియె > వచ్చితి వనియె అని యగును. ఇచ్చట సంధి కాలే దని యనిపింపదు. మధ్యమపురుషైకవచనమున నెట్లయ్యెనో, యిచ్చటను నట్లే యయ్యెను వ్యాకర్తల దృష్టిలో 'ని ద్రుతము. సంధి యగుట యనగా నడుమనున్న ద్రుతము జారిపోయి. 'వచ్చితనియె' అను రూప మేర్పడుట ఇట్టి రూపము మాత్ర మేర్పడరాదు. ఇట్లే అయ్యెనేని మధ్యమపురుషైకవచన క్రియకు, ఉత్తమపురుషైకవచనక్రియకును, భేదము నశించి పోవును 'ని' అనునది ద్రుత మనుటవలన ఇట్లు 'చెప్పితి వనియె' అనునప్పుడు సంధికాలే దనియే సరిపెట్టుకొనుట వ్యాక రణసంప్రదాయము. భాషాచరిత్రనుబట్టి చైన దీనిని నిత్యసంధి యనవచ్చును.

'చెప్పితిమి' బహువచనక్రియ ఇందలి మకారము ఉత్తమపురుషబహుత్వమును సూచించును ఇత్వము లోపించి

నను అర్థగ్రహణమున క్లేశము కలుగదు కావున దీనికి సంధి వికల్పముగా కావచ్చును. తమిళమున మకారము హలంతము గానేయుండును.

'చెప్పిరి' అనునది ప్రథమపురుషబహువచనక్రియ. భూత కాలమును సూచించు ఇత్వ మున్నది. 'చెప్పిరనియె' అను వట్లుగా సంధి చేసినచో ఇత్వ మొక్కచోటనే యుండి భూత కాలికత్వమును నిరూపించుటకు సమర్థముకా దేమో యని యనిపించి కొందరు విసంధిగ వ్రాసియుందురు. చివరి 'రి' తెలుగు 'వారు' లోని 'రు' వర్ణ మగుటచేత, తమిళాదులందలి 'అవర్' అను రూపములోనిది పొల్లురకార మగుటచేతను, ఇకారమును శ్లథముగావించి కొందరు సంధి చేసియుందురు.

'చెప్పెడిన్' అనునది యిదంత తద్ధర్మార్థకము. ఇది ద్రుత ప్రకృతిక మగుటవలన సంధికార్యము లేదని వ్యాకర్తల నియమము తమిళమునందలి 'ఎడుమ్' అనునదియే తెలుగున 'ఎడున్, ఎడిన్' అని రెండు విధములుగా పరిణామము నొందినది. దీనికి పూర్వరూప మగు 'మ' కారము ఆశీరార్యర్థమందచ్చు పరమగునపుడు 'అయ్యెడు మనియె' అన్నట్లుగా ఇప్పటికిని మిగిలియే యున్నది కావున చివరి నకార మకారము లాంగికము లగుటవలన వానికి నష్టము గావించి సంధిచేయుట జరుగలేదు.

క్త్వార్థకం బయిన యిత్వంబునకు కూడ సంధి నిషిద్ధము. 'వచ్చి - ఇచ్చెను' మున్నగుచోట్ల మొదటిది పూర్వకాలిక క్రియ, రెండవది అనంతరకాలిక సమాపకక్రియ. మొదటి

కార్యమునకును, అనంతరకార్యమునకును వ్యవధాన ముండును. దానిని సూచించుట క్త్వార్థకము ధర్మము. కావునసే క్త్వార్థ కేకారమునకు సంధి చేయకుండుట యోగ్యము పూర్వక్రియ లోని ఇకారము భ్రష్టమైనయెడల భూతకాలమును సూచించు చిహ్న మచ్చట కనిపింపక అర్థగ్రహణమునకు కూడ అవరోధము గలుగును కాని ఉచ్చారణత్వర సర్వసిద్ధాంతముల కంచె బల వత్తరము. అందువలన ఇకారమునకు సవర్ణము పరమైనప్పుడు సంధి చేసిన రూపములు కొన్ని కనిపించుచున్నవి. ఎఱిగించి - ఇప్పుడు > ఎఱిగించిప్పుడు ఇట్టియెడల ఇత్వమెట్లును ఉన్నదిగనుక సరుదుగొనిపోవచ్చును. 'ఎఱింగెఱింగి' మున్నగు నెడల ఆగమేడితమునుబట్టి పూర్వరూపమును గుర్తింపనగును గావున ఇట్టివి కూడ కొందఱు కవుల కిష్టములైనవి. ఏమయి నను, క్త్వార్థక సంధి తెలుగుభాషకు అనుగుణము కాదనియే తేలును.

మగనాలు, పురుటాలు మున్నగునవి యిత్వసంధి వచ్చిన రూపములుగా అనిపించును కాని 'మగన్ - ఆళ్' అనునవియే ప్రాథమికావస్థలో మగనాలుగా వచ్చెనని కొనుట అసాధము. దీని విషయమును 'వేదరాలు' మున్నగు రుగాగమ సందర్భ మున స్పష్టముగా తెలిసికొన నగును.

పురుడు - ఆలు > పురుటాలు అని యేర్పడియుండును కాక ఇదంతరూపముపై నేర్పడినచో 'పురిటి అని ఇన్మధ్య రూపమే యుండవలయును. కాని అట్టి రూపములు అశ్రుతి గోచరములు పై గా ఆకారముమీది యూనికవలన 'పురుడు'

లోని నడిమిఉకారము అకారముగా కూడ మారి 'పురటాలు' అన్నట్లు వినిపించుచున్నది.

తీపి, తీపు; తెలివి, తెలివు; అలవి, అలవు - అనునట్లు రెండేసి రూపములు కూడ కొన్ని శబ్దముల కేర్పడి యున్నవి

వచ్చి - ఆకు > వచ్చాకు ఇట్టియెడల అర్థగ్రహణమున కొంత క్లేశము కలదు వచ్చిదైన ఆకునో, వచ్చని యాకునో వక్త యుద్దేశించినది గ్రహించుట కష్టము కావున, ఇట్టియెడల పూర్వశబ్దమునందలి కాలవ్యాచ్చారణమునే గ్రహింపవలయు వని చిన్నయసూరి సంస్కృతసూత్రాంధ్ర వ్యాకరణమునందు సంకేతించెను. దీనికి తగు లిపి తెలుగు వర్ణములలో లేదు కావున ఇటీవల కొందరు దానిని సూచించుటకుగాను ఒక చుక్కనో, గీతనో ఆ అక్షరములపై నిలుపసాగిరి అది యికార మునకు అకారమునకు మధ్యస్థ మగు ఉచ్చారణము కలిగి యుండును.

అత్వసంధి

అత్వసంధిని వ్యాకర్తలు బహుళ కార్యముగా వేర్కొ నిరి స్త్రీవాచక తత్సమ సంబోధనాంతములయందలి అత్వము నకు సంధి లేదని నిషేధించిరి ఇచ్చటకూడ గ్రహణమున క్లిష్టత లేకుండుట శ్రుతి సౌలభ్యము అను రెండు లక్షణములే పనిచేసె ననుట నిర్వివాదము 'అమ్మ - ఇచ్చెను' అని యన్న ప్పుడు సంధి యగుచో 'అమ్మిచ్చెను' అని కావలయును ఇట్టి యెడల 'అమ్మ - ఇచ్చెను' అను అనిష్ట మగు రూపమునుగూడ లోత గ్రహించుటకు అవకాశము గలదు కావున ఇట్టి తడ

కాటును పరివానించి మాటాడుట వక్తకు అవశ్యకర్తవ్యము. అంతేకాక 'అమ్మ'లోని కడపటి అకారము శబ్దగతము సంధి వశమున అది లోపించినయెడల వామాంశమునకే నష్టము వాటిల్లును. అట్లే 'గంగనుకానె' మున్నగు చోట్లకూడ 'గంగను' అనునది ద్వితీయాంతముగా ననిపించును 'చెలువుఁడ - ఇందము' అనుచోట కూడ సంధి కాదు స బోధనమునందు సంబోధ్యవాచకము కడపటి ఉత్వమునకు అత్వము వచ్చినది. కావున అత్వము సప్రయోజనము ఇప్పుడు సంధివశమున ఆ అత్వమునకు లోపము వాటిల్లినయెడల సంబోధనమునందలి శబ్దమునకును, ప్రాతిపదికార్థమునందలి శబ్దమునకును భేదము నశించి అర్థగ్రహణమున తడబాటున కవకాశము కలుగును కావుననే సంబోధనాంతము వందలి అత్వమునకును సంధిచేయ రాదని వ్యాకర్తలనిర్ణయము.

'మేన - అల్లుఁడు' మున్నగుచోట్ల సంధి వైకల్పికముగా జరుగును. 'మేన్' అనగా శరీరము. శరీరసంబంధమైన అల్లుడు అని చెప్పవలసి వచ్చినపుడు తొలిపదముపై అత్వము చేరినది. మేన్ - అ-అల్లుడు ఇచ్చటి 'అ' సంబంధమును తెలియ జేయును తెలుగున నిట్లు అ వర్ణము పెక్కుచోట్ల చేరుచున్న విషయ మింకను చూడగలము. మేన - అల్లుడు ఇచ్చటి అకారము సప్రయోజనము గనుక కారకాదులయందు దీనికి లోపము గలుగలేదు. 'మేనయల్లుఁడు' అను రూపము సిద్ధించినది. అనంతరకాలమున ఉచ్చారణత్వరవలనగాని, పూర్వపదము 'మేను' అను ఉదంతరూపమే అనుభ్రమవలన గాని 'మేనల్లుఁడు' అను రూపముకూడ వాడుకలోనికి వచ్చియుండును. తెలుగున వీళే

మణివిశేష్యముల నొకదానిప్రక్క నొకదానిని జేర్చి సమా సముగా వాడుట అధికముగాకలదు. తేటనూట; మనసుతీపి మున్నగునవి యిట్టివే. ఇటువంటివాని సామ్యమున 'మేన' యందలి కడపటి 'అ' కారమును పరిహరించి సంధి గావించినను గావించి యుండవచ్చును. కావుననే రెండు రూపములు నేటికి నున్నవి.

'చేయక - ఉండెను' మున్నగుచోట్ల కూడ రెండురూప ములు గలవు. '-క' అని వినిపించుచున్నను, దాని వెనుక నొక అత్వము కూడ కలదు. 'చేయ్ - అక' ఈ అత్వముతో కూడిన క కారము వ్యతిరేకార్థమును స్ఫురింపజేయును. తరువాతి అకారము ప్రధానకార్యమునకును పూర్వకార్యమునకును వ్యవ ధానమును గల్పించుటకు వచ్చియుండును. కానికొన్ని యెడల, ఉండు మున్నగుధాతువులు పరమగునపుడు పూర్వక్రియ కేవల సహాకారక్రియగా మాత్రమే వ్యవహరించుచున్నది. పూర్వ క్రియ ఒక కార్యమును తరువాతిక్రియ మఱొకకార్యమును తెలియజేయుట లేదు ఇట్టిచోట్ల వ్యవధానమును గల్పించుటకు వచ్చిన 'అ' వర్ణమునకు లోపము కలిగినను నష్టము గలుగదు కావున 'చేయకుండెను' అనునట్టి సంధికలిగిన రూపమును చేయకయుండెను. అనునట్టి సంధికానిరూపమును గలిగినవి. 'పుట్టినయిల్లు' మొదలయిన చోట్ల కూడ అర్థగ్రహణమున ఇబ్బంది కలుగదు కనుకనే అత్వమునకులోపము కలుగుచున్నది.

వెలయాలు మొదలగుచోట్ల సంధి లేదు. 'వెల - ఆలు' వెలయాలు అనియే యుండవలయును, వెలాలు అను రూపము కలుగరాదు ఇచ్చట యీ సంధిరాహిత్యమునకు కారణము

కేవలము తెలుగుభాషాలక్షణము కాదు తమిళమున 'తలై' అనియు, కన్నడమున 'తలె' అనియు తల శబ్దమునకు రూపములు గలవు. కావున ప్రాచీనద్రావిడభాషయందు 'తలై' యను రూప ముండియుండును. చివరి ఐకారము అయ్, ఎయ్ అనువానికి వడమగా పలుకబడి యుండును అంచు వల్లనే తెలుగున అదంతశబ్దము కన్నడమున ఎదంతశబ్దము నేర్పడినవి ఇంతకును 'విలై-అల్' అను ప్రాచీనరూపముల కలయికవల్లనే "విలయాల్" అయి తెలుగున 'వెలయాలు' అయియుండును. వ్యాకర్తలు 'వెల' అను శబ్దమేర్పడిన పిమ్మట దానిని పూర్వశబ్దముగా గ్రహించి 'ఆలు' అన్నది ఉత్తరశబ్దముగా గ్రహించి యకారము ఆగమ మని నిర్ణయించిరి. కాని వై ప్రక్రియనుబట్టి చూచినయెడల యకారము వామాంశమే కాని ఆగమము కా దని స్పష్టముగా తెలియును. కావుననే దానికి లోపమును గలిగింపరాదు. దీనిని గుర్తించియే ప్రక్రియాసౌలభ్యము నపేక్షించి యెట్లు చెప్పినను సంజ్ఞికమాత్రము వ్యాకర్త లంగీకరింపలేదు

శ్రీ గంటి జోగి సోమయాజి గారు "తలయారి శబ్దము అట్లు కాకుండటచే తలారి అయినది" అని వ్రాసిరి. ఇందలిది నిజముగా తెలుగు 'తల' కాదు కిట్టిల్ ప్రకారము 'స్థలవారః' అను సంస్కృతరూపము ప్రాకృతమున 'తలారో' అని అనది. అదే తెలుగున తలారి తలవరి, తలవారి అను రూపములను దాల్చినది. ఈ రూపములే బహుప్రచారము నందినవికూడ. తరువాతి కాలమున 'తలయారి' అను రూప మేర్పడినది. వెలయాలు మున్నగువాని సామ్యమున 'తలయారి' అనురూప మేర్పడి

యుండునేమో! ప్రాథమికరూపము 'తలారి' యనునది. కావున శ్రీ సోమయాజిగారు చెప్పినట్లు 'తలయారి' యనునది 'తలారి' అని కాలేదు.

అథర్వణాచార్యులు "క్వచిత్సంస్కృతీయోఽపిదృశ్యతే" అని వ్రాసెను. దాని నెందువల్లనో సూరి సందర్భమునుండి విడదీసి అట్టిప్రయోజనములు లేవని నిరాకరించెను. తత్సమ ముల చివరి అత్వమునకు సంధి కావలయు నని అథర్వణుని యుద్దేశము కాదు అయ్య, అమ్మ మున్నగు పూజ్యతా వాచ కములు వచ్చినపుడు తత్సమములకును సంధి యగు నను అథర్వ ణుని భావమును గ్రహించియే ప్రౌఢవ్యాకర్త ఆర్యాంబాద్య ర్థకములు పర మగునపుడు సంధి యగునని సూత్రించెను. రామయ్య, సీతమ్మ మున్నగునవి ఉదాహారణములు. సంజ్ఞా వాచకములందే యీ సంధి యగును. కావున భావగ్రహణమున క్లిష్టత మున్నగున వేర్పడు ననుట కవకాశము లేదు. సంజ్ఞలకు అర్థముతో నంతగా నవసరములేదు. కేవలము వ్యవహారమే వాని ప్రయోజనము.

రామాంతమునకు నష్టము రానంతవరకు కన్నడమున అత్వసంధి యగును. ఎన్న - అరసం>ఎన్నరసం.

కన్నడమున ప్రకృతిభావము కూడ విపులముగా నున్నది. ఆ - అరసం>ఆఅరసం; పొన - ఆనే>పొనఆనె. ఇట్లు కాని యెడల సంధి వాపుటకుగాను 'య,వ'లు ఆగమములు గానగును.

ఆమ్రేడిత సంధి

తెలుగున ఆమ్రేడితసంధి అత్యంత సహజము. ద్విరుక్త మగుట సాధారణముగా భృశార్థమున జరుగును. అందువలన

పలుకు నప్పుడొక వేగముతో కూడికొని యుండుట స్వాభావికము. అందువల్ల నే తెలుగున మరెచ్చటను దీర్ఘము మీద సంధి జరుగకపోయినను, ఆగమేడితము పర మగునప్పుడు జరుగును. ఓహో> - ఓహో > 'ఓహోహో' అని యగును. 'ఏమీ-ఏమీ > ఏమేమీ' అని యగును. ఇట్లే 'ఏఁగి-ఏఁగి మున్నగుచోట్ల సంధివై పునకే మనసు మ్రొగ్గును. కొందఱు 'ఎతిఁగెతిఁగి' మున్నగువిధముగా సంధి చేసిరి. కాని క్త్వార్థక రూపమునకు సంధి యొనర్చినచో క్రియా నిర్వహణమున పూర్వాపరముల నడిమి వ్యవధానము నశించిపోవును గాన అట్లు చేయకుండుటయె శ్రావ్యము ఒక్క క్త్వార్థక మైన యిత్వమును మినహాయించి, తక్కిన హ్రస్వదీర్ఘములయిన యన్నియచ్చుల మీదను ఆగమేడితసంధి జరుగును

పదమధ్యసంధి

ఇంతవరకు చూచినప్రకారము తెలుగునందు పూర్వపదమునందలి కడపటి యచ్చునకును, పరపదమందలి మొదటి యచ్చునకును సంధిజరిగినది. అపదము పర మగునపుడు అన్ని యచ్చులకును సంధి నిత్యముగా జరుగును. ప్రకృతిప్రత్యయముల కలయికవలన పద మేర్పడును. కేవలప్రత్యయము గాని, ఆగమముగాని యైనచో 'అపద' మని యందురు.

నామములపైని ధాతువులపైని 'ఇంచు' ఆగమమై క్రియాధాతువుల నేర్పరుచును. నిర్జి - ఇంచు > నిర్జించు. ఇట్టి చోటులందు నిత్యముగా సంధి జరిగి తీరవలసినదే.

పరిమాణార్థమునందు 'ఎడు' అనునది యగును. పుట్టి - ఎడు>పుట్టెడు అన్ని అచ్చులపైని నిత్యముగా సంధి జరుగును.

నిజమునకు 'ఇంచు, ఎడు' అనునవి ఒకప్పుడు పదములే. ఇంచునకు రూపాంతరము ఇచ్చు. ఈ రెండును 'ఈ' ధాతువునుండి నిష్పన్నము లైనవి. అందించు, అందిచ్చు, అందిమ్ము. ఆడు, చేయు, పడు మున్నగు ధాతువులు ధాతువులపై చేరి నట్లు 'ఇచ్చు' అనునది కూడ చేరినది. కన్నడమున కూడ ఈధాతువు 'ఇసు' అనురూపముతో తెలుగులోవలెనే ధాతువులపైని చేరుచున్నది. 'ఎడు' అన శబ్దమునకు తమిళమునందును, మలయాళమునందును 'ఎత్తు'అని యర్థము. 'ఎడుత్తు' అనునది తెలుగున 'ఎత్తు'గా పరిణతి నొంది యుండును ఒకయెత్తు, రెండెత్తులు అని ఒక పరిమాణమున కర్థముగా వాడుట నేటికిని గలదు అదే క్రమక్రమముగా కొలతకు గాని, తూకమునకు గాని యుపయోగించుసాధనముతో కలిపివాడుట జరిగినది రూఢి యేర్పడిన పిమ్మట పదత్వమును గోల్పోయి, ప్రత్యయముగా మారిపోయియుండును

వీసె - ఎడు అనునప్పుడు ప్రథమాక్షరముగా 'వీ' మీదను 'ఎ' మీదను ఊనిక నిలుచును. కావునసే నిత్యముగా సంధి జరుగుచున్నది. సంధి జరిగినను ఆ ఊనికకు నష్టము వాటిల్లదు కాని కొన్నియెడల నామాంశమునకు నష్టము కలుగును. అట్టియెడల మాత్రము ఊనికనుబట్టి, అర్థగ్రహణ సౌకర్యమునుబట్టియు సంధి జరుగుట గాని, మానుట గాని యగును. రాముని - అందు. ఇచ్చట'ని'విశేషార్థమున వచ్చినది. కావున దానికి లోపము కలుగరాదు. కాని 'రామునాజ్ఞ'

మున్నగు ప్రయోగముల సామ్యమువలన 'రామునందు' అనికూడ పేర్కొనెను హా - అందు. ఇట్టియెడల మాత్రము నామాంశమునకు నష్టము కలిగింపక 'హరియందు' అనియే యగుచున్నది 'అందు' అనునది ప్రత్యయత్వమును పొంది వను ఇప్పటికిని స్వతంత్రపదముగా నుపయుక్త మగుచున్నది. 'అవ' యనునది మరొక ఆగమము. దీనికి పూర్వరూప ముగా 'అగు' అను రూపము భారతమున కనిపించుచున్నది. అపదాద్యంబైన గకారమునకు వకారము కావచ్చును కనుక 'అవు' అను రూపముతో అనంతుడు వాడెను. "మూడవు పర్వము" మున్నగు విధముగా కాగా, విశేషణవిశేష్యములకు సంబంధమును దెలుపు 'అ' కార మొకటి సంచేసికొని దూరి యుండును. 'మూడవపర్వము' అని యగును. వ్యాకర్తలు మూడు, పర్వము అను శబ్దమును వేరుపరిచి నడుమనున్న 'అవ'ను ఆగమముగా వేర్కొనిరి. ఈ 'అవ' సంఖ్యావాచకము లకు పూరణార్థముసం దగునపుడు కొన్ని యెడల నిత్యము గను, కొన్ని యెడల వైకల్పికముగను సంధి జరుగును. రెండు మండి వీడువర కున్న యంకెలు ఉదంతపదములు. కావున సంధి నిత్యము. ఎనిమిది, తొమ్మిది, పది యను పదములు ఇదంత ములు. ఇచ్చట మాత్రము సంధి వైకల్పికము. ఒకటి అను నంకె ఇదంతమే యైనను సంధి నిత్యము. తమిళకన్నడములందు ఒన్టు ఒందు అని ఉదంతరూపములే కలవు. తెలుగునకూడ ఒకఁడు, ఒండు అని ఉదంతరూపములును గలవు. 'ఒకఁడు' అను శబ్దము

మీదనే అవగాగమమై 'ఒకడవ' యన్నట్లు నిత్యసంధి గలరూప మేర్పడియుండును తరువాత మహాదమహాద్భేదము స్పష్టముగా లేక 'ఒకఁడు' అనుదానిని మహాదర్థమునందును, 'ఒకటి' యను దానిని అమహాదర్థమునందును వాడుచువచ్చియుందురు ఇప్పటి కిని 'ఒకడు' అని అమహాదర్థకముగా వాడుచుండుట గలదు. తొలుతటి 'ఒకడవ యనునదియే అమహాదర్థమును చెప్పవలసి వచ్చినప్పుడు 'ఒకటవ' యని మారియుండును. కావుననే ఇట సంధి నిత్యముగా జరుగుచున్నది.

ఆగమాదేశ ప్రకరణము

వ్యాకరణమునందు ఆగమము లనియు, ఆదేశము లనియు కొన్ని యెడల కనబడును. ఆగమ మనగా వర్ణాధిక్యము. ఉన్న యక్షరము లన్నియు నుండగా అదనముగా ఒక అక్షరము గాని, అక్షరసముదాయము గాని వచ్చి చేరుట ఆగమము. ఆదేశ మనగా ఉన్న యక్షరములలోనుండి ఒక యక్షరమును గాని, అక్షరసముదాయమును గాని తొలగించి తత్ స్థానమున మరొక యక్షరము గాని, అక్షరసముదాయము గాని వచ్చి చేరుట వ్యాకర్తల దృష్టిలో ఇదిసమంజసము. ప్రక్రియాసౌకర్యము, రూపనిష్పాదనసౌలభ్యము వారి కపేక్షితము. చారిత్రక దృష్టితో చూచినప్పుడు ఇది అసంగతముగను, అసమంజసముగను అనిపించును. ఒక అక్షరమునకు మరొక యక్షరము వరుసకాగా, దీనికి గాని దానికి గాని సంబంధింపని క్రొత్తయక్షరము ఆగమముగా గాని, ఆదేశముగా గాని వచ్చుటకు అవకాశము కనిపింపదు. అక్షరము లన్నియు ముఖయంత్రమునందుద్భవించును. నాలుకయందలి యొక భాగము (కరణము) నోటిలోపలి యొక భాగము (స్థానము)ను స్పృశింపగా (ప్రయత్నము) వేర్వే రక్షరము లుద్భవించును. కరణము, స్థానము, ప్రయత్నము - ఈ మూడింటి సహకారమున వర్ణసమామ్నాయము కలుగుచున్న దన్నమాట. కావున ఒక యక్షరమును పలికినవెంటనే మరొక యక్షరమును పలుకవలయు నన్న కరణస్థానప్రయత్నములందు భేదము కలుగవలయును. అదే యక్షరమును మరల పలుక వలయు నన్నను, కరణమును యథాస్థాన

మునకు తీసికొని వచ్చి మరల తదనుకూల మైన ప్రయత్నమును చేయవలయును.

ఆగమములు

ఆగమయవలు : వాఁరి - అతడు. మొదటిపదము చివరివర్ణ మగు 'ఇ' శాలవ్యము అనగా నాలుకకొన అంగిటిని శాకటవాన ఈవర్ణ ముత్పన్న మగుచున్నది. వెంటనే 'అ' వర్ణమును పలుకుట కష్టము. నాలుకను బల్లపరుపుగా ఆన్చి ఉంచి, నాలుకయొక్క మొదటిభాగమునుండి యుచ్చరింప వలయును. 'అ' వర్ణము జిహ్వామూలీయము. కావున మొదటి స్థానమునుండి తరువాతి స్థానమునకు కరణముయొక్క ప్రయత్నము మారునప్పుడు నడుమ నొక శబ్దము కలుగును. ఇట్టి దానిని ఆంగ్లమున glide అని యందురు 'వాఁరి' అను శబ్దము వందలి చివరివర్ణము శాలవ్య మగుటవలన శాలవ్యమగు యకారమే glide గా అంతరించినది. పూర్వోత్తర ప్రభావము కాని, ఉత్తరోత్తరప్రభావము కాని యిట్టిచోట పనిచేయవచ్చును. నా - ఇల్లు > నాయిల్లు. ఇచ్చట పరస్వరముయొక్క ప్రభావమే పనిచేసినది.

కాని, తెలుగున సంధి లేనియెడల స్వరమునపై నున్న స్వరమునకు యకారమే నిత్యముగా విధింపబడినది. మా - ఊరు > మాయూరు, పూర్వవర్ణ మగు ఆకారము జిహ్వామూలీయము; పరవర్ణమగు ఊకారము ఓష్ఠ్యము ఇక్కడ శాలవ్య మగు యకారమునకు ప్రసక్తిలేదు. ఐనను రెండచ్చుల నడుమ సంధి లేనప్పుడెల్ల యకారమునే విధించి సమత్వమును

సాధింపవలయు నని యేమో, శాస్త్రకారులు ప్రయత్నించిరి. కాని వాడుకయందు ఆ విధానము సాగుటలేదు. శిష్టులు కూడ 'మావూరు' అనియే యుచ్చరించుచున్నారు తరువాతి వర్ణ మగు ఓష్ఠ్యము ప్రభావమువలన దంతోష్ఠ్య మగు 'వ' సవా కారాత్మకము (glide) గా వచ్చినది. ఇది యీనాడు ఆధుని కుల యక్షరద్ధవలన కాక, ఆదికాలమునుండియు నున్నదే. అందువలననే వ్యాకర్త "యకారమును, వ్రవూవోవోలును దెలుఁగుమాటలకు మొదట లేవు" అని పెచ్చరింపవలసి వచ్చినది.

తమిళమున సవాకారాత్మకములుగా యకార వకార ములు రెండు నంగీకరింపబడినవి నన్నూల్ అను గ్రంథము నందు 'ఇఈఐ' వర్ణములకు పరమందు యకారమును, తక్కిన యచ్చులకు పిమ్మట వకారము నగు నని యున్నది. ఈ ఇడై > ఈయిడై; కరి-అన్ > కరియన్: అల్ల-ఎన్టాన్ > అల్ల వెన్టాన్; పలా-ఇన్ > పలావిన్.

కాని యీ విధానమునకు వ్యత్యయమును గలదు. యకారము రావలసిన చోటున వకారమును, వకారము రావల సిన చోటున యకారమును వచ్చుటగూడ జరిగినది.

మలయాళమున కేవలము లయిన అత్వమునకు ఇత్వము నకు వకార మగును; దానికి ద్విత్వమును వైకల్పికము. సంధి కానిచోట ఉత్వమునకు పరమందు 'వ' కారమును, తక్కిన చోట్ల 'య' కారమును నగును.

కన్నడమునందు ప్రకృతిభావము విపులముగా గలదు, అట్లు ప్రకృతిభావము కలుగక, సంధిని కలుగకున్న స్థలములలో యకారము వచ్చును.

ఆ_ఎడె≥ఆయెడె, సతి-ఇవళ్>సతియివళ్. అకారమునకు ఓష్ఠ్యము పరమైన 'వ' యగును. ఆ-ఉదకం>ఆవుదకం. ఉఊబుఓలకు స్వరము పరమైన 'వ' కారములు కలుగును. కుడు-ఉదు>కుడువుదు; పూ_ఇల్లద>పూవిల్లద; పితృ-ఇవం>పితృవివం; గో_ఇందం>గోవిందం.

తెలుగున 'వ' కారము సంధి నాపటకు వచ్చుట లేదని యనిపించినను, అది యదార్థము కాదు గ్రంథస్థభాషలో పదాంతమునయందు యకారమువలె వకారము కనిపించవి మాట నిజమే కాని పదమధ్యమున వకారము వచ్చు తావులు లేకపోలేదు.

ఇయంధేనుఃఅనె > ఇయంధేనువనె. ఇచ్చట విసర్గ లోపించిన పిమ్మట ఉత్వమును అత్వమును సన్నికర్ష పొందును 'ధేను' లోని ఉత్వము నామాంశము కావున దానికి నష్టము కలుగ రాదు; అనగా సంధి జరుగ రాదు. కావున సంధి నాపుటకుగాను ఓష్ఠ్యముపై దంతోష్ఠ్య మగు వకారము వచ్చుచున్నది. అప్పుడు 'ధేనువనె' అను రూపము కల్గుచున్నది ఇది కేవలము అనుకరణమునందు మాత్రమే యగు కార్యముకాదు. ప్రాతిపదికార్థమునం దగు 'ధేనువు'వకును అనుకరణమునం దగు ధేనువునకును నిజమునకు భేదము లేదు.

వధు అను నామము పై ప్రథమావిభక్తిప్రత్యయము 'ఉ' మాత్రమే కలుగగా సంధి నాపుటకు 'వ'కారము వచ్చినది. వధు - వ్ - ఉ > వధువు. ఇట్లే ఉకారాంతములకును, గోశబ్దమునకును పరమగునది 'ఉ' మాత్రమే. వకారము ఆగమముగా నగును. తెలుగున గల ముల్లు, పల్లు, వాక్కు, స్వార్థట్టు మున్నగు శబ్దములలో చిట్టచివర నున్నది 'ఉ' మాత్రమే. అదియే తెలుగున ప్రథమావిభక్తిప్రత్యయము. దానికి ముందున్న వకారము ఆగమమాత్రము; అనగా సంధినాపుటకుగా వచ్చిన సవకారాకారము.

అచ్చే ఇంచుగాగమమునకు ముందు కొన్ని యెడల వకారము సంధి నాపుటకు వచ్చినట్లు కనిపించును. కావించు, రావించు, మేళవించు మున్నగుచోట్ల ధాతువునందు వకారము వినిపింపదు. కా - ఇంచు > కావించు. కావున దీనిని సవకారాకారముగా అంగీకరింపక తప్పదు. కన్నడమున కూడ 'మేళవిసు' మున్నగువిధముగా వకారయుక్తములైన రూపములున్నవి.

శ్రీ వజ్ఝుల చినసీతారామస్వామి శాస్త్రిగారు పదమధ్యమున కొన్ని యెడల 'గు, చు' మున్నగువర్ణములు లోపించుననియు, తత్స్థానమున సంధి నాపుటకుగాను 'వ'కారము నిల్చు ననియు తెలిపిరి. ఇట్టిది ప్రాకృతమున కలదు అమృతం > అమిఅం; చతుర్థి > చఉద్ది > చవుథి, చతుష్క > చఉక్క > చవుక. ప్రాకృతసమములం దీకార్యము తెలుగునను కనిపించును. కాని చిగురు, తగులు మున్నగుచోటులందలి అపాద్య గకారము

నకు వకారము వచ్చుట యిట్టిది కాదేమో యనిపించును. శ్రీ వష్ఠులవారి దృష్టిలో చిగురు > చిఉరు > చివురు అని అయ్యెను. అట్లే 'గెలుచు' అన్నంతక్రియ యైనప్పుడు చకారము లోపించి సంధి నాపుటకు తత్థ్సానమున వకారము రాగా 'గెలువన్' అని అయ్యెను. కాని దీని నిట్లే సిద్ధాంతము గావించుటకు ఇంకను గొంత ప్రయోగపరిశీలనము అవసరము. గకారము వకార మైనచో వాల్లు లోపించి, వ్యవధానసంరక్షకముగా వకారము వచ్చిన దనుట సులభమే కాని వకారము నకు గకారము వచ్చు కావులు కూడ భాషలో లేక పోలేదు. ప్రవాళము>పవడము >పగడము క్రియారూపములందు వకారమైనట్లుగనే, కొన్నియెడల పకారమగును. తలచు - అన్ తలపన్ యిచ్చటి పకారమును సంధి నాపుటకువచ్చిన దనుట పొసగదు కదా! ఇట్టిచోట్ల నున్న పకారమును ఆగమము లేదా సవాకారాశ్రయముగా కాక ఆదేశముగా నెంచుటయే సమంజస మనిపించును. స్థానాదికసంబంధమేమియు లేకపోయినను 'గవ' లు వ్యత్యయము నొందుట తెలుగుభాషకు లక్షణ మని తలచుట సమంజసము

ఈవిధముగా చూడగా 'యవ'లు రెండును సంధి నాపుటకుగాను రెండచ్చులకు నడుమ వచ్చు నని తేలినది తెలుగున వచ్చు న'కారమును కూడ డా॥ కాల్డ్వెల్ సంధి నాపుటకు వచ్చు సవాకారాశ్రయముగానే నిర్ణయించెను. కాని ప్రయోగములను పరిశీలింపగా కొన్నిచోట్ల నకారము నామాంశముగను, కొన్నిచోట్ల అర్థవంతమగు ఆగమముగను స్పష్టమగును. కేవల ముచ్చారణ సౌకర్యమునకును, సంధినాపుటకును వచ్చినదనుట సమంజసము కాదు.

ఆగమ నకారము : "ద్రుతాశ్చోనఃనః" యని ఆం ధ్ర శబ్ద చింతామణి. దాని ననుసరించియే చిన్నయసూరి "నకారంబు ద్రుతంబు" అని సూత్రించెను దీనిని సవరింప బూనియో, వివరింప బూనియో "నకారం బసాధారణంబు ద్రుతంబు' అని సూత్రించి ప్రౌఢవ్యాకర్త "ప్రత్యయాగమావ్యయాత్మకమై యుత్వవిశిష్టమైన నకారంబు ద్రుతసంజ్ఞకం బని యర్థ" మని విశదీకరించెను. సూరికూడ ప్రకృతిభావమును విధించునపుడు ఉత్వవిశిష్ట మైన నకారమునే తెలిపెను. కావున సూరి మతమున కూడ 'ను' యే ద్రుతము. అయినచో 'నకారము' అనిచెప్పుట యేల? అను ప్రశ్న యుదయింపవచ్చును. దానికి కారణము గలదు. ఇకారముమీది 'ను' 'ని'గా మారిపోవును. అట్లే వాలవ సానములు పరమగునపుడు ద్రుతమునకు గాని, ద్రుతస్వరము నకు గాని లోపము కలుగవచ్చును. కాబట్టి 'ను' అను ఒక రూపమునుండి రూపాంతరములుగా పర్వడు 'న్,ని' అను రెం డును ద్రుతములే. అటుగాక ఉత్వవిశిష్ట మైన 'ను' అనునది యే ద్రుతమునుచో అవ్యాప్తికలిగి 'న్, ని' అను రెండును ద్రుతసంజ్ఞాకములు కాకపోవలసి వచ్చును. కావున చింతామణి మార్గము, తదనుసారి సూరిమార్గము ప్రశస్తములై యున్నవి.

ద్రుతమును బట్టచివర గల శబ్దములు ద్రుతప్రకృతికములు. ద్రుతప్రకృతికములకు పరమం దచ్చున్నచో, ద్రుతము తరు వాతి అచ్చుతో సన్నికర్ష పొందును. "ఇఁకాదులకుఁ దప్ప ద్రుతప్రకృతికములకు సంధి లేదు" అని సూత్రము. అనగా ద్రుతము లోపము నొంద దని యర్థము, "ద్రుత మనఁగా నొల్లనియెడ మఱఁగిపోవునది" అని బహుజనపల్లి వారు వివ

రించిరి. కాని, యిది సర్వథా సత్యము కాదు అవసానము నందు కాని సరళస్థిరములు పరము లగునపుడు కాని లోపింప వచ్చును. పరుషాదులు పరమ లగునపుడు పూర్ణార్థబిందువు లుగ పరివర్తనము నొందుటో, మీది హల్లుతో సంశ్లేషము నొందుటో జరుగును. 'ఉన్నాను' మున్నగుచోట్ల ద్రుతమునకు లోపము లేదన్న సంగతి గమనార్హము కావున ఇక్కడ మఱగి పోవుట అను ప్రసంగము లేనే లేదు. కొలను, చేను మున్నగు శబ్దములలోని అంతిమనకారమునకును ద్రుతనకారమునకును భేదము గలదు శబ్దగతనకారము ద్రుతనకారమువలె మార్పాటులకు లోనుకాదు నేను, తాను, కమ్మ శబ్దములలోని ఆంగికనకారమును వ్యాకర్తలు ప్రక్రియాసౌలభ్యమునుగోరి ద్రుతముగనే పరిగణించిరి. ఇంతవరకు ద్రుతాంతములు కానివానిని కళలు అని యందురు. కళలకు పరమందు అచ్చులు వచ్చినయెడల సంధి యగుటయో, పూర్వము చెప్పికొన్నట్లు యడాగమముకలుగుటయో జరుగును

వ్యాకులవారు కేవలము పొల్లునకారమే ద్రుత మని నన్నయ మతముగా నిర్ధారించిరి. పొల్లునకారమే యైనను, ని,ను వ్. అను మూడువిధము లగునకార మైనను ప్రయోజనము మాత్ర మొక్కటియే. నేను - అరసితిని > నేనరసితిని. ప్రాచీన రూపము 'నేన్' అనియే యుండి, తరువాత ఉదంతత్వమును పొందినది. అందువలన ఉత్వమునకు లోపముకలిగినను నష్టము లేదు నకారము ద్రుతము. అది తరువాతి అచ్చుతో సన్నికర్ష పొందును. కావున ఇచ్చట నున్ననకారము వామాంకమే కాని సంధి నాపుటకు వచ్చిన యాగమము కాదని నిశ్చితముగా

చెప్పవచ్చును తెలుగున పెక్కు పదములకు చివర నిట్టి 'న'కారము గలదు. దానిని వ్యవధాననంరహితముగా నెంచుట తగదు.

షష్ఠీతత్పురుషమునం దుకార బుకారములకు అచ్చు పరమగునపుడు నుగాగమ మగును. ఇది కూడ ప్రకృతిభావ వివారణకే వచ్చు నని కొందఱు యూహించెదము. రాజు - ఆనతి > రాజునానతి కాని ఇక్కడి 'ను' అట్టిది కాదు. రాముని (యొక్క) - ఆనతి > రామునానతి అని యైనప్పటివలెనే విశేషణ విశేష్యములకు నడిమిసంబంధమును 'ని' యన్నది స్థిరీకరించుచున్న దనుట నిశ్చయము ఇట్లే 'అనునతఁడు' మున్నగుచోట్ల తద్ధర్మార్థకములకు అచ్చు పరమగునపు డైన నకారము కేవలాగమము కాదు. 'అనును' అని తెలుగున తద్ధర్మార్థకము. దీనినే క్రియావిశేషణముగా, విశేష్యమునకు పూర్వమందు వాడుదురు. వ్యాకర్తలు, ఇక్కడి 'ను' వర్ణమును ఆగమముగా వేరొక్కన్నను వైయుదాహరణమునుబట్టి అంగికమని గ్రహించుట కష్టము కాదు అట్లే చిగురుఁగైదువు. తెల్లఁదనము మున్నగుచోటు లందలి ద్రుతము కూడ విశేషణ విశేష్య సంబంధమునే నిరూపించును. తమిళమున నిట్టియెడల సాధారణముగా మీదివాల్లునకు ద్విత్వము కలుగుచుండును.

పముచ్చయార్థక మగు 'ను'వర్ణము కూడ ద్రుతమే, ఉదంతరూపములవై కేవలము 'మ' మాత్రమే వచ్చి, తక్కిన వానివై 'ఉను' అని వచ్చును. రాముఁడును లక్ష్మణుఁడును, సీతయును వారియును.

సముచ్చయార్థకము 'ఉను' అనునది యే. ఉదంతములపై వచ్చినప్పుడు పూర్వమున ఉత్వముతో ఉత్వము సంధినొంది 'ను' మాత్రమే కన్పించుచున్నది. కావున 'ను' అను నది యే సముచ్చయార్థక మను భ్రమ కలుగుచున్నది. దీనిని సముచ్చయార్థక మని పిలుచుకొంటిమి కాన, కేవలము ప్రకృతి భావనివారణమునకు కాక, సప్రయోజనముగనే ఇది తెలుగున నున్నదనుట సమంజసము. తమిళకన్నడములందు కూడ 'ఉమ్' అని మకారాంతముగా సముచ్చయార్థకము కలదు. అది యే తెలుగున నకారాంతముగా పరిణామము నొంది యుండును. ఈ నాడు వాడుకయందు 'రాముడున్ను కృష్ణుడున్ను' అన్నట్లుగా ద్విత్వయుక్తముగా కూడానున్నది. నకారోచ్చారణమును భద్రముగా కాపాడవలయు ననుప్రయత్నమే దీనికి కారణము కావచ్చును. కన్ను, పల్లు మున్నగు శబ్దముల జడ్డకు వైకల్పికముగా లోపము రావచ్చును; చివరి ఉత్వముకూడ లోపింపవచ్చును కను, కన్, పలు, పల్ అను రూపములు సిద్ధించును. ఊనిక తొలియచ్చుమీదనే కలదు వీనికి పరమందచ్చున్నచో నలలకు లోపము చేయరాదని వ్యాకర్తల నిషేధ మున్నది. కన్ + కను-అదతె, పల్ పలు-ఒత్తె అన్నట్లుండరాదు. ఈ విధముగా సంధిచేయుట తటస్థించునెడల మొదటిపదము పై అసలు ఊనిక ఉండనే ఉండక, రెండవపదము మొదటియచ్చుపై నిలుచును. అప్పుడు వర్ణపదభ్రంశమున కవకాశము కలదు. కావున తొలిపదము తొలి యచ్చుపై కూడ ఊనికను నిలుపుట చాల యవసరము. ద్విత్వమునకు లోపము చేయనియెడల ఊనిక నిల్చును. కన్నదతె, పల్లొత్తె

ఇట్లే సముచ్చయార్థకమందలి ద్రుతమును కూడ నిలుపు టకు గాను ఉత్వమును ద్విత్వమును గూడ వాడుకలో వచ్చి యుండును. వాడుకలోనే యనట యేల? స్థిరత్వమును సంపా దించుకొనకపోయినను గ్రాంథికభాషయందుకూడ ఈ లక్ష ణము లేకపోలేదు. అన్-ఇష్టసఖ>అన్నిష్టసఖ, సర్వమున్ అతని>సర్వమున్నతని॥

ఆంగిక మైన నకారముకూడ అచ్చు పరమగునపుడు కొన్నియెడల నకారమును పొందుచున్నది. పెన్-ఉరము> పెన్నురము ఇది కూడ నామాంశమునకు నష్టము కలుగకుండ, ఊనికను నిల్పుటకు వచ్చిన నకారమే.

ప్రాతాదికార్యములయందు కూడ మగాగమము కలు గును. ఇది వ్యాకర్తల విధానము. కాని చారిత్రకదృష్టితో చూచినప్పుడు 'ను' వర్ణము ఆంగికమే కాని ఆగమముకాదని తేలును 'ప్రాత+ కెంపు' అను రెండుశబ్దములు' ప్రాగెంపు'గా మారె నని వ్యాకరణము తెల్పును. కాని తమిళమున మన్న 'పటి కెంబు' మున్నగు రూపములనుబట్టి 'ప్రాత' యను శబ్ద మునకు 'పటమ్' అను నొకరూప ముండెనని యూహింపనగును. 'మరమ్' అను శబ్దము 'మ్రాను' అని తెలుగున నైనట్లు, 'పటం' 'ప్రాన్' వలె అయియుండును ప్రాన్-కెంపు>ప్రాగెంపు అని అయియుండును. ప్రాన్-త అనునది తరువాతి కాల మున అర్థవిశేషమున ఏర్పడి, క్రమక్రమముగా విశేషమును కోల్పోయి యుండును. ఇట్లు చాల శబ్దములందు నామాంశ ముగా నిల్చినను కొన్నియెడల కేవలసామ్యము (analogy)ను

పురస్కరించుకొని 'నకారము' కలిగియుండును. పూఁదోట; సంగోరు॥ ఇంతేకాక మూలమున బిందువులేని యనేకశబ్దములు తెలుగున బిందుమంతములై కనిపించుచున్నవి. ఇంక విశేషణ విశేష్యముల సంబంధమును తెలుపుటకు కూడ నకారము కలుగవచ్చునని యిదివరకే చూచితిమి.

శతృత్వానంతర్య చేదాద్యర్థకములును ద్రుతప్రకృతిక ములు. వీనియందు ఒక్క శత్రర్థకమందలి నకారమునకు తప్ప దేనికిని సంధి చేయరాదు శత్రర్థకవిషయ మత్వసంధివిషయ మున పరిశీలించితిమి.

కావున, ఇంతవరకు చూచినదానినిబట్టి నకారము 'యవ'లవలె ప్రకృతిభావనివారణముకొరకు మాత్రమే కాక, ప్రత్యేకప్రయోజనముకొరకు నైతము వచ్చు నని స్పష్టము కాగ లదు. కొన్ని యెడల ప్రకృతిభావనివారణమునకును రావచ్చును. దీనినిబట్టియే కొందరు నకారమును గూడ వ్యవధానసంరక్షకముగానే పరిగణించిరి. కొన్నియెడల నకారమును జేర్చుట అలవాటుపడిన పిమ్మట అజ్ఞాతముగా కొన్ని యెడల నుపయోగించుట జరుగును. కొన్నియెడల ద్రుతముపై ద్రుతమును జేర్చుటయు జరిగినది, దివంబునుంబోలె, అదియునుంగాక॥

మొత్తముమీద ఈ ద్రుతనకారము నామాంశముగను, ప్రత్యేకార్థబోధకముగను, విశేషణవిశేష్యసంబంధనిర్ధారకము గను, కొన్నిచోట్ల మాత్రము వ్యవధానసంరక్షకముగను తెలుగుభాషయందు కనిపించుచున్నది.

ఆగమ రకారము: "కర్మధారయంబునఁ దేదాది శబ్దముల కాలుశబ్దము పర మగునపుడు రుగాగమం బగును" అని సూత్రము. వేద - రు _ ఆలు > వేదరాలు

ఇచ్చట వచ్చిన రకారము తెలుగున సాధారణముగా బహువచనమున వచ్చు రకారము వంటిదే. వారు; అందఱు, అల్లుడు; నృపాలురు 'వేద - వారు' అనునదియే 'వేదరు' అయి, తరువాత ఆలుశబ్దముతో సమసించియుండును. వేదలకు చెందిన స్త్రీ యని యర్థము. ఇటుకాక వేదవానియొక్క భార్య యను నర్థమున వేదయాలు అనియే యగును. 'వేదరు' అనునది, సమూహార్థకముగా, బహువ్యక్తులను బోధించును, 'కొమరు' అనగా అందము. దానికి 'ఆలు' చేరగా 'కొమరాలు' అయి అందముగల స్త్రీని బోధించును ఇట్టివానినిఱూచి అనుచితవిభాగముమూలమున గొడ్డు, జవ, బాలెంత మున్నగు శబ్దములకు చివర రకారప్రసక్తి లేకపోయినను '-రాలు' అని చేర్పుట సాగించియుందురు. అంతేకాదు. శ్రీమంతుఁడు; ధీమంతుఁడు మున్నగు శబ్దములలో పురుషవ్యక్తిని బోధించునది చివరనున్న 'డు' వర్ణము. కావున దానిని తొలగించి తమ దృష్టిలో స్త్రీబోధకమైన '- రాలు' తగిలించి శ్రీమంతురాలు, ధీమంతురాలు అని కూడ మహాత్ములు వాచకరూపములను వాడుట మొదలుపెట్టిరి. వ్యాకర్తలు కడపటి శబ్దము 'ఆలు' అని తెలిసికొని, నడుమనున్న రకారమును ఆగమముగా పరిగణించిరి. తత్సమములందు అత్వమునకు ఉత్వము కూడ వచ్చునని విధించిరి. కాని యీ ఉత్వము పుంలింగమహాద్వాచకములకే కలిగి,

అనుచితవిభాగమువలన ఏర్పడిన 'రాలు' శబ్దమును చేర్చునప్పుడు కూడ అట్లే నిలిచి పోవుచున్నది.

పొదరిల్లు మున్నగుచోట్ల పూర్వపదము 'పొద' యని యనిపించును. కాని భాషలో 'పొదరు' అను శబ్దము కూడ సమానార్థకముగా కలదు. తమిళభాషలో కూడ 'పుదర్' అను శబ్దము కలదు ప్రాచీనరూపమగు పొదరు పూర్వపదముగా 'పొదరిల్లు' ఏర్పడియుండును 'పొద'యే పూర్వపదమను భ్రాంతితో కొందఱు రకారమును ఆగమముగా పరిగణించిరి 'పొదరుటిల్లు' అను టుగాగమరూపము కూడ దీనినే నిర్ధారించుచున్నది.

గంగిరెద్దు, చిచ్చు(చ్చ)అంన్ను మున్నగుచోట్ల కూడ రకారము కనిపించుచున్నది. తేఱిల్లు ప్రజ్వరిల్లు మున్నగు క్రియాపదములలో కూడ రకారము సందుచేసికొన్నది. నిలువరించు; నెప్పరించు; చప్పరించు; నిబ్బరించు మున్నగు తెలుగు క్రియలందలి రకారము సామ్యమున పై వానియందును రకారము కలిగెనేమో!

ఆగమటకారము : కర్మధారయమున నుదంతముల కచ్చు పరమగునపుడు టుగాగమం బగు నని సూత్రము; అట్లే వేర్వాదిశబ్దములకు వికల్పముగా నగు. కఱకు - అమ్ము > కఱకుటమ్ము; సరసపు - అలుక > సరసపుటలుక॥ వేరు - ఉరము > వేరురము, వేరుటురము; పొదరు - ఇల్లు > పొదరిల్లు, పొదరుటిల్లు.

వీని యన్నింటియందును పూర్వపదమునందలి చివరి ఉత్వమును నిలుపుటకొరకు టుగాగమము వచ్చినట్లు కనిపించును. పేర్వాదులలోని చివరి ఉకారమునకు లోపముచేసి తెలుగునకూడ వాడుట యున్నది కావున అట్లు లోపము వచ్చియు, లోపము రాక టుగాగమము కల్గియు రెండు రూపము లేర్పడుచున్నవి ఈ 'టు' అనునది 'అదు' అను అమవాత్తచ్ఛబ్దరూపాంతరమే ద్రావిడభాషలందు విశేషముల కడపల తచ్ఛబ్దము నిల్పుట సంప్రదాయము. నీ.నా.తనలకు మగాగమము వచ్చును. నీదు కరుణ, నాదు చెలిమి, తనదు మహిమ ఇట్టియెడల 'అదు' యొక్క అవశిష్ట మగు 'దు' ఆగమముగా నగుచున్న దనట నిర్వివాదము. ఇక్కడకూడ 'పేర్ - అదు - ఉరము' అని యుండగా 'అదు' లోని నాదాత్మకమగు శ్వాసాత్మకమగు 'తు' గా మారినది. వత్తనము > పట్టణము అనువిధముగా తకారము టకార మగును. పేర్-అటు-ఉరము > పే(ర్)టురము॥ అని యైయుండును.

తరుసంటి పిలుకులు, పిన్నటి వయసు మున్నగు కర్మధారయములందలి 'టి' వర్ణము కూడ ఇచ్చటి టుగాగమమునకు రూపాంతరమే కావలయును.

కొందరు కఱకుటమ్ము మున్నగుచోట్ల ఔపవిభక్తికటివర్ణమే వచ్చుచున్న దని యందురు. ఔపవిభక్తికములు నామములకు ద్వితీయాద్వైకవచనము పర మగునప్పు డగును. కర్మధారయమునందు పూర్వపదము ప్రథమావిభక్త్యంతమగ నుండును. కనుక 'అదు' యొక్క అవశిష్టరూపమే రూపాంతరము నొంది ఆగమముగా విల్పు నమట నసంభవ మనిపించును

మిద్దెటిల్లు, దుక్కి చెద్దు మున్నగుచోట్ల అనుదంతములపై కూడ టుగాగమము కలుగుచున్నది.

ఇగాగమము : సమాసమునందు చేత, తోడ, వలన అను కిత్వంబగు. అత్వమువలెనే ఇత్వము కూడ కొన్ని చోట్ల పూర్వ పరశబ్దములకు సంబంధమును సాధించును నాచేత - ప్రాపు > నాచేతి ప్రాపు. అనగా నాచేతియొక్క ప్రాపు అనియే అర్థము. దొంగవలని భయము అని యనగా దొంగవలనివ కలుగు భయము అనియే యర్థము. కావున ఇక్కడి ఇత్వము సప్రయోజన మనియే చెప్పవలయును.

అంద్వాదులకు అలి యనునది ఆగమముగా నగును. అందు అనుశబ్దముపై అల్ అను సప్తమ్యర్థకము నిల్చును. దానిపై తర్వాతి శబ్దముతో సంబంధమును సాధించుచు ఇత్వము నిలిచినది. అందు-అల్-ఇ>అందలి॥ దుమంతమునకు ద్వితీయా ద్యేకవచనము పరమగునప్పుడగు 'నిగాగమము' కూడ ఇకారమాత్రమే. అవన్-ఇ>వాని; రామన్-ఇ>రామ (ము)ని; మగన్-ఇ>మగని॥ కావున తెలుగునందు సంబంధ బోధకముగా ఏకవచనమున 'ఇ' కారమును, బహువచనమున 'అ' కారమును వచ్చు చున్న వనట యథార్థము.

ఇట్లే కొపవిభక్తములయందలి ఇత్వము కూడ దీనినే నిరూపించును. 'ఊరివాడు' అనునప్పుడు ఉన్న యిత్వము వంటిదే 'ఊరియందు' అన్నప్పుడు ఉన్న యిత్వము కూడ. అరవమున సప్తమ్యర్థమున 'ఇల్' అని కలదు 'ఆట్' అనగా ఏఱు అని యర్థము. 'ఏటియందు' అను నర్థమున 'ఆట్-ఇల్>ఆట్టిల్' అని యగును. ఇట్టిచోట్ల నున్న టి'వర్ణమే తెలుగున నొవ

విభక్తిక మైనది. 'మరత్తిల్' అనగా 'చెట్టునందు' అని యర్థము. అనుచితవిభాగమువలన 'టి'పలెనే 'ఱి' కూడ ఔపవిభక్తిక మైనది. 'ఇల్'యొక్క అవశిష్టమే 'ఇ'వర్ణ మనియు, అదియే సంబంధార్థమున ఏకవచనమున తెలుగున నగుచున్న దనియు, ఔపవిభక్తికములకు కూడ అదియే మూల మనియు సిద్ధాంతము.

ఆదేశములు

పుంప్వాదేశము : 'అమహాన్నపుంసకముల కదంతములకు మువర్ణకం బగు' నని తత్సమనామములకు మువర్ణకము విధించుట కలదు. తెలుగుశబ్దములు కూడ కొన్ని మువర్ణకాంతములు గలవు. వీని ప్రాచీనరూపములను శాసనములందు చూడగా 'రాజ్యమ్ము, సాసనపు, కయ్యమ్ము, క్రమబు' మున్నగు విధముగా కనిపించుచున్నవి. తెలుగున 'పాము' అని యుండగా సమానార్థమున అరవమున 'పామ్బు' అనియు కన్నడమున 'హావు' అనియు రూపములు గలవు. తెలుగునున్న 'ము' అరవమునందలి 'మ్బు', కన్నడము నందలి 'వు' వర్ణములతో సమానమైనది. శాసనములనుబట్టి కూడ అవి పర్యాయము లనియే తేలుచున్నది. 'మువిభక్తియతి' యందు పుపు బుభులను ము ప్రత్యయమునకు మిశ్రాదేశములుగా చెప్పుటలోని సామంజస్యము కూడ నిదియే. శావున వృక్షము, వృక్ష్మము, వృక్ష్ంబు వృక్ష్ంపు, వృక్షపు - మున్నగువిధముగా ప్రథమావిభక్తియందు పెక్కురూపము లూడవచ్చును. 'మాయు' అను క్రియాధాతువు విశేష్య మగుటకు 'పు' అను కృత్ప్రత్యయమును బొంది 'మాపు' అని యగుచున్నది. ఇట్లు కృత్ప్రత్యయ

ముగా నున్నదికూడ ప్రథమావిభక్తి మువర్ణమునకు రూపాంతరమే. పునరపి. ప్రాచీన మనియు మువర్ణము సంస్కృత నపుంసకశబ్దముల సామ్యమున అర్వాచీన కాలమున నేర్పడెనని యు కూడ భాషాశాస్త్రుల యభిప్రాయము

కర్మధారయములందు మువర్ణకమునకు 'పుంపు' లగునన్నప్పుడు వ్యాకరణపద్ధతి ననుసరించి, పూర్వశబ్దము తుదినున్న మువర్ణకము లోపించి, తత్ స్థానమున 'పు' వర్ణముగాని, పూర్ణబిందుపూర్వక 'పు' వర్ణముగాని ఆదేశముగా వగును. చారిత్రకదృష్టితో చూచినప్పుడు ఒకటి పోవుట మరొకటి వచ్చుట యనున దేమియు లేదని తేలును. 'దురుసుమాట' మున్నగు సమాసములం దేవిధముగా రెండుమాట లొకదానిప్రక్క నొకటి చేరెనో, అట్లే 'సరసపువచనము' అన్నప్పుడు కూడ ఏమార్పును లేకుండ రెండుమాట లొకదాని ప్రక్క నొకటి చేరెను 'సరసపు' అనునది కేవలము ప్రథమావిభక్త్యంతము ప్రాచీనశబ్దముల సామ్యమున, అనంతరకాలమున కూడ నీశబ్దమునందు 'పు' వర్ణకమే నిలుచుచున్నది. అట్లని 'కయ్యమువస' 'మొగమందము' మున్నగు మువర్ణకాంతరూపములతోడి కర్మధారయములు లేకపోలేదు, అనగా, అర్వాచీనకాలమున 'పు' వర్ణవిధి వైకల్పిక మయ్యెను. మువర్ణకాంతత్వమే ప్రచుర మగుట దీనికి కారణము

ద్విరుక్తటకారము : ద్రావిడభాషలన్నింటియందును సాధారణముగా పదాంతము లయిన అడలకు అచ్చు పరమైనచో ద్విత్వ మగును అకారము టవర్గ తవర్గములకు నడుమగా నుచ్చరింపబడును దీనికి ద్విత్వము కలిగినప్పుడు ఆలఘు

రకారోచ్చారమును కలిగియుండును. తెలుగున ఈఅకార ద్విత్వము టకారద్విత్వముగా పరిణామము నొందినది; కన్నడ మున కొన్నియెడల తకారద్విత్వముగా కూడ పరిణమించినది. కుఱు - ఉయిర్ > కుట్టయిర్; చిఱు - ఎలి > చిట్టెలి। మున్నగువిధముగా అరవమున రూపనిష్పత్తి యగును. నడు - ఇరుళ్ > నట్టిరుళ్; కిఱు - అడి > కిత్తడి। అన్నట్లు రెండు విధములుగా కన్నడమున నగును. వాల్లు పర మగునప్పు డీమార్పు కలుగదు.

తెలుగున కూడ కుఱు; కడు మొదలగు ఱకారడకారాంతముల కచ్చు పర మగునప్పుడు ద్విరుక్తటకార మగుచున్నది కుఱు - ఉసురు > కుట్టసురు; చిఱు - ఎలుక > చిట్టెలుక। వాల్లు పర మగునపుడు 'కడుబెడద' మున్నగు విధముగా ద్విరుక్తటకారరహితరూపములే యగును.

ప్రౌఢవ్యాకర్త 'చిట్టెలుక' మున్నగు సమాసములందు 'చిట్టి' యనునదే పూర్వశబ్ద మని యభిప్రాయపడెను. కాని అన్నియెడల నిట్లుచెప్పుటకు వీలు కాదు అంతే కాక, తెలుగు వందలి సమాసమునుబట్టి అనుచితవిభాగమువలన నిట్టి శబము లేర్పడినే నేర్పడి యుండవచ్చును.

అభ్రేడితంబు పరం బగునపుడు కడాదుల తొలయిచ్చు మీది వర్ణంబుల కెల్ల అదంతం బగు ద్విరుక్తటకారం బగును. కడ-కడ>కట్టకడ, పగలు-పగలు> పట్టపగలు। మున్నగుచోట్ల పునరుక్తి భృశార్థమున కలిగినది ఒకే మాటను పునరుక్తము చేయునెడల, అందును నన్నియు లఘువులే యైనప్పుడు, శ్లోక మెక్కువ; ఉచ్చారణ వేగమున కొన్ని యక్షరములు జారి

పోవుట కూడ తటస్థించును. క్లేశమును పరిహరించి, ఉచ్చారణమున సుస్థితిని సాధించుటకుగాను ఉత్తరపదము ప్రారంభమునకు ముందరి యక్షరమును ఊనికతో పలుకుట యవసరము. అట్లు పలుకగా అద్యంతవర్ణములపై నూనిక యుండుటవలన నడిమి వర్ణములకు నష్టము వాటిల్లవచ్చును అట్లు నష్టము కలిగినప్పటికిని, ఆక్రమేడిత మున్నది గనుక, అర్థగ్రహణమున కష్టము కలుగదు బయలు-బయలు>బట్టబయలు॥ పూర్వపదమునడుమ నున్న 'య'కారము శ్లథమైనది. అనను పరపద మర్థగ్రహణమున సహకరించును ఇందలి పదముల చివర సాధారణముగా డ ల ట,ర వర్ణములు గలవు. వీనికి ద్విత్వము కలుగగా టకారోచ్చారణమే కలుగుట ద్రావిడభాషాసంప్రదాయము. ఇటుగాక తెలుగున 'పిడుగు' మొదలయిన శబ్దములు అన్యవర్ణాంతములైనను అరవమందు 'ఇడి' మున్నగు విధముగనే యున్నవి. కావున 'కట్టకడ' మున్నగునవి ప్రాచీనరూపము లనియే తలపవచ్చును వానిని చూచి అర్వాచీనకాలమున సామ్యము ప్రభావమున కొన్ని రూపముల నేర్పరిచి యుందురు. చిలుకూరి నారాయణరావుగారు ఇట్టిచోట్ల నున్న 'కట్ట' మున్నగువానిని స్వతంత్రపదములుగానే భావించిరి. కొన్నింటిని అట్లు విడదీయుటకు వీలున్నను, వానిని సిద్ధాంతీకరించుట కవకాశము చాలదు. కన్నడమున 'తుత్తతుది, మొత్తమొదలు' అను విధముగా తకారద్విత్వరూపములు గలవు. కడె - కడె > కట్టకడె॥ అను విధముగా టకారద్విత్వరూపములు కూడ కలవు.

అందదుకులు 'అందదుకు ప్రభృతులు యథా ప్రయోగంబుగ గ్రాహ్యములు' అని సూరి సూత్రించెను. ఇదియు ఆమ్రేడితవిధికి సంబంధించినదే తుమురు - తుమురు > తుత్తుమురు. ఇచ్చట రకారము ద్విత్వము నొందినది. తరువాత నున్న 'త'కారముతో సమీకరణము నొందుటవలన తుత్తుమురు' అని యైనది చెల్లచెదురులు, ఇల్లిగ్గులు మున్నగు చోట్ల పూర్వపదము చిట్టచివరి వర్ణమునకు ద్విత్వము కలిగి, దీనిక తక్కువయిన నడిమియచ్చురములు జారిపోవుటచేత ఏర్పడిన రూపములు ఇవి అర్వాచీనరూపము లగుటచేత, వీనికి టకారోచ్చారణము కలుగలేదు. మిఱుమిట్లు, అందదుకు మున్నగువాని రూపనిష్పత్తి భిన్నముగా కన్పట్టును, వీనిని ఆమ్రేడితకార్యమునకు విషయముగా గ్రహించుట ఉచిత మని పింపదు. 'మిటు' అను స్వతంత్రశబ్దము కానరాదు. మిట్ట, మిట్టిపడు మున్నగురూపములు గలవు. ఏమైనను ఇది 'దరిదాపులు' అను శబ్దమువలె వేర్పడియుండిన నుండవచ్చును. 'మిట్టు - మిట్లు' ఎత్తుమీదికి చూచుటవలన కన్నులు చెదరుట అని యర్థము కావచ్చును. అదియే మిక్కిలి కన్నులు చెదరుట అని రూఢిని సంపాదించుకొని యుండును.

అద్దు, అదుకు అను రెండు శబ్దములు ఒకే యర్థమున గలవు అద్దునకు 'అరుందు' అను రూపమును గలదు. వడిమి 'ర' కారమునకు లోపము కలుగగా 'అందు - అదుకు' అని యేర్పడి 'అందదుకు' అయుండును.

'ఇంకు' అను దానికి 'ఇరుంకు' అనునది ప్రాచీన రూపము. భృశార్థమున కేవలము బహువచన ప్రత్యయము

'లు' వచ్చి చేరి 'ఇరుంకులు' అని యైయుండును. పూర్వ స్వరాకారమువలన 'రు' 'రి'గా మారి 'ఇరింకులు' అయి ఊనికకొరకు ద్విత్వము వచ్చి 'ఇట్టింకులు' అని యైయుండును. తెలుగున 'ఇరుకు' అను శబ్దము కూడ కలదు. వ్యుత్పత్తులవారు 'ఇరికించుటచే ఇంకుట' యను నర్థము గ్రహించి ఇరుకు - ఇంకు > ఇట్టింకు అయ్యెనని అభిప్రాయపడిరి. 'ఇట్టింకులు' అనుచోట నున్నది యొకటే శబ్ద మనియు, ఆధిక్యమును తెప్పుటకు బహువచనము నెనసె ననియు భావించుట సమంజస మనిపించును.

గసడదవాదేశము : 'ప్రథమమీఁది పరుషములకు గసడదవలు బహుళముగా నగు' నని సూరి సూత్రీకరించెను. ఉక్తార్థమునందును, ప్రాతిపదికార్థమునందును, సంబోధనము నందును ప్రథమ యగును గోడ బల్ల మున్నగువాని చివర ప్రథమాప్రత్యయము కనిపింపకున్నను, అవి ప్రథమాంతములే. అట్లే అప్పుడు ఇప్పుడు మున్నగునవి కూడ ప్రథమాంతతుల్య ములే. వీని నన్నింటినిబట్టి చూడగా కళ లగు పదములపై నిల్చిన పరుషములకు గసడదవలు బహుళముగా నగునని తేలును కళ లగు క్రియాపదములపైగూడ ఈ కార్యము జరుగ వచ్చును. వాఁడు - కొట్టెను> వాఁడు గొట్టెను. వాఁడు కొట్టెను; రారు - కదా> రారుగదా రారుకదా

ఇందు నాదములతోడి రూపములే ప్రాచీనములు. పరుష ములతోడి రూపము లర్వాచీనములు ద్వంద్వమునందు మాత్రము పదముమీది పరుషములకు గసడదవా దేశము నిత్యముగా నగును తల్లి - తండ్రి > తల్లిదండ్రులు.

ద్రావిడభాషలందు తొలుత పరుషములే కాని సరళ ములు లేవు ఈ స్థితి తమిళమునం దధికముగా కలదు ఒకే యక్షరమును పదాదిని పరుషముగను, తక్కిన స్థానములందు సరళముగను పలుకుదురు, ద్విత్వాక్షర మైనచో పరుషము గనే పలుకుదురు. తెలుగున సంస్కృతసాహచర్యము అధిక మగుటవలన నేమో పరుషసరళములకు స్పష్ట మగు లేఖనము కలదు అనను ప్రాచీనసంప్రదాయము మాత్రము పూర్తిగా విడువలేదు పదమునకు పైని వచ్చిన పరుషములు గసడదవ లగుచున్నవి. అచ్చునకు అచ్చునకు నడుమ పరుషములమ పలుకవలసి వచ్చునప్పుడవి నాదము లగుట యిందులకు కారణము.

తమిళమున 'చ'కార మొక్కటియే 'శ' కారముగా కూడ పలుకబడును. చవర్ణము తాలవ్యస్పర్శము. శవర్ణము తాలవ్యోష్మము. సవర్ణము దంత్యోష్మము ఊష్మత్వసామ్య మున శవర్ణము సవర్ణముగా మారుచుండును. తెలుగున కూడ నట్లే నాదత్వము కలిగినపుడు చవర్ణము జవర్ణము కాక 'సవర్ణము'గా మారుచుండును. అక్కడనెల్లెండ్రు। పకారము ఓష్ఠ్యము. దీనికి నాదత్వము కలిగినపుడు బకారము కావల యును గాని దంత్యోష్ఠ్యమగు 'వ'కారముగా మారుచుండును. ఈరువల్లెలు

ద్రావిడసంప్రదాయమునుబట్టి యేర్పడిన యీ మార్పు తెలుగుశబ్దములకే యన్వయింపవలయును అందువలననే వ్యాకర్తలు 'తెనుఁగులమీఁది సాంస్కృతికపరుషముల కీ

కార్యము కాదు" అని భావించిరి. అయినను "ఎంత గుమతు లైన" మున్నగువిధముగా ప్రామాణికప్రయోగములందును అట్టి వ్యత్యయము కలిగినది.

ద్వంద్వమునందు నిత్యమని చెప్పినను 'కండతుండెము లు, రాకపోకలు' మున్నగుచోట్ల ఈ మార్పు కలుగలేదు. "ఏను పిదప" అని యొకచో ద్రుతాంతముమీద కూడ కలిగినది. కావున, ప్రారంభకాలమున ద్రావిడభాషాసంప్రదాయానుగుణ ముగా గసడదవాదేశము నిత్యముగా జరిగి, క్రమక్రమముగా తగ్గుచు వచ్చియుండును. కన్నడమున 'చట' లు కాక తక్కిన యట్టిరము లీ మార్పును బహుళముగా నొందును పటు గన్నడం; మార్త లె, పాసవెసర్-

సరళాదేశము : కళలపై గసడదవాదేశము కలుగగా ద్రుతప్రకృతికములపై పరుషములు పరమైనప్పుడు సరళాదేశము కలుగును. గజడదబలు సరళములు.

ద్రుతమునకు ప్రకృతి యైనది ద్రుతప్రకృతికము. ద్రుతము నకారము. నకారమునకు పర మైన పరుషము వాద మగును. తోచెన్-చుక్కలు> తోచెన్జుక్కలు. ఈ విధముగా నకారము మీదిహల్లుతో సంశ్లేషముచెందిన రూపములు ప్రాథమికములు తరువాత పూర్ణబిందువు కలిగి 'తోచెంజుక్కలు' మున్నగు రూపము లేర్పడినవి. క్రమక్రమముగా పూర్ణబిందువు శ్లథము కాగా దానికి గుర్తుగా అర్ధానుస్వారము నిల్పుట తటస్థించినది॥ తోచెఁ జుక్కలు॥ సరళములు పరములైనపుడు॥ ఉన్నతంపు